
# ఊసులాడే ఒక జాబిలటా!

\- నిషిగంధ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 2



# ఊసులాడే ఒక జాబిలటా!
## నిషిగంధ



*యదార్థ సంఘటనలకి నవలా రూపం - ఆసాంతం ఆకట్టుకునే సుమధుర స్నేహ బంధం*

గువ్వల కువకువల సుప్రభాతంతో నిద్ర లేస్తున్న బాలభానుడు. అసుర సంధ్య అల్లరి తట్టులోలేక ఎర్రబడ్డ మొహంతో అస్తమిస్తున్న సూరీడు.. తొలిపొద్దు మలిపొద్దూ గోరువెచ్చగా. నిన్ను గుర్తు చేస్తే అది నా తప్పు కాదు!!

కను రెప్పల కింద భాష్పాలకే కాదు కలలకీ చోటు ఉందనీ.. ఉండాలనీ..

వాడిన పువ్వు మూగవేదనే కాదు స్వచ్ఛమైన పచ్చదనం సాక్షిగా రేపు విచ్చుకోబోతున్న మొగ్గ తెచ్చే ఆశల వర్ణాలనీ గుండె నిండా నింపుకోవాలనీ..

మిత్రమా! నా నిశ్శబ్దపు ప్రపంచంలో, నా వెతల కలతను దూరం చేస్తూ నువ్వు ఆలపించిన ఆత్మీయతా రాగం గాయత్రీమంత్రమై.. నా దోసిలిని నమ్మకాల పూలతో నింపుతూ.

మలయమారుతమై మనసుని కమ్మి..

పదాలే లేని నా బ్రతుకుని శ్లోకంలా మలచుకునేందుకు స్ఫూర్తివైన నువ్వున్న తీరాన్ని నేను చేరగలనా!?

ఒక్కసారి. ఒకే ఒక్కసారి.. నిన్ను చూడాలనీ. నువ్వు నేర్పిన నా బ్రతుకు పాట నీకు వినిపించాలనీ.. అది విని నీ పెదవులపై విరిసిన ఆనందపు నెలవంకలను దొంగిలించి దిగంతాల అంచులకి పరిగెట్టి పారిపోవాలనీ..

నేస్తం! కళ్ళల్లో దీపాలు వెలిగించాను. ఇంక నీ నిరీక్షణలో నాకు చీకటైనా పర్వాలేదు!!

********** ********** **********

నమస్తే ప్రభాత గారు,

మాజేరు

మార్చి 5, 1985

అసలే పుస్తక ప్రపంచంతో పరిచయం తక్కువేమో.. అయినా అప్పుడప్పుడూ చదివే ఒకటో అరో పత్రికల్లో కూడా పాఠకుల కోసమేనని కుంటిసాకు చెబుతూ మర్డర్, రాజకీయం, సెక్స్ తో నింపేసిన కథలే వస్తుంటే, అవి చదవలేకా అలా అని ఆ పుస్తకాన్ని విసిరి కొట్టలేకా పజిల్సూ, పదబంధాలూ, సినిమా వార్తలతో చదివేశాననిపిస్తున్న నాకు మీ కవితలు కలిగించిన ఊరట మాటల్లో చెప్పలేనిది..

అవును, నేను మీ అభిమానిని.. ఆరు నెలల క్రితం 'మయూరి' లో మీ రచన చదినప్పటి నించీ మీ కవితా ప్రపంచంలోనే విహరిస్తున్నాను..

లలితమైన పదాలతో మనసుని సూటిగా స్పర్శిస్తున్న మీ శైలి అద్భుతం.. ఇలాంటి పొగడ్తలు ఇప్పటికి మీరు ఎన్నో వినే ఉంటారు.. కానీ మేడం, నా నోటి వెంట ఇదే మొదటిసారి కదా! తల పంకించేసి, చిరునవ్వుతో ఈ అభిమాని వేస్తున్న అభినందన మందారమాలను స్వీకరించండి, ప్లీజ్..

మీ సాహిత్యసేవ నిర్విఘ్నంగా కొనసాగాలని కోరుకుంటూ..

మీ అభిమాని.

*** *** ***

హలో ప్రభాత గారూ,

మాజేరు

మే 20, 1985

గుర్తున్నానా? రెండు నెలల క్రితం మిమ్మల్ని మొదటిసారిగా ఇలానే ఉత్తరంలో పలుకరించాను.. అయినా పేరు కూడా ప్రస్తావించని ఉత్తరాన్ని బట్టి 'నన్ను గుర్తుపెట్టుకున్నారా?' అని అడగటం నా తప్పే.. అందులోనూ మీకొచ్చే ఎన్నో ఉత్తరాలలో నాది గుర్తుపెట్టుకోవటం కష్టమే కదా!!

అప్పుడనుకోలేదు, మళ్ళీ మీకు రాస్తానని.. ఒకసారి అభిమానాన్ని వ్యక్తపరిస్తే సరిపోతుందిలే అనుకున్నా.. ఎంత అజ్ఞానం!! ఇవాళ మీ 'వానచినుకులు' చదివాను.. లేదు మళ్ళీ మళ్ళీ చదువుతూనే ఉన్నాను..

"అనంతం నించీ జారిపడ్డ వాన చినుకు
గాజు కిటికీ అద్దం మీద
అనుపమానమైన దృశ్యం చిత్రించినట్లు..
ఆలంబనలేని నా ఆలోచనలన్నీ
నీ చెలిమి శృతి ఫలకంపై చేరగానే
కలలై, కథలై, కవితలై.. ఎన్నెన్ని రూపాలు!!"

స్నేహం అందించే ఆలంబనని ఎంత హృద్యంగా చెప్పారో మేడం!! చిక్కని వెన్నెల రాత్రి మీ వాన చినుకులలో నిలువెల్లా తడిసిపోతున్నాను.. భావుకత అంటే చంద్రుడినీ, మల్లెల్నే కాదు రాళ్ళనీ, నీళ్ళనీ ఉపయోగించి మనసుని స్పందింపచేయడం.. కదూ! అందుకే మీకు రాయకుండా, నా ప్రశంశలందించకుండా ఉండలేకపోతున్నాను..

అంతే కాదు నాలో ఇంకో అత్యాశ కూడా మొదలయ్యింది.. 'కుదరదేమో.. బాగోదేమో' అని మనసు నసుగుతుంటే చుట్టూ ఉన్న గాలి అలలు మాత్రం 'ఏం పర్లేదు అడిగెయ్యమని' ముంగురులతో ధైర్యం చెప్పిస్తున్నాయి.. అందుకే అడిగేస్తున్నా, "మీ ఆటోగ్రాఫ్ కావాలి మేడం!"..

అయ్యో అలా విసుగ్గా చూడకండి.. నాకు తెలుసు ఇలా ఉత్తరంలోనే ఆటోగ్రాఫ్ అడగటం భావ్యం కాదని.. కానీ ఏం చెయ్యను మేడం, మిమ్మల్ని ముఖాముఖీగా కలిసే అవకాశం నాకు వస్తుందో రాదో.. అందుకే, ఇందాక నేనన్నట్లు అత్యాశ అన్నా అనుకోండి లేదా ముందు జాగ్రత్త అన్నా అనుకోండి..

మీకు ఇబ్బంది కలగకూడదనే నా అడ్రెస్ రాసిన కవర్ కూడా ఈ ఉత్తరంతో పాటు జత చేస్తున్నా.. ఇలా రిటర్న్ కవర్ పంపానని మీరేమీ హడావిడిగా రాయాల్సిన అవసరం అస్సలు లేదు..

ఎప్పుడైనా మీకు ఊసు పోకో, నిద్ర పట్టకో తలవని తలంపులా నా ఈ అభ్యర్ధన గుర్తొస్తే, అప్పుడు రాయండి.. చాలు!

అయ్యో మర్చేపోయాను.. కార్తీక! అదే మేడం.. నా పేరు కార్తీక!!

ధన్యవాదాలు
కార్తీక

*** *** ***

హైదరాబాదు
మే 25, 1985

**కార్తీక గారూ,**

This is Prabhata. మీ ఉత్తరాలకీ, నా కవితపై మీ అభిప్రాయానికీ, ముఖ్యంగా మీ అభిమానానికీ కృతజ్ఞతలు.. మీలాంటి అభిమానుల ప్రశంశలే కొత్త ఆలోచనలకూ, కవితలకూ ఊపిరి పోస్తాయి..
పేరు చెప్పకపోయినా మీ రెండవ ఉత్తరం తెరుస్తూనే మిమ్మల్ని గుర్తుపట్టేశాను.. ఎలా అని అడగరేం?

మీ చేతివ్రాత! అంటే ముత్యాల్లా ఉందని కాదు!! అక్షరాలని ఒకదాని పక్కన ఒకటి పడుకోబెట్టినట్లు తమాషాగా రాసారు :-)

తెల్ల  కాగితం మీద కూడా లైను మీద రాసినట్లు ఎక్కడా వంకర లేకుండా (అదీ పడుకోబెట్టి) రాయడం ఆసక్తికరంగా అనిపించింది.. జస్ట్, అనిపించింది చెప్పాను.. ఏమనుకోకండి మరి..

మీరు ఒట్టి ఆటోగ్రాఫ్ అడిగితే నేనిదంతా ఎందుకు రాస్తున్నానని నాకే సందేహం వస్తుంది ఇప్పుడు.. అసలు సమాధానం ఇప్పుడు తట్టటం  లేదు కానీ ఒక విషయం మాత్రం మీకు చెప్పాలి.. అది, మీరనుకున్నంత గొప్పగా ఏమీ రాయను నేను.. చిన్నప్పటి నుంచీ మనసుకు  అనిపించింది ఏదో పుస్తకంలో రాసుకోవటం అలవాటు.. ఈ మధ్య నుంచే అది బయట ప్రపంచంతో పంచుకోవటం మొదలు పెట్టాను..  అంటే ఈ కవితా ప్రపంచంలో నేను వేశేవి ఇంకా తప్పటడుగులే! ఇంకా చాలా ఎదగాలి, ఎంతో దూరం నడవాలనుంది.. ఎన్నో కదలికలను,  ఆలోచనలను, ఊహలను, అనుభూతులను అందరితో పంచుకోవాలనుంది..

నా ఈ ప్రయత్నానికీ, మీ లాంటి అభిమానుల సాయం నాకు చాలా అవసరం.. ఎందుకంటే నా ఆలోచనా పరిణితిని బయటనుంచి గమనించగలిగేది కేవలం కవితా విమర్శకులే కాదు మీ వంటి పాఠకులు కూడా! కేవలం మెచ్చుకుంటూనే కాకుండా, నచ్చక పోయినా  నిర్ద్వంద్వంగా చెప్తే చాలు..

అంతే కాదు.. మీరనుకున్నట్లు అభిమానుల నుంచి నాకేమీ బస్తాల కొద్దీ ఉత్తరాలు రావండి.. వారానికి ఐదో, ఆరో ఉత్తరాలు.. వస్తాయి.. కానీ అన్నిటికి నా సమాధానం మాత్రం 'ధన్యవాదాలు' 'థాంక్స్' అనే!!

చాలా రోజుల తర్వాత ఇంత పెద్ద రిప్లై రాస్తున్నా.. దానికి ముఖ్య కారణాలు, ఒకటి మీరు ఆల్‌రెడీ మీ అడ్రెస్ ఉన్న కవర్ పంపడం అయితే, ఇంకోటి మీ పేరు!! చాలా రోజుల తర్వాత మంచి తెలుగు పేరు విన్నా.. చక్కగా ఉంది!

ఇక్కడ మీకో ముఖ్య విషయం చెప్పాలి.. 'ప్రభాత' నా కలం పేరు మాత్రమే.. అసలు పేరు వంశీ.. వంశీ మోహన్! అంటే అర్థం  అయింది కదూ.. మీరనుకున్నట్లు నేను 'మేడం' కాను :-)

నేను అబ్బాయినన్న విషయం ఎంతమందికి తెలుసో అంతేమందికీ తెలీదు.. సో చాలా మంది మీలానే పొరబడుతుంటారు.. అసలు నేనెవరో  తెలిశాక కొందరు నిరుత్సాహ పడుతుంటారు, ఇంకొందరు "అలానా" అని జస్ట్ తలాడించేసి ఊరుకుంటారు.. మరి మీరే కోవలోకి  వస్తారో!?

ఉంటాను..

'ప్రభాత' (వంశీ)

*** *** ***

"...నా లోపల ఎవరో చప్పున ఇటు నుంచి అటు వైపు వెళ్ళిపోతూ
ఆనవాలుగా వదులుతారు ఇరవై యేళ్ళ నాటి జ్ఞాపకాల్ని..
నా గది అవతల ఎవరో నవ్వుని నొక్కి పట్టిన ధ్వని.. నీళ్ళని కలచినట్టు!
రోదసీలో.. చీకటిలో.. అంతర్హిత సంగీతం తాలూకు శృతి చుట్టుకొన్నట్టు
మంచూ మసక వెన్నెలా కలిసిన శీతాకాలపు రాత్రి గుండెలమీద
మరకలా పడుతుంది.. నా నిట్టూర్పు ఏకాంతం మీద నా తీర్పు..
ఎందుకు రాస్తున్నావంటే ఏం చెప్పను? ఎవరికి చెప్పనిప్పుడు??
గోడమీద బల్లి విసుగ్గా వెళ్ళిపోయింది.. ఫెరస్ మొక్క నిద్రపోయింది..
ఆకాశం నక్షత్రాల్ని జారవిడిచి అంత ఎత్తుకు ఎగిరిపోయింది..
నా చుట్టూ ఉన్న తెరలు జారిపోయాయి.. నాకు నిజంగా మెలకువ వచ్చింది!
....."

(తిలక్ 'నేను కాని నేను')

*మాజేరు,*

*జూన్ 22, 1985*

*వంశీ గారికి,*

నా చేతివ్రాత్తోనే అడ్రెస్ ఉన్న ఉత్తరాన్ని చించుతుంటే చేతులు వణకలేదు కానీ మనసు కాస్తంత ఉద్విగ్నతకు గురైన మాట మాత్రం నిజం! మీ ఆటోగ్రాఫ్ ఇస్తూ మీరు 'షి' కాదు 'హి' అన్న విషయం కూడా చెప్పినప్పుడు మనసేదో సందిగ్ధావస్థలో పడిపోయింది.. కారణం ఇదీ అని చెప్పలేను కానీ బాగా దగ్గర అనుకున్న వ్యక్తి హఠాత్తుగా దూరం జరిగినట్లు అనిపించింది.. అదీ కొంచెంసేపే! నేను ఇష్టపడింది మీ సాహిత్యాన్ని కదా.. మీరెవరైందీ తెలుయటం వలన దాని విలువ, నా ఇష్టం ఏదీ తగ్గదు.

నాకెందుకో అబ్బాయిలు సమాజాభ్యుదయం, విప్లవభావాలు ఉన్న కవితలు రాస్తారని అనిపిస్తుంది.. కానీ మీరు దాన్ని అసత్యం చేశారు.. మీరు చాలా సెంటిమెంటల్ గా రాస్తారు.. 'మనసు ప్రాంగణం', 'వెన్నెల తునకలు', 'ప్రతిస్పందనల శీతలపవనం' ఇలాంటి అద్భుతమైన పదాలు అసలు ఎలా సృష్టించగలరో!

నా చేతివ్రాత మీద మీ కామెంట్కి తెలీకుండానే నవ్వొచ్చింది.. మరి అది కాంప్లిమెంటో కాదో, నేను మీకు థాంక్స్ చెప్పాలో అక్కర్లేదో!? ఇంతకీ మీరు గ్రాఫాలజీలో కూడా నిష్ణాతులు కాదు కదా!

నా పేరు బావుందన్నారు.. ఆ క్రెడిట్ మా నాన్నగారికి దక్కాలి.. ఎందుకంటే అది ఆయన పెట్టిన పేరు.. అసలు శరత్ సాహిత్యంలో పూర్తిగా మునిగిపోయి నాకు 'సురమ' అని పెట్టాలనుకున్నారు.. కానీ అమ్మ ససేమిరా అనేసరికి ఈ పేరు పెట్టారంట!

Thank you so much for your autograph!

*కార్తీక*

***

*హైదరాబాదు,*

*జూన్ 29, 1985*

*కార్తీక గారూ,*

మీ ఉత్తరం చూడగానే కలిగిన రిలీఫ్ అంతా ఇంతా కాదు.. మీ రిప్లై రావటం ఆల్మోస్ట్ నెల అయిపోయేసరికి మీరు అభిమాని 'ప్రభాత' కి కానీ 'వంశీ' కి కాదనిపించింది.. నా అంచనాను తప్పు చేసినందుకు చాలా ఆనందంగా ఉంది.

అంటే మీ ఉద్దేశ్యంలో అబ్బాయిలు సున్నిత విషయాలు తమ రచనల్లో ప్రస్తావించరంటారా!! అయ్యో, ఈ మాట తిలక్, కృష్ణశాస్త్రిలు, అంతెందుకు మీ నాన్నగారు అంత అభిమానించే శరత్ గానీ విన్నారంటే మిమ్మల్ని ఏ మాత్రం క్షమించరు!

ఇంతకీ మీ నాన్నగారి గురించి మీరు చెప్పింది వింటుంటే మీ ఇల్లే ఒక సాహితీవనంలా అనిపిస్తుంది! నిజమే కదూ!?

ఉంటాను..

*వంశీ*

***

*మాజేరు,*

*జులై 10, 1985*

*వంశీ గారికి,* అంతా కుశలమే కదూ..

నాకెందుకో ఇంకా నమ్మశక్యంగా లేదు, నా అభిమాన రచయితతో ఇలా ఇన్నిసార్లు మాట్లాడుతున్నానంటే! Thanks for your time!

అసలు మీకో సంగతి చెప్పాలి.. నేను తిలక్, కృష్ణశాస్త్రి, చలం లాంటి పెద్దవాళ్ళ పేర్లు వినడమే కానీ వారి రచనలేవీ చదవలేదు.. వార పత్రికలు, ఒకటో రెండో నవలలు తప్ప నాకు పుస్తకాలతో పెద్ద పరిచయం లేదు.. అందుకే చదువుతూనే అర్థం అవుతూ, మనసుకు హత్తుకుపోయే మీ రచనలంటే ప్రత్యేక అభిమానం.. సో, మీరు 'సాహితీవనం' అనుకునే మా

ఇంట్లో అసలైన సాహితీ ప్రియులు మా నాన్నగారే! ఆయన చేతిలో ఎప్పుడు చూసినా ఏదో ఒక పుస్తకం ఉండేది.. అమ్మకి అసలు పుస్తకాలంటే పడేది కాదు.. అదొక కారణమో లేక చదువు వలనో నేను కూడా వాటి వైపు మళ్ళలేదు.. కానీ మీ పరిచయంతో ఇప్పుడిప్పుడే బాగా అనిపిస్తుంది నేను చదవాల్సింది మహాసముద్రమని.. ఏవైనా మంచి పుస్తకాలు రికమెండ్ చేయండి, ప్లీజ్.

పోయినసారి కొంచెం లేట్‌గా రిప్లై రాసి మిమ్మల్ని టెన్షన్ పెట్టినందుకు సారీ.. అసలు సంగతి ఏంటంటే, వేసవి సెలవల తర్వాత స్కూల్లో ఒక నెల వరకూ చాలా పనులు ఉంటాయి, మార్కుల బట్టి పిల్లల్ని సెక్షన్స్ లో వేయడం, టైమ్ టేబుల్స్ ప్రిపేర్ చేయడం లాంటివన్న మాట.. అసలు నేను మీకు చెప్పనేలేదు, నేనొక స్కూల్‌టీచర్ ని.. మా ఊరి పక్కన ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంకటాపురం హైస్కూల్లో టీచర్‌గా చేస్తున్నాను.. ఆ ఊరి నించి మా ఊరికి డైరెక్ట్ బస్ ఉన్నా ఒక్కోసారి ఇంటికొచ్చేసరికి లేట్ అయిపోతుంది. ఇలా మీకు రాస్తూనే ఉన్నానా అప్పుడే కళ్ళ నిండా నిద్ర కూరుకు వస్తుంది చూడండి!! అంటే ఏదో బలవంతంగా తప్పదన్నట్లు రాస్తున్నానేమో అనుకోవద్దు.. ఈ మధ్య నేను ఇష్టంగా చేస్తున్న పని మీకు రాసే ఈ నాలుగు లైన్లే!! ఇంకా ఎస్సైన్‌మెంట్స్ దిద్దుకోవాలి.. అందుకే ఇప్పటికి సెలవు..

*కార్తీక*

***

*హైదరాబాద్,*

*జులై 18, 1985*

*కార్తీక గారూ,*

ఇక్కడ అంతా కుశలమే.. మీరు ఎలా ఉన్నారు?

నిజంగానే మీరు నాకు కొంచెం షాక్ ఇచ్చారు, ఇప్పటి వరకూ పెద్దగా ఏమీ చదవలేదని చెప్పి! కానీ ఏదన్నా పని చేయాలంటే కేవలం మన ఆశక్తే కాదు దానికి పరిస్థితులు కూడా తోడవ్వాలి.. సంతోషం, ఇప్పటికన్నా నిర్ణయం తీసుకున్నారు చదవటం మొదలు పెట్టాలని :-) మీరు బుక్స్ రికమెండ్ చేయమన్నారు సరే నాకైతే ఎక్కడి నించి, ఎవరితో మొదలుపెట్టమనాలో అర్థం కావటం లేదు.. రవీంద్రుని గీతాంజలి, నండూరి ఎంకి, కృష్ణశాస్త్రి ఊర్వశి, చలం శశిరేఖ ఎవరితో మొదలుపెడతారనేది మీ ఇష్టం.. కానీ అందర్నీ పలకరిస్తానని మాత్రం మాట ఇవ్వండి.. మధ్య మధ్య తిలక్, వాసిరెడ్డి, గోపీచంద్ ఏమంటున్నారో కూడా చదవండి.

అయితే మీరు 'పంతులమ్మ' అన్నమాట :-) ఇంతకీ మీరు సినిమాలు చూస్తారా? నాకు 'పంతులమ్మ' లో 'మానసవీణ మధుగీతం' పాటంటే ప్రాణం.. రేడియోలో ఆ పాట వస్తుంటే ఇంట్లో ఎంత గొడవగా ఉన్నా నా చెవులు

మాత్రం రేడియోకే అతుక్కుపోతాయి.. ఇంట్లో ఉండేది నలుగురం; నేను, రాధిక, ఆదిత్య, గౌతమ్.. ఆదిత్యకి నాలుగేళ్ళు, గౌతమ్‌కి రెండు.. నేను వీళ్ళతో కలిస్తే ఆ ఇద్దరి కంటే ఎక్కువ అల్లరి చేస్తానని రాధిక అంటుంది.. అందుకే పాటలంటే ప్రాణమైనా వాటిని ప్రశాంతంగా వినేది రాత్రికి మాత్రమే!

ప్రశాంతత అంటే గుర్తొచ్చింది, మీ ఊరు ఎలా ఉంటుంది? నేను పుట్టి పెరిగింది ఇక్కడే సిటీలో, గుంటూరు దగ్గర చుట్టాలున్నారు కానీ వాళ్ళ ఇళ్ళకెళ్ళి ఎక్కువరోజులుంది లేదు. నాకు ఒక అక్క, తమ్ముడు.. ఎప్పుడూ ఎవరో ఒకళ్ళకి పరీక్షలు ఉండేవి.. నాన్నగారు మమ్మల్ని ఎక్కడికి పంపేవాళ్ళు కాదు.. వెళితే అందరం కలిసే! అందుకే మా ప్రయాణాలన్నీ రెండు మూడు రోజులే! రాధిక వాళ్ళది నెల్లూరు దగ్గర ఊరే కానీ ఆ వాతావరణాన్ని పూర్తిగా ఆస్వాదించింది లేదు.. అలా పల్లెటూళ్ళతో నా అనుబంధం చాలా తక్కువ.. సిటీల్లో లభించే సౌకర్యాలు లేకుండా ఉండటం చాలా కష్టమనిపిస్తుంది నాకు.

సరే మరి సెలవు..
*వంశీ*

***

*మాజేరు,*

*జులై 21, 1985*

*వంశీ గారూ,*

అయితే మీది చక్కని చిన్న సంసారం అన్న మాట.. ఆదిత్య, గౌతమ్ ఎంత చక్కని పేర్లు! నాకనిపిస్తుంది ఇవి ఏ జెనరేషన్‌కి అయినా సూట్ అయ్యే పేర్లని.. మీరు రాధిక గారి గురించి ఏమీ చెప్పనేలేదు!? వచ్చే ఉత్తరంలో ఆశించవచ్చా? మీరు రాసింది చూస్తుంటే మీ పేరెంట్స్ చదువుకి చాలా importance ఇచ్చేవారనుకుంటాను! అలా అయితే మీరు ముగ్గురూ పెద్ద డిగ్రీలే సంపాదించి వుంటారు.

మా ఊరి గురించి అడిగారు కదా.. కృష్ణాజిల్లా దివిసీమలో దివిని మరిపించేలా ఉండే చిన్న పల్లెటూరు.. అప్పటివరకూ కుదురుగా ఉన్న జుట్టు ముడిలోంచి ఒక్కసారిగా జారి, కురులు గాలి అల్లరికి సిగ్గుతో మెలికలు తిరిగినట్లుండే కృష్ణమ్మ పాయలు.. గోదావరిలో గంభీరం పాలు ఎక్కువైతే కృష్ణమ్మకి చిలిపితనం ఎక్కువ.. అందుకేనేమో చిన్న చిన్న పాయలు కూడా గల గలా నవ్వుతూనే ఉంటాయి! అసలు ఊరు మెయిన్ రోడ్ నించి ఒక 4 కిలోమీటర్లు లోపలికి ఉంటుంది.. దారంతా అసలు సిసలు అందం మాదేనన్నట్లు వయ్యారాలు పోయే వరి చేలు.. ఊళ్ళోకి వెళ్తూనే చెరువు, చెరువు గట్టునే ఏవో యోగాసనాలు నేర్చుకుంటున్నట్లు వంపులు తిరిగిన కొబ్బరి చెట్లు..

అక్కడికి కాస్త దూరంలోనే మంచినీళ్ళ బావి.. అక్కడే మీకు మొదటి పలకరింపులు, ప్రశ్నార్థకాలు ఎదురవుతాయి.. బావికి ఎదురుగా ఎవరిదో స్మృత్యర్థం అంటూ పెయింట్ వెలిసిపోయి, పెచ్చులూడిపోయిన గోడలు, ఫ్రెష్‌గా అంటించిన

సినిమా పోస్టర్లతో ఊరి బస్‌స్టాప్.. దాని పక్కనే వీరాస్వామి బడ్డీ, సైకిల్ కొట్టు.. ఒక పాతిక అడుగులు వేయగానే ఊరి పెద్దలా హుందాగా పలకరించే మర్రిచెట్టు ఊరి మధ్యగా! కనుచూపుమేరలో కనిపించే ఆంజనేయస్వామి గుడిలోంచి ఉన్నట్టుండి వినిపించే గంటలు.. అక్కడ నించే పింగళివారి వీధి, చావా వారి సందు, మాల పల్లె ఇలా వీధులు వీధులుగా ఊరు విడిపోతుంది.. పట్టుమని 1000 మంది కూడా ఉండరేమో ప్రతీవాళ్ళూ ప్రతీవారికీ తెలుసు!!

పొద్దున్నే అయితే పొలానికి బయలుదేరిన ఎద్దుల మెడలలోని మువ్వల శబ్దాలు.. నడుము ఈ వైపు నించి ఆ వైపుకి నీటి బిందెల్ని మార్చుకుంటూ పల్లె పడుచులు.. సాయంత్రానికి ఇంటికి బయలుదేరిన గోవుల మంద కాలిగిట్టల వల్ల రేగే గోధూళి.. రోడ్డు పక్కన నడిచే పొలంకూలీల చెవులను అదరగొట్టే హారన్‌తో ఊర్లోకొచ్చే ఎర్రబస్సు.. ఇంటిముందు ఎత్తరుగులూ, వెనక దొడ్లో ముద్దబంతులూ, కనకాంబరాలూ.. ఇవీ సాధారణంగా కనిపించే దృశ్యాలు..

మీరు మాఊరి గురించి ఏ వివరాలు అడిగారో నాకు తెలీదు కానీ నేనిదంతా వర్ణించేశాను.. నిజంగా మీలాంటి వాళ్ళు బయటనించి వచ్చినప్పుడు ఇదంతా కనబడుతుందో లేదో తెలీదు కానీ నేను మాఊరు గురించి తలచుకున్న ప్రతీసారీ నా మనసు అనుభవించే సౌందర్యం ఇది!

ఏం పుస్తకాలు చదవమంటారూ అని అడిగేశాను కానీ తర్వాత నుంచి ఒకటే టెన్షన్ ఎక్కడా శ్రీనాథుడు, కాళిదాసుల పేర్లు చెప్తారోనని.. వారిని చదివే జ్ఞానం నాకింకా రాలేదు.. మీరు చెప్పిన పేర్లు చూడగానే కాస్త ఊపిరి పీల్చుకున్నా! ఈ శనివారం బందరు వెళ్ళి తెచ్చుకోవాలనుకుంటున్నాను.. గబాగబా బోల్డన్ని పుస్తకాలు చదివేసి మీలా గొప్పగా రాసేయాలనుంది.. సరదాకి అంటున్నా.. కానీ మీ అంత కాకపోయినా ఎప్పుడో ఏదో రాయాలనుంది.. మొన్న మీ 'కవితల నెగళ్ళు' మళ్ళీ చదువుతుంటే ఒక డౌట్ వచ్చింది..

*"నీ జ్ఞాపకాల చినుకులలో తడిసిన*
*నా ఊహల విహంగాలు*
*ఈ కవితల నెగళ్ళ చెంత*
*చలి కాచుకుంటున్నాయి... నేస్తం..!"*

ఇంత మంచి కవితలు రాయడానికి మీకు inspiration ఎవరు/ఏమిటి? అసలు ఏ inspiration లేకుండా రాయడం సాధ్యమేనా?

ఇక ఇక్కడితో ఆపాల్సివచ్చేట్లు ఉంది.. అంటే మళ్ళీ నేను నిద్ర మత్తులో రాస్తున్నాననుకునేరు! పక్క వాళ్ళ ఇంట్లో పెళ్ళి జరుగుతోంది.. ఆ వాయిద్యాల హోరుకి తల పగిలిపోయేట్లు ఉంది.. పొద్దున్నే ఇదే మోతతో మంచి నిద్ర నించి లేపేసారు.. ఇప్పుడు అర్ధరాత్రి దాటుతున్నా ఆపేట్లు లేరు.. అయినా ఈ పెళ్ళిళ్ళలో ఎందుకో ఇంత హడావిడి చేస్తారు!! ఏమి

సాధించామని ఇంత హంగామా చేసి లోకానికంతా చాటింపు వేస్తారో అర్థం కాదు.. ఒక అర్థంపర్థం లేని తంతుకి రోజుల తరబడి హడావిడి!!
మీ రాధిక గారిని అడిగినట్లు చెప్పండి.
*కార్తీక*

***

*హైదరాబాద్,*
*జులై 28, 1985*

*కార్తీకా,*

మీ ఉత్తరం చదువుతూ నేనూ మీ ఊరంతా తిరిగొచ్చేసాను! మీమీద కాస్త జెలసీగా కూడా ఉంది అంత చక్కని ప్రదేశంలో ఉంటున్నందుకు! రాధిక అంటుంది 'ఒక వారం రోజులు వెళ్ళి ఉందాము అక్కడ' అని!

మా పిడుగుల పేర్ల గురించి మీరు చెప్పింది విని రాధిక హేపీగా ఫీల్ అయింది.. తన సెలక్షనే అవి! తన గురించి చెప్పమన్నారు.. హైస్కూల్ వరకూ చదివింది.. మా ముగ్గురి బాగోగులూ చూసుకుంటుంది :-)

పెద్ద డిగ్రీలు అంటే అంత పెద్దవేమీ కాదు కానీ ముగ్గురం ప్రొఫెషనల్ కోర్సులే చదివాము.. నేను వరంగల్‌లో ఇంజనీరింగ్ చదివి ఇక్కడే పబ్లిక్ సెక్టార్ కంపెనీలో పని చేస్తున్నా.. మా అమ్మ ఎప్పుడూ అనేది "మేము మీకిచ్చే ఆస్తి ఈ చదువులే.. ఎంత చదువుకుంటే అంత సుఖపడతారు" అని! ఒకరికంటే ఒకరం ఎక్కువ ఆస్తి సంపాదించుకోవాలన్నట్టు శ్రద్ధగా చదివేవాళ్ళం :-)

మీరు అడిగారు నా రచనలకి ఏదన్నా inspiration ఉందా అని.. ఏ ఆర్టిస్ట్‌ని అయినా చుట్టూ కనిపించే సౌందర్యం, ఆనందం, దిగులు, బాధ ఇంక మనసులో కదలాడే ఆశలు, ఆవేశాలే ప్రభావితం చేస్తాయని అనుకుంటాను.. తిలక్ అంటాడు, "ఈ కాలంలో బ్రతుకు.. ఈ ప్రపంచాన్ని ప్రతిఫలించు.. ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు.. నువ్వు చెప్పేదేమైనా నీదై ఉండాలి.. నీలోంచి రావాలి" అని! ఒక్క రాయడమే కాదు మనం ఇష్టపడి చేసే ఏ పనైనా ఎలాంటి inhibitions లేకుండా మనసు నుంచి రావాలి.. అప్పుడే దానికి ఒకరకమైన శక్తి వస్తుంది.. నలుగురిని తాకుతుంది!

ఇంకో విషయం మిమ్మల్ని అడగొచ్చో లేదో తెలీదు.. మీ ఉత్తరం చదువుతుంటే మీకు పెళ్ళి మీద సదుద్దేశ్యం లేనట్లు అనిపిస్తుంది.. దీనికి మీవైపు నుంచి బలమైన కారణాలు ఉండే ఉంటాయి.. కానీ మీ అయిష్టం కేవలం పెళ్ళిళ్ళలో జరిగే తంతు

మీదా లేకా మొత్తంగా ఆ బంధం మీదా?? అంతకు ముందు ఉత్తరం చదువుతున్నప్పుడు కూడా మీ పేరెంట్స్ గురించి చెప్తూ 'ఆయన చేతిలో ఎప్పుడు చూసినా ఏదో ఒక పుస్తకం ఉండేది.. అమ్మకి అసలు పుస్తకాలంటే పడేది కాదు' అంటూ మీరు అన్న మాటల్లో ఏదో అపశృతి వినిపించింది.. 'ఉండేది' 'పడేది కాదు' అంటున్నారు వాళ్ళ అలవాట్లలో మార్పు వచ్చిందా లేక...???

ఈ ప్రశ్నలతో ఇప్పటికి మిమ్మల్ని వదిలేస్తున్నాను..
*వంశీ*

***

*మాజేరు,*

*ఆగస్ట్ 13, 1985*

**వంశీ గారూ,**

ఇప్పుడు సమయం రాత్రి 10 దాటింది.. ఊరంతా నిద్రపోతోంది.. ఎంతో నిశ్శబ్దంగా ఇవాళ నిన్నగా మారిపోతోంది.. మంచంమీద దిండుకానుకుని కూర్చున్నా మీకు ఉత్తరం రాయడానికి.. కిటికీలోనించి తెల్లని కాంతి నా చుట్టూ పరుచుకుంది.. విచిత్రం ఏమిటంటే ఇవి పున్నమి రోజులు కూడా కావు! బహుశా మీ ఉత్తరం తెచ్చిన కాంతి కాబోలు!! చూశారా, నాకూ మీ కవుల భాష వచ్చేస్తుంది! అంతా మీ కవితల చలవే నేస్తం.. అదిగో ఎప్పుడు చూసినా నా కవితల గురించేనా అనుకుంటున్నారు కదూ..

ఇవాళ మధ్యాహ్నమే స్కూల్ నించి నేను ఇంకో టీచర్ కలిసి బందరు వెళ్ళాము.. షికార్లు చేయడానికి కాదండోయ్.. ఎల్లుండి మన జెండా పండగ కదా, పిల్లలకి దేశభక్తి గీతాల పోటీలు పెట్టారు.. వాళ్ళకి బహుమతులు, చాక్లెట్లు కొనడం కోసం.. పనిలో పనిగా మీకిచ్చిన మాట నిలబెట్టుకుందామని ఓ ఎనిమిది పుస్తకాలు కూడా కొనుక్కున్నాను.. రవీంద్రుడి గీతాంజలి, అతడు, చలం గారివే మ్యూజింగ్స్, స్త్రీ, రంగనాయకమ్మ గారివి, మాలతీ చందూర్ గారివి ఇలాంటివన్నమాట.. ఆ పుస్తకాల పాకెట్ పదిలంగా గుండెలకానించుకుని వస్తుంటే దానివంక కొందరు అనుమానంగానూ, ఇంకొందరు అసూయతోనూ చూశారు!

బస్‌లో ఇంటికి వస్తున్నంత సేపూ ఎప్పుడెపుడు ఇంటికెళ్ళి వాటన్నిటినీ చదవాలా అనే ఆత్రుత! కానీ ఇంట్లోకి అడుగుపెట్టగానే మీ ఉత్తరం ఎదురుగా.. చెప్పొద్దూ ఎంత సంతోషం వేసిందనీ! చేతిలో ఉన్నవన్నీ ఎక్కడ పెడుతున్నానో కూడా గమనించకుండా గబగబా ఉత్తరం చదవడం మొదలుపెట్టాను.. పాపం రవీంద్రుల వారు, చలం ఇత్యాదులు ఇంకా ఆ పాకెట్ లోనే బందీలై ఉన్నారు.. మీ ఉత్తరం మాత్రం పది సంవత్సరాలు పైబడ్డట్టు అప్పుడే ముడతలు పడిపోయింది.. మరి నా కళ్ళు అందులోని అక్షరాలని ఎన్నిసార్లు స్పృశించాయో నాకే తెలీదు!

ఇక మీరు రాసిన విషయాలకు వస్తే అందులో మీరడిగిన ప్రశ్నలకు సంబంధించిన విషయాలు మీతో ఏదో ఒకరోజు చెప్పాల్సి వస్తుందేమో అనుకున్నా కానీ ఇంత తొందరగా అనుకోలేదు!

నాకు పెళ్ళి అనే బంధం మీద నమ్మకం లేదు అనడం కంటే ఆ బంధంలో చిక్కుకోవడం ఇష్టం లేదని చెప్పాలి.. అన్ని బంధాలకంటే భార్యాభర్తల బంధం గొప్పదని అంటారు.. కానీ అంత గొప్పదైతే జీవితమంతా వాళ్ళు రాజీపడుతూ ఎందుకు బ్రతికేస్తారు!? ప్రతి జంట జీవితంలో నిర్లిప్తత అంతర్వాహినిలా ఎందుకు ప్రవహిస్తుంది!?

ఇక్కడే మీ రెండో ప్రశ్నకి సమాధానం కూడా ఉంది.. మీరు ఊహించింది కరక్టే! అమ్మా నాన్నా ఇద్దరూ లేరు.. నాన్న నేను ఇంటర్ చదువుతున్నప్పుడు, అమ్మ రెండు సంవత్సరాల క్రితం మరణించారు.. నేను అమ్మమ్మ, తాతయ్యలతో ఉంటాను. అంటే నేను ఇక్కడికి నాన్నా అమ్మా పోయాక రాలేదు.. నేను పుట్టింది పెరిగింది ఇక్కడే.

మా ఊళ్ళో బాగా కలిగిన కుటుంబాలలో మాది మొదటి రెండు స్థానాలు దాటి ఎప్పుడూ వెళ్ళలేదు.. పొలాలు, రైసు మిల్లు, నూనె గానుగ ఇవి మా ఆదాయ మూలాలు.. మా అమ్మమ్మ లక్ష్మమ్మ వాళ్ళ అమ్మానాన్నకి ఒక్కతే కూతురవ్వటం వల్ల మా తాతయ్యని ఇల్లరికం తెచ్చుకున్నారంట! పేరుకి తగ్గట్టే పెద్ద బొట్టు, జరీచీర, చేతి నిండా గాజులతో మా అమ్మమ్మ లక్ష్మీ దేవిలానే ఉంటుంది.. దానితోపాటే వీధంతా వినిపించే పెద్ద గొంతు! లేక లేక పుట్టినందువల్లో లేక ఒక్కతే అవ్వటం వల్ల చేసిన గారాబంవల్లో ఆవిడలో అహంభావంతో కూడిన అధికారం నిండిపోయింది.. వాళ్ళకి ఒకబ్బాయి రామకృష్ణ, మా అమ్మ సరళ ఇద్దరే పిల్లలు..

మా మామయ్య అమ్మ కంటే ఐదేళ్ళు పెద్దవాడంట.. చదువులో చాలా చురుకుగా ఉండేవాడంట.. అమ్మ స్కూల్ ఎగ్గొట్టడానికి ఎన్ని వేషాలు వేసినా ఊరుకోకుండా తనతో పాటే తీసుకెళ్ళేవాడనీ, అసలు మా అమ్మ పదో తరగతి వరకూ చదివింది అంటే మా మామయ్య వల్లే అని అమ్మ ఎప్పుడూ అంటుండేది.. మామయ్య అమ్మమ్మతో ఎప్పుడూ పోట్లాడుతూ ఉండేవాడంట, పొలం కూలీల మీద తన అజమాయిషీ మరీ ఎక్కువైందని.. ఎప్పుడూ ఆ కూలీలతో కలిసి తనూ బస్తాలు మోయటం, మందులు చల్లడం, వాళ్ళకి ఎప్పుడైనా వంట్లో బాగోలేకపోతే టౌన్ నించి మందులు తెచ్చి పెట్టడం.. ఇలా వాళ్ళతో కలిసిపోయి ఉండటం అమ్మమ్మకి ఎంత మాత్రం నచ్చేది కాదంట.. 'అలగా జనంతో చేరి పాడైపోతున్నావని' ఒకటే మొత్తుకునేదంట..

ఆస్తులన్నీ చూసుకోవల్సింది మామయ్యే అని తను మంచి యూనివర్సిటీలో చేరి పైచదువులు చదువుతానంటే అమ్మమ్మ ససేమిరా అంది.. మామయ్య వినకుండా అప్లికేషన్ పెట్టేయడం, సీట్ వచ్చేయడం జరిగింది.. ఇంకో వారం రోజుల్లో విశాఖపట్నం వెళ్ళాలి, యూనివర్సిటీలో చేరాలి అని చెప్పగానే మా అమ్మమ్మకి కాళ్ళూ చేతులు ఆడలేదంట.. మామయ్యని ఇంటి దగ్గర కట్టిపడెయ్యడానికి తనకి ఒకేఒక మార్గం తోచింది.. అది వెంటనే పెళ్ళి చేసెయ్యడం!

అంతే, సంబంధం కుదుర్చుకోవడం, వారం రోజుల్లో ముహూర్తం పెట్టడం అన్నీ ఒక్క రోజులోనే అతి గుంభనంగా చేసేసి, పెళ్ళి రేపనగా మామయ్యతో చెప్పిందంట! ఆ పెళ్ళి చేసుకుని, ఇంటి పట్టున ఉండటం తప్ప ఇంకేం చేసినా తను సహించేది లేదని ఖరాఖండిగా చెప్పిన అమ్మమ్మ మాటలను మామయ్య మౌనంగా విన్నాడంట.. పొద్దున్నే పెళ్ళికొడుకుని చెయ్యాలని తనని నిద్ర లేపడానికి వెళ్తే ఖాళీ పక్క కనిపించింది.. రాత్రికి రాత్రే మామయ్య ఇంట్లోంచి వెళ్ళిపోయాడు! వెంట ఒక్క రూపాయి డబ్బు కానీ, ఒక్క జత బట్టలు కానీ ఏదీ తీసుకెళ్ళలేదంట..

ముందు పట్టలేని కోపంతోనూ, తర్వాత భరించలేని బాధతోనూ తనకోసం ఎన్నో చోట్ల వెతికించారు.. లాభం లేకపోయింది.. ఆఖరికి ఒక నెల తర్వాత మామయ్యే ఒక ఉత్తరం రాశాడంట, అదీ తాతయ్య పేరు మీద! తను సైన్యంలో చేరుతున్నాననీ, తన కోసం ఇక ఎవరూ ఆలోచించనవసరం లేదనీ!! ఆ ఉత్తరం వచ్చాక కూడా రెండు మూడు సంవత్సరాలు ఎంతో ఎదురుచూశారంట.. కానీ మామయ్య ఇప్పటికీ రాలేదు! ముందు గదిలో నూనూగు మీసాలప్పుడు తీసిన మామయ్య ఫోటో పెద్ద సైజులోది ఒకటి వేలాడదీసి ఉంటుంది.. ఆ కళ్ళల్లో పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో స్పష్టంగా కనిపిస్తాయి.. అలానే తదేకంగా చూస్తే మనిషే మన ఎదుట ఉన్నాడా అన్నంత సజీవంగా అనిపిస్తాడు.. నేను అచ్చం మామయ్య పోలికేనంట, అలవాటల్లో కూడా! మా అమ్మమ్మ ఎప్పుడూ అంటూ ఉంటుంది, 'ఇదేం కొంపముంచుతుందో' అని.. నాకు చిన్నప్పుడు చాలా బాధేసేది ఆ మాట విన్నప్పుడల్లా.. కానీ నాన్న పట్టించుకోకని చెప్పేవారు.. ఇప్పుడసలేమీ అనిపించదు..

మామయ్య ఇక తిరిగి రాడని అర్థం అయ్యాక ఇకనుంచీ కొడుకైనా కూతురైనా అమ్మే అని అమ్మకి కూడా ఇల్లరికం సంబంధమే చేశారు.. తెనాలికి ఏదో పెళ్ళికని వెళ్ళి అక్కడ పండగకి ఇంటికొచ్చిన నాన్నని చూశారంట.. చూపులకి బాగుండటమే కాదు, మనిషి కూడా చాలా మంచివాడు, రాజమండ్రిలో గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాడని విన్నారు.. అలానే ఒక కంటితో నాన్న వాళ్ళ ఆర్థిక పరిస్థితి కూడా కనిపెట్టేసారు.. నాన్నకి ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు.. లేని కుటుంబం.. అకౌంట్లు రాయడం, ఎరువుల కొనుగోళ్ళలో ఆసామీలకి సహాయం చేయడం ఆయన ఉద్యోగం.. అదీ నాన్నకి ఉద్యోగం వచ్చేంతవరకే.. ఉన్న ఒకటో రెండో ఎకరాలు పెద్దత్త పెళ్ళికీ, నాన్న చదువుకే ఖర్చు అయిపోయాయని తాత చెప్తాడు.. నాన్న ఉద్యోగం వల్ల తిండికి లోటు లేకపోయినా మిగిలిన ఇద్దరి కూతుళ్ళ పెళ్ళి ఎలా అనే ప్రశ్న తాతని వేధిస్తుండేదేమో!? అందుకే అమ్మమ్మ వాళ్ళు మా ఊరికి పిలిపించగానే వాళ్ళ స్థితిగతుల గురించి తెల్సి ఉండటంతో రెక్కలు కట్టుకుని వాలాడు..

వీళ్ళ ఆస్తిపాస్తులు కళ్ళారా చూసి, ఇవ్వజూపిన కట్నానికి ఆశపడి కొడుకుని ఇల్లరికం పంపేందుకు నాన్న తరపున తనే ఒప్పేసుకున్నాడంట.. నాన్నకీ విషయం తెల్సి ఎంత బాధపడ్డారో తెలీదు కానీ మామయ్యలా పారిపోలేదు.. మారుమాట్లాకుండా అమ్మ మెడలో తాళి కట్టారు! తన ఆశల్నీ, కలల్నీ వెరసి తన జీవితాన్నీ వదిలేసి నిశ్శబ్దంగా ఈ ఊరు వచ్చేశారు!

తాతయ్య, నాన్నా ఇద్దరూ ఈ కుటుంబానికి ఇల్లరికం వచ్చిన అల్లుళ్ళే అయినా ఇద్దరికీ ఎంతో వ్యత్యాసం ఉంది.. అమ్మమ్మ నోటి దురుసుతనం, అజమాయిషీ తాతయ్యను రవ్వంత కూడా బాధ పెట్టినట్లు అనిపించదు.. తన మాట ఇంట్లో

ఎలాగూ చెల్లదని తెల్సి ఎందులోనూ తల దూర్చరు.. అమ్మమ్మ చెప్పిన పని మరోమాట అడగకుండా చేయడమే! మనిషి మంచి ఒడ్డూ పొడవుతో భారీగా ఉంటారు.. పంచాయితీ ఆఫీసులో కూర్చుని ఎరువుల ధరలు, వర్షాలు పడకపోవడానికి లేదా ఎక్కువ పడటానికి గల కారణాలు, దేశ రాజకీయాలు, ఇలాంటి విషయాలు అక్కడున్న వాళ్ళతో చర్చిస్తూ కులాసాగా గడిపేస్తున్నట్లు ఉంటారు.. అంటే గాలి వాలు వైపే నడుస్తుంటారు..

కానీ నాన్న గాలితో పాటు కొట్టుకెళ్ళలేరు. అలాగని గాలికి ఎదురు ఈదే ధైర్యం కూడా లేదు.. ఆయనో భావకుడు.. స్వాప్నికుడు.. అంత సున్నిత హృదయుడిని నేనిప్పటివరకూ చూడలేదు.. ఎప్పుడు చూసినా చేతిలో ఏదో పుస్తకంతో కనిపించేవారు.. మా ఇంట్లో ఏదో గ్రహాంతరవాసిలా అంటీముట్టనట్టు ఉండేవారు.. ఈ పొలాల విషయాలు, కూలీలతో తగాదాలు, మధ్యవర్తులతో బేరసారాలు ఇవేమీ ఆయనకి తెలీవు.. నేర్చుకోవడానికి అస్సలు ప్రయత్నించలేదు! అందుకే ఇంటి విషయాలన్నీ అమ్మమ్మ నించి వారసత్వంగా అమ్మే తీసుకోవాల్సి వచ్చింది, వాటితోపాటు నోటి దురుసుతనం కూడా! కానీ రూపంలో అమ్మమ్మకి వ్యతిరేకంగా ఎప్పుడు చూసినా వేలుముడి, రేగిపోయిన జుట్టు, గంజి పెట్టని కాటన్‌చీరతో కనిపించేది.. తన పేరుకి పూర్తి వ్యతిరేకంగా ఎవరి మీదనో అరుస్తూ చాలా అప్రసన్నంగా ఉండేది!

ఒకసారి పండగ కదా కాస్త మంచి చీర కట్టుకుని నీట్‌గా ఉండొచ్చుగా అన్నారని 'అలాంటి భోగం వేషాలు వేయడం తనకి రాదనీ, అయినా సింగారించుకుని కూర్చుంటే జరగాల్సిన పనులెవరు చూస్తారని' నాన్న మీద విరుచుకు పడింది.. నోటితో తప్ప పనులు జరగవని ఆమె నమ్మకం.. ఇంటి విషయాలు, బయట విషయాలు ఏవైనా పరిశరాలతో పని లేకుండా మాట్లాడటం తన అలవాటు.. నాన్న చేతకానితనాన్ని అవకాశం వచ్చినప్పుడల్లా అందరిముందూ చెప్తుండేది.. అలా అయినా ఆయనలో పౌరుషం వచ్చి పనుల్లో ఆసక్తి చూపిస్తారని తన ఆశ.. నాన్న అందుకు విరుద్ధంగా ఇంకా ఇంకా దూరం జరిగేవాళ్ళు.. అసలు వాళ్ళిద్దరే కూర్చుని మాట్లాడుకోవడం నా ఊహ తెల్సిన దగ్గర నించి చూడలేదు. తన ఉనికే భరించలేనట్లు అమ్మ ఉన్న చుట్టుపక్కల అసలు కనిపించేవారు.. పుస్తకాల ధ్యాసలో తనని పట్టించుకోవడంలేదని వాటిన్నటినీ బయట చూరు కింద ఉండే పాత చెక్క బీరువాలోకి నెట్టేసింది..

ఎప్పుడన్నా నాన్న నానమ్మ తాతయ్యల దగ్గరికి వెళ్తే వెంట నన్ను తీసుకెళ్ళేవారు.. అక్కడ వాళ్ళు, అత్తయ్యలు కలిసి ఏకబిగిన కష్టాలన్నీ చెప్పుకుని 'మాకేం చేస్తావని' అడిగేవారు.. అంతా అమ్మ చేతిలోనే ఉందని తెలిసీ ఆయన మీద వత్తిడి తెచ్చి, లాభం లేకపోయేసరికి పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేనివాడని తేల్చేశారు.. ఎప్పుడైనా మా ఇంటికి వచ్చినప్పుడు మాత్రం అమ్మని మహాలక్ష్మి అనీ, ఎంతో పనిమంతురాలనీ ఓ పొగిడేసి బియ్యం, పప్పులు, నూనె లాంటివి మోసుకుని వెళ్ళేవాళ్ళు..

నాన్నకి జాండిస్ వచ్చిన రోజుల్లో భోజనం పెట్టడం, మందులివ్వడం లాంటి పనులన్నీ నాతోనే చేయించుకునేవారు.. నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని బాగా చదువుకోమనీ, చదువులేని జీవితానికి అర్థం లేదనీ చెప్పేవారు.. నేను ఆయనకి జ్వరం లాంటిది ఏదో వచ్చింది ఇంకో నాలుగైదు రోజుల్లో బాగైపోతుందనుకున్నా.. ఒకరోజు రాత్రి నిద్రలో పెద్దపెద్దగా పలవరిస్తూ అమ్మ ఎంత లేపినా లేవకపోతుండేసరికి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు.. అంతే! మళ్ళీ తిరిగి రాలేదు, సజీవంగా! ఆడుకుంటూ

మెట్లమీద పడిపోయి ఏడుస్తుంటే ఒకచేత్తో నా కన్నీళ్ళు తుడుస్తూనే ఇంకో చేత్తో 'నా బుజ్జితల్లిని పడెయ్యడానికి వీటికెంత ధైర్యం! రోజురోజుకీ పొగరెక్కువైపోతుందసలు' అంటూ మెట్లని అదిలించే నాన్న.. నేను నవ్వగానే 'నా తల్లి జాబిల్లి' అంటూ దగ్గరకు తీసుకునే నాన్న.. నిశ్శబ్దంగా తన స్వాప్నికలోకానికి వెళ్ళిపోయారు!

అదేం విచిత్రమో.. నాన్న పోయాక అమ్మ ధోరణిలో విపరీతమైన మార్పు వచ్చింది.. చాలా పరధ్యానంగా ఉండేది.. నాన్న విలువ ఆయన పోయాక తెలుస్తుందేమో అనుకున్నా.. కానీ చిత్రంగా తనకి పెళ్ళి చేసి తన జీవితాన్ని నాశనం చేశారని అమ్మమ్మ తాతయ్యలతో ఒకరోజు అనడం విని నాకు బాధ కంటే చాలా ఆశ్చర్యం వేసింది! అసలు వాళ్ళిద్దరి మధ్య ఉన్న సంబంధమేమిటో నాకప్పుడు అర్ధం అయింది.. ఏమీ లేదు!! యజమానికి పనిచేసేవాడికీ, అమ్మాయికీ అబ్బాయికీ, గురువు శిష్యుడు ఇలా ఏదో ఒకటన్నా లేదు.. అస్సలంటే అస్సలు లేదు!! పెద్దవాళ్ళు ఇద్దర్నీ ఒకే కప్పు కింద ఉండమన్నారు.. ఉన్నారు.. అంతే! వాళ్ళిద్దరి మధ్యా ఎప్పుడూ దగ్గరతనం లేదు.. ఉండటానికి వాళ్ళే మాత్రం కూడా ప్రయత్నించలేదు!

నాకైతే ఇద్దరిలో ఎవరిదీ తప్పులేదనిపిస్తుంది.. వాళ్ళిద్దరివి కంప్లీట్‌గా విరుద్ధమైన ప్రపంచాలు.. ఎవరూ వాటి సరిహద్దుల్ని దాటడానికి ప్రయత్నించలేదు.. ఒకరినొకరు ద్వేషించుకుంటూ కాలం గడిపేశారు.. అమ్మకి ఎలాంటి అనారోగ్యంలేదు.. నిద్రలోనే చనిపోయింది.. హార్ట్ అటాక్ అన్నారు.. జీవితంలో ఏదో కోల్పోయానన్న బాధ ఆమెని మింగేసింది..

అమ్మానాన్నలని చూసిన తర్వాత నాకసలు పెళ్ళి అనే ఆలోచన రాగానే మనసంతా గుప్పెడు వేపపూత తిన్నట్టు చేదుగా అయిపోతుంది.. జీవితాంతం ఒకరికి బందీలా ఉండాలనే విషయం నేను భరించలేకపోతున్నాను.. నాన్న చెప్పినట్లు నాకు చదవాలని ఉంది.. పి.హెచ్.డి చేయాలని ఉంది.. అసలు ఈ స్కూల్ ఉద్యోగం చేయడానికే అమ్మమ్మ చాలా గొడవ చేసింది, 'నీకంత అవసరం ఏమొచ్చిందని'.. అమ్మానాన్న పోయాక తాతయ్య కాస్త గట్టిగానే మాట్లాడటం మొదలుపెట్టాడు.. పక్కనే ఉన్న ఊరు కాబట్టి ఈ ఉద్యోగానికి ఒప్పుకున్నా రేపు యూనివర్సిటీకి వెళ్ళి చదవాలంటే పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చేట్లు ఉంది.. పెళ్ళి చేసుకుని నువ్వేం చేసినా మాకు అభ్యంతరం లేదంటుంది అమ్మమ్మ.. కానీ నాకసలు ఆ ఉద్దేశ్యమే లేదంటే నమ్మదు.. ఎప్పుడో కులం కాని వాడిని తీసుకొచ్చి 'వీడిని ప్రేమించాను.. వీడినే పెళ్ళి చేసుకుంటాను' అంటానని ఆమె భయం.. అందుకే నా మీద ఎప్పుడూ నిఘా వేసి ఉంచుతుంది.. స్కూల్ వేళ కాకుండా ఇంకెప్పుడైనా ఇంట్లోంచి బయటకి కదలాలంటే తను వేసే సవాలక్ష ప్రశ్నలకి సమాధానం చెప్పిగానీ కదలడానికి లేదు..

మీరడిగినదానికి ఇంత పెద్ద సమాధానం వస్తుందని ఊహించి ఉండరు.. అసలు ఇదంతా రాసింది నేనేనా అన్న అనుమానం వస్తోంది! 'ఈ అమ్మాయి ఇంత నస పెట్టేంటి బాబూ' అని భయపడుతున్నారా.. 'ఇంకెప్పుడూ ఏ ప్రశ్నలూ అడక్కూడదనే' నిర్ణయాలు మాత్రం తీసుకోకండి మిత్రమా! మొగ్గ విచ్చుకోవడానికి ఆయత్తమౌతున్న ఈ ఘడియల్లో మీతో కబుర్లు చెప్పడం చాలా బావుంది.. అందుకే ఎన్ని పేజీలు దొర్లిపోతున్నాయో తెలీలేదు! మీరు కూడా మీ రచనలన్నీ ఇలాంటి ప్రశాంత సమయంలోనే రాస్తారేమో!? అందుకే ఆద్యంతం అందమైన భావాలే నిండి ఉంటాయి!

సరే ఇంతకీ మా ఊరి వర్ణన విని మీకు జెలసీగా ఉందన్నారు.. ఇప్పుడు మా కుటుంబం గురించి విన్న తర్వాత కూడా అలానే

అనిపిస్తుందంటారా!? ఇప్పటికే మీ టైమ్ చాలా తినేశాను.. మరి రాబోయే మీ ఉత్తరం చెప్పే కబుర్ల కోసం కళ్ళే కాదు వళ్ళంతా కాయలు కాచేలా.. వద్దు లేండి.. మళ్ళీ కాయలంటే మా అమ్మమ్మ 'అవేం కాయలే.. సంతలో అమ్మొచ్చా?' అంటుంది.. అందుకే మామూలుగానే ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తుంటాను..

ఇక ఉంటాను.

**కార్తీక**

*** *** *** ***

*హైదరాబాదు,*

*ఆగస్ట్ 20, 1985*

**కార్తీకా,**

ఇవాళ సాయంత్రం ఇంట్లోకి అడుగుపెడుతూనే ఆదిత్య తను కొత్తగా నేర్చుకున్న రైమ్ వినిపించడం మొదలుపెట్టాడు.. ఈసారి చాలా పెద్దది నేర్చుకున్నాడంట.. మధ్యలో మర్చిపోవడం, మళ్ళీ మొదటి నించీ చెప్పడం.. ఇలా ఒక నాలుగైదు సార్లు ఆ రైమ్ ని అటూ ఇటూ తిప్పాక కానీ మొత్తం చెప్పలేదు.. అంతలో గౌతం బంతాట ఆడటానికి రమ్మని కాళ్ళు చుట్టేసాడు!! ఈ హడావిడిలో ఉండగానే రాధిక మీ ఉత్తరం తెచ్చిచ్చింది.. అన్ని పేజీల ఉత్తరం చూడగానే చాలా సంతోషం వేసింది కానీ చదవడానికి అది తగిన సమయం కాదని ఇదిగో ఇందాకే భోజనం అయ్యాక చదివాను.. ఎంత చక్కగా రాశారు! కాస్తంత బరువైన విషయాన్ని చెప్తూ కూడా చమత్కారం చిందించడం నాకెంతో నచ్చింది!

పిల్లలిద్దరూ ఎప్పుడో పడుకున్నారు.. రాధిక హాల్లో ఏదో కుట్టుకుంటూ ఉంది.. మీరూహించింది నిజమే! నేను కూడా తారలు సంచరించే వేళల్లోనే రాయడానికి ఇష్టపడతాను.. ఏది రాసినా ముందుగా కిటికీలోంచి తొంగిచూసే నందివర్ధనాలకి వినిపించడం అలవాటు.. ఇంతకీ ఆ రచయితల బంధనాలను ఇప్పటికైనా తొలగించారా లేదా!? నాకెందుకో బాగా అనిపిస్తుంది, ఈ సమయంలో మీరు ప్రపంచాన్ని మర్చిపోయి ఏదో ఒక పుస్తకంలో లీనమై ఉంటారని..

ఈసారి మీ ఉత్తరం దిగులు మేఘాన్ని వెంట తెచ్చింది.. తల్లితండ్రుల మధ్య విభేదాలు ఈ రీతిలో కూడా ఉంటాయన్న విషయం తెల్సింది.. అంతా సవ్యంగా ఉన్న కుటుంబాలలోనే పిల్లల ఆలోచనలు పక్కదారి పట్టడం చూస్తాము కానీ మీఇంటి సంగతి విన్నాక ఆ వాతావరణంలో పెరిగిన మీ ఆలోచనా దృక్పథంలో ఎలాంటి అనారోగ్య సూచనలు కనబడకపోవడం నాకు చాలా నచ్చింది.. ఒక్క వివాహం విషయంలోనే నేను మీతో ఏకీభవించలేను అనిపిస్తుంది.

నాకనిపిస్తుంది, ఒక్క మీ కుటుంబ పరిస్థితుల ఆధారంగా మీరీ నిర్ణయానికి రావడం సబబు కాదేమో అని.. భార్యాభర్తలిద్దరిలోనూ ఒకేరకమైన వ్యక్తిత్వ వికాశం ఉండకపోవచ్చు.. అభిప్రాయభేదాలు ఉండొచ్చు.. ఒకరు అవునంటారు.. ఇంకొకరు కాదంటారు.. మరునిమిషంలో వచ్చే పండక్కి పిల్లలకి ఏం కొనాలా అని సమాలోచనలు చేస్తారు.. ఒక తుఫాను సాయంత్రం భర్త ఇంకా ఇంటికి రాకపోతే భార్య ఆందోళన పడుతుంది.. అదే భార్యకి వంట్లో బాగోకపోతే భర్తకి కాళ్ళూ

చేతులూ ఆడవు.. పందిరి, మల్లెతీగ ఈ రెండిట్లో ఒకటి లేని రెండవదాన్ని ఊహించగలమా!? తననంతా ఆక్రమించేస్తుందనీ పందిరీ, ఆ పందిరి తప్ప ఇంక తనకి వేరే ప్రపంచమే లేదనీ మల్లెతీగా బాధపడి ఒకరినొకరు త్యజిస్తే మనం మల్లెల సువాసనలు ఆస్వాదించగలిగేవాళ్ళం కాదు కదా!?

మీ చుట్టూనే ఇంకా ఎన్నో కుటుంబాలు ఉంటాయి.. అంతవరకూ ఎందుకూ, మీ స్నేహితుల్లోనో లేక దగ్గర బంధువుల్లోనో మీ వయసు అమ్మాయిలలో వివాహం అయినవాళ్ళు ఉండి ఉంటారు.. వారిని చూడండి.. వారి జీవితం గురించి అడగండి.. మీ నిర్ణయంలో ఏమన్నా మార్పు ఉండొచ్చేమో..

అలా గమనించి మీరు చెప్పే విషయాలకోసం ఎదురుచూస్తుంటాను.. ఒక నాలుగైదు కుటుంబాలు పరిశీలించండి.. మళ్ళీ ఈ కౌంట్ ఏమిటో అనుకుంటున్నారా? స్వార్థమండి.. స్వార్థం.. అప్పుడైతే ఇంకో నాలుగు పేజీలు ఎక్కువ రాస్తారు కదా!
**వంశీ**

*** *** *** ***

*మాజేరు,*

*ఆగస్ట్ 22, 1985*

**వంశీ గారూ,**

అబ్బా, మీ లెక్కల పాండిత్యాన్నంతా మీ లెటర్ లోనే చూపించారుగా! ఎలా అంటారా? నేను రాసినదానికి లెక్కేసి సరిగ్గా 10% రాసినట్లున్నారు!! సమయమూ లేక స్టేషనరీనా తమరు ఎందులో పొదుపు పాటిస్తున్నట్లో! మొదటిసారి మీ ఉత్తరం వచ్చిన రెండోరోజు కానీ నేను రిప్లై రాయటంలేదు! నిన్న చాలా తొందరగా పడుకున్నాను.. వర్షాలు విపరీతంగా పడుతున్నాయి.. బస్సులు లేట్ గా నడుస్తున్నాయి.. నిన్న ఇంటికొచ్చేసరికి విపరీతమైన అలసట.. దానితోపాటే అమ్మమ్మ సణుగుడు 'వేళాపాళా లేని ఈ ఉద్యోగం ఏంటి' అని.. ఇది మరీ అన్యాయం కదండీ, వర్షం పడినా అది నా ఉద్యోగం తప్పే!

తెల్లవారుఝామున ఉన్నట్టుండి మెలకువ వచ్చింది.. కళ్ళు తెరవనేలేదు 'వీణ నాది.. తీగ నీది.. తీగ చాటు రాగముంది' పాట అప్రయత్నంగా పెదవులపై కదలాడింది!! చిత్రంగా అనిపించింది.. నిన్న పడుకునే ముందు మీ లెటర్‌లో మీ మాటలే మననం చేసుకుంటూ పడుకున్నాను.. సరిగ్గా నిద్రలోకి జారబోయే ముందు నా మనోఫలకం మీద నిలిచిన చిత్రం ఏమిటో తెలుసా! రాత్రి నిశ్శబ్దంలో టేబుల్ లాంప్ వెలుగులో ఏదో రాసుకుంటున్న మీరు.. ఆ పక్కనే కుర్చీలో ఏదో కుడుతున్న రాధిక గారు!! మీ జంట ఈపాటకి సరైన అర్థాన్ని ఇస్తారనేమో ఈ గీతం సుప్రభాతం పాడింది.. అది సరేగానీ మీరు రాసేవన్నీ మొట్టమొదటిగా వినే భాగ్యం రాధిక గారిదనుకున్నాను మీరేంటీ మధ్యలో నందివర్ధనాలపై అవసరమైన దానికన్నా ఎక్కువ ప్రేమ చూపిస్తున్నట్లున్నారు!! నాదో కుతుహలం.. మీరు ఏరికోరి చేసుకున్నారంటే రాధికగారు కూడా మంచి భావుకురాలు అయిఉంటారు కదూ..

సరే, ఈసారి కూడా మీరు భోజనం అయ్యాకే ఈ లెటర్ చదువుతుంటే మీకొక బెడ్ టైం స్టోరీ చెబుతాను.. వింటారా మరి?

మేము ముగ్గురం స్నేహితులం.. చిన్నప్పటినించీ స్కూల్‌కి వెళ్ళడం, ఇంటిదగ్గర చదువుకోవడం, ఆటలాడుకోవడం అన్నీ కలిసే చేసేవాళ్ళం.. ముగ్గురిలో మాధురి చాలా నెమ్మది, పిరికిది కూడా.. ఎవరు తోడు లేకున్నా ఇంటి నించి బయటకి ఎక్కడికీ వెళ్ళదు.. వేరేవాళ్ళతో కలవదు.. రోహిణి మాత్రం సీమటపాకాయ! చదువులో ఎప్పుడూ ఫస్టే! స్కూల్లో అన్నిట్లో పాల్గొనేది.. ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూనే ఉండేది.. అది మాతో లేకపోతే అస్సలు తోచేది కాదు.. తన కలలన్నీ ఒక పెద్ద సైంటిస్ట్ అవ్వాలని..

టెన్త్ రిజల్ట్స్ వచ్చాయి.. రోహిణి డిస్ట్రిక్ట్ ఫస్ట్ వచ్చింది.. ఎంతో సంతోషంతో ఇంటర్‌కి ఏ కాలేజీలో చేరదామా, ఏ గ్రూప్ తీసుకోవాలా అని రాత్రుళ్ళు డాబా మీద పడుకుని చర్చించుకునేవాళ్ళం.. రోహిణి మాత్రం ఆకాశం వంక మెరుస్తున్న కళ్ళతో చూస్తూ అనేది, 'ఎప్పుడో ఒకరోజు రాకెట్‌లో అక్కడికి వెళ్తాను.. అక్కడ నించి మీకు హాయ్ చెప్తాను'!

ఒకరోజు అమ్మమ్మ అంది, "మీ రోహిణికి పెళ్ళి కుదిరిందంటే.. రేపు శ్రావణమాసంలోనే ముహూర్తం' అని! నాకు అర్థం కాలేదు.. 'అప్పుడైతే కాలేజీకి సెలవలు ఉండవు కదా' నేను అమాయకంగా అడిగాను.. 'ఇంకా కాలేజేంటి! దాన్ని ఇంకా చదివించే స్థోమత వాళ్ళకసలు లేదు.. బోల్డంత ఆస్తి, పిల్ల కావాలని వచ్చారు.. ఇంతకంటే మంచిసంబంధం వాళ్ళకి మళ్ళీ దొరుకుతుందా ఏమిటీ!' అంటూ అమ్మమ్మ రాగం తీస్తూ అంది.. ఆర్థిక తారతమ్యానికి అర్థం జీవితంలో మొదటిసారిగా తెలిసింది!

వెంటనే వాళ్ళింటికి పరిగెత్తాను.. వెనకాల పూల చెట్లకి పాదులు చేస్తుంది.. అసలు తను చేస్తున్న పని మీద స్పృహ ఉన్నట్లేలేదు.. నేను విన్న వార్త నిజమే అన్నట్లు ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయిన తన మొహమే చెప్పింది.. నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.. 'పోనీ ఆ ఊరి నించే కాలేజీకి రారాదూ' అన్నా.. 'ఇంక చదవడం వాళ్ళకిష్టం లేదంట' అది మాట కూడా పూర్తి చేయలేదు కళ్ళల్లో చోటు చాలక కన్నీళ్ళు గొంతులోకి దూసుకొచ్చినట్లు దానిగొంతు పూడుకుపోయింది!! ఇక ఉండలేక కాసేపేదో మాట్లాడాననిపించి వెనక్కి వచ్చేశాను.

తర్వాత తెలిసింది అది 'పెళ్ళొద్దు.. చదువుకుంటాను' అని బాగా గొడవ చేస్తుంటే వాళ్ళింట్లో వాళ్ళు కొట్టి ఇంక బయటకి కాలు పెట్టనీకుండా కట్టడి చేశారని! మళ్ళీ రోహిణిని వంటరిగా కలుసుకునే అవకాశం పెళ్ళి ఆ తర్వాత కార్యక్రమాలన్నీ అయిపోయాక అత్తగారింటికి వెళ్తుంటే వచ్చింది.. నాకు బాధతో అస్సలేం మాట్లాడాలో కూడా తెలీటంలేదు.. మాధురేమో తన ప్రశ్నలతో తెగ వేధించేస్తుంది.. 'మీ ఆయన నిన్ను ఏమని పిలుస్తాడు.. నువ్వేమని పిలుస్తావు..' ఇలాంటివే దాని ప్రశ్నలు! అంతలో గది బయట నించి ఎవరో రోహిణిని పిలిచినట్లు అనిపించింది.. రోహిణి పట్టించుకోకుండా మా కాలేజీ విషయాలు అడుగుతుంది.. మరునిమిషంలోనే వాళ్ళమ్మ గబగబా లోపలికి వచ్చి 'ఏంటే చెవుడొచ్చిందా ఏంటీ.. అవతల అల్లుడు గారు పిలుస్తుంటే వినిపించుకోకుండా ఏంటా సోది' అని గదిమేసరికి దాని మొహంలో నేనెప్పుడూ చూడని భయం చూశాను.. అది వెళ్ళనంటున్నా వాళ్ళమ్మ బలవంతంగా లాక్కెళ్ళింది..

ఆ తర్వాత నాలుగు నెల్లకి మా అమ్మమ్మ మళ్ళీ ఇంకో వార్త చెప్పింది, రోహిణి తల్లి కాబోతుందని.. నాకైతే ఆ వార్త దాని పెళ్ళి వార్త కంటే ఎక్కువ ఆశ్చర్యాన్ని కలుగజేసింది.. చిన్నగా గువ్వలా ఉండే అదే ఒక పసిపాపలా ఉంటుంది.. ఇంకో పాపకి తల్లి కావటమేమిటీ అనిపించింది! ఇక ఆపుకోలేక మొదటిసారి ఉత్తరం రాశాను, తను ఎలా ఉందో అని అడుగుతూ అసలు పెళ్ళి అయ్యాక తన జీవితం ఎలా ఉందో చెప్పమని అడిగాను.. వెంటనే పోస్ట్ కార్డ్ వచ్చింది, 'ఇంకెప్పుడూ ఇక్కడికి ఉత్తరాలు రాయొద్దని!!' ఆ మాట రోహిణి రాసిఉంటుందని నేననుకోను.. కానీ దాని వల్ల ఆ ఇంట్లో తన హక్కులేమిటో తెలిసివచ్చింది!

డెలివరీ టైంలో బిడ్డతో పాటు అదీ చనిపోయిందన్న విషయం నాకిప్పటికీ నమ్మశక్యం కాదు.. అందరూ దాన్నే తప్పుబట్టారు, మొగుడితో సరిగ్గా ఉండేది కాదని.. ఎప్పుడూ ఉసూరుమని ఉండేదని.. ప్రేగ్నెంట్ అని తెల్సాక కూడా సరిగ్గా తిండి తినక తనే తన ప్రాణం తీసుకుందనీ!! మరి తన భర్త తప్పు అస్సలేమీ లేకుండానే దాని జీవితం అలా అయిపోయిందా అనిపిస్తుంది! అతనికి భార్య కావాలి, రోహిణికి చదువు కావాలి.. ఇక్కడా అంతే! ఎవరూ వాళ్ళ వృత్తాల్ని దాటి బయటకెళ్ళలేకపోయారు.. ఒకరికి కావాల్సింది ఒకరు మనస్ఫూర్తిగా అందించుకోలేకపోయారు.. మగవాడు కాబట్టి అతనిది పైచెయ్యి అయితే రోహిణి మాత్రం లోపల లోపలే కుమిలిపోయి తననే కాదు తన ప్రతిరూపాన్ని కూడా అంతం చేసుకుంది.. ఇప్పటికీ రాత్రిపూట ఆకాశంలో తళుక్కుమనే ఏ నక్షత్రాన్ని చూశినా మా రోహిణే అక్కడ నించి హాయ్ చెప్తుందనిపిస్తుంది!

క్షమించండి, ఏమిటో కాస్త డిప్రేస్సింగ్ గా ఉంటున్నాయి నా ఉత్తరాలు..

వంశీ గారు, అందరూ చేసుకుంటున్నారని పెళ్ళి చేసుకోవడం, అందరూ కంటున్నారని పిల్లల్ని కనడం.. బ్రతుకుతో రాజీ పడలేక.. అలా అని అందులో ఇమడలేక రోహిణిలా ప్రాణాలు తీసుకోవడం నేను చేయదలచుకోలేదు.. నేను చెప్పాను కదా, నేనేమీ పెళ్ళి చేసుకుంటున్నవాళ్ళనీ, చేసుకోబోయే వాళ్ళనీ విమర్శించడంలేదు.. 'మరి ఇంకేం చేస్తావు' అంటారా? ఏమోనండి, ముందుగా అయితే పి.హెచ్.డి మీద ధ్యాస పెడతాను.. పుస్తకాలు చదువుకుంటూ, ఇంకా మీకు ఇలా పుంఖాను పుంఖానులుగా లెటర్స్ రాసేస్తూ గడిపేస్తాను.. అది సరేగానీ మీ స్వార్థం నాకు చాలా నచ్చింది.. కవిగారు కళ్ళజోడు పైకి తోసుకుంటూ, సీరియస్‌గా ఉంటారేమో అనుకున్నా.. పర్వాలేదు మీలో కూడా హాస్యనరం ఉందన్నమాట!

మా మాధురి అంది, నేనేంటో ఈ మధ్య చాలా సంతోషంగా కనిపిస్తున్నానని.. మీ పరిచయం, మీరు క్రమం తప్పకుండా ఉత్తరాలు రాయడం గురించి చెప్పేశా.. అది అస్సలు నమ్మలేదు.. ఆఖరికి మీ ఉత్తరం ఒకటి చూపించాల్సివచ్చింది.. ఎందుకో ఈమధ్య దాని ప్రవర్తనలో తేడా కనబడుతుంది నాకు.. ప్రస్తుతానికి టైమ్ లేదు కానీ మళ్ళీ త్వరలో రాస్తాను..

రాధిక గారిని మరీ మరీ అడిగినట్లు చెప్పండి.. ఇంతకీ పిల్లలకి ఈ పల్లెటూరి ఆంటీ గురించి ఏమైనా చేప్పారా లేదా!?

ఈసారి మీ ఉత్తరం ఏం స్వార్థం కోరుతుందోనని ఎదురుచూస్తూ..
**కార్తీక**

*** *** *** ***

**మాజేరు,**

సెప్టెంబర్ 22, 1985

**మిత్రమా,**

అమావాస్య వెళ్ళిన మర్నాటి నించి తన కోసం చూస్తున్నాన! చెప్పిన రోజుకి రాకుండా ఆ జాబిలి ముఖం దాటేస్తే ఎలా చెప్పండి!? కబుర్లన్నీ తన కోసమే దాచి ఉంచుతాననీ తెలుసు.. అయినా వానకి ఇల్లు దాటలేకపోయిన తన అశక్తతని మేఘాల ఉరుములలో వింటూనే ఉన్నాను.. మరి మీ ఉత్తరం కూడా ఎక్కడన్నా తుఫానులో చిక్కుకు పోయిందంటారా? ఆ కబురెవరు అందిస్తారో నాకు?? పది రోజులనించీ ఎదురు చూస్తున్నా మీ కబుర్లని చేరవేసే ఆ కాగితాల కోసం.. ఎక్కడా వాటి జాడే లేదు! ఆదివారం కదా అని ఇవాళ మధ్యాహ్నం షోకి నేనూ, మాధురి కలిసి 'అన్వేషణ' సినిమాకి వెళ్దామనుకున్నాం.. చాలా సస్పెన్స్ మూవీ అని విన్నాను.. ఏదీ ఈ వాన కాలు బయట పెట్టనిచ్చేట్లు లేదు.. ఎప్పుడూ లేంది ఎందుకో ఈసారి వానాకాలం అంటేనే వళ్ళు మండిపోతుంది నాకు!!

ఎలాగూ బయటకెళ్ళడం లేదు కదా అని మీకు ఉత్తరం రాద్దామని కూర్చున్నాను.. కానీ చినుకుల చిందుల్ని చూస్తూంటే మీ కవితలని చదవాలనిపించి ఆ ఆలోచనకి కామా పెట్టాను.. రాత్రి నిశ్శబ్దం నాతో ఎన్ని కబుర్లు చెప్పిస్తుందో మీకు తెలిసిందే కదా! అందుకే యధావిధిగా రాత్రికే రాయాలనుకున్నాను.. ఈ వారం కవిత '**జ్ఞాపకాల వల**' చదువుతుంటే 'అయ్యో నా పరిస్తితి మీకెలా తెలిసిందా' అని కలవరపడ్డ మాట నిజం!

*నీ జ్ఞాపకాల్లో*
*నేనొదిగినప్పుడు-*
*జనారణ్యంలో ఉన్నా*
*ఒంటరితనం అనిపిస్తుంది!*
*ఏకాంతంలో ఉన్నా*
*విశ్వఘోష వినిస్తుంది!!*

జాబిలి మీదంటే అలిగాను కానీ మీమీదెలా అలగను చెప్పండి.. పక్షం దాటి పక్షమైంది మీ ఉత్తరం వచ్చి!! క్రమం తప్పకుండా సమాధానం ఇచ్చే మీరు ఈసారి ఇంకా ఎందుకు రాయలేదో తెలీక మనసులో భయాందోళనలు.. సందేహాలు.. అక్కడ అంతా, అందరూ క్షేమమే కదూ!? మీరేవో ముఖ్యమైన పనిలో ఉండి రాయడానికి కుదరలేదేమో అనిపిస్తుంది.. అది మెదడుకి తెలుసు.. కానీ మనసునెలా బుజ్జగించేది!? అయినా అసలిదంతా మీ తప్పే! మొదటి నించి క్రమం తప్పకుండా ఎవరు రిప్లై ఇవ్వమన్నారు మిమ్మల్ని!! అమ్మమ్మ కూడా అడిగింది మొన్న 'మీ పత్రికవాళ్ళు పంపే ఉత్తరం ఇంకా రాలేదేంటే?' అని.. తెలిసిందిగా, మీరు పత్రికల వాళ్ళన్నమాట!

గత వారం నించి స్కూల్ కి చాలా తొందరగా వెళ్ళి కాస్త ఆలస్యంగా వస్తున్నాను.. మరి ఈ ఎదురు చూపుల నించి తప్పించుకోవడానికి ఇంతకన్నా వేరే మార్గం దొరకలేదు నాకు.. అక్కడ ఆ పిల్లల ఆటపాటల్లో నాదంటూ ఒక ప్రపంచం ఉందనే సంగతే మర్చిపోతాను.. ఆ నిర్మలమైన ముఖాలు, స్వచ్ఛమైన నవ్వులు, అమాయకమైన ప్రశ్నలు గడియారపు ముళ్ళని ఎంత వేగంగా పరిగెత్తిస్తాయో!! కానీ గాలిపటాలు ఎగరేసుకుంటూ, తూనీగల వెనకాల పరిగెత్తాల్సిన వయసులో వాళ్ళ మీద పైథాగరస్ సిద్ధాంతాలు, న్యూటన్‌లా లూ రుద్దడం న్యాయమా చెప్పండి.. అసలు అధికారం నా చేతిలో ఉంటేనా! రోజులో సగం చదువుకి, సగం ఆటపాటలకి కేటాయించేస్తాను.. 'ఇక వాళ్ళు బాగు పడ్డట్టే!" అని అనుకుంటున్నారు కదూ..

స్కూల్లో ఎంత ఎక్కువ సమయం గడిపినా ఇంటిదారి పట్టక తప్పదు కదా.. అప్పటివరకూ దగ్గరకు రావడానికి తటపటాయించిన దిగులు నేను మా ఊరి బస్ ఎక్కగానే దర్జాగా నన్ను ఆవరించేస్తుంది.. 'నిన్నటిదాకా శిలనైనా.. నీ పదము సోకి నే గౌతమి నైనా' మేఘసందేశంలో పాట అప్రయత్నంగా గుర్తొస్తుంది.. ఇందాక మీ కవితలన్నీ మళ్ళీ మళ్ళీ చదివాక, ఇంకా ఏదో చదవాలనిపించి మీ ఉత్తరాలన్నీ చదివాను.. దక్షిణపు గాలి వెళ్తూ వెళ్తూ మంచి గంధాన్ని నా చుట్టూ చల్లిన అనుభూతి! ఒకదాంట్లో 'పంతులమ్మ' అని మీరు సంబోధించడం ఇప్పుడింకా నవ్వు తెప్పించింది.. అందులోనే మీరడిగారు నాకు పాటలంటే ఇష్టమేనా అని.. ఎందుకో నేను ఆ ప్రశ్నకి సమాధానం ఇవ్వలేదు.. అంతలోనే ఒక అనుమానం, ఒకవేళ నేను మీరడిగిన వాటన్నిటికీ జవాబులు చెప్పట్లేదని మీకు వెంట వెంటనే రిప్లై రాయాలన్న ఆసక్తి పోయిందేమోనని.. పిచ్చి ఆలోచనని అనిపిస్తుంది.. మరి కారణం తెలీనప్పుడు మనసు ఇలానే ఆలోచిస్తుందిగా!

నాకు పాటలంటే ఇష్టం.. సినిమాలంటే కూడా! నాన్నకి అలవాటు.. చిన్నప్పుడు నాన్నతో కలిసి చాలా చూశాను.. తర్వాత ఒక 2, 3 సంవత్సరాలనించే మాధురితో కలిసి వెళుతున్నా.. అప్పుడప్పుడు అమ్మమ్మ కూడా మాకు కంపెనీ ఇస్తుంది లేండి.. అప్పుడు మాత్రం సినిమా ఎప్పుడైపోతుందా అనిపిస్తుంది.. మరి చుట్టుపక్కల విషయాలన్నీ తనకే కావాలి కదా!! అసలే కంఠస్వరం పెద్దదేమో, మేము హాల్లోకి వెళ్ళిన క్షణం నించీ లైట్స్ ఎప్పుడు ఆఫ్ చేస్తాడా అని చూడటమే.. లేకపోతే తన వ్యాఖ్యానాలకి అందరూ మమ్మల్ని అదోలా చూడటమే! ఇవీ మా సినిమా కష్టాలు..

నా మనసులో కొద్దికాలంగా ఒక ఆలోచన కదలాడుతూ ఉంది, వికలాంగుల కోసం ఒక స్కూల్ పెట్టాలని.. లాస్ట్ ఉత్తరంలో

పెళ్ళి గురించి  మన సంభాషణని తలుచుకుంటే ఈ ఆలోచన ఇంకాస్త ధృఢంగా మారుతున్నది.. నేను చదవాలనుకున్నదంతా చదివేశాక మా ఊర్లోనే ఈ స్కూల్ మొదలుపెడతాను.. అదీ మా అమ్మా నాన్న పేర్ల మీద.. మామూలు స్కూల్ కంటే వీటికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువని మా ప్రిన్సిపాల్ గారు అన్నారు.. అయితేనేం, ఉన్న ఆస్తంతా ఏం చేసుకుంటాం చెప్పండి.. మా అమ్మమ్మ ససేమిరా అంటుందని తెలుసు.. కానీ తన కళ్ళ ముందే ఉంటాను అంటే కాస్త కనికరం చూపిస్తుందేమో.. అదీ కాకపోతే 'స్కూల్‌కి నీ పేరే పెడతాను అమ్మమ్మా' అంటాను.. పేరు కోసమన్నా కాస్తంత ఆస్తిని కాస్త నాకు దానం చేస్తుందేమో!!

ఆస్తి అంటే గుర్తొచ్చింది.. మీకో విషయం చెప్పాలి.. మా దూరపు చుట్టాలు ఒక కుటుంబం మా వీధిలోనే ఉంటారు.. వాళ్ళమ్మాయి వసంతని తన మేనబావకే ఇచ్చి పెళ్ళి చేశారు.. ఐదు సంవత్సరాల బాబు.. కానీ రెండేళ్ళ క్రితం వాళ్ళ ఆయన పొలంలో పాము కరిచి హఠాత్తుగా చినిపోయాడు.. అతను వాళ్ళ తల్లిదండ్రులకి ఒక్కడే సంతానం.. అందుకే వసంతనీ, మనవడినీ అక్కడే ఉంచేసుకున్నారు.. ఒక ఇరవై రోజుల క్రితం తను వాళ్ళింటికొచ్చినప్పుడు చూడటానికి వెళ్తే ఒక విషయం చెప్పింది.. వాళ్ళ అత్తగారి ఊర్లోనే ఆర్. ఎం.పి. డాక్టర్ గా చేసే ఒకతను వసంతని మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని అన్నాడంట.. సరాసరి వీళ్ళ అత్తగారింటికే వెళ్ళి అడిగాడంట!! ఎంత ఆనందకరమైన విషయమో కదా.. కానీ అన్నీ అనుకున్నట్టు జరిగితే అది జీవితం ఎందుకవుతుంది చెప్పండి.. అతను అలా వెళ్ళగానే 'వసంతే ఏదో చేసి అతన్ని వల్లో వేసుకుందనీ.. అసలు అతని కళ్ళన్నీ వాళ్ళ మనవడి ఆస్తి మీదే' అని ఏవేవో అన్నారంట.. చివరికి వసంత ఏం చేసినా వాళ్ళ మనవడు మాత్రం వాళ్ళ దగ్గరే ఉంటాడని తేల్చి చెప్పారంట! వీళ్ళ అమ్మా నాన్న కూడా ఆమాటకి వత్తాసు పలికారంట.. పైగా వసంత వాళ్ళన్నయ్య ఒక మెట్టు ఎక్కి అసలు ఇది రెండో  పెళ్ళి చేసుకోవడానికే వీల్లేదని రంకెలు వేశాడంట..

ఇదెక్కడి న్యాయం అసలు! కొడుకుని వదిలి ఎలా వెళ్ళగలదు.. అలా అని పాతికేళ్ళు కూడా లేని జీవితాన్ని ఎప్పటికీ అలా వైధవ్యంతోనే  గడిపేయాలా! అసలు పల్లెటూళ్ళలో వితంతువులని ఎంత చిన్నచూపు చూస్తారో మీకు తెలీయని విషయం కాదు.. పాపం తను నిర్ణయం తీసుకోలేక ఎంతలా నలిగిపోతుందో! అమ్మాయికి ఒకసారి పెళ్ళి అయితే తన జీవితం మీద హక్కులన్నీ ఎలా కోల్పోతుందో చూస్తుంటే నా  ఆలోచనలో తప్పేమీ లేదని అనిపిస్తుంది.. 'మాకు ఆస్తి వద్దు.. బాబుతో మేమూ ఈ ఊర్లోనే, మీ కళ్ళ ముందే ఉంటాం' అని అతనన్నా వాళ్ళు కుదరదంటున్నారు..  నా మనసులో అయితే వాళ్ళిద్దరూ, బాబుని తీసుకుని రాత్రికి రాత్రే ఎవ్వరికీ తెలీని ప్రదేశానికి వెళ్ళిపోతే బావుండుననిపిస్తుంది.. అదే మాట తనతో అంటే వసంత నా వంక భయంగా చూసి ఊరుకుంది.. కాలమే పరిష్కారం చూపించాలేమో!

వర్షం ఆగిపోయినా చూరు నించి ఇంకా నీళ్ళు కారుతూనే ఉన్నాయి.. టప్ టప్ మని ఉండుండి వినిపించే ఆ శబ్దం జోలపాటలా ఉంది.. తడిసి ముద్దైన సన్నజాజులు ఈవేళ ఆలస్యంగా విచ్చుకుంటునట్లున్నాయి.. సన్నని పరిమళం మెల్లగా చుట్టూ అలుముకుంటోంది.. కనురెప్పలు ఇవాళ్టికి తమ డ్యూటీ అయిపోయిందంటున్నాయి.. మరి ఇప్పటికి సెలవా..

మీ ఆలస్యానికి నేనే శిక్షా వేయనని హామీ ఇస్తున్నాను.. మరి రెండో మూడో వాక్యాలు, మీ అందరి క్షేమసమాచారం మాత్రం

తొందరగా పంపండి మా ఊరికి..

కార్తీక

*** *** *** ***

మాజేరు,

సెప్టెంబర్ 27, 1985

హలో వంశీ గారూ,

నమస్కారమండి. నా పేరు మాధురి, కార్తీక ఫ్రెండుని. తను నా గురించి చెప్పే ఉంటుంది. అసలు తనకి మళ్ళీ మ్యాగజైన్లు చదవడం అలవాటు చేసింది నేనే! అంటే మీకొక మంచి అభిమాని దొరకడానికి కారణం నేనేనన్నమాట.

నాకు కవితలు అంతగా అర్థం కాకపోయినా కార్తీక వల్ల నేనూ మీ అభిమానిని అయ్యాను. ఎలా అంటారా!? మీ ప్రతి కవితనీ ఎంతో అందంగా విడమరిచి వివరిస్తుంది నాకు. కనిపించే ఆ నాలుగైదు వాక్యాల్లో ఇంత భావం దాగి ఉందా అని నాకు భలే ఆశ్చర్యం వేస్తుంది! మీరు చెప్పారని మొన్నా మధ్య ఏవేవో పుస్తకాలు కొనుక్కొచ్చింది. చదవమని నాకూ ఇచ్చింది. కానీ నా బుర్రకి అవి అందలేదు. కాకాని కమలవో, యద్దనపూడివో అయితే మారుమాట్లాడకుండా పది నిమిషాల్లో చదివేసి ఉండేదాన్ని!

ఏది ఏమైనా, ప్రపంచ సమస్యలన్నీ తీర్చాల్సిన బాధ్యత తనదేనన్నట్లు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండే కార్తీక ముఖంలో సంతోషాన్ని చూస్తున్నాను. తనూ గలగలా మాట్లాడటం చూస్తున్నాను. అందుకు మీకు కృతజ్ఞతలు తెలియచేయడానికే ఈ ఉత్తరం.

రాధిక గారి గురించి, పిల్లల గురించీ కార్తీక చెప్పింది. అందరూ ఒకసారి మా ఊరికి తప్పకుండా రండి. శ్రీరామనవమి మాఊర్లో చాలా బాగా చేస్తారు. పిల్లలకి చూపించినట్లు ఉంటుంది. తప్పక ప్రయత్నించండి.

ధన్యవాదాలతో

మాధురి

*** *** *** ***

హైదరాబాద్

సెప్టెంబర్ 29, 1985

కార్తీకా,

నా ఆలస్యానికి క్షమాపణలు. మీరు ఎలా ఉన్నారు? ఏ శిక్షా వేయనన్న మీ భరోసా కి 'అమ్మయ్య' అనుకున్నాను. లేకపోతే మీరు కినుక వహించి గబా గబా నాలుగైదు కవితలు రాసియ్యండి అని ఆర్డర్ వేస్తే కష్టమైపోయేది! ఇప్పట్లో రాసే మూడ్ అసలు లేదు. 'పర్వాలేదు జీవితం బానే సాఫీగా వెళ్తోంది' అని అనుకున్న మరుక్షణమే ఏదో ఒక కల్లోలం

సృష్టించడం ఆ పైవాడికి అలవాటే  కదా! కంగారు పడకండి, మేమందరం క్షేమమే. కానీ మా కుటుంబ మూలస్థంభాలు మాత్రం మా నుంచి సెలవు తీసుకున్నారు.

మా తాతగారు, ఆ తర్వాత ఊహించని విధంగా మా నానమ్మ గారు చనిపోయారు. అందుకే కొన్ని రోజులుగా ఊర్లో లేము. తిరిగివచ్చి వారం దాటినా మనసు మాత్రం ఇంకా కుదుటపడలేదు. ఆ దంపతుల జ్ఞాపకాలు ఇంకా తడిగానే ఉన్నాయి. మీ ఉత్తరం నిన్నే వచ్చింది. కానీ తెరిచి చూసే ఆసక్తి లేనంత స్తబ్దత. అసలూహించగలరా! ఇవాళ పొద్దున్న ఆఫీసుకి వస్తుంటే రాధిక లెటర్ చేతికిస్తూ 'లంచ్ టైంలో అయినా చదవండి, మనసు కాస్త బయట ప్రపంచంలో పడుతుంది' అంది. నా గురించి నా కంటే తనకే కాస్తంత  ఎక్కువ తెలుసని ఇంకోసారి అనిపించిన క్షణమది!

తాతగారికి కొద్ది కాలంగా అస్వస్థతగా ఉందని తెలుసు. చనిపోక ముందు 10 రోజుల ముందు పరిస్థితి కాస్త సీరియస్ గా ఉందని కూడా చెప్పారు. అలా ఆయన మరణం ఊహించిందే అయినా నానమ్మది మాత్రం పూర్తిగా ఆకస్మికం. పెద్దకర్మ అయిన మర్నాడు ఆమె నిద్ర  లేవలేదు! ఏడుగుర్రాల రథాన్ని తాతయ్య తనకోసం ఆపి ఉంచాడేమో ఆగలేక వెళ్ళిపోయింది!

మేము తాతయ్య ఇంటిని సమీస్తుంటే తెలీని భయం. తాతయ్య పోయిన బాధ కంటే ఈ భయం ఎక్కువగా ఉంది. అసలు నానమ్మ ఈ నిజాన్ని ఎలా తట్టుకోగలుగుతున్నదో అని! పన్నెండేళ్ళ వయసులో పెద్ద కోడలిగా తాతయ్య చేయి పట్టుకుని ఆ ఇంట్లో అడుగుపెట్టి ఆడపడుచుల పెళ్ళిళ్ళు, మరుదుల చదువులు, తన ఐదుగురు పిల్లల ఆలనాపాలనా అంతా ఒక్కచేత్తో చక్కబెట్టింది. తాతయ్య గుంటూరు జిల్లాలో ఉన్న  అనంతవరప్పాడు ఊరికి కరణంగా చేసేవారు. అది ఆయనకి వంశపారపర్యంగా వచ్చిన పదవి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే పెళ్ళయ్యాక తాతయ్య నానమ్మని చదివించారంట. తను ఫిఫ్త్ ఫారం వరకూ చదివింది. ఆ చదువే తాతయ్యకి కరణం లెక్కలలోను,  పిల్లల చదువులో సందేహాలు తీర్చటం లోను ఉపయోగపడింది. నానమ్మతో ఉత్తరాలు చదివించు కోవడానికీ, జమా ఖర్చులు  రాయించుకోవడానికీ ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూనే ఉండేవారంట. మా నాన్నగారు వాళ్ళు ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ళు.  నాన్న వాళ్ళు చదువులు అయ్యాక ఉద్యోగాల పేరుతో సిటీల్లో స్థిరపడిపోయినా వాళ్ళిద్దరూ ఇంకా ఆ ఊర్లోనే ఉంటారు.

నాన్న తరచుగా చెప్పేవారు, తాతయ్యకి కరణం పనులలో ఊర్లు తిరుగుతూ ఇంట్లో ఎక్కువ సమయం గడిపేవారు కాదంట.. అయినా ఆ భార్యాభర్తల మధ్య ఎంతో సాన్నిహిత్యం! నానమ్మ మాటల నిండా తాతయ్యే!! 'ఆయన కష్టాలు.. ఆయన ఇష్టాలు... ఆయన బాధలు.. ఆయన ఆనందాలు' అంతా ఇవే! ఎంత రాత్రైనా ఇంటికొచ్చే తాతయ్య కోసం తనూ ఎదురు చూసేది.. పెరట్లో ఒక గాబులో నీళ్ళు  కాగుతూ ఉండేవి.. ఆయన వచ్చీ రాగానే ముందుగా అక్కడికే వెళ్ళి స్నానం చేసి గానీ ఇంట్లోకి వచ్చేవాళ్ళు కారంట.. అప్పుడు ఇద్దరూ కలిసే భోజనం చేసి, బయట కాసేపు కూర్చుని ఏవేవో కబుర్లు చెప్పుకునిగానీ నిద్రకి ఉపక్రమించేవారు కాదంట!

మీకు ఇంతకుముందు చెప్పినట్టు మేము కాస్త పెద్దయ్యాక చదువుల వలన ఎక్కువగా ఊరికి వెళ్ళడానికి కుదరకపోయినా

సంక్రాంతికి  మాత్రం అన్ని కుటుంబాల సభ్యులం తాతయ్య వాళ్ళ దగ్గరికి తప్పనిసరిగా వేళ్ళేవాళ్ళం. మాకు పంచతంత్రం, సుమతీ శతకం చెబుతూనే మా అమ్మా వాళ్ళతో మాలతీ చందూర్ రచనలు చదవమని చెప్పేది. ఆనందమే అసలైన ఆస్తి అని పూర్తిగా నమ్మే నాన్న అన్నదమ్ముల్నీ,  అక్కచెల్లెళ్ళనీ చూస్తే ఒక స్త్రీ వ్యక్తిత్వం ఆమె కుటుంబ వికాసానికి ఎంతలా తోడ్పడుతుందో అర్ధమౌతుంది!

వారిద్దరి చుట్టూ ఎంతోమంది వ్యక్తులు, ఎన్నో బాధ్యతలు ఉన్నా అంతర్లీనంగా వాళ్ళిద్దరూ ఒకే ఆత్మలా మెలిగేవారని చూసేవాళ్ళకి ఇట్టే తెలిసిపోతుంది! అందుకే తాతయ్య ఇక లేని విషయాన్ని నానమ్మ అసలు జీర్ణించుకోగలదా అనే భయం. తాతయ్య శవం చుట్టూ  గోలుగోలుమని ఏడ్చే ఆడవాళ్ళలో నా కళ్ళు ఆత్రుతగా నానమ్మనే వెదికాయి. ఆయన తలపక్కనే కూర్చుని, ముఖాన్నే తదేకంగా చూస్తూ ఎంతో నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ ఉంది. తాతయ్యకి జరగవలిసిన కార్యక్రమాలన్నీ సక్రమంగా జరిపించి సంతృప్తిగా తనూ  వెళ్ళిపోయింది.

నాకనిపిస్తుంది ఆంత్రోపాలజీలో భార్యాభర్తల సంబంధం కంటే ఆసక్తికరమైన అంశం ఇంకోటి లేదని.. నానమ్మ తాతయ్యల అనురాగం ఒకలాంటి తాదాత్మ్యతని కలిగిస్తే, ప్రేమరాహిత్యంతో ఒంటరి నక్షత్రమైన మీ రోహిణి లాంటివాళ్ళు ఆవేదనని మిగులుస్తారు.. రోహిణి గురించి మీరు రాసింది చదివాక అనిపించింది పరిస్థితులతో రాజీ పడటం అంత సులువైన పని కాదని..  నిజానికి అది కూడా ఒక కళేనేమో!? మనం కావాలనుకున్న దానికి, మనకు దొరికినదానికి మధ్య తేడా చెరిపేయడం సామాన్యమైన  విషయం కాదు!

మీ స్కూల్ ఆలోచన అమోఘం! అది కేవలం ఆలోచనగా వదిలేయకుండా ఒక సంకల్పంగా మార్చుకోండి.. మొదట ఏమన్నా వ్యతిరేకత చూపించినా చేసేది మంచిపని కాబట్టి మీ అమ్మమ్మగారు అడ్డు చెప్పక పోవచ్చు.. లేకపోతే 'అన్ని దిన పత్రికలలో నీ ఫోటోతో సహా వార్త వేస్తారంట' అని చెప్పండి.. ఠక్కున ఒప్పుకోవచ్చు! మీ ప్రణాళికలో ఏమైనా సలహాలు కావాలంటే తప్పకుండా అడగండి.

పిల్లలకి మీ గురించి చెప్పాను.. రాధిక అయితే తను మీ ఊళ్ళోనే పుట్టి పెరిగినట్లు అంతా వర్ణించి చెప్తుంది వాళ్ళకి.. వాళ్ళేమో ఆంటీని ఎప్పుడు చూపిస్తావని గొడవ.. అందుకే మీరు ఒక ఫోటో గానీ పంపారంటే వాళ్ళు ఇక పల్లెటూరి ఆంటీని ఎప్పటికీ మర్చిపోరు!

మీకు తెలిసే ఉంటుంది, మీ స్నేహితురాలు మాధురి ఉత్తరం రాశారు.. మీరు సంతోషంగా ఉండటాన్ని అంత స్వచ్ఛంగా హర్షించే స్నేహితురాలు ఉండటం అదృష్టం.. మీ ఇద్దరి స్నేహం ఎప్పటికీ ఇలానే ఉండాలని నా ఆకాంక్ష..

ఇవాళ మీకు జవాబు రాశాకే ఏ పనైనా అని ఇంటికి రాగానే రాయడం మొదలుపెట్టాను.. నా పొదుపు గురించి మీ అంచనాని పూర్తిగా అబద్దం చేయాలని గాఢంగా ఉన్నా ఇక ఇక్కడితో ఆపక తప్పడం లేదు! ఇన్ని రోజులు ఆఫీసుకు సెలవు పెట్టడం

వలన పేరుకున్న పెండింగ్ వర్క్ సంగతి చూడాలి.

మరల త్వరలో.. మరిన్ని విషయాలతో..
వంశీ

*** *** *** ***

మాజేరు
అక్టోబర్ 8, 1985

హల్లో నేస్తం
బాగున్నారా.. ఏంటీ, 'అందమైన అనుభవం' లోని పాట పాడుకుంటున్నానుకుంటున్నారా!? లేదండీ, మిమ్మల్నే అడుగుతున్నాను.. మనసులో ఎలా ఉందిప్పుడు? మనం సముద్రపు ఒడ్డున కూర్చుంటే అల ఆప్యాయంగా పలుకరిస్తుంది.. ఆ తడి స్పర్శ హాయిని ఆస్వాదిస్తూ ఉండగానే హడావిడిగా వెనక్కి వెళ్ళిపోతుంది.. నాన్న చెప్పేవారు, మన చుట్టూ ఉండేవాళ్ళు, మనవాళ్ళు కూడా ఈ అలల వంటి వాళ్ళేనని.. ఆ అల వెళ్తూ వదిలి వెళ్ళే గవ్వల్లాంటివే వారి జ్ఞాపకాలు కూడా అని.. నిజమే కదూ! అ గవ్వల్నే భద్రంగా దాచుకోవాలి..

మన దగ్గరివారి మరణం మనసుని ఎంతలా కలచివేసేదీ ఊహించగలను.. మీ నానమ్మ, తాతయ్యల ఆత్మలకు శాంతి కలగాలనీ, మీ హృదయానికి పూర్తి స్వాంతన చేకూరాలనీ కోరుకుంటున్నాను.. మీరు రాసింది చదువుతుంటే వారితో ఏ బంధమూ లేని నాకే కళ్ళు నిండుకున్నాయి.. కానీ ఒకటి మాత్రం నిజం, అలాంటివారు మన మధ్య ఉన్నా, లేకపోయినా వారి స్మృతులు మాత్రం మన మనసుని ప్రేమమయం చేస్తాయి.. కానీ ఒక విషయానికి మాత్రం నాకు చాలా సంతోషం వేసింది.. ఈ బాధాసమయంలో ఆ సంతోషమేమిటీ అని తిట్టుకోకండి.. నా సంతోషమల్లా మీ బాధని నాతో పంచుకున్నందుకు.. మీ మనసులో ఈ స్నేహితురాలికి ఆప్తురాలి స్థానం ఇచ్చినందుకు!

మాధురి మీకు ఉత్తరం రాయాలని అడ్రెస్ తీసుకున్నప్పుడు కవర్ మీద అతికించడానికి స్టాంపులు కూడా ఇవ్వబోతే విచిత్రంగా చూసి అంది, 'తల్లీ నీలా పేజీలకి పేజీలు రాసే ఓపిక నాకు లేదు.. నాదగ్గర పోస్ట్ కార్డ్ ఉందిలే' అని.. మీ రిప్లై వచ్చిన సంగతి కూడా చెప్పింది.. అది మళ్ళీ రాస్తుందని నమ్మకం లేదు.. ఏమిటో ఈ మధ్య కొంచెం వింతగా ఉంది దాని ప్రవర్తన!

చెప్పాను కదా, అసలు ఎవరి తోడూ లేకుండా ఇల్లు కదలదని.. మేము సినిమాలకీ, మా స్కూల్లో ఫంక్షన్లకీ, బట్టలు కొనుక్కోవడానికీ కలిసే వెళ్తాము.. కానీ కొన్నిరోజులుగా సంతకీ, గుడికీ, శనివారాలు జరిగే పురాణ కాలక్షేపాలకీ రమ్మని ప్రాణం తోడేస్తుంది.. ఒక్కోసారి నాకు అలసటగా ఉంది, మీ చెల్లిని (అదీ, తన చెల్లెలే వాళ్ళ అమ్మానాన్నలకి) తీసుకెళ్ళవే అంటే వినదు, నేనే రావాలంటుంది.. చిన్నబోయిన దాని మొహం చూస్తే నాకు ఇంక కాదనబుద్ధి కాదు.. అలా అని కలిసే

వెళ్తామా గుడిలో ప్రదక్షిణాలు  చేసేటప్పుడు, దగ్గుస్తోందనో.. కాళ్ళు పట్టేసాయనో పురాణం నించీ, ‘అదిగో అక్కడ కంద‘ కొనుక్కొస్తానంటూ సంతలోనూ ఉన్నట్టుండి మాయమైపోతుంది!!

పైగా వెళ్ళేటప్పుడు ఎంతో హుషారుగా ఏదేదో వాగుతూనే ఉంటుంది.. వచ్చేటప్పుడు మాత్రం చాలా పరధ్యానంగా ఏం చెప్పున్నా పట్టించుకోదు.. ఇదే కాదు! రంగు రంగుల బొట్టు బిళ్ళలు, చెవులకి ఇంత బారున వేళ్ళాడే ఫ్యాన్సీ జూకాలు, ముఖానికి క్రీములూనూ..  ‘ఇవన్నీ ఎప్పుడు కొన్నావే!?‘ అంటే చుట్టాలు ఎవరో ఇచ్చారు అని చెబుతుంది.. నాకైతే దాని ఆరోగ్యం సరిగ్గా ఉందో లేదో అని భయంగా ఉంది.. కాస్త గుచ్చి గుచ్చి అడిగితే ‘నాకేమయింది ఇదివరకులానే ఉన్నాను.. నువ్వే పుస్తకాలు చదవడం ఎక్కువై ప్రతీ విషయం  భూతద్దంలో చూస్తున్నావ్‘ అని విసుక్కుంటోంది.. కానీ నేనూరుకుంటానా! దానికేం తేడా చేసిందో కనుక్కునేవరకూ ఊరుకోను.. మరి స్నేహించాక ఇవ్వన్నీ తప్పవు కదండీ!!

మీరిచ్చిన ప్రోత్సాహంతో అప్పుడే నేనొక స్కూల్ కట్టేస్తున్నా.. అలా ఉలిక్కిపడకండి, నేను కట్టేది ఊహల్లో! ఒక మూడెకరాలు చాలు  ప్రస్తుతానికి.. వరుసగా కుటీరాల్లాంటి క్లాసురూములు, పెద్ద ప్రార్ధనా మందిరం, ఆ పక్కనే గ్రంధాలయం, అక్కడక్కాడా చిన్న చిన్న పూదోటలు.. ప్రతీదాంట్లో ముద్దమందారాలు మాత్రం తప్పనిసరి సుమా! పొద్దున్నే పిల్లలు ‘యాకుందేందు‘ అని పాడుతూ రోజుని  మొదలుపెడుతూ.. అబ్బా! తల్చుకోవడానికే ఎంత బావుందో!! నా ఊహ ప్రభావం కాబోలు, బయట కదులుతున్న చెట్ల ఆకులు ఆనందభైరవి ఆలపిస్తున్నట్లు అనిపిస్తుంది..

ఈ విషయం మీతో చెప్పానో లేదో, మా స్కూల్‌కి ఇద్దరు కొత్త టీచర్లు వచ్చారు.. స్వంత భార్యాభర్తలు.. అలా నవ్వకండీ, ఏదో కాస్త హ్యూమర్ చేశాను.. భూషణంగారు, సులోచనగారు.. రిటైర్మెంట్ దగ్గర పడుతున్నవాళ్ళు.. వాళ్ళ పిల్లలు కాలేజీ చదువులతో  హాస్టళ్ళలో ఉంటారంట.. రిటైర్ అయ్యాక పల్లెటూళ్ళో స్థిరపడాలని వాళ్ళ కోరిక.. అందుకే అలవాటు చేసుకుందామని ముందే మా స్కూల్‌కి బదిలీ చేయించుకున్నారు.. ఆయన సోషల్, ఆవిడ తెలుగు చెప్తారు.. భూషణం గారిని చూడగానే మన పాత సినిమాల్లో నాగయ్య గుర్తొచ్చారు.. కాకపోతే ఈయన ఇంకాస్త గంభీరంగా, స్ట్రిక్ట్‌గా కనిపిస్తారు.. సులోచనగారు మాత్రం కలుపుగోలుగా మాట్లాడుతున్నారు.. మొత్తానికి ఆ దంపతులిద్దరూ నాకు నచ్చేశారు.. ‘వాళ్ళ గురించి ఏం తెలుసని అప్పుడే అంత నచ్చేసారు‘ అని అనుకుంటున్నారా!? అదేదో అంటారు చూడండి, sixth sense అనుకుంటా.. కాదు కాదు first impression.. ఆ అదే! వాళ్ళిద్దరినీ చూడగానే మనసులో ఎలాంటి ప్రశ్నలూ, సందేహాలు తలెత్తలేదు మరి..

మర్చిపోయాను first impression అంటే గుర్తొచ్చింది, మీరు నా ఫోటో పంపమని అడిగారు.. అది చదవగానే భలే ఎక్సైటింగా అనిపించింది.. తను వేసిన బొమ్మకి మొదటి బహుమతి వస్తే చిన్నపిల్లకి కలిగే ఆనందంలాంటిది.. నన్ను చూడగానే మీకెలాంటి impression కలుగుతుందో!! అసలు ఎలా ఉంటాననుకుంటున్నారో అన్న కుతూహలం.. ఒకసారి రాధిక గారిని కూడా ఊహించుకుని చెప్పమనండి.. మీ ఇద్దరిలో ఎవరి ఊహకు నేను దగ్గరగా ఉంటానో తెలుసుకోవాలనుంది..

నాకైతే ఇలా ఫోటోల్లో కాకుండా మిమ్మల్నందర్నీ ప్రత్యక్షంగా చూడాలనుంది.. మాధురి కూడా గట్టిగా ఆహ్వానించిందంట

కదా.. మరి వచ్చేయ్యకూడదూ మా ఊరికి.. నాకు తెల్సు, మనసులో ఆశ..దోశ అనుకుంటున్నారని! దేవుడు తీరుస్తాడో లేదో తెలీకపోయినా భక్తులు కోరికలు కోరడం మానరు కదా!

ఇక మీ కళ్ళకి కాస్త విశ్రాంతి ఇద్దామనుకుంటున్నాను..
ఉంటాను మరి..
*కార్తీక*
చిన్న మనవి: ఇక నుంచి 'మీరు' తీసేసి 'నువ్వు' కి వచ్చెయ్యరూ, ప్లీజ్..

*** *** *** ***

*అక్టోబర్ 13, 1985*

హైదాబాదు

*హాయ్ కార్తీకా,*
ఎలా ఉన్నావు? అయ్యో, అలా దిక్కులు చూస్తావేంటీ!? అడిగేది నిన్నే! ఆ కంగారేమిటీ? ఓ.. సంబోధన మారిందనా.. మరి నువ్వే కదా, సారీ మీరే కదా 'మీరు' నుంచి 'నువ్వు' లోకి వచ్చేయమన్నారు.. అందుకే ఇలా ప్రయోగం చేశాను.. భయపడ్డారా? మరీ ఒకేసారి సంబోధన మార్చడం కష్టం కానీ నెమ్మది నెమ్మది గా మారుస్తాను.. కానీ మీ విన్నపమే నాది కూడా, అంటే మీరు కూడా మార్చాల్సిందే!

ఇప్పుడే రాధిక చేసిన ఆదివారం స్పెషల్స్ ఆరగించి కూర్చున్నా.. సెలవురోజుల్లో మధ్యాహ్నం నిద్ర మానేయాలని ఈ మధ్యనే నిర్ణయించుకున్నాను.. ఏదో పుస్తకం పట్టుకోవడం కన్నా మిమ్మల్ని పలకరించడమే ఉత్తమం అనిపించింది. ముందుగా మీకు ధన్యవాదాలు.. నానమ్మ, తాతయ్యల మరణంతో కలతపడ్డ హృదయానికి మీ స్వాంతన వాక్యాలు చాలా ఊరటనిచ్చాయి.. ఆ అలలు వెళ్ళిన తడి ఇంకా ఆరలేదుకానీ మనసు మాత్రం మళ్ళీ నిర్మలస్థాయికి చేరుకుంది.

మీ ఫ్రెండ్ మాధురి గురించి మీ ఆందోళన చదువుతుంటే నా స్నేహితులందరూ గుర్తొచ్చారు.. ఎంత అల్లరి, ఎన్ని చిలిపి పనులు! తిట్లు, దెబ్బలు, మెచ్చుకోళ్ళు, గోడ కుర్చీలు, దీవెనలు ఒకటేమిటి అన్నీ మాకే! స్కూల్ అల్లరికి గంభీరం ముసుగేసి కాలేజీలో అడుగుపెట్టి దెబ్బలాటలు, కాలేజీ 'కలర్' మీద కామెంట్లూ, పరీక్షలప్పుడు రాత్రీ పగలూ లేకుండా చదవడం.. ఎక్కడకెళ్ళి దాక్కున్నాయో ఆ రోజులన్నీ!! ఇప్పుడు నా క్లోజ్ ఫ్రెండ్స్ నలుగురు ఇదే మహాపట్టణంలో ఉన్నా తరచుగా కలిసేది తక్కువే! ఇల్లు, పిల్లలు ఇదే ప్రపంచం.. ఏ పనికైనా ఇవే ఆటంకాలూ, ఉత్ప్రేరకాలూనూ!! అయినా వీలు చేసుకుని రెండు మూడు కుటుంబాల వాళ్ళం అయినా కలుస్తుంటాము.. లేదా కేవలం అబ్బాయిలమే ఏదో ఒక ఆదివారం సాయంత్రం టాంక్ బాండ్ మీదనో, ఇరానీ ఛాయ్ తాగుతూనో కబుర్లు చెప్పుకుంటాము.. ఆఫీసు, రాజకీయాలు, సినిమాలు, కొత్త పుస్తకాలు, రచయిత(త్రు)లు, ఇలా ఒకటేమిటి కాదే విషయం మా చర్చకు అనర్హం అన్నమాట! ఎందుకో గానీ మీ 'స్నేహించడం' అన్న పదం ఏదో కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది.. very inspirational word!.. 'ఆ వాళ్ళు కాల్ చేస్తారులే' అని కూర్చోకుండా ఇకనించీ

నేనే వీలైనప్పుడల్లా మాట్లాడుతూ ఉండాలనుకుంటున్నా.

ఇంకో విషయం ఏమిటంటే, మీరు మాధురి గారిని ప్రశ్నించేప్పుడు చనువు ఉందని అధికారికంగా కాక అనునయంగా అడగండి.. అదీ తను సంతోషంగా మామూలుగా ఉన్నప్పుడు కాకుండా దిగులుగా ఉన్నప్పుడు అడిగితే తన మనసులోని విషయాన్ని పంచుకునేందుకు సిద్ధపడొచ్చు.. ఒకవేళ ఆమె చెప్పకపోయినా మీరు కోపం తెచ్చుకోకుండా తనకి మీరు ఉన్నారన్న భరోసా ఇవ్వండి.. మీ ఆందోళన తీవ్రస్థాయిలో ఉంటే తను మీకు ఏమీ చెప్పుకోలేకపోవచ్చు.. కాబట్టి తన దగ్గర వీలైనంత ప్రశాంతంగా ఉండండి.

ఇంతకీ ఊహల్లోంచి బయటకొచ్చి మీరు పెట్టాలనుకున్న స్కూల్ గురించి మీ ఇంట్లో వాళ్ళతో మాట్లాడారా? వికలాంగులకోసం అన్నారు కానీ ఏ రకమైన వికలాంగులకోసం? శారీరకంగానా, మానసికంగానా!? ఈ రెండూ కంప్లీట్‌గా వేరు వేరు కాబట్టి స్కూల్ కి కావల్సిన వనరులు, సామగ్రి, సిబ్బంది ఇలాంటివన్నీ వేరు వేరు గానే ఉంటాయి.. మీరు ఏ తరహా వికలాంగుల కోసం స్కూల్ పెడదామనుకున్నా ముందు ప్రణాళిక సిద్ధం చేసుకుని అనుభవజ్ఞులైన వారికి ముగ్గురు నలుగురికి చూపించండి.. పైగా పర్మిషన్స్, అప్రూవల్స్ అంటూ గవర్నమెంట్ తో చాలా పనులుంటాయి.. అలాంటి విషయాల్లో నా సహాయం మీకెప్పుడూ ఉంటుంది.. ఏంటీ మధ్యలో నా ఉత్సాహం ఎక్కువైపోయిందనుకుంటున్నారా! ఏదో, ఒక మహత్కర కార్యానికి ఉడుతా సహాయమన్నా చేయాలన్న అచ్చమైన స్వార్థం.

నాకు ఊహించడాలూ, కనుక్కోవడాలూ అస్సలు రావు.. అందుకే మీరెలా ఉంటారోనన్న విషయం రాధిక ఊహకే వదిలేశాను.. తన మాటల్లో మీది ఛామనఛాయ, కోలమొహం, చిన్న కళ్ళు, వదులుగా వేలాడే పెద్ద వాలు జడ వగైరా వగైరా.. ఇక మీరు ఎంత తొందరగా ఫోటో పంపితే అంత తొందరగా తన అంచనా ఏ మాత్రం కరెక్టో తెలిసిపోతుంది.. ఏమంటారు?

ఇక ఇక్కడితో ఆపక తప్పదు.. సాయంత్రం 'మయూరి' సినిమాకి రాధిక ప్రోగ్రాం వేసింది.. సినిమా వచ్చిన సంవత్సరానికా అని ఆశ్చర్యపడకండి.. అప్పుడు పిల్లలతో కుదరలేదు.. ఇప్పుడు కాస్త పెద్దయ్యారని ఎప్పుడన్నా మంచివి వస్తే ఇలా ఫిక్స్ చేసేస్తుంది..

ఉంటాను మరి.

*వంశీ*

***   ***   ***   ***

*అక్టోబర్ 23, 1985*

*మాజేరు*

*వంశీ గారూ,*

కనుచూపు మేర నీలాకాశం, పచ్చదనం, స్వచ్ఛమైన గాలి, ఉండుండి వినిపించే పక్షుల కూతలు, గడ్డి మేసే పశువుల అరుపులు

ఎక్కడినించో లీలగా.. అన్నీ మా స్టాఫ్ రూం నించే ఆస్వాదించేస్తున్నా.. ఇవాళ ఆఖరి రెండు పీరియడ్లు ఖాళీనే.. ఎస్సైన్ మెంట్ వర్క్ కూడా ఏమీ లేదని ఇదిగో మీకు ఉత్తరం మొదలుపెట్టాను..

బయట ఎంత ఆహ్లాదంగా ఉన్నా మనసు మాత్రం అశాంతితో చిరాకుపడిపోతుంది.. ఈ చిరాకునంతా మీమీద రుద్దేస్తానని మీకు భయం వేస్తోంది కదూ! తప్పదు మరి!! మీరు ఎంత వేడికోలుగా చూసినా వినక (అదే చదవక) తప్పదు.. అకారణంగా ఎవరిమీదో చెప్పలేని కోపం.. ఏంటో ఈ చిరాకులో ఏం మాట్లాడుతున్నానో కూడా తెలీడం లేదు.. లేకపోతే ఎవరి మీదో ఏంటీ, మా మాధురి మీదే! అకారణంగా కాదు సలక్షణమైన కారణం ఉండబట్టే!!

మొన్నాదివారం షాపింగ్ కి వెళ్దామని ఒకటే గొడవ చేసి బందరు తీసుకెళ్ళింది.. ఒక ఫ్యాన్సీ షాపులోకెళ్ళి ఏవేవో కొని ఇంక పద వెళ్దాం అంది.. బస్సు దిగి అప్పటికి పట్టుమని పదినిమిషాలు కూడా అవ్వలేదు.. నేనైతే హమ్మయ్యా అనుకుని చకచకా బస్టాప్ వైపు నడిచాను.. అక్కడ ఖాళీగా ఉన్న బెంచీ మీద కూర్చున్నామో లేదో షాప్ వాడు ఇంకేదో పాకెట్ పెట్టడం మర్చిపోయాడని మళ్ళీ ఆ సంచీ పట్టుకుని మేమెళ్ళిన షాప్ కి పరిగెత్తింది.. 20 నిమిషాలు, అరగంట, గంట గడిచింది.. తను మాత్రం ఇంకా రాలేదు.. నాకు కంగారేసి ఆ షాప్ కెళ్ళాను.. అక్కడ వాళ్ళనడిగితే అసలు మాధురి మళ్ళీ షాప్ కి రానేలేదని చెప్పారు.. నాకు కాళ్ళూ చేతులు ఆడక అక్కడ రెండుమూడు సందుల్లో ఉన్న షాపులన్నీటిలో చూసి, ఎక్కడా కనబడక అదురుతున్న గుండెలతో బస్టాప్ కొస్తుంటే అక్కడ కూర్చొనుంది!! ఆ క్షణంలో వచ్చిన కోపాన్ని అదుపులో పెట్టుకోవడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా! నేనేమీ అడగకుండానే 'షాపువాడింకా కొత్త వెరైటీలని ఏవేవో చూపిస్తుంటే కూర్చుండిపోయానే' అంది.. నెమ్మదిగా తనవంక చూసి 'నేనిప్పుడు అక్కడ నించే వస్తున్నా' అన్నాను.. గొంతులో ఆపేసిన కోపం వేరేదారి వెతుక్కొని కళ్ళల్లోకి దూసుకొచ్చినట్లుంది.. ఆ వేడిని తట్టుకోలేక తలదించుకుంది.

ఇంటికి తిరిగొచ్చే దారంతా తనతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు.. అదే మౌనంతో మాఇంటి వైపు వెళ్ళిపోతుంటే నా చెయ్యి పట్టుకుని ఆపి 'నీతో కొంచెం మాట్లాడాలి.. రాత్రి భోజనాలయ్యాక వస్తాను' అంది.. 'లేదు, నాకు కుదరదు' అని పెడసరగా సమాధానం ఇవ్వాలని అనిపించింది.. కానీ మరుక్షణమే 'అనునయంగా మాట్లాడమన్న' మీ సలహా గుర్తొచ్చింది.. 'సరే' అని ముక్తసరిగా చెప్పి వచ్చేశాను.. కానీ మళ్ళీ దాన్ని చూసేవరకూ మనసులో రకకాల ఆలోచనలు, 'ఏమి చెప్పబోతుందా అని!'.

చిన్నప్పటినుంచీ తనకి సినిమాలన్నా, సినీతారలన్నా చాలా ఇష్టం.. కొంపదీసి సినిమాల్లోకి వెళ్దామని రహస్యంగా ప్రయత్నాలు చేయటం లేదు కదా!! ఒక్కసారిగా వాళ్ళమ్మ గుర్తుకొచ్చింది.. పిల్లలిద్దరిలో ఎవరు బయటకెళ్ళినా తిరిగొచ్చేవరకూ తన కళ్ళని గుమ్మం దగ్గరే వదిలేస్తుంది!! ఈమధ్య మాధురి లో కాస్త మార్పు వచ్చింది కానీ అసలైతే తనూ, వాళ్ళమ్మా, చెల్లీ ఎంతో నెమ్మదస్తులు.. వాళ్ళు కూడా మంచి ఆస్తిపరులైనప్పటికీ ఎప్పుడూ ఒదిగొదిగి ఉంటారు.. దానికి కారణం లేకపోలేదు.. మాధురి వాళ్ళ నాన్నగారికి రెండో భార్య ఉంది.. మరి ఆవిడని భార్య అనొచ్చో లేదో తెలీదు కానీ ఆ హోదా మాత్రం ఇస్తారు.. ఆయనలా చేయడానికి కారణం మాధురి వాళ్ళ అమ్మే అన్న విధంగా ఆయన తల్లితండ్రులు, చుట్టుపక్కల వాళ్ళు

ప్రవర్తించేవాళ్ళు.. అందుకే ఆమె అవసరమైనదాని కంటే ఎక్కువ అణకువగా ఉంటుంది.. అలానే పిల్లల్నీ పెంచింది.. తను గానీ, పిల్లలు గానీ ఏమైనా తప్పులు చేస్తే వారానికి 3 రోజులు ఇంట్లో ఉండే వాళ్ళ నాన్న మొత్తానికి రావడం మానేస్తారని ఆమె భయం! ఇప్పుడు మాధురి ఇలా సినిమాల్లోకి వెళ్తే ఏమైపోతుందో!

నా ఆలోచనల్లో ఉండగానే బయట మాధురి అమ్మమ్మతో మాట్లాడటం వినిపించింది.. ఇవాళ బందరెళ్ళి మేమేం చేశామో అడుగుతుంది అమ్మమ్మ.. ఎప్పుడూ ఇంతే! నేను చెప్పింది నిజమో కాదో అన్న అనుమానం! ఇప్పుడెళ్ళి దాన్ని పిలిస్తే ఏదో చెప్పనీకుండా లాక్కెళ్ళానని ఇంకాస్త అనుమానం పెంచుకుంటుంది.. అందుకే తను వచ్చేవరకూ అలానే గోళ్ళు కొరుక్కుంటూ నా గదిలోనే గడిపేసాను.. మాధురి రాగానే 'నా మీద బాగా కోపంగా వుంది కదా' అంది.. 'అది సరే, ఏదో చెప్తానన్నావుగా ముందది చెప్పు' అన్నా..

నా వంక ఒక నిమిషం అలానే చూసి 'నేను ఒకతన్ని ప్రేమిస్తున్నాను' అంది.. 'సరే నేనూ ప్రేమిస్తున్నాను గానీ అసలు విషయం చెప్పు' అని చిన్నగా కసిరాను.. 'నిజమే చెప్తున్నా! నేను రాజారావుని ప్రేమిస్తున్నాను' అంది.. నాకేదో కెరటం బలంగా చాచి కొట్టినట్లనిపించి కాస్సేపు ఏం మాట్లాడలేకపోయాను.. 'రాజారావంటే...' ఘాటైన అత్తరు వాసన, వెకిలి చూపులు, అనవసర ప్రసంగాలు అన్నీ ఒకదాని తర్వాత ఒకటి గుర్తొస్తుంటే అనుమానం నిజం కాకూడదని ప్రార్థిస్తూ అడిగాను.. 'మీ స్కూల్లో పనిచేసే రాజారావే!' దాని సమాధానం వింటూనే మనసంతా అదోలా అయిపోయింది..

'నీతో ఒకసారి మీ స్కూల్ ఫంక్షన్ కి వచ్చినప్పుడే నన్ను చూశాడంట! మొదటిచూపులోనే తన మనసు దోచేసుకున్నానంట.. ఈ ఉత్తరం చదువు తనకి నేనంటే ఎంత ప్రేమో తెలిస్తుంది' నా చెవులు తాత్కాలికంగా పనిచేయడం మానేస్తే అదిచ్చిన ఉత్తరం యాంత్రికంగా తీసుకున్నాను..

"నా హృదయమంజరీ,

ఇవాళ నువ్వెంత అందంగా ఉన్నావో తెలుసా!! వంగపండు రంగు చీర.. కనకాంబరం పూలు.. జడకి కొత్త రబ్బర్ బ్యాండ్ పెట్టుకుని నా స్వప్నసుందరిలా నడిచొచ్చావు.. ఎంతైనా నీ సెలక్షనే సెలక్షన్! జుంకాలు, బొట్టు బిళ్ళలు, జడ క్లిప్పులు ఎంత మంచి మంచివి పెట్టుకుంటావో!! ఇవన్నీ నాకోసం, నాకిష్టమని చేస్తున్నావని తెలిసి నీ మీద నా ప్రేమ అంతకంతకూ పెరిగిపోతుంది.. ఇవాళేమైందో తెలుసా, నిన్ను కలిసిన ఆనందంలో నా కాలి స్లిప్పర్ తెగిన సంగతి గమనించకుండా నడుస్తున్నాను.. అంతలో రాయి తగిలి ప్రాణం జివ్వున లాగింది.. వెంటనే నువ్వు గుర్తొచ్చావు (నీకు తెలుసు కదా బాధలోనూ, సంతోషంలోనూ నిన్నే తలుచుకుంటాను).. ఆ బాధలో నాపక్కన నువ్వుంటే బావుండుననిపించింది.. అసలు నువ్వే నా పక్కన ఉంటే ఈ చెత్త రబ్బర్ స్లిప్పర్స్ వేసుకోనిచ్చేదానివా!! ఎంచక్కా ఏ లెదర్ చెప్పులో కొనేదానివి.. చెప్పులంటే గుర్తొచ్చింది నీకు హైహీల్ చెప్పులు ఎంత బాగుంటాయో తెలుసా! దానికి తోడు నేనిచ్చిన ఎర్ర గోళ్ళరంగు వేసుకున్నావనుకో అప్సరసలా మెరిసిపోతావు.. నా జ్ఞాపకం నీ గోళ్ళని అంటిపెట్టుకుని ఉందంటే నాకెంత సంతోషమో తెలుసా! అలానే నువ్విచ్చినదేదైనా నాకు దగ్గరగా ఉంటే బావుండుననిపిస్తుంది.. మొన్నిచ్చిన పర్సులాంటిది కాదు.. ఇంకా దగ్గరగా ఉండేది.. ఆ.. బట్టల జత

అయితే ఎలా ఉంటుందంటావ్!? ఎలాగూ నా పుట్టిన రోజు కూడా దగ్గర్లోనే ఉంది కదా.. ఆ రోజున నీ స్వహస్తాలతో సెలెక్ట్ చేసిన రేమాండ్ ప్యాంటు, చొక్కా మెత్త మెత్తగా నన్ను తాకుతూ ఉంటే నీ చేతులే.."

ఇక చదవలేక ఆపేశాను.. అయితే బయటకి వెళ్ళినప్పుడల్లా ఉన్నట్టుండి మాయమైపోయేది ఇతన్ని కలుసుకోడానికేనన్నమాట! తన ప్రేమకు పరోక్షంగా నేనూ సాయం చేశానని అనుకోగానే నామీద నాకే చెప్పలేనంత కోపం వచ్చింది.. విసురుగా దానితో ఏదో అందామని తల తిప్పి చూస్తే పక్కనే ప్రశాంతంగా నిద్రపోతోంది.. ఆ అమాయకమైన మొహం చూస్తే నా బాధ ఇంకా ఎక్కువైంది.. ఆ రాజారావు మాయలో ఎలా పడిందా అని! అతను మా స్కూల్లోనే అడ్మినిస్ట్రటివ్ క్లర్కుగా చేస్తాడు.. అతన్ని చూస్తే ఏ మాత్రం సదభిప్రాయం కలగదు.. పెద్ద తరగతి ఆడపిల్లలతో పరాచికాలు ఆడుతుంటే మా హెడ్మాస్టారు కేకలేసారు కూడాను.. రూపాయి రెండు రూపాయిలకోసం నానా గడ్డీ కరుస్తాడని మా వాచ్‌మాన్ చెప్పడం విన్నాను.. అసలు అతను రాసిన ఉత్తరం చూస్తేనే అనిపిస్తుంది అతని దృష్టి మాధురి వాళ్ళ ఆస్తి మీదనే అని!

అసలు ఇది ఏం చూసి ప్రేమించింది!?!? 'అతను మన వాళ్ళే తెలుసా.. సిగరెట్, తాగుడు లాంటి చెడు లక్షణాలేమీ లేవు.. ఆఖరికి ఒక్కపొడి కూడా వేసుకోడు' ఇందాక మాధురి అన్న మాటలు గుర్తొచ్చాయి.. ఒకే కులం అవ్వడమే అసలైన అర్హతా!? చెడు అలవాట్లు లేనంత మాత్రాన మనిషి మంచివాడైపోతాడా!?! ఆలోచిస్తున్నకొద్దీ ఆవేశం అమాంతంగా పెరిగిపోయి దాన్ని - మాంతంగా నిద్ర లేపి ఈ చెంపా ఆ చెంపా వాయించి 'ఇలాంటి పిచ్చివేషాలు వెయొద్దని' చెప్పాలన్న కోరికని పళ్ళ బిగువున ఆపుకున్నాను..

అదిగో ఆరాత్రి నించీ మనసులో ఈ అసహనం.. తను మాత్రం మాములుగా నవ్వుతూ, తుళ్ళుకుంటూ హాయిగా ఉంది.. నాతో విషయం చెప్పేసిన తర్వాత తనకో అవుట్‌లెట్ దొరికనట్లు ఎప్పుడూ అతని గురించే మాట్లాడటం.. వినే సహనం లేక నేను వీలైనంతవరకూ తప్పించుకుంటునే ఉన్నాను.. కానీ పాపం మీరు మాత్రం నాకు దొరికిపోయారు.. కదండీ!

ఏంటో, ఒక నేస్తం గురించి ఇంకో నేస్తానికి కంప్లైంట్ చేస్తున్నా.. మర్చిపోయాను, మీమీద కూడా ఒక కంప్లైంట్ ఉందండోయ్.. అదిగో ఏమీ ఎరుగనట్టు దిక్కులు చూడకండి.. సంబోధన నెమ్మది నెమ్మదిగా మారుస్తాను అన్నారు కానీ మీ ఉత్తరంలో ఆ ఛాయలెక్కడా కనబడలేదు.. మీ కాలమానంలో నెమ్మదిగా అంటే ఓ పదికాలాలలో అని మాత్రం కాదు కదా!! కనీసం వచ్చే ఉత్తరం నుంచైనా అమలు చేయండి.. ప్లీజ్.. కానీ మిమ్మల్ని ఏకవచనంలో సంబోధించడం మాత్రం నావల్ల అవ్వదేమో! ఎందుకంటే అభిమానం, ఆప్యాయతల స్థాయిలోనే గౌరవం కూడా ఉంది మరి!

మొత్తానికి రాధిక గారు అఖండులు.. ఆమె చెప్పినవాటిలో ఒక్క పోలిక తప్ప మిగతావన్నీ కరెక్టే!! ఆ ఒక్కటీ ఏదనేది నేను వచ్చే ఉత్తరంతోపాటు పంపే ఫోటో చూస్తే మీకే తెలిసిపోతుంది.. అంటే అర్థం అయింది కదా, ఇంకా ఫోటో రెడీ అవ్వలేదు నేస్తం.. ఈసారి మాత్రం మాట తప్పను..

సరే మరి బస్సు వేళైంది.. ఇంకా ఎన్నో విషయాలు చెప్పాలని ఉన్నా మీకు సెలవు ఇవ్వక తప్పదు.. మళ్ళీ ఈ బస్ తప్పితే అమ్మమ్మ వేసే సవాలక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నా పని అయిపోతుంది.

అదండీ సంగతి..
*కార్తీక*

*** *** *** ***

*నవంబర్ 2, 1985*
*హైదాబాదు*

*కార్తీకా,*
ముందుగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు, కాస్త ఆలస్యంగా.. మీ స్కూల్లో ఇలాంటి దినోత్సవాలన్నిటినీ బాగా జరుపుకుంటారా? మా చిన్నప్పుడు కొన్ని స్కూళ్ళకి సెలవుంటే కొన్నింటికి ఉండేది కాదు, ముఖ్యంగా ప్రైవేటు కాన్వెంట్లకి.. అసలు ఆ స్కూళ్ళలో ఏరోజైనా హోంవర్క్ డే నే!!

నేనివాళ ఇంట్లోనే ఉన్నాను.. గౌతమ్‌కి రెండు రోజులనించీ హై ఫీవర్.. డాక్టర్ మామూలు జ్వరమే కంగారేమీలేదని చెప్పింది.. కానీ వాడలా నీరసంగా పడుకునుంటే నాకు ఆఫీసులో కూడా ఏం తోచట్లేదు.. అక్కడుండి ఆదుర్దా పడేకంటే దగ్గరుండి కథలూ అవీ ఇవీ చెబ్దామని ఇవాళ సెలవు పెట్టేసాను.. కాళ్ళకి చక్రాలున్నట్లు ఇల్లంతా పరుగులు పెడుతూ, వచ్చీ రాని భాషలో వాడి కష్టాలూ, సుఖాలూ చెప్పేసుకుంటూ ఉండేవాడు అలా రెక్కలు తెగిన పక్షిలా ఒక్కచోటే ఉంటే మనసంతా ఏమిటోగా ఉంది.. తమ్ముడికి వంట్లో బాలేదని ఆదిత్య కూడా అస్సలు చడీ చప్పుడు చేయడంలేదు.. బుద్ధిగా ఒకచోట కూర్చుని హోంవర్క్ చేసుకుంటున్నాడు.. నాకూ రాధికకీ కూడా అవసరమైతే తప్ప మాట్లాడాలని అనిపించడంలేదు.. ఇల్లంతా ఇష్టంలేని నిశ్శబ్దం.. 'తమ్ముడు తినకుండా నాకు ఎగ్ వద్దమ్మా' అని అంటున్న ఆదిత్యని చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది.. వాడికి ఎగ్ అంటే ప్రాణం.. కొంచెం కొంచెం గా, ఎంతో అపురూపంగా తింటాడు.. అలాంటిది తమ్ముడు తినడంలేదని తను తిననంటున్నాడు.. పిల్లలు అల్లరి చేస్తూ అటూ ఇటూ పరుగులు పెడుతుంటే అబ్బా కాస్సేపన్నా ప్రశాంతంగా ఉంటే ఎంత బావుండుననిపించేది.. కానీ ఇప్పుడు మంచం కింద దాక్కున్న ఆ సందడి ఎప్పుడెప్పుడు బయటకొస్తుందా అని ఎదురుచూస్తున్నాము!

మీ మనసులో అసహనం తగ్గి ఉంటుందని ఆశిస్తున్నాను..నువ్వేమీ అనుకోనంటే నాదొక సందేహం.. నీకు బాధ / కోపం కలిగింది మాధురి రాజారావుని ప్రేమించినందుకా లేక అసలు ప్రేమించడం అన్న పని చేసినందుకా!? నీకు అసలు ప్రేమ అన్న విషయమే ఇష్టం లేదంటే అది నీ వ్యక్తిగత ఆలోచన.. ఆ ఆలోచనతో ఒకవేళ రాజారావు మంచివాడైనా అతనిలోని భరించలేని (నీకు మాత్రమే) విషయాలే కనిపించి అతన్ని ప్రేమించినందుకు మాధురి మీద అనవసరంగా కోపం తెచ్చుకుంటున్నారేమో.. లేక నిజంగానే అతను మాధురి అనుకున్నంత మంచివాడు కాకపోతే ఆ సంగతి తనకి అర్థమయ్యేలా చెప్పగలిగేది మీరే! ఏది

చేయాలన్నా ముందు మీరు మీ మనసుని శాంత పరచుకోవాలి.. మీ స్నేహితురాలితో యధావిధిగా ఇదివరకున్నట్లే ప్రవర్తించండి.. తనకి నీతో ఉన్న చనువు పోకుండా ఉండేలా చూడు.. ఇది కొంచెం సున్నితమైన విషయం కనుక నువ్వేమాత్రం తనతో దురుసుగా ప్రవర్తించినా నీమీదున్న నమ్మకం పోవచ్చు.. అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడండి.. ముందు రాజారావుని అలా బయట అక్కడా ఇక్కడా కలవడం మంచిది కాదని, ఈ విషయం వీలైనంత తొందరగా వాళ్ళ ఇంట్లో వాళ్ళకి చెప్పమని నచ్చచెప్పండి.. ప్రస్తుతానికి నేనివ్వగలిగిన సలహా ఇదే

సరేమరి, గౌతమ్‌కి టెంపరేచర్ చూసి మందు వేయాలి.. ఇసారి కాస్త తొందరగా ముగిస్తున్నాను.. 'ఈయనెప్పుడూ ఇంతే' అని విసుక్కున్నా నువ్వు అర్థం చేసుకుంటావని నాకు తెలుసు.

సెలవు మరి

*వంశీ*

***    ***    ***    ***

*నవంబర్ 9, 1985*

*మాజేరు,*

*మిత్రమా,*

ఎలా ఉన్నారు? మీకు తెలుసా, ఇక్కడ ప్రతిచెట్టుకీ మల్లెలే! అదేంటీ, హేమంతంలో గ్రీష్మ లక్షణాలు చెప్తున్నాననుకుంటున్నారా! అయినా ప్రతిచెట్టుకీ మల్లెలేంటీ! అంతలా ఆలోచించకండి.. రాత్రంతా కురిసిన మంచు కొమ్మల చివర చేరుకుని, ఈ తెల్లవారుఝాము వెలుగులో తెల్లగా అచ్చం మల్లెల్లా మెరుస్తుంది.. కార్తీకమాసం మొదలయ్యింది.. దానితోపాటే జివ్వుమనిపించే చన్నీటి స్నానాలు కూడా, అదీ ఉదయాన్నే.. మా అమ్మమ్మ ఈ విషయంలో మాత్రం యమ స్ట్రిక్టండోయ్.. నేనూ ఇలాంటి రెండు మూడు విషయాల్లో తన మాట బుద్ధిగా వింటాను.

ఇవాళ సెకండ్ సాటర్ డే, స్కూల్ కి సెలవు.. అందుకే పొద్దున్నే తీరిగ్గా మీతో కబుర్లు మొదలుపెట్టేసాను.. ఇప్పుడు గౌతమ్‌కి ఎలా ఉంది? జ్వరం తగ్గినా కాస్త నీరసంగా ఉండిఉంటాడు.. బాబు అనారోగ్యం వల్ల మీరెంత అన్యమస్కంగా ఉన్నారో మీ ఉత్తరం చదువుతుంటేనే అర్థం అయింది.. అంతా 'మీరు' 'నువ్వు' ల ద్వైదీభావమే.. చదువుతుంటే చిన్నగా నవ్వు కూడా వచ్చిందనుకోండి.. గంభీరంగానూ, హుందాగానూ ఉండే మీరు బాబుకి బాలేదని దిగులు పడుతుంటే ఒక్కసారిగా ఎన్నో ఏళ్ళు చిన్నవారైనట్లు అనిపించింది.. కానీ కష్టంలోనూ, సుఖంలోనూ అందరూ అందర్నీ పొదవుకునే మీ నలుగురిని చూస్తుంటే ప్రేమ, అప్యాయతల పొదరింటికి చిరునామా మీ ఇల్లేనేమో అనిపిస్తుంది.. అలాంటి ఇంటితో పరోక్షంగానైనా నాకు సంబంధం ఉందంటే కేవలం నా నేస్తంవల్లనే కదా!

నేస్తమంటే గుర్తుకొచ్చింది, మాధురి ప్రేమ విషయంలో మీరు వెలిబుచ్చిన సందేహంతో నాకే నా ఆలోచనల మీద డౌట్ వచ్చింది.. ఆలోచిస్తుంటే అనిపిస్తుంది, నాకు ఒకటి కాదు, మీరు అన్న రెండు కారణాలకీ తనమీద కోపంగా ఉందని.. ఎక్కడో పుస్తకాల్లోనూ, సినిమాల్లోనూ చూసిన ప్రేమ నా ఎదురుగా, నా స్నేహితురాలికి కలిగిందంటే నమ్మలేకపోతున్నాను.. ఎందుకో గుండెలో చిన్నగా కోస్తున్నట్లు బాధ, మా ఇద్దరి బంధం బీటలు వారుతున్నట్లు!! తనకి నాకంటే ప్రియమైన వ్యక్తి ఇంకొకరు ఉన్నారనే ఉక్రోషం కూడా!! అదీ ఆ వ్యక్తి నాకేమాత్రం ఇష్టం లేనివాడు.. నా ఈ అయిష్టాన్ని తనకి చెప్పి ఇంక అతని అస్సలు మాట్లాడకు అని గట్టిగా ఆజ్ఞాపించాలనిపిస్తుంది.. కానీ తనకి కోపం వచ్చి నాతోనే మాటలు మానేస్తే!! అమ్మో, ఊహించుకోలేను.. కానీ ఈ విషయం తెలిసిన దగ్గరనించీ మా ఆఫీసు రూమ్ వైపుకి వెళ్ళాలంటేనే చిరాకేస్తుంది, ఆ రాజారావుని చూడాల్సివస్తుందని. నిజంగా ఇష్టంలేని మనిషితో మాట్లాడాల్సిరావడం చాలా నరకం!

ఇతని గురించెందుకుగానీ మీకు మా భూషణం సార్ గురించి చెప్పాలి.. గుర్తున్నారు కదా, భార్యాభర్తలు జాయిన్ అయ్యారని చెప్పాను.. ఆయన వచ్చిన తర్వాత స్కూల్ దినసరి క్రమం చాలా ఆసక్తిగా మారింది.. ఇదివరకు పొద్దున్నే ప్రార్థన, ఎవరి క్లాసులకి వాళ్ళు వెళ్ళి పాఠాలు చెప్పుకోవడం, సాయంత్రం జై హింద్ చెప్పి ఇళ్ళకెళ్ళడం.. కానీ ఇప్పుడు సార్ పిల్లలతో కొన్ని ఆసక్తికరమైన పనులు చేయిస్తున్నారు..

ఉదాహరణకి 8, 9, 10 వ తరగతి పిల్లలు రోజుకొక్కరితో స్కూల్ మెయిన్ బోర్డ్ మీద ఆనాటి వార్తల్లో ముఖ్యాంశాలు రాయిస్తున్నారు.. తమ వంతు వచ్చిన రోజు వాళ్ళు కాస్త ముందుగా స్కూల్ కి వచ్చి, న్యూస్ పేపర్ తీసుకుని ఏమి రాయాలనేది ప్రిపేర్ అవ్వాలి.. ఏ వార్త ఎంచుకునేది పూర్తిగా పిల్లల నిర్ణయమే.. సార్ అన్నారు, దీన్ని బట్టి వాళ్ళకి ఏ విషయాల మీద ఆసక్తి ఉందో బాగా తెలుస్తుంది అని! అలానే రోజూ పొద్దున్నే ప్రార్థన అవ్వగానే క్లాస్‌లోకి వెళ్ళేముందు తను ఎంపిక చేసిన పిల్లలతో ప్రముఖుల జీవిత చరిత్రలను క్లుప్తంగా చెప్పిస్తున్నారు.. అంటే దేశభక్తులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, మొదలైనవారి గురించి.. ఈ నోట్సులన్నీ ఆయన దగ్గర రెడీగానే ఉన్నాయి.. అవే పిల్లలకిచ్చి చదివిస్తున్నారు.. క్రమశిక్షణ తప్పితే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ ఉంటారు.. ఆయనంటే పిల్లలకే కాదు మా టీచర్లకి కూడా ఎంతో గౌరవం!! నేనైతే ఆయన చెప్పిన సలహాలన్నిటినీ క్లాసులో అమలుచేసేస్తున్నా..

మీరడిగారు కదా మా స్కూల్లో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం ఎలా చేస్తారని.. మామూలుగా అయితే ఆ రోజు మాకు సెలవు కాబట్టి అసలేమీ పట్టించుకోరు.. కానీ మొన్న భూషణం సార్ ముందు రోజే పిల్లలందరితోనూ సెలవు ఇస్తున్నారని చెప్తూ, మన రాష్ట్ర అవతరణకి సంబంధించిన ముఖ్యమైన విషయాలు ప్రసంగించారు.. అంతే కాదు, ఆయన అధ్వర్యంలో 5వ తారీఖున జరిగిన టీచర్స్ డే కూడా చాలా బాగా చేసుకున్నాం.. పిల్లలందరూ ఎవరి క్లాసుల్ని వాళ్ళు అలంకరించారు.. వాళ్ళ స్వహస్తాలతో చేసిన బొమ్మలు మాకు బహుమతులుగా ఇచ్చారు.. అన్నిటికంటే ముఖ్యమైనది భూషణం సార్ ప్రతీ క్లాస్ కీ గ్రూప్ ఫోటో తీయించారు.. ఆరోజు పిల్లలందరి కేరింతలతో స్కూల్ ఒక నందనవనంలా అనిపించింది.

కానీ చిన్న అపశృతిలా ఫోటోలు తీయడానికి వచ్చినతను నన్ను విసిగించేసాడు.. భూషణం సార్‌కి బాగా తెలిసినతనే అంట..

నన్ను ముందే పిలిచి చెప్పారు, అతనితో పాటు ప్రతి తరగతికీ వెళ్ళి ఫోటోలు తీయించే బాధ్యత నాదేనని! అదేమంతపని అనుకున్నా కానీ తర్వాత తెలిసింది అదెంత అబద్దమో! అతను రాగానే సార్ నాకు పరిచయం చేశారు, పేరు వికాస్ అని.. అక్కడనించీ మొదలయ్యాయి నా కష్టాలు.. బయట చినుకులు పడుతుండటంతో క్లాసు రూంలోనే తీయమని చెప్తే గదిలో వెలుగు సరిగ్గా లేదని అప్పటికప్పుడు ఆఫీసు రూం నించి నాతో టేబుల్ లైట్లు తెప్పించాడు.. అవి మొయ్యడానికి సహాయం వస్తాడేమో అనుకుంటే అక్కడే దర్జాగా కూర్చుని కెమెరా సెట్ చేయడం.. పిల్లలు ఊరికే కదులుతున్నారని అలా నించుండిపోతాడు! మధ్య మధ్యలో 'నేనిప్పుడే వస్తాను ఈ కెమెరా స్టాండ్ ని నెక్స్ట్ క్లాసుకి తీసుకెళ్ళండి' అని మాయమవ్వడం.. వచ్చాక తెలిసింది మహానుభావుడు సిగరెట్ తాగడానికి వెళ్ళాడని.. మొత్తానికి ఆ కాండిడేట్ విసిగించేసాడనుకోండి!! వెళ్ళేటప్పుడు కనీసం కృతజ్ఞతలు కూడా చెప్పలేదు.. భూషణం సార్‌కి తెలిసినతను అని నేను నా కోపాన్ని లోపలే దాచేసాననుకోండి.. ఏమిటో, కొంతమందికి మనం బ్రతికేది నలుగురితో కలిసి అన్న స్పృహే ఉండదనుకుంటా!

అసలు నేను మీకు బోల్డన్ని కృతజ్ఞతలు బాకీ ఉన్నాను.. దేనికంటారా!? నా ఆలోచనల్లోనే ఉన్న వికలాంగుల స్కూల్ కి మీ సలహాలతో ఒక రూపునిస్తున్నారు.. నా ఆలోచనని ముందు అమ్మమ్మా తాతయ్యలతో చెప్పేస్తాను.. దానితోపాటే నేను ఎమ్.ఫిల్ కి అప్లై చేయాలనుకున్న విషయం కూడా! కాస్త భయంగానే ఉంది, అమ్మమ్మ ఏం రాద్ధాంతం చేస్తుందోనని.. ఆడపిల్ల జీవితం అంటే పెళ్ళి, ఇల్లు అనే తన నిర్వచనానికి మార్పులు చేయడం కష్టమైన పనే, కానీ తప్పదు.

కానీ అంతకుముందు తను చెప్పిన పనులు కొన్నిటికి తలాడించేసి మార్గం సుగమం చేసుకోవాలి.. అదిగో అందులో ఒకటి ఇప్పుడు గుడికి వెళ్ళడం.. ఏదో తనకోసం వెళ్తున్నానన్న భావం కలుగజేసాను కానీ ఇలా పొద్దు పొద్దున్నే గుడికెళ్ళడం నాకూ ఇష్టమే!! శనివారం కదా, సుబ్బలక్ష్మి సుప్రభాతం వింటూ కోనేట్లో నీళ్ళు దోసిలితో తాగి, తల మీద చల్లుకుంటుంటే అదో అవ్యక్తమైన అనుభూతి.. రాత్రి స్వామివారు, దేవేరి జలకాలాడుతూ, సుప్రభాతం వింటూనే హడావిడిగా వెళ్ళిపోతూ తమ హృదయాల్ని అక్కడ వదిలేసి వేళ్ళారా అనిపిస్తుంది.. మరి అంత తియ్యగా, చల్లగా ఉంటాయి కోనేటి నీళ్ళు!!

సరే మరి, అమ్మమ్మ పిలుపులు మీ వరకూ చేరకముందే మీకు సెలవిప్పిస్తున్నాను.. రాధికగారిని, పిల్లలని అడిగినట్లు చెప్పండి.. మీకిచ్చిన మాట ప్రకారం నా ఫోటోని ఈ ఉత్తరంతో పంపుతున్నాను.. ఇక మీరే నాకు బాకీ!

వెంటనే బదులు రాస్తారు కదూ..

*కార్తీక*

*** *** *** ***

నవంబర్ 15, 1985

హైదరాబాదు

డియర్ కార్తీకా,

*సాయంసంధ్యలో మలయానిలం*
*చల్లగా తనువును స్పృశించినప్పుడు,*
*వెన్నెల వెలుగుల్లో మధురమైన*
*సెలయేటి నీటి పాట చెవి సోకినపుడు,*
*అర్ధరాత్రి ఒంటరి మెలకువలో*
*కరిగిపోని కల కళ్ళముందు కదలాడినపుడు*
*గుర్తొచ్చే నీ రూపం*
*ఎప్పటికీ నాకపురూపం!!*

నువ్వూ, నీతోబాటు మీ ఊళ్ళోవాళ్ళు, స్కూల్లో వాళ్ళూ అంతా క్షేమమే కదా! చూడగానే కళ్ళకే కాదు మనసుకి కూడా ఆహ్లాదాన్ని కలిగించేదే అసలైన అందం అని ఊరికే చెప్పలేదనిపిస్తుంది, నీ ఫోటో చూశాక! కళ్ళలో నిర్మలత్వం, ఆత్మస్థైర్యం ఒకదానితో ఒకటి పోటీ పడుతుంటే, బయటికి చిందనా వద్దా అనుకుంటున్న దరహాసం.. నా కలం ఒక్క క్షణం కూడా తడబడలేదు పై కవిత రాయడానికి.. ఫోటో పంపించావని చెప్పగానే రాధిక అయితే పిల్లలకి స్నానం చేయిస్తున్నదల్లా పరిగెత్తుకుని వచ్చింది.. ఆ తడి చేతుల్తోనే ఫోటో పట్టుకుని చూస్తానంటుంది!! తుడుచుకోమంటే వినదే!! నేను ఊరుకుంటానా.. ఇవ్వకుండా ఇల్లంతా పరుగులు పెట్టించాను.. పిల్లలు కూడా బాత్‌రూంలోంచి అలానే వచ్చేసి ఈ అల్లరికి ఇంకాస్త రంగు కలిపారు.. వాళ్ళు పార్టీలు ఇట్టే మార్చేస్తుంటారు తెలుసా! ఎప్పుడన్నా బయటకి వెళ్దామని అనుకున్నప్పుడు అన్నీ నేను చెప్పినట్టే చేస్తూ అనుక్షణం నా వెనకే ఉంటారా, అలాంటిది ఇప్పుడు రాధిక పార్టీలోకి దూకేసి నన్ను పట్టుకోవడానికి వాళ్ళిద్దరు కూడా చిన్న చిన్న చేతులు అడ్డు పెడుతూ యధాశక్తి ప్రయత్నించారు!

చివరికి ఫోటో చేజిక్కించుకుని, నిన్ను చూసి రాధిక "చూశారా, అచ్చు నే చెప్పినట్టే ఉంది" అని తృప్తిగా తలాడించేసి వెళ్ళబోతుంటే కొంగు పట్టుకుని ఆపి "అలా కాదమ్మా, కార్తీక అంది కదా నువ్వు చెప్పిన పోలికల్లో ఒక్కటి తప్ప అన్నీ కరెక్ట్ అని!" గుర్తుచేశాను.. "నిజమేనండీ" అని ఆ ఫోటో వంక ఒక పది నిమిషాలు చూసి "కళ్ళు" అని ఏదో పెద్ద పజిల్ సాల్వ్ చేసినదానిలా కాస్త గట్టిగా అరిచింది.. "అవును కాళ్ళు పెద్దవి, నువ్వు చెప్పినట్లు చిన్నవి కాదు" అంటే "అవును చక్కగా ఉంది అమ్మాయి" అని అమ్మమ్మలు మురుసుకున్నట్లు మురుసుకుని పనిలో పడింది.. మొత్తానికి నీ ఫోటో ఇల్లంతా సందడి నింపేసింది!

ఇంతకీ మీ స్నేహితురాళ్ళిద్దరూ ఇదివరకులా మామూలుగా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారా లేదా!? అయినా చెట్టాపట్టాలేసుకుని తిరగక పోవడమే మంచిదనిపిస్తుంది.. కంగారుపడకు, నేను చెప్పేది మీ ఇద్దరి గురించి కాదు నా ఫ్రెండ్స్ గురించి.. మొన్న కలిసినప్పుడు ఒక అరగంట క్లాస్ తీసుకున్నారు, "ఉద్యోగం చేస్తున్నావు బానేఉంది కానీ ఇంకా పైకెళ్ళడానికి ప్రయత్నాలేమీ చేయడంలేదెందుకు?" అని ఒకటే నస.. పాపం వాళ్ళని అనుకోవడం ఎందుకుగానీ నేనే ఏదో ఒక కుర్చీలో

సెటిల్ అయ్యాను కదా అని ఇక కెరీర్ గ్రోత్ గురించి ఆలోచించడమే మానేశాను.. అసలే టెక్నాలజీ యుగం! ఎప్పటికప్పుడు మనల్ని మనం ఇంప్రూవ్ చేసుకోకపోతే ఇట్టే వెనకబడిపోతాం.

ఒక్కోసారి అనిపిస్తుంది కనీసం రాధిక నా వెంటపడి అది కావాలి, ఇది కావాలి అని నస పెడితే అయినా ఎక్కువ డబ్బుల కోసం కెరీర్ మీదే ధ్యాసంతా పెట్టేవాడినేమో! అంతా తన తప్పే!! ఇదే మాట మొన్న తనతో అంటే దగ్గరకు రమ్మని పిలిచి మరీ బుగ్గలు పిండి మళ్ళీ సన్నజాజులు కట్టుకోవడంలో మునిగిపోయింది!! ఒకటి మాత్రం నిజం కార్తీకా, అన్నీ తెలిసిన భార్య కంటే అర్థం చేసుకునే భార్య దొరకడం అసలైన అదృష్టం!! లేకపోతే కవితలూ, కథలూ వద్దని ఎప్పుడో నా పెన్ను ని విరిచి పారేసి ఉండేది.. స్వత హాగా తనకి సాహిత్యం, పుస్తకాలు ఇలాంటివాటి మీద అభిరుచి లేకపోయినా నా ఇష్టాల్నే తన ఇష్టంగా చేసుకుంది.. ఇప్పుడంటే పిల్లలు చిన్నవాళ్ళు అంతా బానే జరిగిపోతున్నాయి.. భవిష్యత్తు కోసమైనా కసరత్తు మొదలుపెట్టక తప్పదు.. అయినా ఒక విధంగా చెప్పాలంటే ఈ విషయంలో నువ్వుకూడా ఒక ప్రోత్సాహకారివే!! ఇంట్లోవాళ్ళ మద్దతు లేకపోయినా ఇంకా పెద్ద చదువులు చదవాలనే నీ సంకల్పం తల్చుకుంటే కొత్త ఉత్సాహం వస్తుంది..

అదమ్మాయ్ ఈసారికి కబుర్లు.. నాలు తెల్సు మా ఫోటో సంగతేం చెప్పకుండా ముగించేస్తున్నానని అనుకుంటున్నావు కదూ.. నీకు పంపడానికి అట్లాంటి ఇట్లాంటి ఫోటో సరిపోదు అందరం మళ్ళీ కొత్తగా తీయించుకుందామని రాధిక ఆర్డర్ వేసింది.. సో, అదీ సంగతి..

ఉంటాను మరి

వంశీ

*** *** *** ***

నవంబర్ 25, 1985

మాజేరు

ప్రియ నేస్తానికి,

బావున్నారు కదూ.. చలికి గువ్వలు, చెట్లే కాదు గాలి కూడా ముడుచుకు పడుకున్నట్టుంది.. ఎక్కడా ఒక ఆకు కదిలిన శబ్దం కూడా రావటంలేదు.. చలికి, నిద్రకి మంచి దోస్తీ ఏమో కదా! చీకటి ముసురుకుంటూనే నిద్ర వాకిట్లో తారట్లాడుతుంది.. తెల్లారాక దుప్పట్లోంచి కాళ్ళు బయటకి తీయాలంటే మొత్తం శరీరం ససేమిరా అంటుంది.. అదేంటో కానీ చలికాలంలో పగటిపూటంతా కాస్త ఎక్కువ ఉల్లాసంగా ఉంటుంది.. కానీ పాపం మంచు దేశాల్లో ఉండేవాళ్ళ అవస్తలు తలచుకుంటే జాలేస్తుంది.. బయటకి అడుగు పెట్టాలంటే కేజీలకి కేజీలు బరువుండే కోట్లు వేసుకోవాలంట! మీ ఊళ్ళో చలి భూతంలా ఉంటుందా లేక మాకు లాగా అల్లరి నాయికలా కవ్విస్తుంటుందా?

నాకు స్కూల్లో బాధ్యతలు ఎక్కువయ్యాయి.. ఇష్టపడి చేస్తున్నవేలేండి! చెప్పాను కదా భూషణం సార్ వచ్చాక మా స్కూల్‌కి ఓ కొత్త వైభవమొచ్చిందని.. ఆయన చేయిస్తున్న పనులే ఇవి.. పిల్లలకి మొక్కలు పెంచడంలో ఆసక్తి కలగజేయాలని పోటీ లాంటిది పెట్టారు.. ఎవరి క్లాసు ముందు వాళ్ళు తమ సొంతంగా గార్డెన్ పెంచేట్లు చేస్తున్నారు.. అందులో ఏమేం మొక్కలు

ఉండాలనేది పూర్తిగా పిల్లల నిర్ణయమే! ఏమైనా సలహాలు కావాలంటే క్లాస్ టీచర్‌ని అడగొచ్చు.. వారానికొకసారి అన్ని తోటలనీ పర్యవేక్షించే పని నాకు ఇచ్చారు.. అలాగే వారానికి రెండు పీరియడ్లు కుట్టుపని, డ్రాయింగ్, వ్యక్తిగత / పరిసరాల శుభ్రత ఇలాంటివాటికి కేటాయించారు.. చిన్న చిన్న పనులకు కూడా వాళ్ళని వాళ్ళ అమ్మానాన్నల మీద ఆధారపడకుండా చేయడమే ఈ ప్రత్యేక శిక్షణకి కారణం.. ఇదివరకు పాపం పిల్లలు చొక్కా గుండీలు ఊడిపోయినా అలానే స్కూల్ కి వచ్చేవాళ్ళు.. ఇప్పుడు చూడాలి వాళ్ళని! శుభ్రంగా ఉతికిన డ్రెస్, చక్కగా దువ్వుకున్న జుట్టు.. అబ్బా ఎంత ముచ్చటగా ముద్దొచ్చేస్తున్నారో!! ఈ స్పెషల్ క్లాస్ లన్నిటినీ చూసుకునేది సులోచన మేడం.. పిల్లలకి నేర్పించే విషయాలను, పద్ధతులనూ చూస్తుంటే ఆవిడకి తెలీని విషయమంటూ ఉందా అనిపిస్తుంది.. గులాబీ పువ్వు, కుక్కపిల్ల, పర్ణశాల ఇలాంటి చిత్రాలన్నీ పిల్లలు క్షణాల్లో నేర్చేసుకుంటున్నారు.. కాదు అంతా సునాయాసంగా ఆవిడ నేర్పిస్తున్నారు.. బొమ్మ పూర్తిచేసిన తర్వాత వాళ్ళ మొహాలు చూడాలీ.. వెయ్యి మతాబుల వెలుగు కూడా వెలవెల పోతుంది!! ఇవన్నీ చూస్తుంటే పిల్లలకి చదువుతో పాటు నేర్పించాల్సిన విషయాలెన్నో ఉన్నాయనిపిస్తుంది.

ఈ దంపతులిద్దరినీ మా ఇంటికి రమ్మని ఆహ్వానించాను.. పిలవగానే ఒక్కసారి మాత్రం ''ఇవన్నీ ఎందుకులేమ్మా.. రోజూ స్కూల్లో కలుస్తూనే ఉన్నాం కదా'' అన్నారు.. నేను ఇంకోసారి అడగగానే ఇంకేమీ బతిమాలించుకోకుండా వస్తామని చెప్పారు.. అదీ మరుసటిరోజే! స్కూల్ అవ్వగానే నేరుగా వచ్చారు.. ఆరోజు పొద్దున్నే నేను అమ్మమ్మ తో చెప్పి వచ్చాను వాళ్ళని తీసుకొస్తున్నట్లు.. అయినాగానీ నాకు వాళ్ళని తీసుకుని వెళ్తుంటే ఇల్లు దగ్గరపడుతున్నకొద్దీ ఒకటే టెన్షన్ ఎక్కడ అమ్మమ్మ పాలేర్ల మీద ఎగిరిపడుతూ కాళికావతారంలో దర్శనమిస్తుందోనని!! కానీ అలాంటి భయాలేమీ నిజమవ్వలేదు.. తాతయ్య కూడా చక్కగా ఇంటిపట్టునే ఉండి మాకోసం ఎదురుచూస్తున్నాడు.. సార్ వాళ్ళు ఒక గంట కూర్చుని వెళ్ళిపోయారు.. కానీ ఉన్న కాసేపట్లోనే వాళ్ళకి మా అమ్మమ్మ గడ్డరితనం, తాతయ్య లౌక్యం బాగా అర్థమై ఉంటుంది.. లేకపోతే ఆ కాస్త సమయంలో అమ్మమ్మ ఎన్ని ఆరాలు అడిగిందనీ!! నాకెందుకో ఆ రాత్రి అంతా అదోరకమైన సంతోషం, సాక్షాత్తూ పార్వతీ పరమేశ్వరులే మా ఇంటికొచ్చివెళ్ళినట్లు!

మీకో సంగతి చెప్పాలి.. పోయిన శనివారం సాయంత్రం ఆఖరి రెండు పీరియడ్ల టైమ్ లో పిల్లల కోసం ఒక చిన్న ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు స్కూల్లో చెప్పారు.. అది ఏ రకమైన ప్రదర్శనో అని అందరికీ ఉత్సుకతే! రెండింటినించీ అంతా ఒకటే కోలాహలం.. చిన్న వేదికని అరేంజ్ చేయడం, పిల్లల్ని వరుసల్లో కూర్చోబెట్టడం ఒకలాంటి పండగ వాతావరణం.. మామూలుగా అయితే ఇలా సభలు జరుగుతుంటే అది ఏ సందర్భంగా చేస్తున్నదీ అందరికీ ముందే తెలుస్తుంది.. కానీ ఇప్పుడు అలా కాదు కదా! అలా ఇలా చూస్తుండగానే మూడైంది.. కానీ ఆ ప్రదర్శన నిర్వహించాల్సిన వ్యక్తి ఇంకా రాలేదు.. ఓ పక్కన పిల్లల్ని కంట్రోల్ చేయలేకపోతున్నాము.. సులోచన మేడం ఎవరికో ఫోన్లు చేస్తూ ఆఫీసు రూంలోకీ బయటికీ హడావిడిగా తిరుగుతున్నారు.. నేనే ఇంక బాగా పాడే పిల్లల్ని తీసుకెళ్ళి పాటలు పాడించడం మొదలుపెట్టాను.. కాస్త సద్దు మణిగినట్లనిపించింది.. పది నిమిషాలు గడిచాయో లేదో చిన్న కలకలం.. ఒకతను ఓ మూడు బ్యాగ్‌లు మోసుకుంటూ ఇంచుమించు పరుగు పెడుతున్నట్లే స్టేజ్ వైపుకి వస్తున్నాడు.. అతను స్టేజ్‌ని సమీపించగానే గుర్తుపట్టేశాను, ఇంకెవరూ ఫోటోలబ్బాయ్ వికాస్!! వెంటనే అనుకున్నాను ''దేవుడా ఈ మహానుభావుడు ఇప్పుడందరికీ ఫోటోలు ఎంత బాగా తీయాలో

నేర్పించడు కదా!'' అని.. వస్తూనే గబగబా రెండు టేబుళ్ళు వేయించాడు అదీ నాతోనే! అవి వేసేసి మెల్లగా స్టేజ్ దిగి వెళ్ళి పోతుంటే, ''మేడం, మీరు ఇక్కడే ఉండాలండి.. నాకు ఒకరి సహాయం కావాలి ఇక్కడ'' అని ఆపేశాడు.. అంతే కోపం తన్నుకొచ్చింది.. 'ఇతనికి నేను తప్ప ఎవరూ కనబడరా' పళ్ళు కొరుక్కుంటూ అక్కడే నిలబడ్డాను..

ఆ సంచుల్లోంచి ఏవో రంగు కాగితాలు, టోపీ, ప్లాస్టిక్ పూల గుత్తులు లాంటివి తీసి బయట పెట్టి పిల్లలతో మాట్లాడటం మొదలుపెట్టాడు.. రెండు నిమిషాల్లో అర్థం అయింది అతను మ్యాజిక్ షో చేయబోతున్నాడని.. లోపల కోపం లావాలా పొంగుతున్నా 'అబ్బో ఇతనికి చాలా కళలే తెలుసే!' అనుకున్నా.. అతనికి కావాల్సినవన్నీ అందిస్తూ చూస్తుండగానే నేనూ పిల్లల కంటే ఎక్కువగా ఆ ప్రదర్శనని ఎంజాయ్ చేయసాగాను.. పిల్లలైతే ఒకటే అరుపులు, చప్పట్లూను!! మొత్తానికి చాలా బాగా జరిగింది అనుకుంటూ అతను తెచ్చిన వస్తువులన్నీ మళ్ళీ లోపల పెట్టేస్తుంటే చూశాను అతని షర్ట్ వెనక ఉన్న రక్తపు మరకల్ని!! కాస్త భయం వేసింది, ఏదైనా యాక్సిడెంట్ లాంటిది జరిగి దెబ్బలేమైనా తగిలాయేమో అని!! మెల్లగా అక్కడ నించి జారుకుని ఆ విషయం సులోచన మేడంకి చెప్పాను.. ఆవిడ ''అవునా కనుక్కుంటాను'' అన్నారు కానీ నాకే మనసాగక అతని దగ్గరకెళ్ళి ''మీకేమన్నా ఫస్ట్ ఎయిడ్ కావాలంటే చెప్పండి'' అన్నా.. అతను నావంక ఆశ్చర్యంగా చూసి ''ఫస్ట్ ఎయిడా!! అవసరం లేదు.'' అన్నాడు.. ఇక నాకెందుకులే అని వచ్చేశాను.. కానీ ఇంటికి తిరిగి వస్తుంటే దారంతా అవే ఆలోచనలు.. అయినా అది యాక్సిడెంట్ కాదేమో.. ఎవరితో అయినా గొడవ పడితే బాగా తన్ని ఉంటారు అనుకున్నా.. అలా అనుకోగానే మనసు ఎందుకో ఎదురుతిరిగింది.. 'అలా జరిగుండదులే' అని నాకు నేనే సర్ది చెప్పుకున్నా.. విచిత్రంగా అనిపించింది.. ఆ స్టేజ్ మీద నుంచుని కారాలు మిరియాలు నూరింది నేనేనా అన్న ఆశ్చర్యం!! అంతలోనే ఈ మెత్తదనం ఏమిటో!? బహుశా పిల్లల మొహాల్లో అన్ని నవ్వులు కురిపించాడనా!? తెలీదు!

అలా ఆలోచనల్లో తేలుకుంటూ ఇంటికి వచ్చానా ఎదురుగా అమ్మమ్మ.. ఆమె మొహం చూస్తూనే మనసు ఏదో కీడు శంకించింది.. ''వసంత ఆత్మహత్య చేసుకుందంటే'' ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండా చెప్పేసింది! అంతే.. ఒక్కసారి మైండ్ అంతా బ్లాంక్‌గా అయిపోయింది.. అలా కూర్చుండిపోయాను.. నానుంచి ఎలాంటి ప్రశ్నలూ రాకపోయేసరికి మళ్ళీ తనే ''వాళ్ళ అత్తగారింట్లోనే ఉరిపోసుకుని చనిపోయిందంట'' కాస్తాగి ''అయినా బంగారంలాంటి జీవితం.. సొంత అమ్మానాన్నల్లా చూసుకునే అత్తామామలు, బోల్డంత ఆస్తి.. ఇప్పుడు ఇంకో పెళ్ళి చేసుకోకపోతే దీనికి తక్కువైందేంటంట! కొడుకుని చూసైనా బ్రతికెయొచ్చు కదా!!'' ఏంటేంటో చెప్తూనే ఉంది.. నాకు విపరీతమైన కోపం వచ్చింది, వసంత మీద!! ఆత్మహత్య చేసుకోవడమేమిటసలు.. జీవితమటే అంత చులకనా! తనకి కావాల్సింది సాధించుకోవాలి గానీ!! అంతలోనే అది పెరిగిన వాతావరణం, చదివిన చదువు గుర్తొచ్చి రెండింతల బాధ.. పాతికేళ్ళు నిండకుండానే మోడుబోయిన జీవితం.. మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని ఒక ఆదర్శమూర్తి వచ్చినా ససేమిరా అంటున్న కుటుంబం!! ఆ పరిస్థితుల్లో ఉన్న ఏ అమ్మాయైనా అదే పని చేస్తుందేమో!! తన బాబుకి మాత్రం ఎలాంటి కష్టమూ తెలీకుండా పెంచుతారు తన అత్తామామలు.. అందులో ఏ సందేహంలేదు.. ఆ ధైర్యంతోనే ఇంత పని చేసిందేమో! అసలు ఆ అమ్మాయిని తన బ్రతుకు తనని బ్రతకనీయడానికి ఆ కుటుంబాలకి అంత అభ్యంతరమేమిటో!! కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే అదో రకమైన వైరాగ్యం మనసుని మెల్లగా ఆక్రమించుకుంది.

అది సరేగానీ మాస్టారూ, మీ ఉత్తరం చదువుతుంటే నా ఫోటో కోసం మీరందరూ చేసుకున్న సందడి పండగలో నేనూ మీతో కలిసి పరుగులు పెడుతున్నట్లు ఒకటే సంతోషం.. 'కాదేదీ కవితకనర్హం' లాగా మీకు 'కాదే విషయం సంబరానికనర్హం' అనుకుంటా!! కవిత అంటే గుర్తొచ్చింది "నీ రూపం" నిజంగా నా ఫోటో చూసి రాసిందేనా! అంటే మీరు అబద్ధం చెప్తున్నారని కాదు కానీ కవిత రాసేంత ఘనత ఆ ఫోటోకుందా అని!! ప్రస్తుతం నేను ములగచెట్టు చిటారు కొమ్మన ఉన్నా మరి! దిగడానికి కాస్త టైం పట్టొచ్చేమో.. అందుకే ఇప్పుడిప్పుడే మళ్ళీ పొగిడే కార్యక్రమాలు పెట్టుకోకండి.

మరి, నాకోసమే మీరు తీయించుకోబోయే స్పెషల్ ఫోటో నాకు చేరేదెన్నడో!? సరే మరి ఇక ఇక్కడితో ఆపుతాను.. అసలే పాపం ఉద్గ్రంధాలు ముందేసుకుని కష్టపడుతున్నారేమో.. అదే కెరీర్ మీద ఫోకస్ చేస్తానని అన్నారుగా! ఇంతకంటే ఎక్కువసేపు మీ సమయాన్ని అరువు తీసుకోలేను..
**కార్తీక**

***   ***   ***   ***

డిసెంబర్ 10, 1985
హైదరాబాదు

**హలో కార్తీకా,**
ఏమిటసలు నీ ఉద్దేశ్యం!! నేను ఉత్తరం రాసిన పది రోజులకి తీరిగ్గా రిప్లై రాశావు.. అదీ ఉత్తరం నిండా మీ భూషణం సార్ కబుర్లే!! నీ పద్ధతి నాకేం నచ్చట్లేదమ్మాయ్.. ఏదో నువ్వు చదువుతున్న పుస్తకాల గురించో లేక మీ అమ్మమ్మని కాకా పట్టడానికి వాడుతున్న కొత్త పద్ధతుల గురించో, అదీ కాకపోతే మాళ్ళీ నా రచనలని పొగుడుతూనో ఉత్తరం నింపేస్తావని ఆశగా చూశాను.. "మరీ ఇంత జెలసీనా!" అని తిట్టుకోకు.. ఏదో సరదాగా అంటున్నా.. నిజం చెప్పాలంటే మీ స్కూల్ విషయాలు వింటుంటే మీ సార్ మీద చాలా గౌరవం పెరిగిపోతుంది.. ఆయన్ని చూడాలనిపిస్తుంది కూడా!

వసంత గురించి విని మేమిద్దరమూ చాలా బాధపడ్డాము.. పెళ్ళి చేసుకుందామనుకున్న అతనికి ఎంతటి వేదనో తలుచుకుంటే ఎలానో ఉంది.. కానీ ఒక విషయం కార్తీకా, మనిషి సంఘజీవి.. చదువు ఉన్నా లేక స్వతంత్ర ఆలోచనలు ఉన్నా గానీ అన్ని పనులు మనకు కావాల్సినట్లు చేశేయలేము.. మన కుటుంబం ఎప్పుడూ చుట్టూవున్నవారు గీసిన పరిధిలోనే బ్రతకాలనుకుంటుంది.. అది దాటి వారి చేత చెడు అనిపించుకోవడం వారికిష్టం ఉండదు.. ఇంకా చెప్పాలంటే సాహసం చేయలేరు.. అందుకే వసంత తన జీవితానికి ఒక కొత్త అర్థం దొరుకుతుందని తెలిసినా అది సంఘం పరిధి బయట ఉండటంతో ఆ గీత దాటలేక, అందులో ఉండలేక తనే మాయమైపోయింది.. అసలు ఆత్మహత్య చేసుకోవడానికి ఎంత ధైర్యం కావాలో కదా! అదే ధైర్యం సమస్యని ఎదుర్కోవడంలో చూపిస్తే!! సరే ఈ విషయం గురించే ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకు.. నీముందు నీ కోసం ఎదురుచూస్తున్న కర్తవ్యాలు ఉన్నాయి..

నేను వర్క్ లో ఒక ప్రోజెక్ట్ హేండిల్ చేస్తున్నాను, మొదటి నించి చివరిదాకా! నేనే అంతా డిజైన్ చేశాను చేస్తున్నాను.. సో,

నువ్వన్నట్లే నా ముందూ, పక్కనా మాన్యువల్సే! ఇప్పుడు ఈ ఉత్తరం కూడా డిన్నర్ టైంని త్యాగం చేసి రాస్తున్నా.. అంటే నేను తినడం మానేశానని నువ్వు బాధపడకు.. రాధిక ఇవాళ రాత్రికి రవ్వ దోశెల ప్రోగ్రాం పెట్టింది.. తను తినిపిస్తుంటే నేను గబగబా రాస్తున్నా.. అయినా తన జడలోని సంపెంగల సువాసన దోసెల ఘుమఘుమలతో చెట్టాపట్టాలేసుకుని నా చుట్టూనే తిరుగుతుంటే "అబ్బా, ఈ డిజైన్లు, మాన్యువల్స్ ఎందుకు గానీ చక్కగా నోట్ పాడ్ పట్టుకుని ఏదన్నా రాసుకుందాం" అన్న దురాలోచన వస్తుంది.. అమ్మో, ఈ మేడం గారు ఊరుకోరు.. చూడటానికి ఆహ్లాదంగా నవ్వుతూ కనిపిస్తుందా ఏదైనా పని చేయాల్సివచ్చినప్పుడు మాత్రం చండశాసనురాలే!! అందుకే ముందే చెప్పా ఈ ప్రాజెక్ట్ అయ్యేంతవరకూ నేను రాతలు కోతలు అని ట్రాక్ తప్పకుండా చూడమని.. ఏదో నీకు మాత్రం రాయడానికి దయతలిచింది.

సరే మరి ఇక ముగించి ఒక్క దోశన్నా నా చేత్తో తింటాను.. మన వేళ్ళతో కొబ్బరి పచ్చడి తిన్న ఆనందమే వేరు కదా!!
ఉంటాను.
వంశీ

***   ***   ***   ***

డిసెంబర్ 22, 1985
మాజేరు

**కుశలమేనా కవిగారూ!**

మీ ఉత్తరమంతా రవ్వ దోశెల వాసనే!! ఆ స్ఫూర్తితోనే నేను కూడా ఇవాళ రవ్వ దోశెలే చేశాను మా ఇంట్లో టిఫిన్‌కి.. చిన్నగా తరిగిన కొబ్బరి ముక్కలు, కొత్తిమీర, పోపు వేసిన జీలకర్ర, ఆవాలు అన్నీ కలిపి దొశెలు వేస్తుంటే తాతయ్య అయితే వంట గదిలోంచి కదలకుండా ఒకటి తర్వాత ఒకటి ఎనిమిది దోశెలు తిన్నాడు!! అమ్మమ్మ తినలేదు లేండి.. తనకి నామీద పీకల వరకూ కోపంగా ఉంది మరి!! ఏమిటో, నా తెల్లవారుఝామున చన్నీటి స్నానాలు, మారుమాట్లాడకుండా గుడికి వెళ్ళడాలు ఇవేవీ పని చేసేటట్లు లేవు..

మొన్న శుక్రవారం కాక అంతకు ముందు శుక్రవారం హాఫ్ యియర్లీ ప్రిపరేషన్‌కని సెలవు ఇచ్చారు.. తాతయ్యకి కాస్త అకౌంట్లు చూడటం, జీతగాళ్ళకి, పని వాళ్ళకి ఇవ్వాల్సిన నెల జీతాలు లెక్కబెట్టి వేరుగా పెట్టడం ఇలాంటి పనులతోనే ఉదయమంతా కరిగిపోయింది.. మీకెప్పుడూ చెప్పలేదేమో మా ఇంట్లో ఇలా లెక్కలూ ఎక్కాలూ చూశేది నేనే! ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు రేట్లు, ఎరువుల రేట్లు ఇలాంటివన్నీ నీట్‌గా రాసి ఉంచుతాను.. అవి చూసే తాతయ్య ఈ సంవత్సరానికీ, పోయిన సంవత్సరానికి ఉన్న తేడాలు బేరీజు వేసుకుంటాడు.. నాకున్న ఇంకో చిన్న సరదా పొద్దున్నే రేడియోలో వచ్చే 'పొలం పనులు' కార్యక్రమం వింటూ ఆరోజు చెప్పిన ముఖ్యమైన సలహాలు రాస్తాను.. అది "పొలం పనులు" డైరీ అన్నమాట.. మా తాతయ్యకి అదో పెద్ద కాలక్షేపం.. ఒక్కోసారి రాత్రి అన్నాలయ్యాక కాసేపు ఆ పుస్తకం చదవమంటాడు..

సరే ఇంతకీ ఎక్కడ ఉన్నాను? ఆ.. ఆ లెక్కలన్నీ చూశేసి భోజనం చేసి, ఎప్పటినించో రెండవసారి చదువుదాం అని వాయిదా వేస్తున్న 'కన్యాశుల్కం' తీశాను.. రెండు పేజీలు చదివానో లేదో బయట నించి అమ్మమ్మ గొంతు, "అమ్మలూ పోస్ట్ లో

నీకేదో పుస్తకం  వచ్చిందే" గట్టిగా వినిపించింది.. "నాకా! పుస్తకమా!?" అనుకుంటూ వెళ్ళి తీసుకున్నా.. తీరా చూస్తే అది ఎమ్.ఫిల్ అప్లికేషన్ ఫామ్స్, బ్రోచర్.. ఎలాగూ అదేంటని తెలిసే వరకూ ఊరుకోదని అమ్మమ్మతో నేను ఇంకా చదవాలనుకున్న విషయం చెప్పేశాను.. ఇక చూడండీ అప్పటివరకూ కాకుల కావ్ కావ్ తప్ప ఇంకేమీ వినబడని ప్రశాంత వాతావరణం అమ్మమ్మ అరుపులతో చెల్లాచెదురైపోయింది..  తను అన్నవన్నీ రాసి మీ టైమ్ వేస్ట్ చేయను కానీ సారాంశం మాత్రం అక్కడికీ ఇక్కడికీ వెళ్ళి చదవడానికి వీల్లేదనీ, ఇక ఆలశ్యం చేస్తే లాభం లేదు మంచిరోజు చూసి సంబంధం ఖాయం చేస్తున్నట్లు చింతలపూడి వాళ్ళకి కబురు పంపిస్తానని..  అప్పటివరకూ మెల్లగా తనకి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్న నాకు పెళ్ళి మాట వినగానే విపరీతమైన కోపం వచ్చి ఛరున లేచి బట్టలు మార్చుకుని "ఎక్కడికెళ్తున్నావే" అని గదమాయిస్తున్న అమ్మమ్మ మాటల్ని లెక్కచేయకుండా గబగబా ఇంట్లోంచి బయటకి వచ్చేశాను.. బయటకైతే వచ్చాను కానీ ఎక్కడికెళ్ళాలో తెలీలేదు.. ఎందుకో మాధురి దగ్గరికి వెళ్ళబుద్ధి కాలేదు.. అది చెప్పే రాజారావు కబుర్లు వినే స్థితిలో నా మనసు లేదు.. హ్యాండ్ బ్యాగ్ కూడా చేతిలో ఉందేమో అప్రయత్నంగా నా కాళ్ళు బస్ స్టాప్ వైపుకి దారి తీసాయి.. అరగంటలో సులోచన మేడం వాళ్ళ ఇంటిముందు ఉన్నాను!!

బొంగు కర్రలతో చేసిన ప్రహరీ గేటు తీస్తుంటే అనిపించింది "ఇదేంటీ ఆవేశంలో ఇలా వచ్చేశాను.. పైగా సెలవు రోజు కూడా వాళ్ళు ఏమైనా పనిలో ఉంటారేమో" అనుకుంటూ ఇంటి వసారాని సమీపిస్తుంటే అప్పుడే ఉడికినట్లున్న పలావు వాసన ఒక్కసారే  చుట్టుముట్టింది! అంతక్రితమే సుష్టుగా భోజనం చేశినా ఆ వాసనకి మళ్ళీ ఆకలేస్తున్న ఫీలింగ్!! వసారాలో తల దూర్చేసి మరీ దీర్ఘంగా పేపర్ చదువుకుంటాయన్ని చూసి "సార్" అని పిలిచాను.. పేపర్ లో నించి తల సగం పైగా బయటకి వచ్చింది..  "ఏంటీ మహానుభావుడు ఇక్కడ ఉన్నాడు??" అనుకుంటుంటే "సార్ లోపల ఉన్నారు" అని చెప్పి మళ్ళీ తల పేపర్లోకి వెళ్ళిపోయింది.. అసలే కోపంతో ఉన్నానేమో అతని ప్రవర్తన ఇంకా చిరాకు తెప్పించింది.. "రెండు సార్లు హెల్ప్ అని స్కూల్లో నాతో చచ్చేంత పని చేయించుకున్నాడు.. ఇప్పుడేమో అసలు నేనెవరో ఎరగనట్లు ఫోజు కొడుతున్నాడు!" ఆ చిరాకుతోనే ఈసారి "మేడం" అని కాస్త గట్టిగా అరిచాను.

లోపల్నించి మెడలో తువ్వాలు, చేతిలో గరిటె తో భూషణం గారు బయటకి వచ్చారు.. నన్ను చూడగానే ఆయన మొహంలో ఆనందంతో కూడిన ఆశ్చర్యం! వెంటనే "లోచనా.. లోచనా.. ఎవరొచ్చారో చూడు" అంటూనే పక్కకి తిరిగి "వికాస్, గుర్తుపట్టలేదా కార్తీక.. మన స్కూల్లో చేస్తుంది కదా" అంటే అప్పటికి అతగాడికి చలనం వచ్చినట్లు లేచి "నమస్తే అండి" అన్నాడు.. నేను అతన్ని  పట్టించుకోకుండా "టీచింగ్ నోట్స్ స్కూల్లోనే మర్చిపోయానండి.. అలా వెళ్తూ మిమ్మల్ని పలకరిద్దామని వచ్చాను" అంత పెద్ద అబద్దం ఎంత సునాయాసంగా వచ్చేసిందో నా నోటివెంట! అంతలో పక్కనించి స్టూల్ ఒకటి మోసుకుంటూ మేడం వచ్చారు.. ఆవిడా నన్ను చూడగానే సంతోషించారు.. "వారంపైనే అయింది సందులో బల్బులు మాడిపోయి.. ఇవాల్టికి కుదిరింది మార్చడానికి" అని "పదమ్మా లోపలికి వెళ్దాం" అని చెయ్యి పట్టుకు తీసుకెళ్ళారు.. నాకు లోపలికి వెళ్తుంటే కొంచెం విచిత్రంగా అనిపించింది.. సార్ చక్కగా  కమ్మని పలావ్ వండుతుంటే, మేడం చక చకా బల్బులు మార్చేస్తున్నారు!! కాస్త ఇంటరెస్టింగానూ అనిపించింది..

నన్ను కూడా భోజనానికి రమ్మంటే నేను తినేసి వచ్చానని వాళ్ళని చేసేసి రమ్మని చెప్పాను.. వికాస్ తమాషాగా నవ్వుతూ "అయ్యో మీరు రాకపోతే మామయ్య మా ఇద్దరికీ కూడా అన్నం పెట్టరు" అన్నాడు.. చేసేది లేక నేనూ వాళ్ళతో కుర్చున్నాను.. అన్నం తింటుంటే మధ్యలో మేడం "వికాస్ ఆరోజు నీ షర్ట్ మీద రక్తపు మరకలు చూసి యాక్సిడెంట్ అయ్యి దెబ్బలు తగిలాయేమోనని కంగారుపడింది కార్తికే!" అని చెప్పారు.. నాకెందుకో ఆవిడ అతనిముందే అలా చెప్పేస్తుంటే కొంచెం ఇబ్బందిగా అనిపించింది.. సార్ మాత్రం భళ్ళున నవ్వేసి "యాక్సిడెంటా పాడా.. వీడు విద్యార్ధి సంఘం నాయకుడు.. ఆరోజున చల్లపల్లిలో రాస్తారోకో చేస్తుంటే పోలీసులతో జరిగిన గొడవ ఫలితంగా తిన్న లాఠీ దెబ్బలవి!" అన్నారు.. నాకైతే చెప్పలేని ఆశ్చర్యం!! అంత గొడవ జరిగీ, దెబ్బలు తినీ ఏమీ జరగినట్లు స్కూల్ కొచ్చి ఆ మ్యాజిక్ ప్రదర్శన ఇచ్చాడా!! ఆరోజు ఆదరాబదరాగా బ్యాగులు మోసుకుంటూ వస్తుంటే లేట్ చేసినందుకు నేనతన్ని ఎంత తిట్టుకున్నానో గుర్తొచ్చి బాధేసింది.. నా ఆలోచనల్లో ఉండగానే భూషణం గారే మళ్ళీ "వీడికి పిల్లలంటే ప్రేమో లేక మేమంటే అభిమానమో తెలీదు కానీ స్కూల్ కోసం ఏదడిగినా కాదనకుండా చేస్తాడు" అన్నారు.. అయితే ఫోటోలు కూడా అలా తీసినవేనా! ఇతనికేదో ఫోటో స్టూడియో ఉందనీ, మా స్కూల్లో అన్ని ఫోటోలు తీసి బోల్డంత సంపాదించేసి ఉంటాడని అనుకున్న నా ఊహ కూడా నిజం కాదు! మనసులో అతని మీద పేరుకున్న దురభిప్రాయాలన్నీ నెమ్మదిగా మాయమవడం నాకు తెలుస్తూనే ఉంది! 'ఇందాక సార్‌ని "మామయ్యా" అని పిలిచాడు అంటే వీళ్ళు బంధువులా!?' ప్రశ్న ఉదయించింది కానీ అడిగే ధైర్యం మాత్రం చేయలేదు..

అసలు నేనే కారణం చేత అక్కడికి వెళ్ళానో అవన్నీ మర్చిపోయి హాయిగా రెండుగంటల పాటు కబుర్లు చెప్పుకుని, టీ తాగి ఇంటికి బయలుదేరాను.. వచ్చేస్తుంటే మేడం జాకెట్ పీస్, పూలు, పళ్ళు పెట్టారు.. నేను 'ఇవన్నీ ఇప్పుడెందుకండీ" అంటుంటే "నా కూతురి లాంటిదానివి.. అమ్మ ఇచ్చిందని తీసుకో" అంటుంటే నాకు కన్నీళ్ళు ఆగలేదు.. అమ్మ పోయిన తర్వాత 'నేనే మీ అమ్మననుకో' అని దగ్గరకు తీసుకుందెవరూ లేదు.. ఆవిడలా అనగానే పొదివి పట్టుకుని ఏడ్చేశాను!! కానీ వంశీ గారూ, ఆ రోజు ఇంటికి తిరిగి వస్తుంటే మనసుని ఆవరించిన ప్రశాంతతని వర్ణించడానికి మాటలు రావడంలేదు.. ఆక్షణంలో ఎంతటి సమస్యైనా చిన్నదిగానే అనిపించింది.. అందుకే ఇంటికి రాగానే అమ్మమ్మ మళ్ళీ కోపంతో అరుస్తున్నా నేను పట్టించుకోలేదు.. ఎక్కడికెళ్ళానో చెప్పాను.. ఇంకా వంట చేయకపోవడం చూసి నేనే గబగబా ఒక కూరా అన్నం వండాను.. మామూలుగా అమ్మమ్మ అలా నామీద అరిస్తే నేనూ గట్టిగా ఏవేవో మాటలనేసి వెళ్ళి పడుకుండిపోయేదాన్ని.. అలాంటిది నేను మాములుగా ఉండటం చూసి తనే ఇంక కామ్‌గా అయిపోయింది..

కానీ ఇంకా నాతో మాట్లాడటం లేదు.. చూడాలి ఎన్నిరోజులు పడుతుందో తను మామూలుగా అవడానికి.. ప్రస్తుతానికైతే ఆ చింతకాయలో దోసకాయలో వాళ్లెవరికో సంబంధం గురించి కబురు పెడతానన్న పని మాత్రం చేయలేదు.. తను ఆ ఊసు ఎత్తనంతవరకూ నా మీద ఎంత కోపంగా ఉన్నా పర్వాలేదు.. నేను మాత్రం అప్లికేషన్ పూర్తి చేసి పంపేశాను.. ఇక నేను ఆ తయారీలో ఉండాలి.. వీలు చూసుకుని సులోచన మేడంతో నా పరిస్థితి గురించి మాట్లాడాలి..

అబ్బా, చూస్తూ చూస్తూనే మళ్ళీ ఎంత పెద్ద ఉత్తరం రాసేశాను!! ఏంటో మీతో కబుర్లు మొదలుపెడితే మా సుబ్బులు తుమ్మిన సంగతి దగ్గరనించీ మాఊరి బస్సు ఎన్నిసార్లు లేట్ గా వచ్చిందో వరకూ నా చుట్టూ జరిగిన విషయాలన్నీ

చెప్పకపోతే మనసూరుకోదు.. మీ ప్రోజెక్ట్ ఏమో గానీ చూస్తుంటే రాధిక గారిని తెగ కష్టపెడుతున్నట్లున్నారు! కవితలు రాసేటప్పుడూ, ఆఫీసు ప్రోజెక్టులకూ ఇలా అన్ని విషయాలకీ సేవ చేసేసి మిమ్మల్ని బొత్తిగా పాడుచేసేస్తున్నారు!! ఇదేమాట ఉన్నది ఉన్నట్టుగా అక్షరాలు దాయకుండా ఆవిడకు చెప్పండి.. ఇంతకీ పిల్లలకి పల్లెటూరి ఆంటీ నచ్చిందో లేదో చెప్పనేలేదు! ఇక ఇవాళ్టికి చాలని చేతి వేళ్ళు మొరాయిస్తున్నాయి.. మరి ప్రస్తుతానికి సెలవా..

**కార్తీక**

***** *** *** *****

జనవరి 5, 1986

హైదరాబాదు

**కార్తీక గారికి నమస్తే,**

నేను రాధికని. అమ్మమ్మ గారు, తాతయ్య గారు బావున్నారా?

మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీరు ఉత్తరంలోనే శుభాకాంక్షలు చెప్పి ఉండాల్సింది. ఒక్కటి కాదు పిల్లల కోసం కూడా వేరు వేరుగా గ్రీటింగ్ కార్డ్ లు పంపారు. వాళ్ళిద్దరికీ అవెంత నచ్చాయో చెప్పలేను. పడుకునేటప్పుడు కూడా అవి దిండు దగ్గర పెట్టుకుని పడుకుంటున్నారు. ఈయనేమో ప్రాజెక్ట్ పని మీద నిన్ననే పూనా వెళ్ళారు. వారం రోజులని చెప్పారు కానీ ఇంకా ఎక్కువ రోజులు ఉన్నా ఉండొచ్చు అన్నారు. పిల్లల సంతోషాన్ని మీకు వెంటనే తెలియజేయాలని ఆయన వచ్చేవరకు ఆగకుండా నేనే మీకు ఉత్తరం రాస్తున్నాను.

ఈ నూతన సంవత్సరం మీకెంతో ఆనందాన్ని, సుఖసంతోషాలనీ అందించాలని కోరుకుంటున్నాను.
మీ గ్రీటింగ్స్ కి మరొక్కసారి ధన్యవాదాలతో సెలవు.

**రాధిక**

***** *** *** *****

జనవరి 5, 1986

**మాజేరు**

**వంశీ గారూ,**

మీ అందరికీ మరొక్కసారి హేపీ న్యూ ఇయర్.. గ్రీటింగ్ కార్డ్స్ అందే ఉంటాయని అనుకుంటున్నాను.. 'ఇదేంటీ ఈసారి కొత్తగా పోస్ట్ కార్డ్' అనేసుకుంటూ ఆశ్చర్యపోతున్నారా!? ఏమీ లేదండీ ఒక చిన్న విషయం తొందరగా మీ చెవిన వేద్దామని దీని మీదే రాసేస్తున్నా.. మీ ఊరు రాబోతున్నాను తెలుసా! సెంట్రల్ యూనివర్సిటీ లో నా ఎమ్.ఫిల్ కి సంబంధించి ఒక పని ఉంది.. మా స్కూల్లో నాతోపాటు చేసే ఇంకో ఇద్దరు అమ్మాయిలు కూడా నాతో పాటే అప్లై చేశారు.. మేము ఈ 9th రాత్రి బయలుదేరి 10 ఉదయానికల్లా హైదరాబాదులో ఉంటాము.. ఒకమ్మాయికి అక్కడ చుట్టాలు ఉన్నారు, పైగా వాళ్ళ నాన్న గారు కూడా మాతో వస్తున్నారు.. అందుకే వాళ్ళింట్లోనే దిగి, యూనివర్సిటీలో పనయ్యాక మిమ్మల్ని కలవాలనుంది.. మరి మీకు వీలవుతుందో లేదో!? వీలవ్వకపోయినా వీలుచేసుకుంటారనే ఈ పోస్ట్ కార్డ్..

ఈ ఉత్తరం మీకు సకాలంలో అందితే చాలు.
మిమ్మల్ని కలవబోతున్నాను అన్న ఊహే ఎంత ఎక్సైటింగ్ గా ఉందో!!
కార్తీక

*** *** *** ***

జనవరి 11, 1986
మాజేరు

రాధిక గారికి,

మీ ఉత్తరం చూశాక చాలా చాలా ఆనందం కలిగింది.. ముందైతే కాసేపు నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను.. హైదరాబాదు వరకూ వచ్చికూడా మీ అందరినీ కలవలేకపోయానే అన్న పట్టలేనంత దిగులు మీ ఈ ఉత్తరం చూడగానే ఎలా కరిగిపోయిందో!! చిత్రంగా అటు నించి మీరూ, ఇక్కడ నేనూ ఒకేరోజు ఉత్తరాలు రాసుకున్నాం కదా! వంశీ గారు ఊర్లో లేరన్న విషయం తెలిసి ఇప్పుడింకా బాధేస్తుంది మిమ్మల్ని కలవలేకపోయానే అని! మరి ఆయన లేనప్పుడే కదా మనం ఎంచక్కా ఆయన మీద చాడీలు చెప్పుకోవచ్చు! ఏమంటారు!?

అసలు మీ ఊర్లో దిగినప్పటినించీ ఒక్క క్షణం ఖాళీ లేదంటే నమ్మండి! నేనేమో మా పని చక్కగా మధ్యాహ్నం కల్లా అయిపోతుందేమో అటు నించి మిమ్మల్ని కలిసి, సాయంత్రం వరకూ ఉండి, రాత్రికి బండెక్కేయచ్చనుకున్నాను.. కానీ యూనివర్సిటీ లో పనయ్యేసరికే నాలుగైంది.. మధ్యాహ్నం భోజనం లేదు.. పైగా వేరేవాళ్ళతో కలిసి వచ్చాను కదా, ఇలా సమయం తక్కువున్నప్పుడు నేనొక్కదాన్నే అటూ ఇటూ వెళ్తానంటే బాగోదని వాళ్ళతోనే ఉండిపోయాను.. కానీ మనసంతా మాత్రం మీ చుట్టూనే.. ఎక్కడ నాకోసం ఎదురుచూస్తుంటారో అని!

బహుశా నా ఉత్తరం కూడా మీకు నిన్నో మొన్నో అంది ఉంటుంది.. ఇప్పుడనిపిస్తుంది, నేను అనుకున్న ప్రకారం మీ ఇంటికొచ్చేసి తలుపు కొడితే ఎలా ఉండేదా అని! నేను వస్తున్నానన్న విషయం మీకు తెలీక, మీకు తెలీదన్న విషయం నాకు తెలీక... అబ్బా, ఊహించుకుంటేనే నవ్వాగటం లేదండీ!! ఈ హాస్యాన్ని మీతో పంచుకోవాలని వెంటనే రెప్లై రాస్తున్నాను.

అయితే వంశీ గారు ప్రాజెక్ట్ పని మీద తలమునకలై ఉన్నారన్నమాట.. ఇక కొన్ని రోజులు పత్రికలు కొనడం మానేయడం మంచిది.. మరి ఆయన ఇంత బిజీ గా ఉంటే ఆయన కవితలేమీ వాటిల్లో ఉండవు కదా! అవునుగానీ వంశీ గారు లేకుండా అన్నిరోజులు ఒక్కరే.. పిల్లలతో.. అదీ వాళ్ళు చాలా చిన్నవాళ్ళు కదా.. మీకేమీ ప్రాబ్లెమ్ లేదు కదా?

సరేనండీ మరి, మీ ఉత్తరం చూడగానే ఆలశ్యం చేయాలనిపించక వెంటనే రాస్తున్నాను.. చాలా బడలికగా ఉందండీ.. ఏదో సుడిగాలిలాగా అలా వెళ్ళి ఇలా వచ్చాము కదా ప్రయాణపు తలనొప్పి అనుకుంటా! మరల తీరిగ్గా మాట్లాడతాను. మీరు కూడా వీలున్నప్పుడు తప్పక రాయండి.

పిల్లలని మరీ మరీ అడిగినట్లు చెప్పండి.
**కార్తీక**

*** *** *** ***

జనవరి 12, 1986
హైదరాబాదు

**హాయ్ కార్తీకా,**
ముందుగా నీకు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు.. పోయిన సంవత్సరం మాకు ఒక ఊహించని బహుమతినిచ్చింది.. ఏమిటో కాదు, నువ్వే! మా కుటుంబానికి ఒక ఆత్మీయురాలిని పరిచయం చేసింది.. ఇక ఈ సంవత్సరం ఏ అద్భుతాలని అందివ్వబోతుందో! మొత్తానికి నేను ఊళ్ళో లేకపోవటం చూసి రాధిక, నువ్వూ గబగబా ఉత్తరాలు రాసేసుకుంటున్నారంట! "ఇప్పుడు మేమిద్దరం ఒక పార్టీ" అంటోంది రాధిక.. కాదనే సాహసం మాత్రం చేయలేను.

నిన్న రాత్రే వచ్చాను పూనా నుంచి.. వారం అనుకున్నది రెండు వారాలు అయింది.. రాధికకి తోడుగా వాళ్ళ తమ్ముడు ఉన్నాడు కాబట్టి ఎక్కువ టెన్షన్ పడలేదు.. మీటింగ్ లు, డిస్కషన్లు, డెసిషన్ లు రోజంతా బిజీ బిజీ.. అసలు టైమ్ ఎలా గడిచిపోయిందో తెలీదు.. కానీ ప్రాజెక్ట్ కి వస్తున్న రెస్పాన్స్ చూస్తే అసలు శ్రమ తెలీలేదు.

అసలు వచ్చీ రాగానే ఎందుకు నీకు లెటర్ రాస్తున్నానన్న విషయం చెప్పనే లేదు.. నువ్వు హైదరాబాద్ కి వచ్చి వెళ్ళావని, మా ఇంటికి వద్దామనుకుని సమయం కుదరక రాలేకపోయావని రాధిక చెప్పింది.. వెంటనే 'అయ్యో' అనుకున్నా ఆ మరుక్షణమే సంతోషం కూడా వేసింది.. నిన్ను కలవడం మిస్ అవలేదని! ముందుగా ఇదిగో మా ఫోన్ నంబర్, 374859.. ఇక హైదరాబాదు కి తరచూ వచ్చే అవకాశాలు ఉన్నాయి కదా.. 'ఇదిగో వస్తున్నానని' ఒక్క ఫోన్ చేసి తిన్నగా ఇంటికొచ్చేయి.. సరేనా! అది సరేగానీ మీ అమ్మమ్మ ఎలా ఒప్పుకున్నారు ఇక్కడికి రావడానికి? ఏం మంత్రం వేశావు!?

సరే మరి, మళ్ళీ మాట్లాడదాము.. కొంచెం బయటకు వెళ్ళాల్సిన పని ఉంది.
మీ అమ్మమ్మ, తాత గార్లకు, భూషణం మాస్టారు దంపతులకు, మాధురి గారికి అందరికీ పేరు పేరునా మా తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు అందించు.
**వంశీ**

*** *** *** ***

జనవరి 26, 1986
మాజేరు

**హలో వంశీ గారు,**
మీకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.. మన ఉత్తరాలన్నీ ఈ శుభాకాంక్షలతోనే నడుస్తున్నాయి కదా! మీరన్నట్లు నిజంగానే

పోయిన ఏడాది నాకిచ్చిన అపురూపమైన బహుమతి మీ పరిచయం! ఇష్టమైన వ్యక్తుల పుట్టినరోజులు గుర్తున్నట్లే ఇకనించీ మార్చి 5, 1985 గుర్తుండిపోతుంది.

మీరు ఇంటికి వచ్చేసారని తెలిసాక అదో నిశ్చింత.. లేకపోతే మీరు పూనా వెళ్ళారని తెలిసిన దగ్గరనించీ ఏదో పక్కింట్లో ఉంటూ, రోజూ కనబడే నేస్తం ఊరెళ్తే కలిగే బెంగలాంటి దిగులు.. 'ఈ అమ్మాయికి ప్రతి విషయానికీ దిగులే' అనుకుంటూ అలా చిత్రంగా చూడకండి.. నేనంతే మరి!

అమ్మమ్మ కి నేనేమీ మంత్రం వేయలేదు, ఒక చిన్న అబద్ధం చెప్పా.. స్కూల్ వాళ్ళు ట్రైనింగ్ కోసం పంపిస్తున్నారని! అది కూడా నాతోపాటు వచ్చిన ఇద్దరమ్మాయిలూ ఇంటికి వచ్చి చెప్తేకానీ కాస్త శాంతించలేదు.. కానీ మా ఇంట్లో పనిచేసే వాళ్ళందరి దృష్టిలో నేనిప్పుడు పెద్ద ఆఫీసరు టైపు.. మరి నేను భాగ్యనగరం వెళ్ళొచ్చాను కదా.. అక్కడ పెద్ద పెద్ద ఆఫీసర్లు, మంత్రులూ లాంటివాళ్ళే ఉంటారని వాళ్ళ నమ్మకం! వాళ్ళ విషయం అటు పెడితే నాకెందుకో ఉన్న ఒక్కరోజూ అస్సలు ఊపిరాడనట్టైంది తెలుసా! ఎటువైపు చూసినా జనాలు, మోటారు బైకులు, మీదకి దూసుకొచ్చినట్లుండే సిటీబస్సులు.. అసలు ఆ రణగొణ ధ్వనిలో ఎలా ఉండగలుగుతున్నారో మీరు అని కాసేపు జాలిపడ్డాను కూడా! మరి ఈ శ్రీరామ నవమికి మీరందరూ మాఊరికి వస్తున్నారా లేదా? మీకు భూషణం గారిని, సులోచన గారిని ఎప్పుడెప్పుడు పరిచయం చేయాలా అనుంది.

ఇప్పుడు నేను వాళ్ళిద్దరినీ పిన్నీ, బాబాయ్ అని పిలుస్తున్నాను.. సులోచన గారే "స్కూల్లో ఉన్నప్పుడు సరేగానీ బయట కూడా సార్, మేడమ్ లు ఏంటమ్మా, చక్కగా పిన్నీ, బాబాయ్ అని పిలువు" అని ఒప్పించారు.. నేను అమ్మమ్మకి అబద్ధం చెప్పి వెళ్ళిన సంగతి విని ఆవిడ చాలా కోప్పడ్డారు.. నేను అమ్మమ్మ మొండితనం గురించి చెప్తూనే నెమ్మదిగా మా కుటుంబం గురించి, ఇంకా చదవాలన్న నా ఆశ గురించీ, పెట్టాలనుకున్న వికలాంగుల స్కూల్ గురించీ, పెళ్ళి పట్ల నా విముఖత గురించీ కొంచెంగా మొదలుపెట్టి మొత్తం చెప్పేశాను.. ఇదంతా మా లంచ్ టైమ్ లో జరిగింది.. అంతా వున్నాక ఆవిడలాగే కాసేపు నావంక చూసి "సాయంత్రం కాసేపు ఇంటికి రా, మాట్లాడుకుందాం" అన్నారు.. నాకు ఎందుకో ఉత్సాహంగా అనిపించింది.. సులోచన గారు తప్పకుండా నాకు అమ్మమ్మ నించి తప్పించుకునే ఉపాయాలేమైనా చెప్తారనిపించింది.

నాకెందుకో ఆదంపతులు చూపించే ఆప్యాయత తెచ్చిపెట్టుకున్నట్లు కాక చాలా సహజంగా అనిపిస్తుంది.. అలానే వాళ్ళ జీవనసరళి కూడా భిన్నంగా బావుంటుంది.. సాధారణంగా ఆ వయసు వాళ్ళలో ఉండే తెచ్చిపెట్టుకున్న అధికారం, అజ్ఞాపించే పెద్దరికం, దైనందిన జీవితంలో ఉదాసీనత ఇవేమీ కనిపించవు.. ఇంకో విషయం తెలుసా! చరమదశలో ఇద్దరు ఒక్కరై పోయినా అన్ని పనులూ సొంతంగానే చేసుకోగలిగి ఉండాలని ఆయన వంటంతా నేర్చుకుంటే ఆవిడ ఎలెక్ట్రిక్ పనులు, చిన్న చిన్న మరమ్మత్తులు లాంటి ఇంటికి సంబంధించిన పనులన్నీ చేస్తారు.. 'పెళ్ళైన కొత్తల్లో నీకు అది చేతకాదంటే మీకు ఇది చేతకాలేదు' అనుకుంటూ ఆయన పువ్వులు అందిస్తుంటే ఆవిడ కడుతూ పోట్లాడుకునే దృశ్యం మాత్రం చూసి తీరాల్సిందే! మొక్కలు కూడా ఎంతో పద్ధతిగా, కళాత్మకంగా పెంచుతారు, పైగా ఈ మధ్య రెండు కుందేళ్ళని కూడా పెంచుతున్నారేమో

గేటు తెరవగానే నందనవనం అలా కళ్ళముందు పరచుకున్నట్లు అనిపిస్తుంది.. నేనెప్పుడూ మీగురించి మాట్లాడుతూనే ఉంటాను.. అందుకే మీ కబుర్లన్నీ అడుగుతూనే ఉంటారు.

ఇక ఆరోజు సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళొస్తుంటే సులోచన గారి మాటలే మళ్ళీ మళ్ళీ చెవిలో గింగురుమంటున్నాయి.. "అసలు మీలాంటి మోతుబరి కుటుంబాల్లో ఆడపిల్లలకి ఈపాటికే పెళ్ళి చేసేస్తారు.. పైగా ఇలా ఉద్యోగం కోసం వేరే ఊర్లకి పంపడం అరుదు.. ఇంకా నీ మీద వత్తిడి తీసుకురాలేదంటే మీ అమ్మగారనుభవించిన అసంతృప్తి నీకుండకూడదనే యోచన వాళ్ళమనసులో ఎక్కడో ఉండే ఉంటుంది.. ముందసలు నువ్వు వాళ్ళనించి వేరు కాదు మీరందరూ ఒకే కుటుంబానికి చెందినవారన్న విషయం అర్థం చేసుకోవాలి.. మన సంస్కృతిలో అతి ముఖ్యమైన భాగం కుటుంబం.. తరువాతే వ్యక్తి! బంధాలలో చిక్కుకోకుండా ఏదో సాధించాలన్నా నీ ఆశయం మంచిదే కానీ ఆ ఆశయాన్ని చేరుకోవటానికి ఒక దారనేది ఎంచుకున్నావా? రేపు వీళ్ళు వద్దన్నా పైచదువులకి వేరే వూళ్ళు వెళ్తావు.. మరిక్కడ వీళ్ళ పరిస్థితేంటి? ఈ వృద్ధాప్యంలో వారసులు బాధ్యతలను పంచుకుంటే బావుండనని వాళ్ళకుండదా! అయినా, మీ అమ్మమ్మ గడసరిది, అన్నిటికీ అనుమానం అంటున్నావు రేపు నువ్వెళ్ళబోయే ప్రపంచలో ఇలాంటివాళ్ళు కోకొల్లలు.. అందరినించీ ఇలానే తప్పించుకు పారిపోతావా!! ఇప్పుడు నువ్వు హైదరాబాదు వెళ్ళిన అసలు కారణం వేరే ఎవరి ద్వారానో తెలిస్తే నిన్నింకా ఎంత కట్టడి చేస్తారో తెలుసా!" ఇలా ఇంకా చాలానే చెప్పారు.. అమ్మమ్మతో మాట్లాడాటానికి సహాయం కావాల్సివస్తే కూడా అడగమన్నారు..

నాకెందుకో కాస్త నిస్సత్తువుగా అనిపించింది.. అమ్మమ్మని ఒప్పించడం అంత తేలికైన విషయం కాదని మీకూ తెలుసు కదా! మొదటిసారిగా నాకో తోబుట్టువు ఉంటే బావుండేదని బలంగా అనిపించింది.. అప్పుడు ఇంట్లోవాళ్ళ దృష్టంతా కేవలం నామీదే ఉండేది కాదు.. కానీ సులోచనగారు చెప్పిన మాటలు తలచుకుంటుంటే 'పాపం వాళ్ళకైనా నేను తప్ప వేరెవరున్నారు' అనిపిస్తుంది.. అంటే మాకు చాలా పెద్ద బంధుగణమే ఉందనుకోండి అయినా అమ్మమ్మని చూస్తే ఎందుకో అందరూ భయపడుతూ హద్దుల్లో ఉంటారు.. కానీ ఏ చిన్న అవకాశమొచ్చినా నా విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పకుండా ఉండలేరు. ఏదేమైనా సులోచన గారు చెప్పినట్లు ఏవేవో చేసేయాలని, ఎలాగోలా చేసేయాలని కాకుండా ఎలా చేయాలనే నిర్దిష్టమైన మార్గం ఒకటి ఆలోచించాలనే నిర్ణయం తీసుకున్నాను.. అందులో భాగంగానే ముందుగా అమ్మమ్మకి నా ఎమ్.ఫిల్ సంగతి, హైదరాబాదుకి అసలెందుకెళ్ళిన విషయమూ చెప్పేశాను.. ఏంటీ ఆమె రియాక్షన్ ఏమిటోనని అమాంతంగా కళ్ళు పెద్దవి చేసి చదువుతున్నారా!? ఏముందీ, మామూలే! తిట్లు, శాపనార్థాలు, మరికొన్ని తిట్లు, బెదిరింపులు, ఇంకొన్ని తిట్లు!! కానీ ఒప్పించాను.. అదిగో ఏదో ఎనిమిదో వింత చూసినట్లు ఆశ్చర్యపడకండి.. నేనెక్కడికి వెళ్తే నాతోబాటు తనను కూడా తీసుకెళ్తానని ఒంటరిగా మాత్రం వెళ్ళనని, అలా అయితే తను కూడా ఎప్పుడూ ఇలా చుట్టూ ఉన్న ఊర్లే కాకుండా సిటీలు కూడా చూడొచ్చని, ఆఖరిలో బ్రహ్మాస్త్రంగా నాకు తనకంటే పెద్ద దిక్కెవరని బ్రతిమాలాను.. కానీ ఒక షరతు మాత్రం పెట్టిందండోయ్, ఏదైనా మంచి సంబంధం వస్తే మాత్రం పెళ్ళి చేసేస్తానని అంది.. ఏదైతేనేం ప్రస్తుతం గండం గడిచింది కదా అని తలూపేసాను.

ఇవాళ సెలవే అయినా ఒక చోటికి వెళ్ళాల్సి వచ్చింది.. ఆ కథ మళ్ళీ ఉత్తరంలో రాస్తాను.. ఇక ఇంటికి వచ్చాకా తాతయ్యకి

సహాయం చేయడం, పిల్లల టెస్టులు దిద్దడం ఇలా చాలా పొద్దుబోయిందప్పుడే. నా ఈ చిన్న విజయాన్ని మీతో పంచుకోవాలని ఉత్తరం మొదలుపెట్టాను.

మీకు టైమ్ లేకపోతే రాధిక గారితో రాయించండి.. అయినా మీరు మళ్ళీ ఊరెప్పుడు వెళ్తారో మేమిద్దరం మళ్ళెప్పుడు ఉత్తరాలు రాసుకుంటామో!

కార్తీక

*** *** *** ***

ఫిబ్రవరి 10, 1986

హైదరాబాదు

కార్తీకా,

ఈసారి ఎలా ఉన్నావు అని అడగాల్సిన అవసరం లేదనిపిస్తోంది.. నిన్ను అభిమానించి మంచి సలహాలనిచ్చి పిన్ని, బాబాయిలను సంపాదించుకున్నావు.. ముఖ్యంగా మీ అమ్మమ్మగారిని పైచదువులకి ఒప్పించావు.. నీకు నా హృదయపూర్వక అభినందనలు.

నిజంగా మానవ సంబంధాలు ఎంత చిత్రమైనవో కదా! ఒక్కోసారి మనకి సంబంధించినవాళ్ళే మనల్ని దూరంగా ఉంచితే, ఎలాంటి సంబంధంలేని వాళ్ళు అలా పరిచయమై ఇలా మనతో మమేకమైపోతారు! సులోచన గారు నీకు చెప్పిన విషయాలన్నీ చదువుతుంటే ఆవిడ ముందు చూపు, నీ క్షేమం కోరుకునే హృదయం కనిపించాయి.. వారి ఆలోచనకీ, మన ఆవేశానికీ ఎంత వ్యత్యాసం ఉందో అర్థమైంది.. నువ్వు ధైర్యం చేసి మీ అమ్మమ్మ గారికి అసలు విషయం చెప్పినందుకు సంతోషం వేసింది.. నువ్వు మా గురించి ఏం చెప్తున్నావో కానీ నీ ఉత్తరాల్లో భూషణం గారి దంపతుల్ని మాత్రం మా కళ్ళముందు ఉంచుతున్నావు.. ఈ శ్రీరామనవమికి తప్పక రావడానికి ప్రయత్నిస్తాము.. వాళ్ళని కలుసుకోవాలని చాలా అనిపిస్తోంది..

ఇక ఇక్కడ విషయాలకొస్తే, నా లైఫ్ మొత్తం ఒక్కసారిగా ప్రాజెక్ట్ మయమైపోయింది.. అప్పుడప్పుడూ రిలాక్స్ అవ్వడానికని పాత కవితలూ, రచనలూ చదువుతుంటే 'ఇవి రాసింది నేనేనా' అని అనుమానం వేస్తోంది.. అసలిప్పుడు బుర్రలో ఎలాంటి భావుకత్వం లేదు.. అయినా ఇది కూడా చాలా బావుంది.. మొదట్లో ఆ మాన్యువల్స్ అవీ చదవటం నీరసంగా అనిపించేది కానీ ఇప్పుడు మొత్తంగా అందులోకి మునిగిపోయాను.. మనం చేసిన పనికి సరైన గుర్తింపు వస్తే అసలు ఆ ఆనందాన్ని వర్ణించలేమేమో కదా!

ఇక మేము ఈ శుక్రవారం అంటే 14న తిరుపతి వెళ్తున్నాం.. మామూలుగా జనవరి మొదటివారంలో వెళ్ళేవాళ్ళం.. కానీ ఈసారి నా పూనా ట్రిప్ వల్ల లేట్ అయింది.. అది సరేగానీ నీకు నరసింహం గురించెప్పుడూ చెప్పనేలేదు కదూ! ఇతను తిరుమలలో ఉంటాడు.. ఇందాక నే అన్నానే మానవ సంబంధాలు అనీ, ఆకోవలోకే వస్తుందీ కథ కూడా!

మా పెళ్ళైన వారంలోనే కళ్యాణం కోసమనీ మా కుటుంబమంతా తిరుపతి వెళ్ళాము.. కళ్యాణమూ, దర్శనమూ అయ్యాక

అందరం పూజ వస్తువులూ, దేవుడి పటాలూ కొనడానికని ప్రధాన ద్వారం ఎదురుగా ఉండే కొట్ల దగ్గరికి వెళ్ళాము.. వర్షం రాబోతుంది వెళ్ళాలని నాన్న హెచ్చరిస్తూ ఉంటే అమ్మావాళ్ళు గబగబా బేరాలాడుతున్నారు.. దొరక్క దొరక్క దొరికిన ఆ కాస్త సమయాన్ని ఏకాంతంగా మార్చుకోవడానికీ నేనూ, రాధిక కొంచెం ముందుకు నడిచి ఇంకో కొట్టు ముందు నించుని మాట్లాడుకుంటున్నాము.. అంతలో ఒకేసారి వాన హోరుగా పడటం మొదలుపెట్టింది.. మేము ఆ షాపులోకి జరుగుతూ గమనించాము అందులో ఎవరూ లేరని.. ఒక పక్క షాపు ముందు బుట్టల్లో పెట్టిన వస్తువులు తడిసిపోతుంటే మేమిద్దరం గబగబా అవి లోపలికి చేరేసాము.. అలా ఆఖరి బుట్ట పెట్టేసి మేమూ కాస్త లోపలికి సర్దుకుంటుంటే ఒకతను అలా వానలో తడుస్తూనే పరిగెత్తుకుంటూ వచ్చాడు.. మేమవన్నీ లోపల పెట్టడం చూసి తెగ ఇదైపోతూ "అయ్యో ఎంత శ్రమ తీసుకున్నారండీ, మాఆవిడ దగ్గరికి వెళ్ళొస్తున్నా.. కాస్త పైకెళితే మాకింకో షాపు ఉంది. తను అది చూసుకుంటుంది" అని మాకు తుడుచుకోవడానికి టవల్ ఇచ్చాడు.. అలా వాన పూర్తిగా తగ్గుముఖం పట్టేలోపు ఆ కబురూ, ఈ కబురూ చెప్తూ ఎంత దగ్గరైపోయాడంటే మేమెప్పుడు తిరుపతి వెళ్ళినా వాళ్ళింట్లో ఒకపూట భోజనం చేయకుండా వాళ్ళు వదిలిపెట్టరు. నీలానే తెలీకుండానే చాలా ఆత్మీయుడైపోయాడు.. తేడా ఏంటంటే అతన్ని చూశాము నిన్ను చూడలేదు, అదే ప్రత్యక్షంగా!

చూడటం అంటే గుర్తొచ్చింది, మొత్తానికి నీకు పంపడానికి ఫోటో రెడీ అయింది. ఈ ఉత్తరంతోనే పంపుతున్నాను.. చూసి మామీద నీ అమూల్యమైన అభిప్రాయాన్ని తెలియజేయి.
అందరినీ అడిగినట్లు చెప్పు..
ఉంటాను
వంశీ

***   ***   ***   ***

ఫిబ్రవరి 23, 1986
మాజేరు

ప్రియ మిత్రమా,
అందరూ బావున్నారు కదూ! మీ తిరుపతి ప్రయాణం ఎలా జరిగింది? మీరు నరసింహం గారి గురించి చెప్పింది వింటుంటే ఎక్కడెక్కడి వాళ్ళం ఎలా దగ్గరైపోతాం కదా అనిపించింది!

శివరాత్రి దాటినా ఇంకా చలెందుకో ఊరు విడిచి వెళ్లనంటోంది.. ఉన్నట్టుండి వీస్తున్న గాలికి బాదం చెట్టు ఆకులు గలగలమంటున్నాయి.. మీకు ఉత్తరం రాద్దామని పెన్నూ, పేపర్లూ తెచ్చుకుని అంతలో ఎదురుగా ఉన్న మీ ఫామిలీ ఫోటోని చూస్తూ చుట్టూ చీకటి ఎప్పుడు పరుచుకుందో గమనించనే లేదు.. ఇంకా నమ్మశక్యంగా లేదు మిమ్మల్ని చూస్తున్నానని, అదే లేండి మీ ఫోటోని. ముందుగా రాధిక గారికి ధన్యవాదాలు చెప్పాలి ఇంత శ్రమ తీసుకుని కేవలం నాకోసమని స్పెషల్ గా ఫోటో తీయించుకునేలా చేసినందుకు! నిశితంగా చూస్తున్న మీరు, అందంగా నవ్వుతున్న రాధిక గారు, మీ మధ్యలో అమాయకంగా పిల్లలు.. ఎంత బావున్నారో అందరూ! అయినా మాస్టారూ నేను మిమ్మల్ని ఊహించుకున్నట్లు అస్సల్లేరు తెలుసా! ఎలా ఊహించుకున్నానంటారా? బూరెల బుగ్గలు, బుంగ మీసాలు, భారీ కాయం.. ఇలా! చాలా నిరుత్సాహపరిచేశారండి..

సరదాగా అంటున్నా కానీ ఇంక ఆ పళ్ళు కొరకడం మానేయండి మహానుభావా.. ఇంట్లోనే తీయించుకున్నట్లున్నారు కదా ఫోటోని, పూలమొక్కలు చాలా బావున్నాయి.. నిజంగా రాధిక గారి ఓపికకి మెచ్చుకోవాలి.. 'అదేమిటి? రాధికే మొక్కల్ని చూస్తుందని అంత ఖచ్చితంగా ఎలా చెప్పావు' అనుకుంటున్నారా? అవి అంత అందంగా ఉన్నాయి అంటే ఖచ్చితంగా రాధికగారి పనితనమే అయ్యుంటుంది.

ఇవాళ ఆదివారమైనా కొంతమంది పిల్లలకి ట్యూషన్ చెప్పడానికి వెళ్ళాను.. ఆగండి, ఇదేదో అదనపు సంపాదన కోసం అని అపార్థం చేసుకోకండి.. ఈ సంగతి పోయిన లెటర్ లోనే రాద్దామనుకున్నా కానీ కుదరలేదు.. ఒకరోజు సులోచన గారికి వంట్లో బాగుండకపోతే పలుకరించడానికి వెళ్తే ఆవిడకి మందులు తెచ్చిస్తూ వికాస్ కనిపించారు.. అతను మంచి నీళ్ళిచ్చి టాబ్లెట్ వేయించి అటు వెళ్ళగానే ఆవిడ "తెల్సు కదా స్కూల్లో ఇన్స్పెక్షన్ ఉందని.. ఇంక ఆయనకేమో ఇంట్లో ఉండడానికి కుదరలేదు.. ఏ జన్మ బంధమో ఈ అబ్బాయి ఎంతో శ్రద్ధగా చూసుకుంటున్నాడు" అన్నారు. వెంటనే నేను "అదేంటి అతను మీ బంధువులబ్బాయి కాదా!? బాబాయి గారిని 'మామయ్యా' అని పిలుస్తారు కదా!" అనడిగాను.

"లేదమ్మా, మామధ్య ఏ చుట్టరికం లేదు. మేమీ ఊరుకి వస్తున్నప్పుడు మీ బాబాయి స్నేహితులొకరు వికాస్ వివరాలు చెప్పి, అతను ఇక్కడ కావాల్సిన ఏర్పాట్లుఅవీ చూసుకుంటాడని చెప్పారు.. అన్న విధంగానే మేము ఇక్కడ సెటిల్ అవ్వడంలో చాలా సహాయం చేశాడు.. ఆ క్రమంలో మాకు బాగా దగ్గరైపోయాడు.. అసలైతే తన చిన్నప్పుడే తల్లితండ్రులు చనిపోతే ఇంటర్ వరకూ మేనమామ దగ్గరే పెరిగాడంట.. కానీ వాళ్ళు ఇతన్ని సరిగ్గా చూసేవాళ్ళు కాదనుకుంటా, డిగ్రీకొస్తూనే బయటకొచ్చేసి పార్ట్ టైమ్ చేసుకుంటూ ఎమ్మెస్సీ చేశాడు.. ఇప్పుడు మన బందరు నోబుల్ కాలేజ్ లో మ్యాథ్స్ లెక్చరర్ గా చేస్తున్నాడు" నమ్మలేకపోయాను క్షణం సేపు! ఫోటోలు తీస్తూ, గారడీలు చేస్తూ, అల్లర్లలో దెబ్బలు తినే వ్యక్తి లెక్చరరా!!

నా ఆశ్చర్యాన్ని గమనించినట్లున్నారు, సులోచనగారే మళ్ళీ "వాడు స్టూడెంట్ గా ఉన్నప్పుడు విద్యార్థి సంఘాల్లో చురుకుగా పాల్గొనేవాడంట.. అదే ధోరణి ఇప్పుడూ ఉన్నా ప్రస్తుతం స్టూడెంట్‌గా కాకుండా ఒక పౌరుడిగా అన్యాయం జరిగినప్పుడల్లా అడ్డుపడుతుంటాడు.. అదే కాదు ఎవరికి అని చూడకుండా అవతలివాళ్ళు కాస్త కష్టంలో ఉన్నా సరే డబ్బు ఖర్చుపెట్టేస్తుంటాడు.. మొన్నెవరో బస్సులో స్పృహ తప్పిపడిపోయారని అతన్ని హాస్పిటల్ లో చేర్పించడమే కాదు వాళ్ళు అప్పటికప్పుడు ఎక్కించిన గ్లూకోజ్ ఖర్చు తనే పెట్టుకుని, నీరసంగా ఉన్నాడని పళ్ళు కొని ఇచ్చాడంట.. ఇలాంటివన్నీ ఒక ఎత్తైతే అనాథ శరణాలయం ఇంకో ఎత్తు!" అంటుండగానే నేను విభ్రాంతిగా "అనాథ శరణాలయమా!!" అన్నా.

ఆవిడ "అధికారికంగా ఇతను నిర్వహించక పోయినా అందులో ఉండే పిల్లల బాగోగులు మాత్రం చూసేది ఇతనే! కాలేజీ కి దగ్గర్లోనే ఉంటుంది ఇక అతని నిద్ర అక్కడే! నలభై వరకూ ఉంటారు పిల్లలు.. అన్నిరకాల వాళ్ళు.. అంతా బాగున్న పిల్లలు, పోలియో బారిన పడినవాళ్ళు, చెవిటి, మూగ, ఇలా అన్నిరకాల వాళ్ళు.. వాళ్ళ చదువు సంధ్యలు, భోజన సదుపాయాలు, అనారోగ్యాలు ఇలా అన్నిటిలో పాలుపంచుకుంటాడు.. తన జీతంలో ఎక్కువ భాగం అక్కడే ఖర్చుపెడతానుకుంటా మీబాబాయి అప్పుడప్పుడూ హెచ్చరిస్తూ ఉంటారు గొడవల్లో తిరిగి ఉద్యోగం పోగొట్టుకుంటే ఇలాంటివన్నీ చేయలేవని!"

"అయ్యో ఇప్పుడేమైందనీ కళ్ళల్లో ఆ నీళ్ళు!" ఆవిడ ఆశ్చర్యంగా నన్ను తట్టి ప్రశ్నించేవరకూ నాకే తెలీదు నాకళ్ళు తడిబారాయని.. కారణం ఏముందసలు! నేను ఎప్పుడో చేయాలనుకున్న పనిని ఒక వ్యక్తి అప్పటికే చేసేస్తున్నందుకా!? తెలీదు.. కానీ ఘనీభవించిన మనసులో ఏదో కదలిక!

భూషణం గారు ఆదివారాలు ఆ అనాథ శరణాలయానికి వెళ్ళి పాఠాలు చెప్తారని విని నేనూ వస్తానని చెప్పాను.. ఒక్క పాఠాలే కాదు ఇంకే విషయంలో అయినా సహాయం కావాలంటే చేస్తానని చెప్పాను.. అలా పిల్లలకి ఏమైనా వండి తీసుకెళ్ళడం, పెన్సిళ్ళు, పెన్నులు లాంటివి కొనడం చేస్తున్నాను.. కానీ ఈ హడావిడిలో మిమ్మల్ని మరచిపోయానని మాత్రం అనుకోవద్దు.. మీ ఆలోచనలు ఎప్పుడూ నన్ను పలుకరిస్తూనే ఉంటాయి.

ఇంకో ముఖ్యమైన సంగతి, మన మాధురికి పెళ్ళి కుదిరింది, రేపు మార్చ్ మూడున!! ఇంత ఆనందమైన విషయం ఇప్పుడా చెప్పేదని నన్ను ఉరిమి చూడకండి.. అంతా నిమిషాల మీద జరిగిపోయింది.. పెళ్ళికొడుకు తన కలల రాకుమారుడే, రాజారావు.. మీకో విషయం తెలుసా, అతనే మాధురి వాళ్ళ నాన్న గారితో డైరెక్ట్ గా మాట్లడాడంట! కంటికి నదురుగా ఉంటాడు, కలుపుగోలుతనం, పైగా ఒకే కులం.. అవుననక ఏం చేస్తారు చెప్పండి! ఇక వాళ్ళ తల్లితండ్రులు మాధురిని చూడటం, ముహూర్తాలూ, ప్రధానాలు క్షణాల్లో జరిగిపోయాయి.. మాధురి అయితే కాబోయే భర్త నైపుణ్యానికి తెగ సంబర పడిపోతుంది!

వాళ్ళ నాన్న ఒప్పుకున్న రోజైతే ఎంత సంతోషంగా పరిగెత్తుకొచ్చిందో! ఆ వార్త విని నాలో ఎలాంటి సంతోషం కనిపించకపోతే తన మొహం చిన్నబోయింది పాపం.. నా పక్కన కూర్చుని నెమ్మదిగా "నాకున్న ఏకైక స్నేహితురాలివి నువ్వు.. నువ్విలా ముభావంగా ఉంటే నాకెలా సంతోషంగా ఉంటుంది చెప్పు" అని అడుగుతుంటే చాలా జాలేసింది.

ఇక ఊరుకోలేక నాకు రాజారావు పట్ల ఉన్న అయిష్టాన్ని చెప్పి "నీ పెళ్ళంటే నాకెందుకు సంతోషం ఉండదు చెప్పు, కానీ ఆ రాజారావుతో అంటేనే ఎందుకో మనసు ఒప్పుకోవడంలేదు" అన్నాను..

"కానీ అతనికి నేనంటే విపరీతమైన ఇష్టమే.. నన్ను చూడందే ఉండలేడు.. నాక్కూడా నా చుట్టూ కేవలం నా చుట్టూ తిరిగే భర్తే కావాలి.. నా జీవితాన్ని మా అమ్మలా వేరొకరితో పంచుకునే దురదృష్టాన్ని కల్లోనైనా ఊహించలేను" అని తన వైపు వాదన చెప్తుంటే నేను ఆవేశంగా "అంటే మీ అమ్మ జీవితం అలా అయిందని నీ జీవితంలో కూడా అలానే జరుగుతుందా!?" ప్రశ్నించాను.

తను చిన్నగా నవ్వుతూ "ఆప్రశ్న ముందు నీకు నువ్వే వేసుకోవాలి కార్తీకా" అంది.. అప్పుడుగానీ నాకర్థంకాలేదు నేను ఏవాదనని నా మనసుకి బలంగా వినిపిస్తూ వస్తున్నానో దాన్ని నేనే ప్రశ్నించానని!!

వెంటనే బింకంగా "నేను పెళ్ళి చేసుకోనసేది కేవలం మా అమ్మానాన్న ని చూసి కాదు.. ఇంకా ఎంతో మందిని చూసి.. ఉదాహరణకి మన రోహిణి, వసంత!" అని సమాధానం చెప్పాను..

"అలా అయితే నేనూ ఇస్తాను ఉదాహరణలు.. వంశీ గారి దంపతులు, భూషణం గారి దంపతులు! విఫలమైన వివాహాలకి నువ్వెన్ని ఉదారణలు ఇస్తే సఫలమైనవాటికి నేనూ అన్నే ఇవ్వగలను.. రాజారావు మంచివాడు, నన్ను బాగా చూసుకోగలడు అన్న నమ్మకంతో ఈ బంధంలోకి అడుగుపెట్టబోతున్నాను.. తర్వాత సఫలమౌతుందో లేక విచ్ఛిన్నమౌతుందో కాలమే చేప్తుంది" మాధురి అలా చెప్తూ ఉంటే నేను ఆశ్చర్యంగా తనవంకే చూస్తుండిపోయాను.. ఉన్నట్టుండి అదెంతో ఎదిగిపోయిన భావన.. తనన్న ఏమాటనీ ఖండించలేక తన చేతిని తీసుకుంటూ "నీ సంతోషమే నాది కూడా.. సరేనా!" అన్నాను.. నిజంగా ఎంత సంబరపడిందనీ!! నాక్కూడా నేనే అనవసరంగా రాజారావుని అపార్థం చేసుకున్నాననిపించింది.. అసలు అతన్ని నేనేమాత్రం ఎరుగుదునని ఇలా అయిష్టత ఏర్పరచుకున్నాను అనిపించింది. మరి మీక్కూడా శుభలేఖ పంపుతానని మాధురి అంది.. మీ దంపతుల దీవెనలు దానికి తప్పకుండా అందిస్తారు కదూ!

ఏమిటో ఈ మధ్య పనులెక్కువై పోయి ప్రకృతితో మాటలు తగ్గిపోయాయి.. నామీద అలిగినట్లు చెట్లన్ని మౌనంగా ఆకులు రాల్చేస్తున్నాయి.. అయినా వెన్నెల నించి ఒక కిరణం పారిపోయొచ్చి నా మనసులోకి దూసుకెళ్ళినట్లు అదో రకం ఉత్తేజం! మనకిష్టమైన పనులు చేస్తున్నప్పుడుండే ఉత్సాహం !!

అమ్మమ్మ ఆగకుండా పిలుస్తోంది భోజనం చేయడానికి రమ్మనమని.. 'ఇదిగో వస్తున్నా' అని ఇప్పటికి ఓ పదిసార్లు చెప్పానేమో! అయినా నా పని అవ్వగానే నేను పెట్టుకుని తింటానుగా! ఇలా అనుకుంటుంటే వికాస్ గుర్తొస్తున్నారు.. తను అన్నం తిన్నారో లేదో! అతనికి ఒకటా రెండా పనులు! వాటిల్లో పడి భోజనం సంగతే మర్చిపోతారేమో.. తనకెవరు ఇలా ఇలా పిలిచి పిలిచి అన్నం పెడతారు.. అయినా ఉన్నట్టుండి అతని ఆలోచనేమిటీ, చిత్రంగా!! సరే మరి అమ్మమ్మ ఇంకోసారి అరిచేలోగా అదే పిలిచేలోగా వెళ్ళాలి.

ప్రస్తుతానికి సెలవా మరి.
కార్తీక

***    ***    ***    ***

మార్చ్ 13, 1986

హైదరాబాదు

మంచమ్మాయి కార్తీకకి,
అంతా క్షేమమే కదా! ఏంటీ ఒకేసారి 'మంచమ్మాయి' అని బిరుదు ఇచ్చేశానని అనుకుంటున్నావా?

పోయినసారి నువ్వు చెప్పిన విషయాలు చదివి ఆ నిర్ణయానికి వచ్చేశాను. అది సరేగానీ నిన్న రాత్రి నాకు మీ ఊరి గురించి ఓ కల వచ్చింది తెలుసా!

చుట్టూ పచ్చని పొలాలు.. అందులో పని చేస్తున్న పల్లె పడుచులు.. పచ్చిక బయళ్ళలో గడ్డి మేస్తున్న పశువులు.. వాటికి దగ్గర్లోనే గోళీలాటాడుతున్న కాపరులు.. కనుచూపు మేరలో కనిపిస్తున్న పొదరిళ్ళ లాంటి తాటాకు ఇళ్ళు.. ఉన్నట్టుండి ఎక్కడి నించో బస్సు హారన్ మోత.. ఆ బస్సు కంటే తనే ముందు స్టాప్ దగ్గరికి చేరుకోవాలని ఒకమ్మాయి అప్పుడే ఇంట్లోంచి బయటకొచ్చి ఇంచుమించు పరిగెడుతున్నట్టు నడుస్తోంది.. ఆ అమ్మాయి ఎలా ఉందంటే... షిఫాన్ చీర, స్టైల్ గా దువ్వి ముడి పెట్టిన జుట్టు, నుదుటిన చీర కలర్ ప్లాస్టిక్ బొట్టు, ఎత్తుమడమల చెప్పులు, భుజానికి హాండ్ బ్యాగ్, చేతిలో పడని ఎండకి అడ్డుగా పట్టుకున్న పువ్వుల గొడుగు.. హడావిడిగా నడుస్తుండటంతో రాయి తగిలి ఎత్తుమడమ చెప్పు కాస్త బెదిరి, ఆమె కాస్త అదిరి, గొడుగు పక్కకి చెదిరి తన ముఖం కనిపించింది.. అంతే నాకు ఠక్కున మెలకువ వచ్చింది.. దిగ్గున లేచి కాలెండర్ చూశాను, ఇంకా మనం 1986 లోనే ఉన్నాము.. అప్పుడర్థమైంది అది కలని!! కాకపోతే దడతో గ్లాసు నీళ్ళు ఆపకుండా తాగాననుకో!

అవును, ఆ షిఫాన్ చీర యువరాణి గారు తమరేనండి.. పొద్దున్న లేవగానే రాధికకి ఈ కల గురించి చెప్పగానే 10 నిమిషాల వరకూ ఆపకుండా నవ్వుతూనే ఉంది.. "ఎలా ఉండే కార్తీకని ఎలా మార్చేశారండీ" అని ఒకటే దెప్పిపొడుపు! అయినా నా కల మీద నాకేం అధికారం ఉంది చెప్పు! ఇంకా చెప్పాలంటే కేవలం నువ్వు చేసిన పనుల వల్లే నువ్వలా రూపాంతరం చెందావు!!

లేకపోతే మాధురి పెళ్ళి సంగతి నీకంటే ముందు తను పంపిన వెడ్డింగ్ కార్డ్ చెప్పింది.. మొత్తానికి మాధురి ప్రేమ కథ సుఖాంతమైనందుకు నాకు సంతోషంగా ఉంది.. ఇంతకీ పెళ్ళి ఎలా జరిగింది? ఆ విశేషాలతో నీ దగ్గరనుంచి ఓ పేద్ద ఉత్తరం వస్తుందని చూస్తున్నాను.. నాకు తెలుసు ఉత్తరం బాకీ ఉంది నేనని! ఏదో నాకు కుదరక నేను రాయలేదనుకో.. నువ్వైనా ఇన్ని రోజులైందని కంగారు పడుతూనో లేక మండిపడుతూనో రాయొచ్చు కదా!

అంటే నువ్వు చాలా ఖాళీగా ఉన్నావని నా ఉద్దేశ్యం కాదు.. ఏదో నీ చేత నా బాధ్యతని గుర్తు చేయించుకుందామనే సరదా! అసలైతే పోయిన ఆదివారం పొద్దున్నే లేస్తూనే రాధికకి చెప్పాను "ఇవాళ ఖచ్చితంగా కార్తీకకి ఉత్తరం రాస్తానని".. కానీ సాయంత్రం మా రాజా గాడు మా గాంగ్ తో వచ్చి వచ్చి సినిమాకెళ్దామని గొడవ చేస్తే వెళ్ళక తప్పింది కాదు.. హిందీ సినిమా 'ఇల్జామ్' కి వెళ్ళాము.. కొత్త కుర్రాడు గోవిందా డ్యాన్సులకి ఒకసారి చూడచ్చనుకో! అదీగాక ఫ్రెండ్స్ తో చూస్తే అదొక ఉత్సాహం.. ఇక నిన్న రాత్రి కల వచ్చాక అది చెప్పడానికైనా రాయాలని, ఇవాళ ఇంటికి రాగానే రాధిక చేతి టీ నీళ్ళు సేవించి మొదలుపెట్టాను.

ఇంకో సంగతి ఏంటంటే, ఈ వికాస్ ఎవరో గానీ చాలా ఇంటరెస్టింగ్ గా ఉన్నాడు.. మన లాగా ఏవేవో చేయాలీ చేయాలీ అనుకుంటూ కూర్చోక అనుకున్నది సైలెంట్‌గా చేసుకెళ్ళిపోయే మనస్తత్వంలా ఉంది.. కేవలం నీ ఉత్తరాలతోనే అతను నాకు

మంచి స్నేహితుడైన భావన కలుగుతోంది.. నేను అడిగినట్లు తప్పకుండా చెప్పు.

ఒక ముఖ్య విషయం నీకు చెప్పాలి.. పోయిన సంవత్సరం జరిగిన 'కనిష్క' విమాన ప్రమాదం గుర్తుంది కదా.. 329 మందిని ఒకేసారి పొట్టనపెట్టుకున్న తీవ్రవాద చర్య!! ఇంకో విషయం తెలుసా, అందులో 82 మంది ముక్కుపచ్చలారని పిల్లలేనంట!! ప్రభుత్వాన్ని సాధించడం కోసం ఏ పాపం ఎరుగని సామాన్య ప్రజల్ని పొట్టన బెట్టుకునే అసహ్యకరమైన వాదం ఈ తీవ్రవాదం.. దీని గురించి మన లాంటి మామూలు మనుషుల్లో ఎలాంటి అవగాహనా లేదు.. మా ఆఫీసులో పనిచేసేవాళ్ళలో కొంతమందిమి కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడి కాలేజీ ఫంక్షన్లు, సాహితీ సదస్సులు మొదలైనవాటిలో ఈ తీవ్రవాదం గురించి మరింత అవగాహన కలిగించడం గురించి సెమినార్లు ఇద్దామని నిర్ణయించుకున్నాము.

రాధిక 'మీకెందుకివన్నీ.. ప్రభుత్వం చూసుకుంటుంది గా" అంటుంది.. తను అలా అడ్డు చెప్పడానికి కారణం భయం అనుకుంటా! కానీ నిన్న విమానం కూల్చారు.. రేపు ఎన్నో వందలమంది ప్రయాణించే రైళ్ళు అవ్వొచ్చు.. మనం ప్రయాణం చేసేప్పుడు పక్కన ఉన్నవాళ్ళు ఎలాంటివారో గమనించడం తప్పుకాదేమో.. అలాంటి పరిశీలన, జాగ్రత్తల గురించి చెప్పడమే మా గ్రూప్ ముఖ్యోద్దేశ్యం.

మరి ఇవాళ్టికి ముగిస్తాను.. పిల్లల కబుర్లు విని పుస్తకం పట్టుకోవాలి.. అలా జాలిపడకులే! ప్రస్తుతం నేను చదువుతున్నది మన తిమ్మన గారి 'పారిజాతాపహరణం'.. పారిజాతపుష్పం రుక్మిణికి ఇచ్చిన సంగతి విని సత్యాదేవి మౌనంగా, ఆభరణాలన్నీ తీసేసి, మాసిన చీర కట్టుకుని కోప గృహానికి వెళ్ళింది.. మరి అల్లరి కృష్ణయ్య ఆమెను ప్రసన్నం చేసుకునే విధానం ఎప్పుడెప్పుడు చదువుదామా అని ఉంది.

నేను ఆలస్యం చేశానన్న సంగతి మనసులో పెట్టుకోకుండా ఎప్పటిలా నీ విశేషాలన్నీ చెప్తూ వెంటనే ఉత్తరం రాయి.
**వంశీ**

*** *** *** ***

మార్చ్ 23, 1986
**మాజేరు**

**వంశీ గారు,**
ఎలా ఉన్నారు? మీరు నామీద ఇంత పెద్ద ఎత్తున కినుక వహిస్తారనుకోలేదు సుమా! ఉత్తరం కాస్త ఆలస్యం అయినందుకు నాకు ముడి పెట్టేసి, హైహీల్స్ వేసేసారు! అసలు చెప్పాలంటే ఎప్పటికప్పుడు ఠంచనుగా జవాబు రాసేసి చేతులు దులుపుకున్నదానికంటే ఆలస్యమైనకొద్దీ మీకు ఉత్తరం రాయాలీ రాయాలీ అన్న ఆత్రుతతోనే మిమ్మల్ని ఎక్కువ గుర్తు పెట్టుకుంటున్నాను.. నిజ్జం.. నమ్మండి! మొన్న మీ ఉత్తరం రాగానే అనుకున్నాను, ఈ ఆదివారం తప్పకుండా రాయాలని.. ఇంకా ఆదివారం పూర్తిగా మొదలవ్వనేలేదు మీకు బోల్డు విశేషాలు చెప్పాలనే ఉత్సాహంలో తొందరగా మెలకువ వచ్చేసింది.

తెల్లరువారుఝాము ఐదుగంటలైంది.. తెల్లవారబోతుందనడానికి సూచనగా వెలుగురేఖొకటి తూర్పునించి దూసుకొస్తోంది.. నిద్ర లేస్తున్న పక్షుల కిలకిలలు మంద్రంగా.. ఇంటిముందు మా సుబ్బులు చల్లుతున్న కళ్ళాపి చప్పుడు.. ఉండుండి వినబడుతున్న గుడిలో గంటలు.. ఇవన్నీ కలిసి వింటుంటే ఎవరో నిష్ణాతుడైన సంగీత విద్వాంసుడు పలికిస్తున్న రాగంలా వినిపిస్తోంది.. చెట్లన్నీ ఆకులు రాల్చేసి కొత్త చిగురు కోసం ఆయత్తమౌతున్నాయి.. శిశిరంలో ప్రకృతి వసంతం కోసం ఎదురుచూస్తున్న విరహిణిలా అనిపిస్తోంది.. ఇది స్తబ్ధత కాదు, అద్భుతం కోసం ఎదురు చూస్తున్న నిశ్శబ్దత!

నేనూ, మా సుబ్బులూ అప్పుడే ఒక కప్పు కాఫీ కానిచ్చేసాము.. దానికి నేనే అలవాటు చేశాను ఫిల్టరు కాఫీ.. మీకో విషయం తెలుసా, అది అచ్చం ఎంకిలా ఉంటుంది నాకు.. **''నీలి సీరాగట్టి నీటుగొస్తావుంటే.. వానలచ్చిమనిపించు నా ఎంకీ''** అని ఎప్పుడూ దాన్ని ఆటపట్టిస్తూ ఉంటాను.. అది గనక రాకపోతే మా ఇంట్లో ఏ పనీ కదలదు.. మొన్న మాధురి పెళ్ళికి వారం రోజుల పాటు దీనికి ఒకటే ఎడతెగని పనులు.. పాపం 2,3 రోజులు వళ్ళు బాలేక రాలేకపోయింది.. అప్పుడు చూడాలి మా అమ్మమ్మ సణుగుడు!

మాధురి పెళ్ళి గురించి నా కంటే ముందు అది పంపిన వెడ్డింగ్ కార్డ్ చెప్పిందంటే నాకు సంతోషమే కదా.. ఆ శుభవార్త తను చెప్తేనే బావుంటుంది.. ఏంటీ నా బద్దకానికి అందమైన ముసుగేస్తున్నాననుకుంటున్నారా! అలా అపార్ధాలు చేసుకుంటే అస్సలు బావోదు.. మరి మీ ఇష్టం.. మీరు పంపిన పెళ్ళికానుక రాధా కృష్ణుల పెయింటింగ్ దానికి చాలా నచ్చింది.. ఈ హడావిడి తగ్గగానే మీకు ఫోన్ చేస్తానని చెప్పింది..

పెళ్ళి మాత్రం చాలా వైభవంగా బాగా జరిగిందండి.. పెళ్ళి కార్డులు, మంటపం, భోజనాలు.. ఆడపెళ్ళివారివీ, మగ పెళ్ళివారివీ కలిపి రాజారావే దగ్గరుండి ఆర్డర్ చేశాడు.. ఓ సారీ.. సారీ.. ఇప్పుడతను మాధురి భర్త కదా, గౌరవం ఇవ్వాలి.. చేశారు! మాధురి అయితే మిమ్మల్ని పిలిచినట్లే భూషణం దంపతులనీ, వికాస్ గారినీ కూడా స్వయానా వెళ్ళి ఆహ్వానించింది.. నాతో ఓ రెండు సార్లు శరణాలయానికి వచ్చింది లేండి.. అలా అక్కడ వికాస్ కూడా పరిచయమయ్యారు.. అతను నాతో ఎందుకో అంత కలివిడిగా మాట్లాడరు కానీ మాధురితో బానే మాట్లాడతారు.. అదేమాట దానితో అంటే ''నీ మొహం.. ముందు నువ్వు బిగదీసుకుని కూర్చోక ఫ్రీగా మాట్లాడు'' అంది! నేను ఉక్రోషంగా అనుకున్నా ''అవసరమైనవి మాట్లాడుతుంటేనే ఎప్పుడు వదుల్తుందా అన్నట్టు నుంచుంటారు, ఇక ఫ్రీ గా ఏం మాట్లాడేది!?'' అని.

''ఏదో టైమ్ కొచ్చి పెళ్ళి భోజనం చేసివెళ్ళి పోవటం కాదు.. ఆ రోజు పొద్దున్నా, సాయంత్రం, మర్నాడు కూడా మా ఇంట్లోనే మీ భోజనాలు'' అని వికాస్‌కి మరీ మరీ చెప్పింది.. ఆశ్చర్యంగా అతను పెళ్ళి రోజు ఉదయామే వచ్చేశారు.. భోజనానికి కాదు, పెళ్ళిపనులలో సహాయం చేయడం కోసం!! మాధురి స్వంత తోబుట్టువులా అన్ని పనులూ చక్కబెట్టారు.. మాధురి వాళ్ళ నాన్న గారికి డబ్బు వ్యవహారాలు తప్ప ఇలా దగ్గరుండి పని చేయించడం అసలు చేతకాదనుకుంటా ఎవరొచ్చి ఏమడిగినా వికాస్‌నే పిలిచారు.. అతను కూడా ఏదో వంద పెళ్ళిళ్ళు చేసిన అనుభవం ఉన్నట్లు క్షణాల్లో పనిని చక్కబెట్టేశారు.

ఇక మా అమ్మమ్మ అయితే "ఏ పెళ్ళికీ రావు.. నీ స్నేహితురాలి పెళ్ళి కదా చక్కగా అలంకరించుకో" అని ఉన్న నగలన్నిటినీ నా మీద గుమ్మరించింది.. మాధురి, ఇంక పెళ్ళికొచ్చిన వాళ్ళంతా "నువ్వే పెళ్ళికూతురిలా కళకళలాడిపోతున్నావు" అన్నారు గానీ నాకైతే కాంక్రీట్ తో కప్పేసినట్లు అస్సలు గాలాడలేదు.. పెళ్ళేమో తెల్లవారుఝామున.. ముందు రోజు రాత్రి భోజనాలు అవ్వగానే "ఇంటికెళ్ళి ఒక గంట పడుకుని వస్తానని" మాధురితో చెప్పి ఇంటికొచ్చి గబగబా వాటన్నిటినీ తీసేయగానే ఎంత హాయిగా అనిపించిందనీ!! అలానే తలలో అమ్మమ్మ పెట్టిన గంపెడు మల్లెపూలు తీసేసి ఒక చిన్న దండ పెట్టుకుని, బట్టలు మార్చుకుని అలానే పడుకుండిపోయాను.

ఉన్నట్టుండి మెలకువ వచ్చింది.. మాధురికి అలంకరణ చేయాలి, లేచిందేమో చూద్దామని వాళ్ళిటికి వెళ్ళాను.. అక్కడ పెట్రోమాక్స్ లైట్ల వెలుగులో మంటపానికి అప్పుడే వచ్చిన పువ్వులతో డెకరేషన్ చేయిస్తున్నారు వికాస్! ‘ఇతనికసలు విశ్రాంతంటే పడదా‘ అనిపించిందో క్షణం.. ఆ మంటపం డిజైన్ని విజయవాడ కి చెందిన ఏదో డెకరేషన్ పార్టీకి రాజారావు స్వయంగా ఇచ్చారు.. సెలెక్ట్ చేసిన అతను గానీ, పని చేయించాల్సిన పెళ్ళికూతురి బంధువులు గానీ అక్కడెవరూ లేరు.. ‘పెళ్ళికొచ్చి నాలుగక్షింతలు వేసెళ్ళిపోక మీకెందుకీ శ్రమంతా!’ అని చిన్నగా కోప్పడుతూ అతని నుదుట అలుముకున్న చెమటని అద్దాలనిపించింది.. అప్రయత్నంగానే అతని వైపు నడిచి "ఏమన్నా సహాయం కావాలా?" అని అడిగాను.

వెంటనే నా వైపు చూసి "అహా.. ఏమక్కర్లేదండి" అని అటువైపు తిరిగి అంతలోనే ఏమనుకున్నారో "శ్రమ అనుకోకపోతే ఓ కప్పు కాఫీ ఇప్పించగలరా?" అనడిగారు.. నిజంగా మిత్రమా, నేను జీవితంలో ఎప్పుడూ కాఫీ అంత శ్రద్ధగా పెట్టలేదు.. ఎందుకో చేతులు వణికాయి.. పాలు కొద్దిగా చిందాయి.. రెండు చేతుల్తో కప్పుని అతి భద్రంగా అతనికిస్తుంటే **"అసలే అనదు చూపు.. ఆపై ఈ కన్నీరొకటి.."** అన్న శబరి భావోద్వేగం మనసుకి చేరిన క్షణమది!

అతను కాఫీ తాగుతూ "అబ్బా, ప్రాణం లేచొచ్చిందండీ" అని ఆహ్లాదంగా నవ్వాడు.. ఉన్నట్టుండి చుట్టూ రాత్రి చల్లదనం ఇంకాస్త పెరిగినట్లనిపించింది.. "పాపం పట్టుచీర, నగలతో చాలా ఇబ్బంది పడినట్లున్నారు.. ఏ అలంకరణ లేకుండా ఇలానే చక్కగా ఉన్నారు" గుండె ఒక క్షణం ఆగి కొట్టుకోవడం మొదలుపెట్టింది.. నా అవస్థో, ఆనందమో అతను గమనిస్తున్నాడన్న ఆలోచన ఎందుకో చాలా సంతోషాన్నిచ్చింది.. ఎవ్వరికీ కనబడని వెన్నెల కిరణమొకటి నిశ్శబ్దంగా మనసులో చోటు చేసుకోవడం అర్థమౌతూనే ఉంది! అప్పుడు నెమ్మదిగా నవ్వేసి అక్కడనించి వచ్చేసినా మా ఇద్దరి మధ్య జరిగిన ఆ కాస్త సంభాషణ తాలూకు భావతరంగాలు నెమ్మదించడానికి కాస్త సమయం పట్టింది.

మాధురి చాలా సంతోషంగా ఉంది.. ఆ దంపతులు ప్రస్తుతం గుళ్ళూ గోపురాలు తిరగడంలో బిజీగా ఉన్నారు.. నేను కూడా మళ్ళీ నా స్కూల్ పరీక్షల ప్రిపరేషన్, శరణాలయం పనులతో బిజీ అయిపోయాను.. అందుకేనేమో నా ప్రాణస్నేహితురాలు నా నించి దూరంగా వెళ్ళబోతుందన్న బాధ అంత తీవ్రంగా అనిపించలేదు!

శరణాలయం పిల్లలు మాత్రం చాలా దగ్గరైపోయారు.. వాళ్ళలో కొత్త ఉత్సాహం కనబడుతోందని పురుషోత్తం గారు అంటున్నారు.. ఆయన శరణాలయం నిర్వహణాధికారి.. ఆయన కాక బజారు పనులకు ఒకతను, వంటకీ శుభ్రత పనులకీ కలిపి ఇద్దరు ఆడవాళ్ళు.. వీళ్ళే మొత్తం సిబ్బంది! వీళ్ళు కూడా ఏదో అసహాయత పరిస్థితిలో ఇక్కడ చేరినవాళ్ళే.. సేవాభావం ఉన్నవాళ్ళే.. ఎవరో ధర్మాత్ముడు పెద్ద మనసుతో మొదలుపెట్టిన ఈ శరణాలయం ఆయన చనిపోయాక వేరే అదనపు ఆదాయం లేక, బాంక్ లో ఉన్న నిధులు సరిపోక పిల్లల మనుగడే ప్రమాదంలో పడింది!

భూషణం గారు అంటారు, 'అసహాయతలో ఉన్నవాళ్ళకి కావాల్సింది తాము ఒంటరి కాదని మనో ధైర్యం ఇచ్చే మనుషులని!'.. అందుకే ఎప్పుడు సమయం ఉన్నా వాళ్ళతో గడుపుతున్నాను.. పాఠాలు చెప్తూ, పాటలు పాడిస్తూ, ఎవరి పనులు వాళ్ళే ఎలా చేసుకోవాలో నేర్పిస్తూ.. అసలు సమయం ఎలా గడిచిపోతుందో తెలీదు! నేనక్కడ ఉన్నంతసేపు సీతాకోకచిలుకల్లా నా చుట్టూనే తిరుగుతుంటారు.. ఒక ఐదుమంది పిల్లలకి ఒకరిని లీడర్ని ఉంచి వాళ్ళ గురించి పట్టించుకునే బాధ్యతని వాళ్ళ పైనుంచాను.. ఆ మాత్రం దానికే తామూ ఏదో సాధించేయగలమనే విశ్వాసం వాళ్ళలో!

అందరిలో ఆరీఫ్ ప్రత్యేకం.. "కార్తక్కా" అంటూ విడవకుండా ఎప్పుడూ నా పక్కనే ఉంటాడు.. పిల్లలందరిలో అతనే పెద్దవాడు.. పన్నెండేళ్ళు.. కళ్ళు కనబడవు! పుట్టు గుడ్డి కాదు, అలానే ఇక్కడి పిల్లల్లా పుట్టుకతోనే అనాధ కాదు.. ఏడేళ్ళు వచ్చేవరకూ తన తల్లితండ్రులతోనే ఉన్నాడంట.. ఏదో యాక్సిడెంట్ లో కళ్ళు పోయాక, నిరుపేదలైన తల్లితండ్రులు జీవితాంతం ఆ గుడ్డి పిల్లవాడి భారం మోసే ధైర్యం లేక ఇక్కడ వదిలేసి వెళ్ళారంట!! అకస్మాత్తుగా జీవితం అంధకారమైందన్న విచారంగానీ, అక్కున చేర్చుకోవాల్సిన తల్లితండ్రులే శరణాలయంలో వదిలేసివెళ్ళారనే దుఃఖం గానీ ఆరీఫ్‌లో ఏ మాత్రం కనబడదు.. అసలెంత ఉత్సాహంగా ఉంటాడనీ! ఇంకో అద్భుతమైన విషయం చెప్పనా, వాడు చక్కగా బొమ్మలు గీస్తాడు.. ఊహ తెలిసేప్పటికే ప్రపంచాన్ని చూసాడేమో చాలామట్టుకు వస్తువుల రంగులు, రూపాలు మస్తిష్కంలో బాగా గుర్తుండిపోయాయి.. ఏదన్నా వస్తువు ఇస్తే తడిమి తడిమి, చేతి వేళ్ళు గుర్తులుగా వాడుతూ బొమ్మ మొత్తం కంప్లీట్ చేస్తాడు.. ఇందాక నేనన్న అద్భుతం అన్న మాట చాలా చిన్నగా అనిపిస్తుంది కదూ!

పోయిన ఆదివారం నేను అక్కడికి వెళ్ళేసరికే మధ్యాహ్నమైపోయింది.. ఆరీఫ్ వళ్ళెరగని జ్వరంతో పడుకున్నాడు.. వికాస్ వచ్చి అప్పటికే రెండు రోజులైందంట.. ఏ గొడవల్లో తిరుగుతున్నారో ఏమో! ఆ రోజు భూషణం గారు పనుండి రాలేదు.. సమయానికి పురుషోత్తం గారు కూడా లేరు.. వెంటనే మెడికల్ షాపు కెళ్ళి మందులు, బ్రెడ్ తెచ్చాను.. వాళ్ళు చెప్పినట్లే తడిగుడ్డ పెడుతూ, రెండు గంటలకోసారి టెంపరేచర్ చూస్తూ అలా ఆరీఫ్ పక్కనే కూర్చుండిపోయాను.. అంత జ్వరంలోనూ నా చెయ్యి వదలకుండా పడుకున్న వాడిని చూస్తుంటే అక్కడినించి లేచి రాలేక పోయాను.. అక్కడ పనిచేసే ఆదెమ్మ హెచ్చరించేవరకూ చీకటి పడటం, వర్షం మొదలవ్వడం గమనించనేలేదు.. మరుసటి రోజు తప్పకుండా వస్తానని ఆరీఫ్‌కి ప్రామిస్ చేసి, ఆ రాత్రికి వేయాల్సిన మందుల గురించి ఆదెమ్మకి చెప్పి హడవిడిగా గేటు దాటుతుంటే స్కూటర్ మీద లోపలికొస్తూ కనిపించారు వికాస్!

నేను గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోయాను.. మనసులో అమ్మమ్మని తలుచుకుని ఒకటే కంగారు.. ఎప్పుడూ ఇంత ఆలస్యంగా వెళ్ళలేదు ఇంటికి.. ఇప్పుడెంత రాద్ధాంతం చేస్తుందోనని ఆందోళనతో బస్టాప్ లో బస్సు కోసం చూస్తుంటే వికాస్ తన స్కూటర్‌ని పక్కనే ఉన్న సందులో పార్క్ చేసి పరిగెత్తుకు రావడం కనిపించింది.. "ఆదెమ్మ చెప్పింది.. మందులు తెచ్చినందుకు థాంక్స్.. బాగా లేట్ అయిపోయింది మీకు" అంటూ ముక్కలు ముక్కలు గా మాట్లాడటం మొదలుపెట్టారు.. జ్వరంతో ఉన్న ఆరిఫ్‌ని వదిలేసివెళ్ళాడని తెలిసినప్పుడు వచ్చిన విసుగు ఎక్కడకెళ్ళి దాక్కుందో తెలీలేదు.. అయినా అతను ఆ సమయంలో లేనిది ఇక్కడ ఆరిఫ్‌కి కాకపోతే ఇంకో ఆరిఫ్‌కి సహాయం చేయడానికే అయి ఉంటుంది.. నేనలా నా మనసుకి ఎందుకు సమాధానం చెప్పుకుంటున్నానో అర్థం కాలేదు.. ఆరోజు నాతో బాటే బస్సులో వచ్చి, నా వెనకే ఎక్కడో నడుస్తూ మా ఇంటికి ఓ పదడుగుల దూరంలో వదిలి వెళ్ళాడు.. నిజం చెప్పొద్దూ ఇంట్లోకి అడుగుపెట్టాక అమ్మమ్మ ఏమేం అందో, ఎంత తిట్టిందో ఏవీ నా చెవిలోకి చేరలేదు.. కడుపు నిండా అన్నం తిని హాయిగా నిద్ర పోయాను.

విశేషాలు చెప్పమన్నారు కదాని ఎక్కడి నించి ఎక్కడికెళ్ళిపోయానో చూడండి! ఇలా నాతో అన్నీ చెప్పించేసే విద్య మీకొక్కరికే తెలుసు!! మీరు కొత్తగా స్టార్ట్ చేసిన గ్రూప్ గురించి వింటుంటే ఇంటరెస్టింగా ఉంది.. చాలా పెద్ద సమస్యనే ఎంచుకున్నారుగా మీ అందరు! గుడ్ లక్ మరి.

అకస్మాత్తుగా కావ్యాలవైపు మళ్ళిందేమిటి మీ దృష్టి? మీరు చెప్పిన సన్నివేశం వింటుంటే శ్రీ కృష్ణ తులాభారంలోని 'ఓ చెలీ కోపమా' అని మన ఎన్ టి ఆర్ గారు జమున ని వేడుకోవడమే గుర్తొస్తుంది.. మీరేమనుకోనంటే నాదో చిన్న కుతూహలం మీకు, రాధిక గారికి మధ్య ఇలాంటి సిట్యుయేషన్ ఎప్పుడన్నా వచ్చిందా? నా పిచ్చిగానీ అంత అన్యోన్యంగా ఉండే మీ మధ్య మాటపట్టింపులు, కలహాలు ఉంటాయా!! అసలు ఈ ప్రశ్న రాధిక గారిని అడిగి ఆవిడ సమాధానం రాయండి.

నేను ఆలస్యంగా రాస్తున్నానని నాతో పందెం వేసుకోకుండా మీరన్నా తొందరగా రాస్తుండండి నేస్తం.. అప్పుడన్నా నేను నా పూర్వపు బుద్ధి తెచ్చుకుని ఎప్పటికప్పుడు తిరుగుటపా ఇస్తాను.
మరిక ఇప్పటికి సెలవా.
**కార్తీక**

*****   ***   ***   *****

మార్చ్ 30, 1986
హైదరాబాదు

**అతి మంచమ్మాయి కార్తీకకి,**

చూశావా, నీకు ప్రమోషన్ ఇచ్చేసి అతి మంచమ్మాయిని చేసేశాను.. లేదు, చేసేట్టు చేసింది నీ ఉత్తరం.. నిన్నే వచ్చింది.. చదవగానే రాధిక అయితే చాలాసేపు అలా నిశ్శబ్దం అయిపోయింది.. నువ్వు చెప్పిన శరణాలయం సంగతులు చదువుతుంటే మనసు పట్టేసింది.. ఆ చిన్నారులకి నువ్వందిస్తున్న స్నేహహస్తం, సహాయం ఎనలేనివి.. నువ్వు నా స్నేహితురాలివైనందుకు ఒక మనిషిగా నా స్థాయి ఎంతో పెరిగిందనిపిస్తుంది.. ఈసారి మాత్రం నీకు రిప్లై రాయడం లో ఏమాత్రం ఆలస్యం

చేయాలనిపించలేదు.

ఎదుటివారికి సంతోషాన్ని అందించడానికి, అభిమానాన్ని వ్యక్తం చేయడానికి ఎక్కువ డబ్బు ఖర్చు చేయక్కరలేదని, స్పందించగల మనసు.. ఆ మనసు నిండా స్నేహార్ద్రత అని నిరూపిస్తున్నావు.. అదే కాదు నీలో ఈ మధ్య ఒక కొత్త కార్తీక కనిపిస్తోంది.. చాలా నచ్చుతోంది కూడా! చూడాలి ఈ అమ్మాయి ఏమేం చిత్రాలు చేయబోతుందో!

సరేగానీ, మా ఇద్దరి అన్యోన్యత మీద నీకు సరైన అవగాహన లేనట్లుంది.. పాపం, ఏవేవో ఊహించుకుంటున్నావు.. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పౌర్ణమి నాటి వెన్నెల్లా, పూల నించి వచ్చే పరిమళంలా సహజంగా వచ్చేయదు.. పూర్తి దగ్గరితనం సాధించేముందు ఎన్ని మానసిక దూరాలు అధిగమించాలో!

"సముద్రం లోతు కొలవవచ్చు గానీ ఆడదాని మనసు లో ఏముందో తెలుసుకోలేమనే" పెద్దవాళ్ళ మాట నాకు పెళ్ళైన తర్వాత మొదటి పండగ దసరాకి రాధిక వాళ్ళింటికి వెళ్ళినప్పుడు తెలీలేదు.. మా మామగారు వాళ్ళు బట్టలు పెట్టి, పిండివంటలు చేసి చాలా చక్కగా మర్యాదలు చేశారు.. పండుగ రోజు వాళ్ళు పెట్టిన బట్టల్నే వేసుకోమని రాధిక చెప్పింది.. అదో సిల్క్ ఖద్దరు కలిసిన చొక్కా పాంటు.. వేసుకుంటే నాకు నేనే తమాషాగా అనిపించాను.. మరీ బాగోదని ఓ గంట సేపు వేసుకుని తీసేసి, వేరే షర్ట్ వేసుకుని మా బావమరిదితో ఊరు చూడటానికి వెళ్ళాను.. తిరిగి ఇంటికొచ్చి సరదాగ కబుర్లు చెప్తుంటే రాధిక ఎందుకో చాలా ముభావంగా, కావాల్సినవి అందిస్తూ చుట్టుపక్కల లేకుండా తప్పించుకు తిరుగుతోంది.. కాస్త ఏకాంతం దొరకగానే అడిగాను "ఏమైంది.. వంట్లో బాలేదా" అని.. "అదేం లేదు అంతా బానే ఉందని" ముభావంగానే చెప్పి వెళ్ళిపోయింది.. ఎన్నిసార్లడిగినా అదే ధోరణి.. నాకైతే పండగ హుషారంతా పోయింది.. అక్కడనించి వచ్చేప్పుడు తనకి ఒక్క మాట కూడా చెప్పకుండా వచ్చేశాను.. తర్వాత ఉత్తరంలో రాసింది, ఆ పండగ రోజు వేసుకున్న షర్ట్ తన సెలెక్షన్ అని, నాకు చాలా బావుంటుందని ఖరీదు ఎక్కువైనా అదే తీసుకున్నాననీ, నేను అలా వేసుకుని ఇలా తీసేశాసినందుకు తనకి చాలా బాధ కలిగిందని రాసింది.. నాకు భలే కోపమొచ్చింది, ఇదే విషయం నేను అక్కడ అన్నిసార్లు అడిగినప్పుడు ఒక్కసారన్నా చెప్పొచ్చు కదాని! అ తర్వాత భార్యాభర్తల మధ్య ఉండాల్సిన ఓపెన్ కమ్యూనికేషన్ గురించి నేనూ ఒక ఉత్తరం రాశాను. మరి ఉత్తరం లోని మాటర్ అర్ధమైందో లేక మాట్లాడకపోతే మళ్ళీ ఇలాంటి పెద్ద పెద్ద ఉత్తరాలు చదవాల్సొస్తుందన్న భయమో తెలీదు కానీ తర్వాత్తర్వాత ఇష్టం లేని, కష్టం కలిగించిన విషయాలని వెంటనే చెప్పేది.

నువ్వు శ్రీ కృష్ణ తులాభారం గురించి చెప్తుంటే ఇంకో సంఘటన గుర్తొస్తుంది.. అవి మేము హైదరాబాదులో కొత్తగా ఫామిలీ స్టార్ట్ చేసిన రోజులు.. రెండు పోర్షన్ల ఇంట్లో మేమొక పోర్షన్లో, ఓనర్స్ ఒక పోర్షన్లో ఉండేవాళ్ళం.. ఆ ఇంట్లో మేము దిగి నెల పైనే దాటుతోంది.. ఒకాదివారం పొద్దున్న నేను ముందు రూంలో పేపర్ చదువుతుంటే, "రాధిక గారూ" అని కంఠం ఖంగున వినిపించింది.. తలెత్తి చూస్తే పెద్ద జడ ముందుకేసుకుని, ఓణీ పైట నడుము దగ్గర దోపి, ఒక చేయి నడుము పైన వేసుకుని, తలుపుకానుకుని ఠీవీగా ఒకమ్మాయి నించునుంది.. పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళు ఉంటాయేమో.. ఆ శరీర ఛాయ, ఒంటి లావణ్యం చూస్తే నాకైతే ఆంధ్రప్రభ దీపావళి ప్రత్యేక సంచిక ముఖచిత్రం పై ఉండే వడ్డాది పాపయ్య గారి

నాయికామణులు గుర్తొచ్చారు! నేనలా ఆలోచిస్తునే ఉండగానే "రాధిక గారూ, ఎక్కడండీ? రెండు రోజుల్లో ఇచ్చేస్తానని పోయిన వారం మా అమ్మ గగ్గర పంచదార తీసుకున్నారట కదా.. ఎప్పుడిస్తారో, అసలు ఇస్తారో లేదో తెలుసుకుందామని వచ్చాను" అని గొంతు ఇంకాస్త పెంచి అడిగింది.. కాదు కాదు.. అరిచింది!

లోపల్నించి రాధిక హడావిడిగా కప్పుతో పంచదార తెచ్చి ఆ అమ్మాయికిస్తే "హు" అని లాక్కున్నట్టు తీసుకుని గిర్రున తిరిగెళ్ళిపోయింది.. ఆ అమ్మాయి పేరు స్వర్ణ అని, ఓనర్ గారి పుత్రికా రత్నం అని, నానమ్మ దగ్గరే పెరిగిందనీ, ఇంకా పెరుగుతోందనీ, అప్పుడప్పుడు మాత్రం ఇలా అమ్మానాన్నల దగ్గరకొచ్చి ఓ 2,3 వారాలు ఉండెళ్తుందనీ తెలిసింది.. రోజులు గడిచేకొద్దీ ఆ రూపానికీ, ప్రవర్తనకీ ఎంత తేడా ఉందో క్రమంగా అర్థమైంది.. జామకాయలు కోస్తున్నారని వీధిలో వెళ్ళే పిల్లల మీద, పక్కింటి వాళ్ళ చాకలి బట్టలు ఉతుకుతుంటే ఆ నీళ్ళు ఇటువైపు పడుతున్నాయని వాళ్ళ మీద, ముగ్గు గీత వంకరొచ్చిందని పనిమనిషిమీద.. ఇలా అందరిమీద అరుస్తూనే ఉంటుంది.. నాన్నమ్మ గారాబం ఆ పిల్లని అలా తయారుచేసిందని రాధిక అంటుండేది..

ఒకరోజు సాయంత్రం ఆఫీసు నించి వచ్చి ఏదన్నా రాసుకుందామని పేపర్లు ముందేసుకుని అలా కిటికీలోనించి బయటకి చూస్తుంటే పూలుకోస్తూ స్వర్ణ కనిపించింది.. చూపు మరల్చలేక పోయాను.. పసుపు పచ్చని ఓణీతో ఆకుపచ్చని చెట్ల మధ్య అచ్చు ప్రబంధ నాయికలా అనిపించింది.. ఏం లాభం ఇంతటి అందాన్ని అజ్ఞానం వికృతంగా మార్చేసింది.. చుట్టుపక్కల వాళ్లు, పాలబ్బాయి, కూరగాయలమ్మాయి, పిల్లలు ఈమె ఉన్నన్ని రోజులు ఇంటి ముందు నించి నడవడానికే భయపడతారంట!

అలా ఆ అమ్మాయిని చూస్తూ, ఆలోచిస్తూ ఎంతసేపున్నానో తెలీదుకానీ "అమ్మా, రేపు పిండి కొట్టడానికి వీరమ్మని రమ్మని చెప్పావా?" అంటూ స్వర్ణ పెట్టిన గావుకేకతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను.. తల విదిలించుకుని పైకి లేవబోతుంటే పక్కనే రాధిక నిలబడిఉంది!! అలా ఎంతసేపటినించి ఉందో తెలీదు కానీ నేనా అమ్మాయిని చూడటం తను చూసిందని నేను నిలబడగానే గిరుక్కున తిరిగి విసురుగా వెళ్ళిపోయిన తన వైనమే చెప్పింది! అంతే, అప్పటి నించి మా మధ్య మాటలు ఆగిపోయాయి.. నన్ను అనుమానించేదేమోనన్న ఆలోచనే భరించలేకపోయాను.. కానీ తను నిలదీసి అడుగుతుందనీ, అప్పుడు నేనసలు ఏమాలోచిస్తున్నానోనన్న విషయం చెబ్దామని నేనూ, నేను వచ్చి బ్రతిమాలుకుంటానని తనూ ఇలా వారం రోజులు గడిచిపోయాయి.. ఒకే ఇంటిలో అలా మాటల్లేకుండా బద్ధశత్రువుల్లా జీవించడం ఎంత కష్టమో నాకర్థమైంది.. ఊర్నించి మా అమ్మానాన్న రావడంతో మా ఇద్దరికీ మాట్లాడుకోక తప్పింది కాదు.

వాళ్ళు వెళ్ళిపోగానే రాధికకి మళ్ళీ నా ఓపెన్ కమ్యూనికేషన్ పాఠం మొదలుపెట్ట బోయాను.. వెంటనే తను "రామారావంతడివాడే జమున కాళ్ళు పట్టుకున్నాడు.. తమరు కనీసం గడ్డం పట్టుకునైనా బ్రతిమాలొచ్చుగా.. అది కాదు సంగతి ఇదీ అని చెప్తే నేను వినకపోతానా!" అంది.. నాకు ఓ ఐదునిమిషాలకి గానీ అర్థం కాలేదు తను చెప్పింది శ్రీ కృష్ణ తులాభారం సీన్ గురించని!! భార్యని బ్రతిమాలుకోవడానికి ప్రామాణికం ఇక ఎన్.టి.ఆర్, జమునలే కానీ శ్రీకృష్ణ సత్యభామలు కాదన్నమాట అనుకుంటూ నవ్వేశాను.. విన్నావుగా! మేమూ పోట్లాడుకుంటాము, అలుగుతాము.. అందరిలానే!

చూస్తూ చూస్తూ నేనూ నీలానే పెద్ద కథ చెప్పేసినట్లున్నాను.. సరేగానీ, రాధిక శరణాలయం పిల్లలకి కానుకగా తన దాచుకున్న డబ్బు పంపిస్తానని అంది. రేపో ఎల్లుండో వీలు చేసుకుని మనియార్డర్ పంపిస్తాను.. ఎలా ఖర్చుపెట్టాలీ అన్న డెసిషన్ పూర్తిగా నీదే!

భూషణం, సులోచన గార్లు, వికాస్, మాధురి దంపతులు అందరూ బావున్నారు కదా..

ముగించేముందు ఒక చిన్న విషయం.. మేము శ్రీరామ నవమికి మీ ఊరు రాకపోవచ్చేమో!? నేను ఇంకో వారంలో మళ్ళీ పూనా వెళ్ళాల్సిరావొచ్చు.. పండగకి కాకపోతే మామూలుగానైనా రావడానికి ప్రయత్నిస్తాము.. నీకు ఎలాగూ వేసవి సెలవలు మొదలవ్వబోతున్నాయిగా.. మే లో వస్తే నువ్వూ తీరిగ్గా మాకన్నీ చూపించొచ్చు.. ఏమంటావు?
ఇక ఉంటాను మరి.
**వంశీ**

*** *** *** ***

ఏప్రిల్ 11, 1986
**మాజేరు**

**ప్రియమైన రాధిక గారికి,**
మీరు పంపిన మనీయార్డరు వచ్చింది.. అసలు అది మొన్ననే వచ్చింది.. వంశీ గారి పేరు చూశాను గానీ అసలెందుకు పంపారో అర్ధంకాక నిన్న స్కూల్ ఆఫీస్ నించి ఫోన్ చేద్దామనుకున్నాను కానీ కుదరలేదు.. పిల్లలకి పరీక్షలు జరుగుతుండటం వలన ఇవాళ కూడా ఊపిరి సలపని పని.. ఇక రేపు బందరు వెళ్ళినప్పుడు తప్పకుండా చేయాలని అనుకుంటూ ఇంటికి రాగానే వంశీ గారి ఉత్తరం కనిపించింది.. అందులోని విషయం చదివి నాకు నోటమాట రాలేదు! నిజంగా మీది అమృత హృదయం.. ఇంకా ఏవేవో చెప్తూ పొగడాలని ఉంది కానీ ఉద్వేగంతో అసలు మాటలు రావడంలేదు!

డెసిషన్ నాదే అని పెద్ద బాధ్యత పెట్టేసారు.. తప్పకుండా ఆ పిల్లలకి అవసరమైన వాటికే మీరు పంపిన ఈ ఆప్యాయతని ఖర్చుపెడతాను.. ఈ విషయం భూషణం బాబాయి వాళ్ళకి ఎప్పుడెప్పుడు చెబ్దామా అని ఉంది!

మనియార్డర్ ఎందుకో తెలిసిన ఆనందంలో గబగబా ఈ రెండుముక్కలు రాస్తున్నాను.. మళ్ళీ త్వరలో విపులంగా మాట్లడతాను.
పిల్లలిద్దరినీ మరీ మరీఅడిగినట్లు చెప్పండి.
ప్రేమతో
**కార్తీక**

*** *** *** ***

మే 4, 1986
మాజేరు

నా నేస్తానికి,

ఝాము రెండు దాటింది.. కనురెప్పలు నిద్రన్న విషయమే తెలీనట్లు మూతపడనంటున్నాయి.. మనసులో తెలియని అలజడి.. మీ కవితల్లో కనిపించే 'కలల విహంగాలు', 'మధురోహలు', 'రాగమాలికలు' లాంటి పదాలకు కొత్త అర్థమో లేక అసలు అర్థమో ఇప్పుడిప్పుడే స్ఫురిస్తున్నట్లు అనిపిస్తోంది.. మీకే కాదు నాకు నేనే కొత్తగా అనిపిస్తున్నాను! ఈ మనసు చూస్తున్న కొత్త ప్రపంచాన్ని మీతో పంచుకోవాలని ఎంతగానో అనిపిస్తుంది.. కానీ ఎలా చెప్పాలో, అసలేం చెప్పాలో కూడా తెలీక సతమతమౌతున్నాను.. రెండురోజులనించీ ప్రయత్నిస్తున్నా మీకు ఉత్తరం రాద్దామని.. చేతినిండా సమయముంది.. కానీ చేతిలో పెన్ను మాత్రం కదలడం లేదు!

రాధిక గారికి ఉత్తరం రాసిన నాలుగు రోజుల నించీ ఎప్పటికప్పుడు మీకు రాద్దామనే అనుకుంటూ ఉన్నాను.. కానీ మా స్కూల్ పరీక్షలు, శరణాలయంలో పిల్లలని పరీక్షలకి చదివించడం.. అవైపోయాక అమ్మమ్మ ఇంటికి సున్నాలేయించే పని పెట్టింది.. ఓ నాలుగు రోజులు ఆ పనితో ఊపిరాడలేదు.. అంతలో సెలవలిచ్చేసారు.. సులోచన పిన్ని వాళ్ళు పిల్లలకి కాలేజీ పరీక్షలు మొదలవ్వబోతున్నాయని, దగ్గరుండి భోజనానికి ఇబ్బంది లేకుండా చూస్తే బావుంటుందని అక్కడికి వెళ్తామన్నారు.. వెళ్ళేముందు శరణాలయం పిల్లల్ని తీసుకుని ఎక్కడికైనా పిక్నిక్ లా వెళ్ళొద్దామని బాబాయి సలహా ఇచ్చారు.. ఎంత మంచి ఆలోచనో కదా!

వెంటనే 2,3 ప్రదేశాల గురించి చర్చించి చివరికి అమరావతి వెళ్దామని నిర్ణయించారు.. నేనూ అమ్మమ్మ, తాతయ్యలని కూడా రమ్మని బలవంతపెట్టాను.. అమ్మమ్మ పిక్నిక్ అంటే 'అహా.. ఉహూ' అంది కానీ అమరేశ్వరాలయం అంటే మాత్రం ఠక్కున ఒప్పుకుంది.. తాతయ్య మాత్రం చాలా పని ఉంది రానన్నారు.. కానీ ఖర్చులకి అవసరమౌతాయని రహస్యంగా డబ్బులి మాత్రం ఇచ్చారు.. మా మంచి తాతయ్య!

భోజనాలకి కావల్సినవన్నీ మేము ఆడవాళ్ళం చూసుకుంటే బాబాయి, వికాస్ బస్సు మాట్లాడటం లాంటివి చేశారు.. పిల్లలు, శరణాలయం లో పని చేసేవాళ్ళు, మేమూ మొత్తం కలిపి ఒక బస్సులో మొన్న ఒకటో తారిఖున బయల్దేరి వెళ్ళాము.. పిల్లల మొహంలో ఆనందాన్ని, వాళ్ళ ఉత్సాహాన్ని వర్ణించడానికి నాకు తెలిసిన భాష సరిపోదు.. అందరూ నీటుగా ఉతికిన బట్టలేసుకుని, చక్కగా తలలు దువ్వుకుని ముచ్చటగా తయారయ్యారు.. ఆరీఫ్ అయితే నా పక్కనే కూర్చుని ఒకటే ప్రశ్నలు!

ముందు బౌద్ధ ప్రదర్శనశాల చూసి, ఆ తర్వాత తిన్నగా అమరేశ్వరాలయానికి వెళ్ళాము.. పక్కనే కృష్ణా నది, గుడిలోంచి పూజారుల మంత్రాలు.. మనసంతా ఏదో అవ్యక్తానుభూతి.. పిల్లలందరి పేరా కలిపి అర్చన చేయించి, ఆ ప్రాంగణంలోనే టిఫిన్లు కానిచ్చాము.. ఆ తర్వాత కార్యక్రమం లాంచీలో కృష్ణ దాటి అవతలి వడ్డుకి వెళ్ళడం అని తెలిసి పిల్లల కేరింతలని

పట్టలేకపోయాము.. వాళ్ళని చూస్తుంటే మా ఉత్సాహం వెయ్యింతలు పెరిగినట్లనిపించిది! జాగ్రత్తగా సామాన్లు అవీ తీసుకుని అవతలి వైపుకి చేరుకున్నాము..

పైన ఎండ చురచురమంటున్న కృష్ణమ్మ పైనించి వస్తున్న గాలికి అదేమంత కష్టమనిపించలేదు.. కానీ అక్కడ ఎండ తగలని చోటు వెతకడానికి కాస్త టైం పట్టింది.. ఒకచోట నాలుగైదు పొదలు కలిసి నీడగా అనిపించగానే వెంటతెచ్చిన దుప్పట్లు అవీ పరిచేసి చతికిలబడిపోయాము.. భోజనం ఉన్న కాన్లు అవీ కాస్త లోపలికి బాగా నీడగా ఉన్నచోటకి సర్దుతుండగానే అక్కడ కూడా ఎండ తగలడం మొదలుపెట్టింది.. ఇలా కాదని ఇంకాస్త లోపలికి వెళ్ళి వికాస్ ఇంకో మంచి స్థలం చూసి వచ్చారు.. మళ్ళీ అవన్నీ అక్కడికి జారేసి.. అయ్యో మేము కాదు, పిల్లలే! "ఇది మేము తెస్తాము.. అది మేము మోస్తాము" అని వాళ్ళు మా చేతుల్లోంచి లాగేసుకుని మరీ ఆ చిన్ని చిన్ని చేతులతోనే మమ్మల్ని కూడా మోసినంత పని చేశారు!! కాసేపు నీళ్ళ దగ్గర ఆడుకుని, భోజనాలు కానిచ్చి అందరం అలా విశ్రాంతిగా కూర్చుని కధలు, కబుర్లు చెప్పుకుంటున్నాము.. అంతలో ఆరీఫ్ "అక్కా నేను ఒక పాట వాయించనా?" అని తన మౌత్ ఆర్గాన్‌ని తీశాడు.. అది ఎప్పుడో వికాస్ బహుమతిగా ఇచ్చారంట.. అప్పుడప్పుడూ దానితో కుయ్ కుయ్ మనిపిస్తాడు గానీ పాట వాయించేంతగా నేర్చుకున్నాడని అనుకోలేదు.

అందరూ ఉత్సా హంగా "సరే సరే" అనగానే ముందు 'వందేమాతరం' మొదలుపెట్టాడు.. అది అవ్వగానే పిల్లలందరూ "ఇంకోటి, ఇంకోటి" గోల చేస్తుంటే 'మా తెలుగు తల్లికి' మొదలుపెట్టాడు.. ఎంత శ్రావ్యంగా పలికిస్తున్నాడో! ఆ పాటకో లేక వాయిస్తున్న వాడి ప్రతిభకో అది కాకపోతే మేమున్న ప్రశాంతమైన ఆ ప్రదేశ ప్రభావానికో మనసు ఆర్ధ్రమైపోయింది.. ఆ సంగీత తరంగాల మంద్రత నరనరంలోకి ఇంకిపోతుంటే ఒకలాంటి జలదరింపు.. పాట అయిపోగానే ఆ ఉద్విగ్నత తట్టుకోలేక వాడిని చుట్టేసి ముఖమంతా ముద్దులు కురిపిస్తూ ఏడ్చేశాను.. అలా ఎంత సేపు వెక్కి వెక్కి ఏడ్చానో గుర్తు లేదు!! పిన్ని సముదాయించడం, అమ్మమ్మ కంగారుపడటం తెలుస్తూనే ఉంది.. కానీ నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను.. చివరికి బిక్కమొహాలేసుకుని చుట్టూ మూగిన పిల్లలని చూ సేసరికి ఈ ప్రపంచంలోకి వచ్చాను.. చాలా సిగ్గనిపించి ఎవరివైపూ సూటిగా చూడలేకపోయాను.. కానీ నా పక్కనే ఏం జరుగుతుందో తెలీక గాభరాగా చూస్తున్న ఆరీఫ్ తలని ఇంకోసారి ముద్దుపెట్టుకుని "చాలా బాగా వాయించావమ్మా!" అని మాత్రం అనగలిగాను.

నెమ్మదిగా వాతావరణాన్ని తేలికపరుస్తూ మళ్ళీ పిల్లలతో ఆటపాటలు మొదలుపెట్టించాము.. నాలుగింటికల్లా అంతా సర్దుకుని ఒడ్డుకొచ్చి లాంచీకోసం చూస్తుండగా హఠాత్తుగా వికాస్ "టికెట్లున్న క్యాష్ బాగ్ కనిపించడంలేదు!" అని సామాన్లన్నీ వెదకడం మొదలుపెట్టారు.. తిరుగు ప్రయాణానికని ముందే కొని పెట్టుకున్న బస్సు టికెట్లు, కొంత డబ్బూ కూడా అందులో ఉన్నాయంట! బాబాయి "మనం కూర్చున్నచోటే వదిలేసి వచ్చామేమో" అంటుండగానే వికాస్ నావైపు తిరిగి "కార్తీక గారూ, మీరు మనం ముందు కూర్చున్న చోటికి వెళ్ళి వెతకండి, నేను ఇప్పటివరకూ కూర్చున స్థలంలో చూస్తాను" అని గబగబా అడుగులేస్తూ వెళ్ళిపోయారు.

మొదట మేము కాసేపు మాత్రం గడిపిన స్థలం దగ్గరికి వెళ్ళి అక్కడా, చుట్టూ ఉన్న పొదల దగ్గరా వెతికాను కానీ ఆ బాగ్

కనిపించలేదు.. చోటు మారేప్పుడు మధ్యలో ఏమన్నా జారవిడిచామేమోనని దారంతా చూసుకుంటూ అసలు సమయమంతా గడిపిన చోటు కొచ్చాను.. అక్కడే చేతిలో బాగ్‌తో నించుని ఉన్న వికాస్‌ని చూసి ఏదో అనబోయేలోపులే అతను ఒక్క ఉదుటున నన్ను చేరుకుని బలంగా కౌగిలించుకున్నారు!!

గుండె ఆగినంతపనయ్యింది.. అలానే పట్టుకుని "ఇన్నాళ్లకి నాలా ఆలోచించే ఇంకో వ్యక్తిని.. కాదు కాదు.. నాకంటే ఎంతో ఉన్నతమైన వ్యక్తిని మీలో చూస్తున్నాను.. కార్తికా, మీరు ఈ పిల్లల పట్ల చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే నాకెంత సంతోషంగా ఉందో తెలుసా! ఇక నాకేదైనా పర్లేదనిపిస్తుంది.. చెప్పండి, నాకేమన్నా అయితే మీరు వాళ్ళకి అండగా ఉంటారు కదా?" అంటుంటే ఎప్పుడో లయ తప్పిన హృదయాన్ని సరిచేయడానికి విశ్వప్రయత్నం చేస్తూనే "భలేవారే, మీకేమౌతుంది.. అసలు మీరే మా బలం" చెప్తున్నానో.. లేక చెప్పాలని ప్రయత్నిస్తున్నానో కూడా తెలీదు.. "ఇదిగో మీ గొంతులో వినిపించే ఈ ఆర్తి, కళ్ళల్లో కనిపించే వాత్సల్యమే నాకు ధైర్యానిస్తాయి.. మీకు తెలీదు, ఏమన్నా గొడవల్లో ఇన్వాల్వ్ అయినప్పుడల్లా మనసంతా ఈ పిల్లల గురించే ఆందోళన.. ఇందాక ఆరిఫ్ పాటకి మీరు కదిలిపోవటం చూశాక నా భయమంతా పటాపంచలైంది! అసలు బాగ్ వెతుకుతూ మీరిటువైపు వస్తారో రారో నని, రాకపోతే నా మనసులో మాట మీకు చెప్పలేనేమోనని టెన్షన్ పడ్డాను!" అంటే బాగ్ కావాలనే వదిలేశారా!!

నా మోకాళ్ళు బలహీనమైపోవటం తెలుస్తూనే ఉంది.. అతను నన్ను వదిలిన మరుక్షణం కింద కూర్చుండిపోయాను.. "ఏమిటీ, మీమీద పెద్ద బాధ్యతని పెడుతున్నాననుకుంటున్నారా?" ఆతృతగా అడుగుతున్న అతన్ని చూస్తుంటే మనసులో ఉన్న మాట చెప్పేశానన్న సంతోషం తప్పితే ఇంకేమీ కనిపించలేదు.. అదే నిర్మలత్వం! "అహా, అదేం లేదు.. పదండి వాళ్ళందరూ మనకోసం కంగారు పడుతుంటారు" అని లేచి తిరిగి నడుస్తున్నా కానీ శరీరమంతా వ్యాపించిన విద్యుత్తరంగాల తాలూకు ప్రకంపనలు మాత్రం తగ్గనేలేదు! మళ్ళీ అతనివైపు చూసే శక్తి లేకపోయింది..

బస్సులో కూడా ఎవరితో మాట్లాడే ఆసక్తి లేక అలా కిటికీకి తలానించి బయటకి చూస్తుంటే అనిపించింది, అసలు మామధ్య ఉన్న చనువు ఏపాటిదని షేక్‌హ్యాండ్ ఇచ్చినంత కాజువల్‌గా కౌగిలించుకున్నారు.. అంత ధైర్యం ఎలా వచ్చిందో! ఒకటి మాత్రం నిజం.. నేను ఆరిఫ్ పైన చూపించిన భావోద్వేగానికీ, ఇతని చర్యకీ నాకు తేడా కనబడటంలేదు.. ఒకటే సిన్సియారిటీ! కానీ నేను బాహాటంగా ప్రదర్శించగలిగాను.. ఆడపిల్లనన్న స్పృహ ఉండటం మూలానేమో అతను అలా చేయలేకపోయారు.. నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది.. లేకపోతే నా పిచ్చిగానీ, అసలేం జరగనట్టు వెనకాల బాబాయితో భోపాల్ గ్యాస్ లీక్ బాధితుల గురించి పెద్ద పెద్దగా చర్చలు చేస్తున్న అతనికి ఇలాంటివి స్ఫురణకి ఉంటాయా!!

కొన్ని అనుభవాలకి వర్ణనలు అవసరంలేదు.. కానీ ఎలాగైనా మీకు చెప్పాలని ఇప్పటికి రాయగలిగాను..

"... అనురాగం తాగి మత్తెక్కి

మంచులో తడిసి.. వెన్నెట్లో మెరిసి

లలితంగా.. స్థిరచిత్త లోలితంగా
ఈ శిల..''

శిలాలోలిత లోని పదాలు పదే పదే గుర్తుకొస్తున్నాయి.. శిలలాంటి నా మనసు చిరుగాలి లాంటి అతని సమక్షంలో ద్రవించడం తెలుస్తూనే ఉంది.. అలా అని నాకేమీ ఎప్పుడూ అతన్నే చూడాలనీ, సమయమంతా అతని ప్రెజెన్స్ లో గడపాలనీ అనిపించడంలేదు.. అతనికి ఇష్టమైన పనులన్నీ... అవి నాకు చేతైనా కాకపోయినా, ఎంత కష్టపడైనా చేయాలనుంది.. ఒక్కోసారి అంతా అయోమయంగా అనిపిస్తుంది.. ఇదంతా ఏమిటో, ఎందుకిలా అనిపిస్తుందో మీరైనా నాక్కాస్త అర్థమయ్యేట్లు చెప్పండి నేస్తం!

అసలు విషయం మర్చేపోయాను, రాధిక గారు పంపిన డబ్బులతో పురుషోత్తం గారూ, వికాస్ కలిసి పిల్లలకి దుప్పట్లు కొన్నారు.. పోయిన శీతాకాలం చలికి చాలా ఇబ్బంది పడ్డారంట, అందుకే ముందే కొని ఉంచారు! ఆరీఫ్‌కి ఆదిత్య, గౌతమ్‌ల గురించి చెప్పాను.. వాళ్ళ బొమ్మలు వేస్తాను వాళ్ళని తీసుకురమ్మని కూర్చున్నాడు!! ఏం చెప్పాలో మీరే సెలవియ్యండి మరి!

ఈసారి మాత్రం మీ జవాబు కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తుంటాను.
**కార్తీక**

**"అతని కోసం వృథాగా ఎదురుచూడ్డంలోనే చాలా భాగం గడిచిపోయింది.. విసిగి అలసి ఉదయాన నేను నిద్రపోయినప్పుడు నా తలుపు దగ్గరికి ఉన్నట్టుండి వస్తాడేమో నా భయం - నెచ్చెలులారా, తలుపు తెరచి ఉంచండి.. అతన్ని అడ్డగించకండి" -- గీతాంజలి**

మే 1, 1986
హైదరాబాదు

**ప్రియమైన కార్తీకకి,**
నేను రాధికని.. మీకు చెప్పే ఉంటారు కదా, ఈయన మళ్ళీ పూనా వెళ్లారు.. ఇందాక ఫోన్ చేసినప్పుడు మీ ఉత్తరం వచ్చిందని చెప్తే చదివి వినిపించమన్నారు.. ఫోన్ బిల్ దృష్టిలో పెట్టుకుని గబగబా చదవడం మొదలుపెట్టినా ఆరీఫ్ పాట నించి స్లో అయిపోవడం నాకే తెలుస్తుంది.. పూర్తయ్యేసరికి ఇద్దరమూ కొన్ని క్షణాల పాటు నిశ్శబ్దంగా ఉండిపోయాం.. మీరు తన జవాబు కోసం ఎదురుచూస్తుంటారని అప్పటికప్పుడు ఈ మాటలు మీకు రాయమని చెప్పారు.. ఇవి తన చెప్పిందే యధాతధంగా...

"కార్తీకా, నీ జీవితంలోని ముఖ్యమైన వ్యక్తులని మాకు పరిచయం చేయడమే కాకుండా ఇలాంటి అరుదైన క్షణాలని కూడా మాతో పంచుకుంటూ ఇంకా దగ్గరైపోతున్నావు.. కొన్ని సంఘటనలు అనూహ్యమైన అనుభవాన్ని మిగులుస్తాయి.. అది

ఇబ్బందికరమైన అనుభూతి కానంతవరకూ మంచి జ్ఞాపకంలా మనసు పొరల్లో దాచుకోవడానికీ, ఏకాంతంలో ఇష్టమైన పాటలా తల్చుకోడానికీ సందేహాలనవసరం.. అలానే అంతకుమించి ఉద్వేగమూ అనవసరం.. ఇంతకన్నా ఇప్పటికి ఎక్కువ చెప్పలేను. త్వరలో నీకు ఉత్తరం రాస్తాను."

ఇవీ తను మీకు చెప్పమన్నవి.. ఇంకేమిటి కార్తీకా? మీ సెలవలెలా గడపబోతున్నారు? నాన్నగారు వచ్చారు.. ఎలానూ ఈయన లేరని మమ్మల్ని ఓ నాలుగు రోజులకోసం ఊరికి తీసుకెళ్తామంటున్నారు.. బహుశా రేపు వెళ్తామేమో.
అక్కడ అందరినీ ముఖ్యంగా ఆరీఫ్ నీ అడిగాననీ చెప్పండి.
ఇట్లు
రాధిక

*** *** *** ***

జూన్ 18, 1986
పూనా

కార్తీకా,
ఇప్పుడే రాధికతో ఫోన్లో మాట్లాడాను.. తను చెప్పిన విషయం విని ఎంత సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యానో నువ్వూహించలేవు!! అసలు ఇంత సర్ప్రైజింగ్ న్యూస్ ఇస్తావని నువ్వే ఊహించి ఉండవేమో!? అందుకే ఫోన్ పెట్టేసిన మరుక్షణమే ఆత్రుతగా నీకు ఉత్తరం రాస్తున్నాను.. నిజంగా ఇది నిజమేనా!! నువ్వూ, వికాస్ గుళ్ళో పెళ్ళి చేసుకున్నారని ఇందాక రాధిక అన్న మాటలు ఇంకా చెవిలో గింగురుమంటున్నాయి! అసలిదంతా ఎలా... ఎప్పుడు... ఇంత తక్కువ సమయంలో! ఒక విషయం మాత్రం నిజం, మాఇద్దరికీ ఎంతో ఆనందాన్ని కలిగించిన వార్త ఇది!

ఇలాంటప్పుడు ఉత్తరం కోసం తొందర పెట్టడం భావ్యం కాదనుకో.. అయినా జరిగిన విషయాలన్నీ ఎప్పుడెప్పుడు నీ మాటల్లో విందామా అదే చదువుదామా అని ఉంది.. నీ నిర్ణయానికి మీ అమ్మమ్మ గారు చాలా సంతోషించి ఉంటారు కదా! ఇందాక ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు రాధిక గొంతులో ఎంత సంతోషమో! ఇవాళ మధ్యాహ్నం మీ ఇద్దరూ ఫోన్ చేసి తనకి ఈ విషయం చెప్పిన దగ్గరనుంచీ ఎప్పుడెప్పుడు నేను ఫోన్ చేస్తానా అని ఎదురు చూస్తుందంట.. 'ఒక గుడ్ న్యూస్, అదేంటో ఉహించండి' అని కాసేపు ఊరించింది కూడా! ఐదు నిమిషాల వరకూ నేను కనుక్కోలేకపోతే తనే ఇక ఆగలేక చెప్పేసింది!

నీకు చెప్పే ఉంటుంది కదా, నేను మధ్యలో ఒక వారం రోజులు ఇంటికి వచ్చి మళ్ళీ తిరిగి ఇక్కడికి రావాల్సి వచ్చింది.. ఈ నెలాఖరుకి ఒక సర్టిఫికేషన్ ఎగ్జామ్ ఉంది.. అదవ్వగానే ఇంటికి వచ్చేస్తాను.. అప్పట్లోగా నీ ఉత్తరం నా కోసం ఎదురు చూస్తుంటే బావుండుననిపిస్తుంది.
మీ దంపతులిద్దరికీ మా హృదయపూర్వక శుభాకాక్షలు!
వంశీ

*** *** *** ***

జులై 13, 1986

వెంకటాపురం

వంశీ గారికి,

మీరు క్షేమమే కదా! ఈరోజు రేపు మీకు ఉత్తరం రాయాలనుకుంటుండగానే మీరే కబురు పంపించేశారు.. మీ ఆశ్చర్యం నేనూహించినదే. నిజం చెప్పాలంటే నేను మీలానే నా గురించి ఆశ్చర్యపడుతున్నా! అసలు మనల్ని మనం ఎంత ఎక్కువగా అంచనా వేసుకుంటామో కదా! కాస్త ప్రపంచ జ్ఞానం, విషయావగాహన రాగానే మన జీవితాన్ని నిర్దేశించుకోవడం మొదలుపెడతాము.. అంతా మన చేతుల్లోనే ఉందనుకుంటాము.. ప్రణాళికలు వేస్తాము.. కానీ అనుకున్నవి జరగనప్పుడుగానీ మనల్ని మించిన శక్తేదో ఇంకొకటుందనే విషయం స్ఫురణకి రాదు! నాకిప్పుడలానే అనిపిస్తుంది..

నాక్కావల్సిందేదో నాకు బాగా తెల్సని ఒక గట్టి నమ్మకం ఉండేది.. అందుకే ఇంకో యాభై ఏళ్ళకి సరిపడా ప్రణాళికని సిద్ధం చేసుకోవడం మొదలుపెట్టాను.. నా అభీష్టానికి వ్యతిరేకంగా ఏ పనీ నాచేత ఎవరూ చేయించలేరనే గొప్ప ధైర్యం.. ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళి గురించి అమ్మమ్మ పెద్ద దుమారం లేవదీస్తుందని, నయానో భయానో నన్ను ఒప్పించాలని చూస్తుందని తెలుసు.. అలాంటి ప్రయత్నాలన్నీ ఎదుర్కోవడానికి మానసికంగా నన్ను నేనెంత సిద్ధం చేసుకున్నానో మీకు తెలీదు.. అలాంటిది తను వద్దంటుంటే నేనే బయటకి వచ్చేసి మరీ పెళ్ళి చేసుకున్నానంటే మరి నాకే ఆశ్చర్యంగా ఉండదూ!!

నేను మీకు అమరావతి ప్రయాణ విషయాలు రాసిన తర్వాత వెంటనే రాధిక గారు మీ మాటల్ని ఉత్తరంలో పంపించినా ఏదో అసంతృప్తి! మీరు వెంటనే తిరిగొచ్చేసి ఇంకో పెద్ద ఉత్తరం రాస్తే బావుండుననిపించింది.. అసలు అప్పటివరకూ బిజీ బిజీ గా పరుగులు పెడుతున్న కాలం సెలవలివ్వగానే సడెన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయినట్లనిపించింది.. మాధురి తన కొత్త కాపురం గొడవలో తనుంది.. సమయానికి రాధిక గారు కూడా ఊరెళ్ళారు.. లేకపోతే మీ ఇద్దరిలో ఎవరో ఒకరితో మాట్లాడాలని చాలా అనిపించింది.

దక్షిణపు గాలి వెళ్తూ వెళ్తూ ఏటి నీళ్ళ ని కదిలించివెళ్ళినట్టు మనసులో ఒకటే సంచలనం.. ఇదీ అని తెలీని గాభరా.. అసలు సెలవలు రాగానే ఎన్నిపనులు చేద్దామనుకున్నానో, ఎన్ని పుస్తకాలు చదవాలనుకున్నానో!! కానీ అదేంటో ఏ పని చేయబోయినా నిరాసక్తతగా అనిపించేది.. ఒక్క మీ కవితలు, గీతాంజలి తోనే స్వాంతన కలిగేది..

"మనసు చుట్టూ అల్లుకున్న మరోలోకంలో
నీ జ్ఞాపకాల బంగళాకి కాపలా కాస్తున్నా
ఈ ప్రాంగణంలో నీ చెలిమి సవ్వడి కోసం
తలవాకిటనె నిలబడి నిరీక్షిస్తున్నా!"

పదే పదే చదివానీ కవితని! నా నిరీక్షణ ఎవరికోసమో అర్థమౌతూనే ఉన్నా, దేనికోసమో తేల్చుకోలేని అసహనం మనసుని

తినేస్తుంటే శరణాలయానికి వెళ్ళాలనిపించేది.. పిల్లలంతా ఎలా ఉన్నారో? ఆరీఫ్ ఏమేం కొత్త బొమ్మలు వేశాడో, ఇంకేమన్నా కొత్తపాటలు నేర్చుకున్నాడేమో!? అయినా ఇప్పుడు వెళ్తే సెలవల్లో కూడా ఇక్కడ ఈమెకేం పని అనుకుంటారేమో!! ఇన్ని సందిగ్ధాల మధ్య రోజులెలా వెళ్ళబుచ్చానో తెలీదు.. స్కూల్ ఇంకో వారంలో తెరుస్తారనగా ఇక ఉండబట్టలేక బాబాయి వాళ్ళింటికి బయలుదేరి వెళ్ళాను.

నన్ను చూడగానే పిన్ని గబగబా వచ్చి "ఏవండీ కార్తీకొచ్చింది.. రండి త్వరగా" అని బాబాయిని పిలిచి నా చేయి పట్టుకుని "రా రా.. నీ కోసమే చూస్తున్నాము.. ఇవాళ కూడా రాకపోతే నేనే వచ్చి తీసుకొద్దామనుకున్నాను" అంటుంటే కాస్త అయోమయం.. "ఏమైంది పిన్నీ? ఏమన్నా అర్జెంటా?" అనడిగాను.

"లేదు గానీ ఇలా కూర్చో" అని నన్ను కూర్చోబెడుతుండగానే లోపల నించి బాబాయి వచ్చారు.. పక్కనే ఇంకో కుర్చీలో కూర్చుంటూ "కార్తికా, నీతో ఒక విషయం మాట్లాడాలనుకుంటున్నామమ్మా" అన్నారు.. కొంచెం సీరియస్ గా ఉన్న వాళ్ళ మొహాలు చూస్తుంటే నాకు గుండె దడదడలాడింది.. పిన్ని మొదలుపెడుతూ "మేము ఊర్నించి తిరిగి వచ్చిన రోజు వికాస్ ఇక్కడికొచ్చాడు" మొదట్లోనే అతని పేరు వినడంతో గుండె వేగం ఇంకాస్త హెచ్చింది! "విషయాన్ని అక్కడనించీ సాగదీయాలా?" అంటూ అంతలోనే బాబాయి అందుకుని "కార్తికా, నీకభ్యంతరం లేకపోతే వికాస్ నిన్ను పెళ్ళి చేసుకుంటాడంటమ్మా"!

ఒక క్షణం కాదు, చాలాసేపే ఏమీ అర్థం కాలేదు.. మళ్ళీ ఆయనే మాట్లాడుతూ "పెళ్ళి మీద నీ అభిప్రాయం గురించి మాకు తెలుసు.. కాని నీ అభిప్రాయం సరైనది కాదని నువ్వు తెల్సుకునేసరికి చాలా ఆలస్యమై పోయి అప్పటికి నిన్నింతలా ఇష్టపడే వికాస్ నీకందుబాటులో లేకపోతే!! అతనిష్టపడుతున్నాడనే కాదు.. మేము మీ ఇద్దరినీ దగ్గరనుండి చూశాము.. వ్యక్తిగా మీరేంటో తెలిసి అంటున్నాను మీరు ఒకరికొకరు సరిగ్గా సరిపోతారు" బాబాయి ఇంకేదో చెప్తుండగానే ఉన్నట్టుండి లోపలనించి వికాస్ బయటకి వచ్చారు! ఇంతసేపూ లోపలే ఉన్నారా!! అతన్ని చూడగానే వాళ్ళిద్దరూ లేచి "మీరు కాసేపు మాట్లాడుకోండి" అని ముందు వసారాలోకి వెళ్ళిపోయారు.. మొట్టమొదటిసారి స్కూల్లో దించేసి అమ్మా నాన్నా వెళ్ళిపోతుంటే కలిగే గాభరా నాలో.. తను వచ్చి ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంటుంటే తలెత్తి చూశాను.. చిన్నగా నవ్వారు.. అప్పుడు కనిపించింది అక్కడ చిక్కుకున్న నా మనసు!! ఇన్ని రోజులు లోపలంతా ఏదో వెలితిగా అనిపించడానికి గల కారణం ఏమిటో అప్పుడర్థమైంది!

"మీతో ఇలా ఏకాంతంగా మాట్లాడే అవకాశం కోసం ఎంతగా ఎదురుచూస్తున్నానో కార్తీకా.." అంటూ మొదలుపెట్టి ఎన్నో విషయాలు చెప్పుకుంటూ పోయారు.. తన చిన్నతనం, చదువు, అన్యాయం పట్ల ఆవేశం, ఒంటరితనం, ఉద్యోగం, శరణాలయం.... ఇలా వరుసగా.. చిన్నముల్లు ఎన్ని మజిలీలి దాటిందో! ఏమీ పట్టించుకోవాలనిపించలేదు.. అతని మాటలు వినబడుతూనే ఉన్నాయి "మీ పరిచయం అయి మీరేమిటో తెలిసాక నా జీవితంలోకి వచ్చే తోడు ఖచ్చితంగా మీరే అనిపించింది.. మామయ్య చెప్పారు, మీకు పెళ్ళంటే అంత సదభిప్రాయం లేదని.. భర్త అనే హోదాతో కాకున్నా ఒక మంచి

స్నేహితుడుగా మీ సమక్షంలో గడిపే అవకాశం కోసమైనా మీ చేయి పట్టుకుని నడవాలనిపిస్తుంది కార్తీకా'' ఇంకా ఏవో అనబోతుంతుంటే నేను మెల్లగా అక్కడ నించి లేచి పిన్ని వాళ్ళున్న చోటికి వచ్చాను.. అతను కంగారుగా నా వెనకే రావడం తెలుస్తూనే ఉంది.. ఆత్రంగా మా వంకే చూస్తున్న వాళ్ళతో ''రేపు వచ్చి అమ్మమ్మతో మాట్లాడండి బాబాయి'' అన్నాను.

వాళ్ళకామాట అర్థమవ్వడానికి కొంచెం సమయం పట్టింది.. అర్థమవుతూనే సంతోషంగా నా చేతులు పట్టి ఊపేశారు.. బాబాయి అయితే వికాస్‌ని పట్టుకుని ఊపేస్తూ ''కంగ్రాచ్యులేషన్స్ మై బోయ్'' అంటూ నావైపు తిరిగి ''అసలు మేమూరినించి వచ్చినరోజు చూడాలి వీడిని, కాళ్ళు లోతుకెళ్ళిపోయి, గడ్డం పెరిగి.. చూడటానికే భయమేసిందనుకో! ఈ విషయం నీతో ఎలా చెప్పాలో అని ఒకటే టెన్షన్ అంట! మాట్లాడటం తర్వాత ముందిలా నిన్ను చూస్తే ఆ పిల్ల భయపడి పారిపోతుందని చెప్తే కాస్త కుదురుగా ఇదిగో ఇలా తయారయ్యాడు!'' అని చెప్తుంటే మొదటిసారి ఎలాంటి తడబాటు లేకుండా అతన్ని చూసి నవ్వాను.. 'నా' అన్న దగ్గర భావం ఒకరి నించి ఇంకొకరికి ప్రవహించడం అప్పుడే మొదలుపెట్టేసింది!

బాబాయి, పిన్ని పదింటికల్లా ఇంటికొచ్చి మాట్లాడతామని చెప్పాక నేను బయల్దేరాను.. ఏ మేఘం తీసుకొచ్చి పడేసిందో తెలీదు గానీ ఇంటికి చేరిందే తెలీదు! నాకు తెలుసు, అమ్మమ్మ నేను పెళ్ళికి ఒప్పుకున్నానని తెలిస్తే ఎంత సంతోషిస్తుందో! అందుకే ఆమెని సర్‌ప్రైజ్ చేయాలని మరుసటిరోజు పిన్ని వాళ్ళు వస్తున్న సంగతి చెప్పాను కానీ ఎందుకనేదీ చెప్పలేదు.

ఇక ఆరాత్రి నిద్ర పోయానని చెప్తే అది అబద్ధమే అవుతుంది.. అప్పుడెప్పుడో ఇలాంటి నిద్ర పట్టని రాత్రే అతని గురించి ఆలోచిస్తూ, అతనితో పరిచయం స్థాయి ఇంకాస్త పెరిగితే ఎంత బావుండునో అనుకుంటూ... అందుకేం చేయాలో తోచక సలహాలిమ్మనమని అడిగితే ఏదో పనున్నట్టు హడావిడిగా మబ్బు చాటుకెళ్ళిపోయిన ఆ జాబిల్లిని పిలిచి చెప్పాలనిపించింది ఇవాళ అతని సమక్షంలో నేనెంతసేపు గడిపానో!!

రాత్రి తెల్లవారడం అంటే కొన్ని వేల యుగాలవ్వడం అనేది ఆ రాత్రే తెలిసింది!! దూరంగా నడిచొస్తున్న వాళ్ళని చూసేదాకా అసలు వస్తారో రారోనన్న సందేహమే.. ఇంట్లోకి వచ్చి రెండు నిమిషాలు ఏవో కుశల ప్రశ్నలు వేసుకున్నాక బాబాయి వెంటనే విషయంలోకి వచ్చేశారు.. పెళ్ళి మాట వినగానే ఎంతో సంతోషిస్తుందనుకున్న అమ్మమ్మ మొహం చిత్రంగా ముడుచుకుంది.. ''ఎవరబ్బాయేంటి?'' క్షణంలో గొంతు మారిపోవడం తెలిసిపోతూనే ఉంది.. బాబాయి వికాస్ వివరాలన్నీ చెప్పాక వెంటనే అమ్మమ్మ ''అయితే మావాళ్ళు కాదుగా.. మేమెలా ఇస్తాం పిల్లని!'' అంది.. నాకంతా అయోమయంగా అనిపించింది.. బాబాయి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.. అంతకంతకూ అమ్మమ్మ గొంతు పెరిగిపోతూనే ఉంది.

నేనే ఆ సంభాషణని ఆపుచేస్తూ నేను అమ్మమ్మ తో మాట్లాడి ఒప్పిస్తానని చెప్పి బాబాయి వాళ్ళని పంపించేశాను.. వాళ్ళటు వెళ్ళగానే అమ్మమ్మ తిట్ల దండకం ప్రారంభించింది.. నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించాను.. నాకు కావాల్సింది వాళ్ళ ఆశీర్వాదమే కానీ ఇంకేమీ కాదని.. అయినా సరే నోటికొచ్చిందల్లా మాట్లాడటం మొదలుపెట్టింది.. 'కులం, కుటుంబం, ఆస్తి ఏమీ లేనివాడికి పిల్లనెలా ఇస్తాం... అయినా పెళ్ళి వద్దూ వద్దూ అన్నప్పటినించీ అనుకుంటూనే ఉన్నా ఇలాంటి తలకి

మాసినవాడిని చేసుకుంటానని అడుగుతానని!'' ఇదా ఈమెకి నా మీదున్న నమ్మకం అనుకుంటే ఒకలాంటి నిర్వేదం.. ఎప్పటికప్పుడు నేనేంటో, నా భావాలేంటో ఆమెకి అర్థం అయినా అర్థం కాకపోయినా చెప్తూనే ఉండేదాన్ని.. అప్పటికీ అన్నాను, వికాస్‌తో నా పరిచయం నామమాత్రమేనని.. మనసు విప్పి మాట్లాడింది నిన్నేనని! అసలు వినిపించుకుంటేనే కదా! ఇక ఏం చెప్పాలో తెలీక ఆఖరిమాటగా నేను వికాస్‌ని పెళ్ళి చేసుకోవడానికే నిర్ణయించుకున్నాట్లు చెప్పేశాను..

అంతే! ఇంటిని బందిఖానాలా చేసేసి నన్ను వెయ్యికళ్ళతో కాపలా కాయడం మొదలుపెట్టింది.. 2,3 రోజులయ్యేసరికి చుట్టాలు దిగడం మొదలుపెట్టారు.. ఏవేవో సంబంధాలు, పెట్టుడు ముహూర్తాలు అంటూ మాట్లాడుతుంటే ఇక ఆలశ్యం చేస్తే ప్రమాదమనిపించింది.. ఆఖరిసారిగా తాతయ్యని అడిగాను పెళ్ళికి ఒప్పించమని.. ఆయన నావంక చూసి ''అది నాచేతుల్లో లేని పనని నీకు తెలుసు.. నిన్ను ఉద్యోగానికి పంపడంతోనే నా ఆఖరి అధికారాన్ని వాడేసుకున్నాను'' అంటూ నిస్సహాయంగా చూశాడు.. నాకర్థమైంది నేనేం చేయాలో!! పది నిమిషాల్లో మళ్ళీ ఆయన దగ్గరకెళ్ళి ''నీకు లాగా, నాన్నకు లాగా కాకుండా నా ప్రపంచాన్ని నేనే ఎన్నుకుంటాను తాతయ్యా.. నా ప్రయాణం నీ ఆశీర్వచనంతో ప్రారంభించాలని ఉంది, ఓ పది రూపాయలివ్వవా'' అనడిగాను.. ఏమర్థమైందో పది చేతిలో పెట్టి తల నిమిరాడు.. అలా ఉట్టి చేత్తో నడిచి రావడం వల్లనేమో ఇంట్లో వాళ్ళెవరూ అనుమానపడలేదు!

వాళ్ళకి తెలిసేలోగా నేను బస్సులో ఉన్నాను.. నన్ను చూస్తూనే పిన్ని, బాబాయి ఎంతో సంతోషించారు.. వికాస్ కళ్ళల్లో చూసిన ఆనందాన్ని పోల్చడానికైతే నాకు తెలిసిన భాష సరిపోదు.. నేను వస్తానని ఎదురుచూస్తూ అక్కడే ఉంటున్నారంట.. తర్వాత రెండు రోజులు మా వాళ్ళొచ్చి పెద్ద గొడవ చేశారు.. ఎక్కడి నుంచి వచ్చారో కానీ వికాస్ స్నేహితులంట ఒక గుంపులా బాబాయికి, వికాస్‌కి అండగా నిలిచారు..

ఆలశ్యం చేయడం మంచిది కాదని నేను అక్కడికి వెళ్ళిన మూడో రోజేనే గుళ్ళో మా పెళ్ళి చేయడానికి అందరూ నిర్ణయించేశారు.. అంతే నేస్తం! మేళతాళాలు, మామిడాకులు, విందు భోజనాలు ఇలాంటివేమీ లేకుండానే మా పెళ్ళి జరిగిపోయింది.. అవన్నీ లేకపోతేనేం.. స్వంత అమ్మానాన్నల్లా పిన్నీ బాబాయి మా ఇద్దరికీ కొత్త బట్టలు పెట్టి అటు ఆడపెళ్ళివారు, ఇటు మగపెళ్ళివారిలా వ్యవహరిస్తే, వికాస్ స్నేహితులంతా కావాల్సిన ఏర్పాట్లు క్షణాల్లో చేశేశారు.. అదే రోజు రిజిష్టర్ ఆఫీసుకి వెళ్ళి చట్టబద్ధంగా నమోదు చేయించుకోవడానికి అప్లికేషన్ కూడా సబ్మిట్ చేశాము.. ఆ మరుసటి రోజు శరణాలయంలో అందరం కలిసి విందులాంటిది చేసుకున్నాము.

ప్రస్తుతం కొత్త జీవితం మొదలుపెట్టింది స్కూల్ ఉన్న ఊర్లోనే పిన్ని వాళ్ళింటికి కూతవేటు దూరంలో! ఇంటికి ముఖ్యంగా కావాల్సిన పాత్రలు, వంట సామాన్లు లాంటివన్నీ వికాస్ స్నేహబృందమే సమకూర్చారు!! నాకొచ్చే ఉత్తరాలన్నీ అక్కడే ఉంచమని వికాస్ మా ఊరి పోస్ట్ ఆఫీసులో చెప్పి ఉంచారంట.. తనే ఏదో విధంగా అవి నాకందేలా చేస్తున్నారు.. అలానే మీ ఉత్తరం చేరింది.. మా కొత్త అడ్రెస్ కవర్ మీద రాస్తున్నాను..

నేను రాధిక గారితో ఫోన్లో ఈ విషయం చెప్పినప్పుడు తన గొంతులో వినిపించిన ఆశ్చర్యం, సంతోషం కళ్ళెదురుగా కనిపించినట్లనిపించింది.. అసలు మొదటిసారిగా మాట్లాడుతున్నాను అన్న సంగతి మా పెళ్ళి న్యూస్‌తో మరుగునపడిపోయింది.. నేనెప్పుడూ ఇంతే, ఏమన్నా చెప్పమంటే ఒక పుస్తకం రాసేస్తాను.. కానీ ఈ విషయాన్ని సవివరంగా చెప్పుకునేది మీ ఇద్దరి దగ్గరే కదా!

మీరు హైదరాబాదుకి తిరిగి రాగానే ఉత్తరం రాయండి.. మళ్ళీ మేమిద్దరం కలిసి మీతో మాట్లాడుతాము.. ఇప్పటికే వికాస్‌కి మీ గురించి చెప్పి చెప్పి ఊదరగొట్టేశాను.

ఈసారి పిల్లల్ని పలుకరించడానికి పల్లెటూరి ఆంటీకి పట్టణం అంకుల్ కూడా తోడయ్యారని చెప్పండి.
ఇప్పటికి సెలవు.
**కార్తీక**

*** *** *** ***

ఆగస్ట్ 11, 1986
హైదరాబాదు

**ప్రియమైన కార్తీకకి,**
ఎలా ఉన్నారు మీ ఇద్దరూ? నీకు ఉత్తరం రాద్దామని మొదలుపెట్టి నువ్వు రాసినదే పట్టుకుని ఎన్ని సార్లు చదివానో గుర్తు లేదు.. జరిగిన విషయాలన్నీ వివరంగా రాసినందుకు చాలా సంతోషం వేసింది.. అప్పటికే ఎండింగ్ తెలియబట్టి సరిపోయిందిగానీ లేకపోతే ఏ పాపులర్ నవలకీ తక్కువగా లేదు మీ కథ! అలా కోపంగా చూడకు.. సరదాగా అంటున్నాలే.. అయినా సంప్రదాయాలూ, పెద్దతనం లాంటి విషయాల వల్ల మీ అమ్మమ్మ గారు మీ పెళ్ళికి ఒప్పుకోలేకపోయారేమో కానీ కాలం గడిచిన కొద్దీ ఆమె మనసు మారుతుందనడంలో సందేహం లేదు.. తెల్సు కదా ప్రేమనే విషయానికి మన పెద్దవాళ్ళు ఏ మాత్రం గౌరవం ఇస్తారో!! అయినా మీ కథ ప్రేమకథ కిందకి వస్తుందా లేదా? మీ వికాస్‌ని కూడా కనుక్కుని వచ్చే ఉత్తరంలో సమాధానం రాయడం మర్చిపోకు.

నేను పూనా నుంచి వచ్చి వారమైంది.. పిల్లల్ని మాత్రం చాలా మిస్ అయ్యాను.. వాళ్ళు కూడా అంతే, నేను ఇంట్లో ఉన్నంతసేపూ నా కాళ్ళ చుట్టూనే! వీలైనంతవరకూ సమయాన్ని వాళ్ళతోనే గడపడానికి ప్రయత్నిస్తున్నాను.. అయినా కొన్ని పనులు మాత్రం తప్పడంలేదు.. చెప్పాను కదా, ఈ మధ్య తీవ్రవాదం మీద అవేర్‌నెస్ తీసుకురావడానికి ఒక గ్రూప్ మొదలుపెట్టామని.. దాని కోసం ఒక వీడియో డాక్యుమెంటరీని తయారు చేసే బాధ్యత నా మీద పెట్టారు.. సో, దానికోసం కొంతమందిని ఇంటర్వ్యూ చేయడం లాంటివి చేస్తున్నాను ప్రస్తుతం.

మొన్నొక రెండు రోజులు మా తిరుపతి స్నేహితుడు నరసింహం వాళ్ళ అబ్బాయి కాలేజీ పనిమీద సిటీ కొచ్చి మా ఇంట్లోనే ఉన్నారు.. చాలా సరదాగా గడిచిపోయింది సమయమంతా! వాళ్ళు వెళ్ళిపోయాక నాకూ, రాధికకీ మనసులో ఒకటే భావం,

నిన్న అదే, మిమ్మల్నిద్దరినీ ఎప్పుడు చూస్తామో అని! శ్రీరామనవమికి మీఊరికి వద్దాము అనుకుంటూనే ఉన్నాము ఇప్పుడు వినాయకచవితి వెళ్ళినా కుదిరేటట్లు లేదు. అయినా మేము ఇప్పుడొచ్చినా 'ఎవరండీ మీరు?' అని మొహం మీదే తలుపేసేస్తావేమో కదా! మరి కొత్తకాపురం కదా!

కొత్తకాపురం అంటే గుర్తొచ్చింది, మీరు హనీమూన్ కి ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నారు? మైసూరు, ఊటీ అయితే నా స్నేహితుడొకడికి ట్రావెలింగ్ ఆఫీసు ఉంది.. బస్సు టికెట్ల నించి హోటెల్ అకామడేషన్ వరకూ వాళ్ళే చూసుకుంటారు.. మీకు అటువైపు వెళ్ళే ఉద్దేశ్యం ఉంటే నాకు చెప్తే అరేంజ్ మెంట్స్ చేస్తాను.. You know I will be very happy to do it.. so, please don't hesitate.

ఇక ఇంటి పనుల విషయాలకొస్తే రాధికని సంప్రదించొచ్చు.. 'భర్తని సాధించడం ఎలా?' అన్న విషయం తోపాటు ఇంకెన్నో అవసరమైనవి చెప్పగలదు నీకు. నాకు తెల్సు, దగ్గర ఉంటే గనక కత్తీ డాలూ తీసుకుని నా మీద యుద్ధానికి వచ్చేదానివని.. అయినా గానీ నీకు పెళ్ళైపోయిందని తల్చుకుంటే భలే గమ్మత్తుగా ఉంది తెలుసా! ఇక నించీ నువ్వు కూడా అందరి లాగా 'ఈపూటకి ఏం వండాలి.. వడియాలు పెట్టుకోవాలి.. బూజులు దులపాలి' అనుకుంటూ ప్రణాళికల మీద ప్రణాళికలు వేసుకుంటావేమో!

ఇంకేమిటి సంగతులు? చాలా రోజుల తర్వాత నేను మళ్ళీ నా టేబుల్ ముందు కూర్చుని, రాత్రి చెప్పే కబుర్లు వింటూ ఏమన్నా రాద్దామని సిద్ధమౌతున్నాను.. రాధికేమో 'అప్పుడే మల్లెపూల సీజన్ అయిపోయిందే' అని మల్లెపందిరి వంకే చూస్తూ కూర్చుంది.. పనేమీ లేకపోయినా చీకట్లోకి అలా చూస్తూ కుర్చోవడం తనకిష్టం.. 'అదేం ఆనందం!?' అనడిగితే "పని లేదని నేను పడుకుంటే మీరిలా తెల్లవార్లూ కూర్చుండిపోతారు" అని నా తిరిగి మీదకే బాణం సంధిస్తుంది!

నాన్న గారికి కొంచెం వంట్లో బావుండటం లేదంట.. రోజు విడిచి రోజు ఫోన్ చేస్తూనే ఉన్నాకానీ రెండు, మూడు రోజుల్లో వెళ్ళి ఒకసారి చూసి వస్తేగానీ మనసు కుదుటపడదు.

నీ కొత్తజీవితం గురించి వీలున్నప్పుడల్లా రాస్తుండు.. వికాస్ ని మరీ మరీ అడిగినట్లు చెప్పు.
వంశీ

*** *** *** ***

సెప్టెంబర్ 21, 1986
వెంకటాపురం

ప్రియ నేస్తానికి,
ఎలా ఉన్నారు? మీ నాన్నగారిని చూసొచ్చారా? ఆయనకిప్పుడు వంట్లో ఎలా ఉంది?

మా జీవితం ఎలా సాగుతోందీ అని కదా అడిగారు.. అప్పుడెప్పుడో మాధురి తన ప్రేమకథ గురించి చెప్తూ "నీకంటూ ఒక ఆత్మీయుడు దొరికితే తప్ప నేచేప్పేది అర్థం కాదు" అన్న మాటల్లోని నిజం ఇప్పుడర్థమౌతుంది.. మాటలు, తాగాదాలు, అలకలు, ఆలోచనలూ ఇదే మాలోకం.. ఇదివరకు లంకంత ఇంట్లో ఉన్నా ఈ మూడు గదుల్లో ఉన్నంత స్వేచ్ఛని అనుభవించలేదు.. నాచుట్టూ తిరుగుతూ, నాతోనే ఉండే ఇంకో మనిషితో కలిసి పనులన్నీ చేసుకోవడం ఒక ఊహించని అనుభూతి.

మీరడిగిన ప్రశ్న, అదే 'మాది ప్రేమ వివాహమా కాదా'? అని వికాస్‌ని అడిగాను.. తను నవ్వేసి "కాదు, ఇష్ట వివాహం అని చెప్పు" అన్నారు.. నవ్వుకోకండి, నేను చెప్పిన విషయాల్ని బట్టి తనని సీరియస్ మనిషిగా ఊహించేసుకున్నారేమో కదూ! అసలు ఇంత హఠాత్తుగా నిర్ణయం ఎలా తీసుకున్నాననేగా మీ సందేహం.. ఒకటి మాత్రం చెప్పగలను, ఒకవేళ వికాస్ పెళ్ళి గురించి ప్రపోజ్ చేయకపోయినా తను చేసే పనులన్నిటిలో తప్పకుండా సహాయం చేసేదాన్నే.. ఇన్ని నెలలుగా పరిశీలిస్తున్నాను కదా.. తను చేసే పనులు, వాటి మీద తనకున్న నిబద్ధత చూశాక తన పట్ల ఒకలాంటి మౌన విశ్వాసం పెంచుకున్నాను! ఆ విశ్వాసమే నన్ను ఇంత తొందరగా ఒప్పుకునేలా చేసిందేమో!

అసలు తను ఉంటే చుట్టూ ఒకలాంటి చైతన్యం.. పొద్దున్నే నేను స్కూల్‌కి, తను కాలేజ్‌కి వెళ్ళడం.. మళ్ళీ సాయంత్రం నేను వెళ్ళి తనని శరణాలయంలో కలవడం.. అక్కడ ఓ రెండు గంటలు పిల్లల చదువు గురించి విచారించి తిరిగి ఇద్దరం ఇంటికి రావడం.. ఇదివరకులా వికాస్ రాత్రిళ్ళు అక్కడ ఉండటానికి కుదరదు కాబట్టి ఒక్కోసారి తనకు వేరే పనులున్నా నేను మాత్రం తప్పనిసరిగా వెళ్ళొస్తున్నాను.

ఇంకా వేరే పనులేముండొచ్చు అనుకుంటున్నారా.. ఉదాహరణ చెప్తాను వినండి.. ఈ వెంకటాపురం చుట్టూ ఉన్న ఇంకో నాలుగైదు ఊళ్ళకి కలిపి ఒక చిన్న ఆసుపత్రి లాంటిది ఉంది.. జనాలు జ్వరాలు, చిన్న చిన్న దెబ్బలు, కడుపు నొప్పి లాంటివాటికి అక్కడికి వెళ్తుంటారు.. ఆ ఆసుపత్రి పెట్టిన రెండు నెలలకే ఒకావిడ జ్వరం ఉందని వెళ్తే సరిగ్గా డయాగ్నిసిస్ చేయకుండా టైఫాయిడ్ జ్వరాన్ని మామూలుగా ట్రీట్ చేయడంతో ఆవిడ చనిపోయింది.. అది జరిగి వారం కాకుండానే ఇంకో రైతుకి కాలికి తగిలిన దెబ్బని క్లీన్ చేయడంలోనూ డ్రెస్సింగ్ చేయడంలోనూ సరైన జాగ్రత్త తీసుకోకపోవడంతో కాలు మొత్తం బాగా వాచిపోతే బందరు తీసుకెళ్తే సెప్టిక్ అయిందని మోకాలు వరకూ తీసేసారు.. ఇంత ప్రాథమిక విషయాలలోనే తప్పులు జరగడం చూసి వికాస్ స్నేహితుల సహాయంతో ఎంక్వయిరీ చేయిస్తే ఆ డాక్టరుకుంది నకిలీ లైసెన్స్ అని తెలిసింది.. ఇక అతని మీద పోలీసు కంప్లైంట్ ఇచ్చినా ఫలితం లేకపోవడంతో వికాసే ఊరి పెద్దలతో మాట్లాడి, అందరితో కలిసి ఆ డాక్టరు కాని డాక్టరు ఊరి విడిచి వెళ్ళేలా చేశారు.

ఇలాంటి విషయాల మీద చర్చలు లాంటివన్నీ ఇంట్లోనే జరుగుతాయి.. వికాస్ స్నేహబృందమంతా ఆవేశంగా అది చేద్దాం, ఇది చేద్దాం అంటుంటే వికాస్ ఏమో చేసేదేదైనా ప్రణాళికా బద్ధంగా చేయాలంటారు.. ముందు చట్టప్రకారం ట్రై చేసి కుదరకపోతే అప్పుడు ఆందోళన కార్యక్రమాలు చేయాలంటారు.. వాళ్ళ కాలేజీ ఉన్న ప్రాంతంలో మంచి నీటి పైపులతో డ్రైనేజ్ లైన్లు

కలిసిపోవడంతో నీళ్ళు వాడలేని పరిస్థితులలో ఉన్నారు.. అందుకే పదిహేను రోజుల క్రితం నేను ఆ చుట్టుపక్కన ఉన్న ఇళ్ళ వాళ్ళందరి దగ్గరా సంతకాలు తీసుకుంటే ఒక అప్లికేషన్ తో సహా వాటిని కలెక్టరుకి సబ్మిట్ చేశాము.

ఇది జరిగిన రెండు రోజులకి అనుకుంటాను అందరం ఇంకా ఈ విషయం మాట్లాడుకుంటుంటే అప్పుడే వచ్చిన వికాస్ స్నేహితురాలు వనజ చెప్పింది బందరులో అందాల పోటీలు నిర్వహించబోతున్నారని! నాకు చాలా ఆవేశం వచ్చింది.. "ఇప్పటికే రేజర్ బ్లేడు, లుంగీలు లాంటి వస్తువులకి కూడా అమ్మాయిలనే మోడల్సుగా చూపిస్తూ ఆడవారి మీదుండే గౌరవాన్ని దిగజారుస్తున్నారు.. దానికితోడు మచిలీపట్నం లాంటి చిన్న చిన్న పట్టణాల్లోకి ఈ సగంబట్టల పోటీలు మొదలితే సామాజిక విలువలు తగ్గుతాయనడంలో అస్సలు సందేహం లేదు.. అసలు ఆత్మ సౌందర్యంకంటే బాహ్య సౌందర్యానికే పెద్దపీట వేసే ఇలాంటి పోటిల వల్ల యుక్తవయసు వనితల్లో ఎలాంటి పోటీ వాతావరణాన్ని సృష్టిస్తున్నారో వీళ్ళకి అర్థం కావటంలేదు" అంటూ గట్టి గట్టిగా మాట్లాడుతున్న నన్ను చూసి వికాస్ "మరైతే వాటిని ఆపే ప్రయత్నం ఎందుకు చేయకూడదు? అదీ నీలాంటి అమ్మాయిలే అయితే వాదనకి బలం ఉంటుంది" అని వనజ వైపు తిరిగి తన మిగతా స్నేహితురాళ్ళకి కూడా ఈ విషయం చెప్పమన్నారు.. ఇక చూడండి, నాలో ఒక ఉత్సాహం.. తెల్లవార్లూ కూర్చుని ఆ అందాల పోటీలకి వ్యతిరేకమైన నినాదాలతో హోర్డింగ్ బోర్డులను తయారు చేశాను.. పోటీలు జరగడానికి ముందు 4రోజుల నుంచీ వాటిని స్పాన్సర్ చేస్తున్న కంపెనీ ఆఫీసు ఎదురుగా బోర్డ్స్ పట్టుకు నుంచుని మౌన ప్రదర్శన చేశాము.. ఆ విషయం కాలేజీలకి పాకి తర్వాత నించి ఆ అమ్మాయిలందరూ, ఒక మహిళా సంఘం వాళ్ళూ మాతో కలిసేసరికి ఆ చిన్న నిరసన ఒక ప్రభంజనంలా తయారయింది.. మహిళా శక్తి అంతా ఒక్కటయ్యేసరికి కంపెనీ వాళ్ళకి పోటీలను రద్దు చేయక తప్పింది కాదు! ఆ రోజైతే నన్ను పట్టుకోవడం ఎవరివల్లా కాలేదు తెలుసా.. వ్యక్తిగతంగా నేను సాధించిన మొట్టమొదటి విజయం అది!

ఇంత చైతన్య లాహిరిలో మునిగి తేలుతున్న మాకసలు హనీమూన్ లాంటివేమీ గుర్తులేవంటే, అసలు అలా వెళ్ళాలనే కోరిక కూడా లేదంటే నమ్ముతారు కదా! అయినా మీరేంటీ రాధిక గారి స్కిల్స్ గురించి తెగ జోక్స్ వేస్తున్నారు.. మిమ్మల్ని అంత సాధించబట్టేనా పాపం హాయిగా అన్ని ఊర్లు చుట్టొస్తున్నారు!! మళ్ళీ రైటింగ్ మీద ధ్యాస పెడుతున్నందుకు సంతోషంగా ఉంది.. అసలు ఇందాకే నేను వంట చేస్తుంటే పక్కన 'పల్లకి' చదువుతూ 'ఇదిగో మీ ఫ్రెండ్ రాసిన కవిత పడింది' అంటూ మీ '**అప్పుడప్పుడు**' చదివి వినిపించారు.

"అలవోకగా అగుపించిన ఏదో దృశ్యం
సమాధిలోంచి జ్ఞాపకాల్ని తవ్వుతుంది..
హఠాత్తుగా ఆవరించిన ఏదో ఆలోచన
ఆనాటి అగాధాల్లోకి మనసుని విసిరేస్తుంది..
కాలకన్య కదిలించిన ఏదో అనుభూతి
అంతరాంతరాల్ని అల్లకల్లోలం చేస్తుంది..
కాపాడుకుంటే జీవితమో రతనాల గని!
అదుపు తప్పితే అదే వరద గోదావరి!!"

నిజంగా నిస్పృహలో నీరసించిన ఏ మనసునైనా ఊరడించగల శక్తి మీ కవితలకి ఉంది వంశీ గారూ! ఇది నేనంటున్న మాట కాదు, వికాస్ మీతో చెప్పమన్న మాట! వీలుదొరకగానే మళ్ళీ మీతో తప్పకుండా మాట్లాడుతానన్నారు. నా వీరనారీ కథలన్నీ చెప్తూ అసలు విషయం మర్చేపోయాను.. మీరు పంపిన శుభాకాంక్షల గ్రీటింగ్ తోపాటు, అతి జాగ్రత్తగా పాక్ చేసి పంపిన నిర్మల్ పెయింటింగ్ కూడా వచ్చింది.. నిజంగా మీ టేస్టుకి అబ్బురపడుతూనే మీమీద కినుక వహించాలని ఉంది.. మరి ఇంత ఖర్చుపెట్టి పంపడం అవసరమా చెప్పండి!!

మారిన జీవితం మనోహరంగా ఉంది నేస్తం.. అమ్మమ్మ వాళ్ళు ఎప్పుడు మమ్మల్ని దగ్గరకు తీసుకుంటారో నన్న ఎదురుచూపులు తప్ప చుట్టూ ఆనందపు నెలవంకలే! వికాస్ రేపటి క్లాసు కోసం ప్రిపేర్ అవుతుంటే బయట వీధిదీపం వెలుగులో మసకబారిన చీకటిని చూస్తూ మీకీ ఉత్తరం రాస్తున్నాను.. ఈ క్షణంలో నా మనోఫలకంపై మీ ఆత్మీయ దంపతులు కదలాడడం యాధృచ్చికం మాత్రం కాదు.
వీలు చూసుకుని రిప్లై రాస్తారు కదూ.
కార్తీక

*** *** *** ***

నవంబర్ 23, 1986

హైదరాబాదు

కార్తీకా,
ఆప్యాయతల స్నేహం.. అరుదైన వ్యక్తిత్వం.. వీళ్ళిద్దరూ ఎలా ఉన్నారు? ఇంకెవరో కాదమ్మా, మీరిద్దరే!

మీకేం కావాలో, కలిసి ఏం చేయాలో నిర్ణయించుకుని మీ జీవితాల్ని నా మాటల్లో చెప్పినట్టుగానే 'రతనాల గని' చేసుకుంటున్నారు.. పెళ్ళి తర్వాత అందరిలానే మామూలు జీవితం గడిపేస్తారనుకున్న నా అంచనాలని నువ్వు రాసిన ఉత్తరం తలక్రిందులు చేసింది.. నాలోనూ ఒక కొత్త చైతన్యం.. నా సమయాన్ని ఇంకాస్త సద్వినియోగపరచాలని!

సమయం అంటే గుర్తొచ్చింది.. నీకెప్పుడన్నా చెప్పానా నేను అర్గనైజర్ ఒకటి మెయిన్ టెయిన్ చేస్తానని!? నే చేయాల్సిన పనులన్నిటినీ ఒకరీతిలో పద్ధతి ప్రకారం చేయడం అలవాటు.. అందుకే ఏ రోజుకారోజు చేయాల్సినవన్నీ ఆ తేదీన డైరీలో రాస్తాను.. 99% వీలైనంతవరకూ రాత్రి పడుకునేలోపు ఆ పనులన్నీ క్రాస్ అయ్యేలా చూసుకుంటాను.. కానీ ఒక పని మాత్రం ఎప్పటినించో ఒకరోజు నించీ ఇంకో రోజుకి జరుగుతూ ఉంది.. 'అదేమిటా!?' అని ఆకాశంలోకి చూస్తూ ఆలోచించకు.. నీకు ఉత్తరం రాయడమే! ఏంటీ ఇంకో కొత్తకథ అనుకుంటున్నావా.. నిజం, కావాలంటే గౌతమ్‌ని అడుగు.. మళ్ళీ ఆ క్వొశ్చెన్ మార్క్ ఫేస్ పెట్టకు.. అప్పుడప్పుడూ సాయంత్రాలు మరుసటిరోజుకి లిస్ట్ రాసుకునేముందు ఆరోజుకి అయిపోయిన పనులని క్రాస్ ఆఫ్ చేయడానికి వాడిని పిలుస్తాను..వాడికెంత ఇష్టమైన పనో అది! పేజీ మొత్తం గీస్తానని

కూర్చుంటాడు.. మళ్ళీ ఏదో ఒక తెల్లకాగితం ఇచ్చి గీసుకోరా అంటే కుదరదంటాడు.. అలా 'కార్తీకకి ఉత్తరం' మీద వాడి చెయ్యి వెళ్ళకుండా ఉండడానికి చాలా కష్టపడాల్సివస్తుంది!!

అసలయినా ఈ ఉత్తరాల గొడవ లేకుండా మనం పక్క పక్క ఇళ్ళల్లో ఉంటే ఎంత బావుండేదో కదా! ఈసారి నీ ఉత్తరం చదువుతుంటే ఇలానే అనిపించింది.. సమాజసేవ, సాహితీ చర్చలు, సినిమాలు, కలిసి భోజనాలు.. ఎంత సందడిగా ఉంటుందో! మీ హీరోకి ఇక్కడే ఏదో కాలేజీలో ఉద్యోగం చూస్తాను కానీ వచ్చేయకూడదూ! అసలు నీకో ముఖ్య విషయం చెప్పాలి.. మనందరం కలిసి ఉండటం కాదు కానీ నేను దూరంగా వెళ్ళే పరిస్థితొచ్చింది.

మా కంపెనీ వాళ్ళు నన్నొక అస్సైన్ మెంట్ మీద అమెరికాకి పంపుతున్నారు.. 8 టు 10 మంత్స్ ఉండాలి. జనవరి 5న ప్రయాణం.. నిన్ననే పేపర్ వర్క్ అంతా ఫైనలైజ్ అయి కన్ఫర్మ్ చేశారు.. ఇక డిసెంబర్‌లో వీసా పనులవీ చూసుకోవాలి.. నిన్నంతా అసలు ఎంత హాపీగా అనిపించిందో కానీ ఇవాళ పొద్దున్నుంచీ రాధిక దిగాలు మొహం చూస్తుంటే ఒక్కసారి రియాలిటీ లోకి వచ్చిపడ్డాను.. అన్ని నెలలు ఇంటికి, ఇంట్లోవాళ్ళకి దూరంగా ఉండాలని తలచుకుంటే భయం సంగతేమో కానీ కాస్త గాభరాగా ఉంది.. మరేం లేదు పిల్లలతో రాధిక ఎలా ఉండగలదో అని!

ఇంకో నెలన్నర టైం ఉన్నా వెళ్ళేలోపు పూర్తి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి.. అందుకే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ముందు నీకు ఉత్తరం రాస్తున్నాను.. ఇంక వెళ్ళేలోపు రాయడానికి కుదరకపోవచ్చు.. నాకు తెలుసు నువ్వక్కడ రోటి ముందు కూర్చుని కారాలు మిరియాలు నూరుతూ ఉంటావు.. అవును మరి పరిచయం అయినప్పటి నించీ మమ్మల్ని మీ ఊరికి రమ్మని పిలిస్తూనే ఉన్నావు.. అదిగో, ఇదిగో అని దాటవేస్తూనే దేశాలు దాటివెళ్ళిపోతున్నాననేగా నీ కోపం! నేను తిరిగి వచ్చేసరికి నువ్వు నన్ను ఎరగనట్లు ఫేస్ పెట్టినా మేమంతా ఒక వారం అయినా తిష్టవేస్తాము.

అసలు విషయం అడగడం మర్చిపోయాను, మీ అమ్మమ్మ గారి ధోరణిలో ఏమన్నా మార్పు ఉందా? మీ సంతోషంలో వాళ్ళుకూడా పాలుపంచుకుంటే బావుంటుంది! అసలు ఇంకెవరినైనా పెద్దవాళ్ళని పంపి కాస్త సామరస్యంగా ఆవిడని ఒప్పించే ప్రయత్నం చేస్తే బావుంటుందేమో! ఆవిడ అనుకుంటుందేమో పత్రికలవాళ్ళు కూడా ఇంక ఉత్తరాలు రాయటంలేదని!

మీ ఫ్రెండ్ మాధురి ఎలా ఉన్నారు? నా ఉద్దేశ్యం ప్రకారం వాళ్ళు కూడా మీరిప్పుడు ఉంటున్న ఊళ్ళోనే ఉంటున్నారు కదూ! మరి రాజారావు గారు కూడా మీ స్కూల్లోనే పని చేస్తారు కదా! పెళ్ళిళ్ళైనా మళ్ళీ మీరిద్దరూ ఒకే చోటికి చేరి ఉంటారు! వాళ్ళకి, భూషణంగారు వాళ్ళకి కూడా నా ప్రయాణం గురించి ఓ మాట చెవిన వేయి.

ఈసారెందుకో రాత్రయ్యేవరకూ ఉండకుండా సాయంత్రమే నీకు రాసేస్తున్నాను.. పోస్ట్‌పోన్ చేసినకొద్దీ ఏవో కొత్త పనులొస్తాయేమోనని భయం.. ఐదవబోతుంది టైం.. పగలంతా జాగింగ్ చేసిన సూర్యుడు ఎర్రబడ్డ మొహంతో అలసటగా పడమటి కొండలవైపు నడుస్తున్నాడు.. మళ్ళీ కుదురుతుందో లేదో ఏదన్నా రాసుకోవాలని అనిపిస్తుంది.. అందులోనూ

వెళ్ళేలోపు 'మయూరి', 'పల్లకి' వాళ్లకి రాసివ్వాలి.

మరి నేవెళ్ళేలోపు నీ కబుర్లు వస్తాయని అనుకుంటున్నాను.. నాకు రాయడానికి సమయం లేకపోయినా తర్వాత మాత్రం టైం ఉన్నప్పుడల్లా రాధికని పలుకరిస్తుండు.. అయినా ఇకనించీ ఎప్పుడూ నీఒక్కదాని కబుర్లే కాకుండా వికాస్ మాటలు కూడా యాడ్ చేస్తుండు. తనని మరీ మరీ అడిగినట్లు చెప్పు.

హమ్మయ్యా, ఇంకో ఏడెనిమిది నెల్ల వరకూ ఈయన ఉత్తరాల గొడవ ఉండదనుకుంటున్నావేమో అక్కడకి వెళ్ళాక అన్ని విశేషాలతో మళ్ళీ రాస్తాను.
అంతవరకూ సెలవా మరి.
వంశీ

*** *** *** ***

డిసెంబర్ 25, 1986
వెంకటాపురం

ప్రియ నేస్తానికి,
అక్కడ అంతా బావున్నారు కదూ? సర్‌ప్రైజింగ్ న్యూస్‌లు ఇవ్వడంలో నన్ను మించిపోతున్నారుగా మీరు!! అసలు మీమీద చాలా కినుక వహించాను నేను.. ఈసారి నేను కూడా మూడునెల్ల కంటే ముందుగా మీకు రిప్లై రాయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను.. కానీ మీ ప్రయాణం సంగతి చెప్పి నా ప్రతిజ్ఞని తప్పేలా చేస్తున్నారు.. హార్టీ కంగ్రాట్యులేషన్స్ మిత్రమా! ఇప్పటివరకూ ఒక కవి గారు నా స్నేహితులని గొప్పగా చెప్పుకునేదాన్ని.. ఇప్పుడు ఫారిన్ కవి గారు నా ఫ్రెండ్ అని చెప్తాను.. నా లెవల్‌ని ఎంతలా పెంచేస్తున్నారో మీరు!!

నేను కూడా ఒక న్యూస్ చెప్పాలి.. మీరు తిరిగొచ్చేసరికి ఆదిత్య, గౌతమ్‌లకి ఆడుకోవడానికి ఇంకో బుల్లి ఫ్రెండ్ రాబోతున్నారు.. మీరూహిస్తున్నది కరక్టే, మా ఇంటి జనాభా సంఖ్య రెండు నించి మూడుకి పెరగబోతోంది.. కానీ ఎందుకో అంత ఉత్సాహంగా లేదు వంశీ గారు.. అమ్మమ్మ ధోరణిలో కొంచెం కూడా మార్పు లేదు.. ఇలాంటి వార్తలు పెద్దవాళ్ళతో పంచుకుంటే ఇంకా సంతోషంగా అనిపిస్తుంది కదా.. తనకేమో మా ఊసే పడట్లేదంట.. మా 'ఎంకి' సుబ్బులు గుర్తుంది కదా, తనని అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండమని చెప్పాను.. అప్పుడెప్పుడో మేము అందాలపోటీలు ఆపడానికి చేసిన ప్రదర్శన గురించి ఎవరో అమ్మమ్మ చెవిన వేస్తే "అది అలా రోడ్ల పట్టిపోతుందని నాకు ముందే తెలుసు" అందంట.. ఇలాంటి మాటలు విన్నప్పుడల్లా స్వయంగా వెళ్ళి పలుకరించాలన్న ఆలోచనకి గండి పడుతుంది! ఏమి చేసి తనకి నామీదున్న కోపాన్ని తగ్గించగలనో తెలీదు.. ఈ పెద్దవయసులో వాళ్ళిద్దరూ ఎలా ఉన్నారో అనేదే నా బాధ.. కనీసం తాతయ్య అయినా మమ్మల్ని చూడటానికి రాలేదు.. సుబ్బులు చెప్తోంది ఇప్పుడింట్లో చిన్నమ్మమ్మ కొడుకు కుటుంబం వచ్చి ఉంటున్నారని! అదివరకు చుట్టంచూపుగా వచ్చినప్పుడే వాళ్ళు చేసే అజమాయిషీని గుర్తు తెచ్చుకుంటుంటే ఇప్పటి తాతయ్య పరిస్థితి ఊహించడానికే భయమేస్తుంది!

ప్రతిరోజూ పడుకోబోయేముందు శరణాలయం పిల్లలు, పరిష్కరించిన సమస్యలు, చేయాల్సిన పనులు మననం చేసుకుంటూ ఇంత సంతృప్తినిచ్చే జీవితాన్ని  ఎన్నుకున్నందుకు ఇంకాస్త సంతృప్తి చెందే సమయంలో సరిగ్గా వాళ్ళిద్దరూ గుర్తొస్తారు! మనసంతా చేదు తిన్నట్లు అయిపోతుంది! సంతోషమంతా మన సొంతమైతే అది జీవితమెందుకవుతుంది చెప్పండి!

మర్చేపోయాను మాధురి గురించి చెప్పడం! వాళ్ళిప్పుడు మా మాజేరులోనే మాధురి వాళ్ళింట్లోనే ఉంటున్నారు.. ఓ నెలరోజులు వాళ్ళ అత్తగారింట్లో ఉందేమో అంతే! ఒకరోజు రాజారావు గారు మాధురి వాళ్ళ అమ్మా నాన్న ఉన్నప్పుడు వాళ్ళకి అల్లుడైనా, కొడుకైనా తనే అని, వాళ్ళతో పాటు ఉంటూ అన్ని పనులూ చూసుకుంటాని చెప్పి కాపురం అక్కడే పెట్టేశారు! మాధురి వాళ్ళ నాన్నకి ఆ ఇంటికి వచ్చే అవసరం లేకుంటే అంతకంటే కావాల్సిందింకోటి లేదు! మా సుబ్బులు అంటోంది, మాధురి వాళ్ళాయనలో అప్పుడే మోతుబరి లక్షణాలు వచ్చేశాయని, అందరిని అజమాయిషీ చేయడం లాంటివి ఎక్కువైపోయాయని! మాధురికి అతని నిర్ణయం నచ్చలేదనిపిస్తోంది.. తను పుట్టిపెరిగిన ఊరు వదిలి వెళ్ళక్కరలేదనే విషయం చెప్పినప్పుడు ఆనందంగా కాక నిస్తేజంగా కనిపించింది!

ఇక నా పెళ్ళి జరిగిన పరిస్థితి విని ఎంతలా ఆశ్చర్యపడిందో చెప్పక్కర్లేదు.. 'నువ్వేమిటి.. ప్రేమేమిటి.. పెళ్ళేమిటి!' అని సంభ్రమానికి గురవుతూనే ఆ  భాగస్వామి వికాస్ అయినందుకు అంతకంటే ఎక్కువగా సంతోషించింది కూడా! తనకే మా అమ్మమ్మ తాతయ్యలని ఒక కంట కనిపెడుతూ ఉండమని చెప్పాను.

ఇవాళ క్రిస్‌మస్ కదా నిన్నంతా శరణాలయంలో క్రిస్‌మస్ ట్రీ అలంకరించి వచ్చి, ఇవాళ పిన్నీ బాబాయిలతో కలిసి కేక్ కట్ చేసి వచ్చాము.. పండగలొస్తే అసలు పిల్లల్ని పట్టలేకపోతున్నాము తెలుసా! వినాయకచవితి నించీ ఇప్పటి వరకూ అన్ని పండగలూ ఎంత కోలాహలంగా జరిగాయో.. అప్పుడే న్యూ ఇయర్ కి పథకాలు వేసేస్తున్నారు.. గ్రీటింగ్ కార్డ్‌లు తయారు చేసేసుకుంటున్నారు.

గ్రీటింగ్ కార్డ్ అంటే గుర్తొచ్చింది, ఇంతలోనే సంవత్సరం ఎంత వేగంగా అయిపోయిందో కదా! నాకు నిన్నా మొన్నా ఆదిత్య, గౌతమ్ లకి కార్డ్ లు రాసినట్లే అనిపిస్తుంది.. రోజులు గడిచి పోతున్నాయి కానీ మిమ్మల్ని కలవడం మాత్రం కుదరడంలేదు! వచ్చే కొత్తసంవత్సరమైనా మిమ్మల్ని చూపిస్తే బావుండు.. ఇక్కడికి వస్తామని ఊరిస్తూనే సముద్రాలు దాటివెళ్తున్నారు.. మీకిలా ఉత్తరం రాసినప్పుడూ, మీ గురించి మాటల్లో వచ్చినప్పుడూ అసలు ఎప్పుడెప్పుడు చూద్దామా అనిపిస్తుంది..  కేవలం ఉత్తరాల్తోనే ఇంత దగ్గరతనం సాధ్యమా అని సందేహం వస్తుంది కూడా! మీరన్నట్లు ఇక పక్కపక్క ఇళ్ళల్లో ఉండుంటే ఇంకెంత హడావిడి చేసేవాళ్ళమో!

అదిసరేగానీ మీరన్ని నెలలు దేశాలు పట్టి పోతుంటే రాధిక గారు పిల్లలతో ఎలా ఉంటారు చెప్పండి.. ఈ సంవత్సరం ఆదిత్యని మా స్కూల్లో జాయిన్ చేస్తాను కానీ మీరు వెళ్ళేలోపు వాళ్ళ ముగ్గురినీ మా ఊరికి పంపేయకూడదూ, ప్లీజ్.. రాధిక గారికి

ఇక్కడ చాలా నచ్చుతుందని హామీ ఇస్తున్నాను! తప్పకుండా 'సరే' అంటారని ఆశిస్తున్నాను.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు మీ ప్రయాణం, పర్యటన నిర్విఘ్నంగా సాగాలని మా ఇద్దరి ఆకాంక్ష.
అక్కడకెళ్ళాక వీలుచూసుకుని ఒక్క ఉత్తరమన్నా రాస్తారు కదూ.
**కార్తీక**

*** *** *** ***

మార్చ్ 17, 1987
హైదరాబాదు

**డియర్ కార్తీకా,**

మీరూ, వికాస్ బావున్నారని తలుస్తాను. ఇక్కడ అంతా క్షేమమే. మీ ఊరుకి రమ్మని ఆహ్వానించినందుకు చాలా సంతోషం వేసింది. నిజంగా నాకూ ఈయన లేకుండా ఇక్కడ ఉండబుద్ధి కావడంలేదు. ఆదిత్యని మీ స్కూల్లో జాయిన్ చేసే ఆలోచన బానే ఉన్నా మళ్ళీ తిరిగొచ్చాక ఇక్కడ ఇదే స్కూల్లో అడ్మిషన్ దొరకడం చాలా కష్టం. ఏమిటో ప్రొఫెషనల్ చదువులక్కూడా ఇన్ని తలనొప్పులు ఉండవేమో అనిపిస్తుంది!

ప్రస్తుతం అమ్మానాన్నా నా దగ్గరే ఉంటున్నారు. తమ్ముడు ఇప్పుడు బెంగుళూరు లో జాబ్ చేస్తున్నాడు కదా అందుకే ఇద్దర్నీ వచ్చేయమన్నాను. మామూలుగా అయితే అమ్మానాన్నా మన దగ్గర ఉంటే ఎంత ఆనందంగా ఉంటుందో కదా. కానీ ఇప్పుడు ఏ సంతోషమూ ఈయన మా దగ్గర లేరన్న నిజాన్ని దాయలేకపోతోంది. అసలు టైం ఎంత స్లోగా నడుస్తుందో చెబితే నమ్మరు. ఇంటి నిండా బోల్డంత పని ఉంటుంది. అన్నీ పూర్తిచేసేసరికి ఏ రెండు మూడు రోజులైతే బావుండునో అనిపిస్తుంది. తీరా చూస్తే రెండు మూడు గంటలైతే గగనం. నాకు తెలిసీ పెళ్ళై వచ్చేక అమ్మావాళ్ళ గురించి కూడా ఇంత దిగులు పడ్డ సందర్భాలు లేవు! ఈ బంధంలో ఉన్న విచిత్రమేమిటో అసలు కొన్ని నెలల ఎడబాటును తట్టుకోవడం చాలా కష్టమనిపిస్తుంది.

అప్పుడప్పుడూ తను రాసుకునే టేబుల్ దగ్గర కూర్చుని ఆ పెన్, పేపర్స్, ఉత్తరాల దొంతరలు అన్నిటినీ చూస్తు పరాకుగా అయిపోతాను. అమ్మొచ్చి ఉన్నట్టుండి కదిలించేసరికి తన ఆలోచనల నించి బయటకి లాక్కొచ్చినందుకు కోపం వెంటనే బాధ కలిసి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతాయి. ఏమిటో పూనా వెళ్ళినప్పుడు ఇంత దిగులనిపించలేదు.. ఇవాళ కాకపోతే రేపొచ్చేస్తారుగా అనుకునేదాన్ని. ఇప్పుడు తను రావడానికి ఎన్ని రేపులు రావాలో అని అనుకుంటుంటే ఒక్కసారిగా నిస్సత్తువుగా అనిపిస్తుంది.

నన్ను చూడండసలు! ఈ సమయంలో మీ గురించీ, మీలో పెరుగుతున్న పాపాయి గురించి అడగడం మానేసి నా బెంగంతా కుమ్మరించేస్తున్నాను. ఏం చేయను, మీకంటే మా ఇద్దరి గురించి తెలిసిన ఆత్మీయులు లేరు. ఇంతకీ మీ ఆరోగ్యం బాగా చూసుకుంటున్నారా? మీ ఇద్దరూ ఎన్నో పనుల్లో తిరుగుతూ ఉంటారని తెలుసు. కానీ ఈ చివరి నెలల్లో అయినా మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి. వేళకి మంచి ఆహారం, పళ్ళు తీసుకుంటున్నారు కదా.

మీకు తెలుసా, నేను ప్రైవేటుగా బి.ఏ కి కట్టబోతున్నాను. మీ స్ఫూర్తితోనే! అప్లికేషన్ పెట్టడం అయిపోయింది. ఇంక పుస్తకాల గురించి చూడాలి. మీ దగ్గరకి రాకపోవడానికి ఇది కూడా ఒక కారణం. గౌతమ్‌ని ఎల్.కె.జి లో జాయిన్ చేయడానికి కూడా ఒక తతంగం ఉంది. తను లేకపోవడం వలన చాలా పనులు నా అంతట నేనే చేసుకోవాల్సివస్తుంది. ఇదొక కొత్త కాన్ఫిడెన్స్ ఇస్తుంది కూడా!

మీ కవిగారు లేరని మామీద పూర్తిగా శీతకన్ను వేయకుండా ఉత్తరాలు రాస్తుండండి. తను వారానికొకసారి ఫోన్ చేసినప్పుడల్లా మీ ఇద్దరి గురించి గుర్తుచేసుకోకుండా సంభాషణ ముగించరు.
వికాస్ గారిని, సులోచన గారి దంపతులనీ, మీ ఫ్రెండ్ మాధురినీ అడిగినట్లు చెప్పగలరు.
మీ ఆరోగ్యం జాగ్రత్త.
**రాధిక**

*****  ***  ***  *****

మే 5, 1987
**వెంకటాపురం**

**ప్రియమైన రాధిక గారికి,**
ఎలా ఉన్నారు అని అడగడం అవివేకమే అవుతుంది.. మీ ఉత్తరం చదివాక వెంటనే మిమ్మల్ని పిల్లల్ని ఇక్కడికి తీసుకొచ్చేయాలనిపించింది! కానీ అలా చేయకుండా మీరు చెప్పిన కారణాలు సైంధవుల్లా అడ్డుపడ్డాయి.

మీ బి.ఏ కి ఏవైనా పుస్తకాలు కావాలంటే చెప్పండి. మన లెక్చరర్ బాబుకి పని చెబ్దాం.. సడలేవరకూ మన ప్రతి ఆలోచనా ఒక గొప్ప నమ్మకంగా నిలుస్తుందనుకుంటా! ముందు పెళ్ళి విషయంలో, ఆ తర్వాత ఎం.ఫిల్ విషయంలో ఇదే విషయం అనుభవమైంది నాకు.. అప్పట్లో నాకెవరి అవసరం రాని ఒంటరి ఉన్నత స్థానం సాధించాలని, దానికి పై చదువులే మార్గమని అనుకున్నాను.. అందుకే అమ్మమ్మకి తెలీకుండా మీ ఊరొచ్చి మరీ ఎం.ఫిల్ కి అప్లై చేశాను.. కానీ ఇప్పుడు చుట్టుపక్కల సమాజంలో ఉన్న సమస్యలను చూస్తూ, అన్నీ కాకపోయినా కొన్నిటినైనా పరిష్కరించ గలిగే శక్తి ఉన్న నాలాంటివాళ్ళు చదువు పేరుతో చుట్టూ ఒక కోట కట్టుకోవడం తగదేమో అనిపించింది.. అందుకే వికాస్ ఎంత చెప్పినా ఇంక చదివే ఆలోచనని ప్రస్తుతానికి వాయిదా వేసుకున్నాను.

ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నారని అదేపనిగా చెప్పుకుంటున్నాము.. కానీ కంటికి కనిపించని ఎన్ని చీకటి కోణాలున్నాయో ఊహించలేము.. ముఖ్యంగా ఇక్కడ గ్రామాల్లో బాల్యవివాహాలు, బాల కార్మికుల సమస్య ఎంతగా వేళ్ళూన్నిపోయిందో తెలిస్తే భయమేస్తుంది. వయసుకు మించిన పనుల్లోనూ, పట్టుమని ఇరవై కూడా దాటకుండానే ఇద్దరు ముగ్గురు పిల్లలకి తల్లి అవడం.. దాంతో లెక్కలేనన్ని ఆరోగ్య సమస్యలు!

మా గ్రూపు వాళ్ళందరం ఈ విషయాల మీద ముఖ్యంగా తల్లితండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాము.. గ్రూప్ అంటే ఏమీ లేదు, సామాజిక స్పృహ ఉన్న కొంతమంది కలిసి వాలంటరీగా చేయడమే! రోజూ మనం చూసే మనుషుల జీవితాల్లోనే ఎన్నెన్ని చేదు నిజాలు దాగి ఉంటాయో ఊహించలేము రాధిక గారు! ఒక రోజు మాదగ్గరికి మా స్కూల్లోనే పని చేసే ప్యూన్ భార్య వచ్చింది.. ఆమిప్పుడు 7 నెలల గర్భవతి.. అప్పటికే ముగ్గురు పిల్లలున్నారు.. వయసెంతో ఊహించగలరా? 22 అంట! ముగ్గురూ ఆడపిల్లలేనని, ఈసారి మగపిల్లాడు పుట్టకపోతే పుట్టింటికి పంపేస్తానని అతను రోజూ బెదిరిస్తున్నాడంట.. రాకెట్లని చంద్రమండలానికి పంపిన వైజ్ఞానిక ప్రపంచంలో ఇంకా అతని లాంటి మూర్ఖులు ఉన్నారంటే నమ్మశక్యం కాదు.. మళ్ళీ రోజూ మా దగ్గర అంటే ఆడ టిచర్ల దగ్గర ఎంత వినయంగా ప్రవర్తిస్తాడో!

వికాస్‌కి ఈ విషయం చెప్తే చాలా అవేశపడి అతనికి దేహశుద్ధి చేసేంతవరకూ వెళ్ళారు.. కానీ ఇలాంటి కుటుంబ విషయాల్లో ఆవేశం కంటే ఆలోచన అవసరం అని, అతనితో మంచిగా మాట్లాడుతూ పరిస్థితిని తెలుసుకునేలా, తన దృక్పథం మార్చుకునేలా చేయమని చెప్పాను.. ఇలాంటివాళ్ళ విషయాల్లో పెరిగిన ఇంకా చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావం చాలా ఉంటుంది.. సమస్యని అక్కడ నించి నరుక్కురావడం మంచిది కదా!

ఇలాంటి ఆలోచనల మధ్య సమయమే తెలియడంలేదు.. ఏమిటో రాధిక గారూ డెలివరీ డేట్ దగ్గరకొచ్చేస్తుంది కానీ ఇన్ని నెలల్లో నేను డాక్టర్ దగ్గరకెళ్ళింది కేవలం రెండు సార్లే! ఇంటి దగ్గర వికాస్ ముద్దలు కలిపి నోటికి అందిస్తుంటే ఇంక డాక్టర్ అవసరమేముంటుంది చెప్పండి.. పిన్ని మాత్రం కోప్పడుతూనే ఉంటారు అలా అశ్రద్ధ పనికి రాదని.. ఒక్కొక్క సమస్య పరిష్కారమైనప్పుడల్లా వాళ్ళిచ్చే ఆశీర్వాదాలే నా పాపాయికి శ్రీరామరక్ష అనిపిస్తుంది!

ఇంక మా కవిగారిని మరీ మరీ అడిగినట్లు చెప్పండి.. మీకు మరీ దిగాలుగా అనిపిస్తే కనీసం ఒక వారం కోసమైనా వచ్చి వెళ్ళండి.. ఎలాగూ ఇప్పుడు ఆదిత్య స్కూల్‌కి సెలవలు ఇచ్చేసి ఉంటారు కూడా కదా!
మరి ఉంటాను.
మీ
కార్తీక

*** *** *** ***

సెప్టెంబర్ 12, 1987
హైదరాబాదు

**హల్లో మమ్మీ గారూ,**
ఎలా ఉంది మీ కొత్త పదవి? ముందుగా సరికొత్త అమ్మానాన్నలకు అభినందనలు.. ఏమంటున్నాడు వికాస్ జూనియర్? పేరు డిసైడ్ చేశారా లేదా?

ఇంత సుదీర్ఘ విరామం తర్వాత రాస్తూ ఇలా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నానేమిట అనుకుంటున్నావా! నేను లేకపోడం చూసి

గబగబా మీ అబ్బాయిని తీసుకొచ్చేశావుగా! నిజంగా చాలా ఈ న్యూస్ వినగానే చాలా సంతోషం వేసింది.. ఇకనించీ నీ ఉత్తరాల్లో పిల్లలు-పరుగులాటల గురించి చదవాల్సివస్తుంది అని తల్చుకుంటుంటే 'అమ్మయ్యా, మాకో తోడు దొరికింది' అనిపిస్తుంది!

ఇన్ని రోజుల తర్వాత నీకు ఉత్తరం రాస్తుంటే ఏదో తెలీని ఉత్సాహం.. వేసవి సెలవలకి ఊరెళ్ళి తిరిగొచ్చాకా ఇంటి దగ్గర నేస్తానికి ఆ విశేషాలన్నీ ఎప్పుడెప్పుడు చెబ్దామా అన్న తొందరలా.. నేను వచ్చి నాలుగురోజులవుతుంది.. వచ్చినప్పటి నించి అదోరకమైన కొత్త శక్తి! రాధిక, పిల్లల్ని చూడటం వల్లా ఇంకా అక్కడ వర్క్ లో సాధించిన ప్రోగ్రెస్‌కి ఇక్కడ ఆఫీసులో కురిపిస్తున్న ప్రశంసల వల్ల కూడా!

మొదటిసారిగా సముద్రాలు దాటి ప్రపంచానికి అటువైపున్న ఆ దేశంలోకి అడుగుపెట్టినప్పుడు ఉత్సుకత, ఉత్తేజంతో పాటు కాస్త గుబులూ, గాభరా కూడా! రోజులు గడిచేకొద్దీ అక్కడి క్రమశిక్షణ, నిబద్ధత చూశాక రూల్స్ అంటే పాటించడానికి కానీ బ్రేక్ చేయడానికి కాదు అన్న విషయం మొదటిసారిగా తట్టినట్లనిపించింది.. మన వయసుకి కాక చేసే పనికి గౌరవం ఇవ్వడం నచ్చింది.. నీకో విషయం తెలుసా! అక్కడ ఏ గవర్నమెంట్ ఆఫీసులో అయినా పనుంటే పొద్దునే లేచి వాళ్ళు తలుపులు తెరిచాక, క్యూలో నుంచుని మన వంతు కోసం వెయిట్ చేయడం.. ఎవరి చెయ్యీ తడపాల్సిన అవసరం లేదు.. రోజుల తరబడి వాళ్ళ చుట్టూ చెప్పులరిగేలా తిరగక్కరలేదు!! లంచగొండితనం లేని ఏ దేశమైనా ఇలానే అబివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు!

చుట్టూ పచ్చదనం, ఎప్పుడు చూసినా ఇప్పుడే ఊడ్చి తుడిచారా అన్నట్లుండే రోడ్లు, ఆకాశ హర్మ్యాలు, ఆ పక్కనే జలపాతాలు అన్నీ కలిసి ఏదో అల్లావుద్దీన్  సృష్టించిన ప్రపంచంలో ఉన్న అనుభూతి కలిగిస్తాయి.. కానీ కార్తీకా, సాయంత్రం ఆరు దాటంగానే ఒక్కసారిగా నిశ్శబ్దంగా అనిపించేది.. అప్పటి వరకూ ఆడుకున్న పిల్లలంతా వెళ్ళిపోగానే మిగిలిన ఖాళీ పార్క్ లా నిస్తేజంగా అనిపించేది.. కారణం రాధికా వాళ్ళు నాతో లేకపోవడమే కాదు అప్పటి వరకూ ఎంతో క్లోజ్ గా పని చేసిన సహాధ్యాయులు ఐదవ్వగానే ఉన్నట్టుండి అపరిచితులుగా మారిపోతారు.. అక్కడ నించి వాళ్ళ జీవితంలో మనకేమాత్రం ప్రాముఖ్యం ఉండదు! పుట్టిన దగ్గర్నించీ మన చుట్టూ ఉన్నవారితో ఎటాచ్ మెంట్స్ పెంచుకుంటే పెరిగే మనలాంటి వారు ఈ డిటాచ్ మెంట్ కి అలవాటు పడటం కష్టమనిపిస్తుంది!

కారణాలు ఏమైతేనేం, అక్కడా ఉన్నన్నాళ్ళు ఎక్కువ కాలం పనితోనే గడిపేవాణ్ణి.. అక్కడ ఉన్న రిసోర్సెస్ తో పని చేయడం కూడా చాలా ఉత్సాహంగా అనిపించేది.. అలానే మా కంపెనీ వాళ్ళ అంచనాలను మించగలిగాను.. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్న సంతృప్తి నాకూ మిగిలింది! కానీ విమానం మన నేలని తాకగానే కలిగిన అనిర్వచనీయమైన భావాన్ని వర్ణించడం నా వల్ల కాదు!

వచ్చిన దగ్గర్నించీ ఫోన్ కాల్సు, స్నేహితుల విజట్లతో కాస్త బిజీగానే ఉన్నా అన్నిటినీ తప్పించుకుని నీకెప్పుడెప్పుడు ఉత్తరం

రాయాలా అనిపించింది! ఎల్లుండి అమ్మానాన్న, ఇంకా అక్కయ్య వాళ్ళందరూ ఇక్కడికి రాబోతున్నారు.. చాలా సంవత్సరాల తర్వాత వినాయక చవితి కలిసి చేసుకోబోతున్నాం.. మళ్ళీ ఆ హడావిడిలో పడితే ఇంకా లేట్ అయిపోతుందని కాస్త వెసులుబాటు దొరకగానే రాసేస్తున్నాను.

ఒక విషయానికి మాత్రం నీకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా.. నేను లేనప్పుడూ ఎప్పటికప్పుడు రాధికకి ఉత్తరాలు, ఫోన్లతో పలకరించినందుకు.. తనకి నీ మాటలు ఎంత స్వాంతన కలిగించాయో చెప్పలేను.. ఒక్కోసారి తనకి ఫోన్ చేయేబోయేముందు నాకు టెన్షన్ గా అనిపించేది.. ఎక్కడ బ్రేక్ డౌన్ అవుతుందోనని! కానీ ఫోన్ తీస్తునే ఎంతో ఉత్సాహంగా మాట్లాడటం, అలా మాట్లాడినప్పుడు ఎక్కువగా నీ కబుర్లే ఉండటం నాకు ఆశ్చర్యాన్నీ, సంతోషాన్నీ కలిగించేది! ఒక విచిత్రం చెప్పనా, నేను వేళ్ళేముందు వికాస్‌తో మాట్లాడాను కదా.. ఎప్పుడూ చూడని మనిషితో కాక ఎంతో కాలం నుండి తెలిసిన స్నేహితుడితో మాట్లాడిన ఫీలింగ్! మనందరం కలిసే సమయం అతి త్వరలో రావాలని కోరుకుంటున్నాను.

నిన్న తెల్లవారుఝామునే మెలకువ వచ్చేసింది.. అలా కిటికీలోంచి బయటకి చూస్తుంటే అప్పుడే ప్రియుడి నించి విడివడిన ప్రేయసిలా మెరుస్తున్న ఆకాశం.. వెంటనే 'ఈ గాలీ.. ఈ నేలా.. ఈ ఊరు' పాట గుర్తొచ్చింది.. వెంటనే ఒక శీతల పవనం తాకినట్టు ఎంత హాయిగా అనిపించిందనీ! వెంటనే ఇదిగో ఈ కవిత మనసులోనే రాసేసుకున్నా.. ఇంకా ఏ పత్రికకీ పంపలేదు, నీకే ముందు వినిపిస్తున్నా..

*"జాబిల్లి జోలపాడి జోకొడితే*
*కొలువు తీర్చిన కలలు..*
*తలలూపే కలువ పూబాలలు!*
*సూరీడు వెన్ను తట్టి నిదురలేపితే*
*కరిగిపోయిన కలలు..*
*హారం తెగిపడి జారిపడి ముత్యాలు!"*

దీనికి ఏం పేరు పెట్టమంటావో నువ్వే చెప్పు.. అవునూ సినిమాలు, పాటలు, పుస్తకాలకీ నీ దైనందిన కార్యక్రమంలో ఏమన్నా చోటుందా? చైతన్యానికి తోడైన ఆలోచనాపటిమలా మీరిద్దరూ కలిసి చేస్తున్న పనులు ఎంతో ఉత్తేజభరితంగా ఉన్నాయి. భూషణం దంపతులకు నా నమస్కారాలు తెలియజేయి.. అలానే మళ్ళీ ఎప్పుడెప్పుడు తనతో మాట్లాడుదామా అని ఎదురుచూస్తున్నట్లు వికాస్ కి చెప్పు.
త్వరలో ఉత్తరం రాస్తావుగా?
వంశీ

*** *** *** ***

నవంబర్ 10, 1987

వెంకటాపురం

వంశీ గారికి,

ఎన్నాళ్ళకెన్నాళ్ళకి మీ కబుర్ల పావురం మా ఊరొచ్చింది! మీరు చెప్పిన విశేషాలన్నీ ఎన్నిసార్లు చదువుకున్నానో.. అలా వస్తూనే ఎంత అద్భుతమైన కవితని వినిపించారు!! చాలా చాలా బావుంది.. దానికి "కరిగిన కలలు" అనే పేరు ఎలా ఉంటుంది? పేరంటే గుర్తొచ్చింది.. మావాడి పేరు 'హర్ష'.. వాళ్ళ నాన్న పెట్టుకున్నదే. అప్పుడే బోర్లా పడుతున్నాడు.. తెగ నవ్వులు చిందుస్తున్నాడు.. వికాస్ అయితే ఇంకో రెండడుగులు ముందుకెళ్ళి తనని గుర్తు పడుతున్నాడని కూడా చెప్తారు!

ఇంకా అంతా కలలా వుంది వంశీ గారూ.. ఎన్నో సార్లు రాత్రి ఉన్నట్టుండి మెలకువ వచ్చి పక్కన పడుకున్న వికాస్ నీ, హర్షనీ చూస్తుంటే అసలు ఇది నా జీవితమేనా లేక అందమైన కలా అన్న అనుమానం వస్తుంది.. వెంటనే నన్ను నేను గిల్లుకుని నిర్ధారించుకుంటాను.. ఇది నా స్వంతం చేసిన ఘనత మాత్రం పిన్నీ, బాబాయిలదీ ఇంకా ఎప్పటికప్పుడు మోరల్ సపోర్ట్ అందిస్తున్న మీదీ!

జీవితానికి అసలైన అర్ధం ఏమిటో ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.. నిస్సహాయులకి వీలైనంతగా సహాయం చేయాలని ఉంది.. ఇంకో విషయం, భూషణం బాబాయి మా స్కూల్లో ఇప్పుడు కరాటే నేర్పించే మాస్టారిని అప్పాయింట్ చేశారు.. వారానికి రెండు రోజులు, ఒక్కొక్క గంట చొప్పున నేర్పిస్తున్నారు.. మొదట్లో అబ్బాయిలందరూ ఎంతో ఉత్సాహంగా చేరారు కానీ ఒక్క అమ్మాయి కూడా రాలేదు.. ఆత్మరక్షణ ఆవశ్యకత గురించి వాళ్ళకొక అవగాహన కలిగించడానికి అందరినీ కూర్చోబెట్టి ఉదాహరణలతో సహా వివరించాల్సివచ్చింది! అయినా తమకేం కావాలో తెలుసుకుని వాటిని సాధించుకోవడం ఈ దేశంలో ఆడపిల్లలకు ఎప్పుడు అబ్బుతుందో!

కావాల్సింది సాధించుకోవడం అంటే గుర్తొచ్చింది, మాధురి ఎందుకో అంత సంతోషంగా ఉన్నట్టు లేదండి. ఆ మధ్య హర్షని చూడాడానికి వాళ్ళిద్దరూ వచ్చారు.. మోటార్ బైక్ మీద నించి దిగుతున్న రాజారావుని చూస్తుంటే నడమంత్రపు సిరి తెచ్చిన మార్పు స్పష్టంగా తెలుస్తోంది.. మెడలో లావుపాటి చైన్, రెండు చేతుల వేళ్ళకి ఉంగరాలు, ఇస్త్రీ నలగని బట్టలు.. అసలు సత్తు కారేజీ పట్టుకుని, అప్పుడో ఇప్పుడో విరిగిపోయేట్టుండే సైకిల్ మీద వచ్చే రాజారావేనా ఇతను అనిపించింది!! ఎప్పుడూ తుళ్ళుతూ ఉండే మాధురి మాత్రం ఏమిటో అప్పుడే భాష నేర్చుకుంటున్నదానిలా ఉండుండి రెండుమూడు మాటలు మాట్లాడుతోంది.. ఉన్న కాసేపూ అతనే కొత్తగా కొన్న బైక్, ఇంట్లోకి కొన్న ఫర్నిచర్, రేపో మాపో కొనబోతున్న భూమి గురించీ మాట్లాడాడు.. అంతేకాక బాబుని ఆడిస్తున్న మాధురిని పట్టుకుని "పిల్లల్ని కనే రహస్యమేమన్నా ఉందేమో కార్తీక గారిని అడగరాదూ.. నువ్వు కూడా మనింట్లోనే ఇలా ఆడించుకోవచ్చు" అన్నాడు.. నేను చటుక్కున మాధురి వంక చూశాను.. అప్పటివరకూ నిర్వికారంగా ఉన్న దాని మొహంలో బాధ కొట్టొచ్చినట్లు కనబడింది.. ఏమిటో అర్ధమయ్యీ అర్ధమవనట్లు అనిపించింది.. అయినా పెళ్ళై ఏమాత్రం కాలం గడిచిందనీ!! అప్పటినించీ నేనతనికి మధ్యంతరంగా కట్టబెట్టిన గౌరవాన్ని తీసేసుకున్నాను.. వీలుచూసుకుని మళ్ళీ రమ్మని మరీ మరీ చెప్పాను.. ఈసారైనా అది ఒక్కత్తే వస్తే అసలు విషయం ఏమిటో

కనుక్కోవాలి.

ఒక్కోసారి అనిపిస్తుంది సమయానికి తగ్గట్టు మన పనులు నిర్ణయించుకోవడం కాకుండా పనులకు తగ్గట్టు సమయం ఉంటే ఎంత బావుంటుందని! హర్షతో ఒక రోజంతా  గడిపే రోజెప్పుడొస్తుందా అని చూస్తున్నాను.. ఈ మాట అంటే పిన్నేమో నవ్వేసి "నీ పనుల చిట్టా చూసినవాళ్ళెవరికైనా తెలుస్తుంది అదెంత అసంభవమో" అంటుంది..  నేను డెలివరీ రోజు వరకూ కూడా స్కూల్ కి వెళ్తూనే ఉన్నాను.. డాక్టర్ అయితే ఒకటే మందలించడం, మధ్య మధ్య చెక్అప్ కి రానందుకు.. "అయినా చందమామలాంటి బుజ్జాయి పుట్టాడు కదండీ" అని నేనంటే "ఆ అది నీ అదృష్టం.. వాడి అదృష్టమూనూ" అన్నారు!

అప్పుడంటే తప్పించుకున్నాను గానీ ఇప్పుడోసారి డాక్టర్ దగ్గరకు వెళ్ళి రావాలి.. ఈ మధ్య తరచుగా కడుపులో నొప్పి వస్తొంది.. గాస్ అనీ, స్ట్రెస్ అనీ ఏవేవో  మాత్రలు మింగుతూ ఉన్నాను కానీ తగ్గినట్లే తగ్గి మళ్ళీ వస్తోంది! ఆ మాత్రం నొప్పి కూడా భరించలేనా అని నన్ను నేనే వెక్కిరించుకుని మొండిగా తిరిగేస్తున్నా కానీ ఇంటికొచ్చి కాస్త రిలాక్స్‌డ్‌గా హర్షతో టైం స్పెండ్ చేసేప్పుడు ఆ నొప్పి తాలూకా తీవ్రత భరించలేకపోతున్నాను.. అందుకే ఒకసారి వెళ్ళి తెల్ల దూతలని చూసొస్తే ఒక పనై పోతుంది. ఈ విషయం ఇంకా వికాస్‌కి చెప్పలేదు.. లేదంటే నన్ను ఈ పాటికి ఆ హాస్పిటల్‌లో బంధించేసి ఉండేవారు!

మీరు చెప్పిన వింతలూ విశేషాలు ఒక రెండు మూడు రోజుల వరకూ వికాస్‌కి చెప్తూనే ఉన్నాను.. తనేమో "మళ్ళీగానీ వెళ్తే నిన్ను తన అసిస్టెంట్‌లా వెంట తీసుకెళ్ళమని మీకవి గారికి చెప్తాలే" అంటూ ఒకటే ఆటపట్టించడం.. కానీ మీరు సాధిస్తున్న విజయాలను తల్చుకుంటుంటే మీలాంటి మిత్రుడున్నందుకు చాలా గర్వంగా ఉంది. ఆమధ్య 'పడమటి సంధ్యారాగం' సినిమా వస్తే వెళ్దామని చాలా అనుకున్నాము కానీ ఆ టైమ్ ఏదో హర్షతో గడపడానికి ఉపయోగించుకోవచ్చుగా అనిపించింది.. ఆ సినిమాకి వెళ్ళుంటేనైనా మీరు చెప్పిన కొన్ని దృశ్యాలు కొన్ని తెరమీద చూసే భాగ్యం కలిగేది!

రాధిక గారికి, పిల్లలకి మీమీద బెంగ పూర్తిగా తీరిపోయుంటుంది.. మీ కుటుంబం కలిసిన గేదరింగ్ ఎలా జరిగింది? నాకెందుకో అమ్మమ్మ గుర్తొస్తుంది.. హర్ష పుట్టినప్పుడు వికాస్ చెప్పడానికి వెళ్తే తను కనీసం బయటకి కూడా రాలేదంట.. వరండాలో కూర్చుని కాసేపు తాతయ్యతో మాట్లాడి వచ్చేసారంట.. వాళ్ళ విషయమొక్కటే అప్పుడప్పుడూ కలుక్కుమనిపించే బాధ.

మీకు ఇక ఇప్పట్లో ఎక్కడికీ వెళ్ళే అవసరం లేదనుకుంటాను.. చక్కగా మళ్ళీ కలాన్ని ఝుళిపించి ఒకచేత్తో కవితలూ, ఇంకో చేత్తో నాకు ఉత్తరాలు రాసేస్తుండండి.
వీలైనంత త్వరలో రాస్తారు కదూ.
కార్తీక

***   ***   ***   ***

డిసెంబర్ 15, 1987

హైదరాబాద్

డియర్ కార్తీకా,

ఎలా ఉన్నావు? ప్రస్తుతం ఇలా ఊరికే అడిగేసి సరిపెట్టదలచుకోలేదు.. నువ్వు 'తెల్లదూతలని' చూసొచ్చావని నాకు తెలిసేవరకు అస్సలూరుకోను.. తెలిసిందా!

'హర్ష' పేరు చాలా బావుంది.. వికాస్ సెలక్షన్ అని నువ్వంటుంటే నిన్ను చేసుకున్న అబ్బాయికి ఇంత మంచి టేస్టుందా అనిపించిన మాట నిజం! ఏంటీ, చలికాలంలో ఇల్లు ఉన్నట్టుండి ఇంత వేడెక్కిందేమిటా అనుకుంటున్నావా!? మరి తమరు ఉడుక్కుంటున్నారుగా.. అదీ కారణం!

అసలు నా కవితకి మంచిపేరు సజెస్ట్ చేసినందుకు నీకు కృతజ్ఞతలు చెప్పాల్సిందిపోయి ఎలా ఏడిపిస్తున్నానో చూడు! నీకు తెలుసా, ఒక్కోసారి కవితలకి పేరు పెట్టడానికి రాసినదానికన్నా ఎక్కువ టైమ్ తీసుకుంటాను నేను.. కవితకి సరిగ్గా అతికే పేరు తట్టడం భలే కష్టమైపోతుంది.. అసలు ఇక నించీ మనిద్దరి కొలాబరేషన్ లో కవితలు రిలీజ్ చేద్దాం.. మరి నువ్వే అన్నావుగా పుంఖాను పుంఖానులుగా రాసేయమని.. నేనలా రాసేసి నీకిస్తుంటాను.. వాటికి నామకరణం చేసే బాధ్యత నీదన్నమాట! సో, వికాస్ కి చెప్పు నా అసిస్టెంట్ పోస్ట్ రెడీ అయిపోయిందని.

అయినా నీలాంటి ఉత్సాహవంతులకి పనులు చెప్పడానికి నాలాంటివాళ్ళెప్పుడూ రెడీగా ఉంటారు కానీ నువ్వు మాత్రం హర్షతో గడిపే సమయాన్ని దేనికోసమూ త్యాగం చేయకు.. ఈ మొదటి రెండు, మూడు సంవత్సరాల జ్ఞాపకాలు జీవితానికి సరిపడా శక్తినిస్తాయి!

విదేశ జీవనం తాలూకా వాసనలు పల్చబడి ఇప్పుడిప్పుడే నా రొటీన్ ఒక గాడిలో పడుతోంది.. మళ్ళీ టైం ప్రకారం వెళ్ళి టైమ్ కి రావడం.. పిల్లలతో ఆటలు.. తోచినప్పుడు కొన్ని రాతలు! ఏమైనా ఈ పూనా, అమెరికా ట్రిప్స్ వల్ల తాత్కాలిక వియోగాలు కుటుంబ సభ్యుల మధ్య దగ్గరతనాన్ని ఎలా పెంచుతాయో అన్న విషయం మాత్రం బాగా అర్థం అయింది!

మాధురి గారి నిర్లిప్తత గురించి నువ్వు రాసింది చదువుతుంటే నీకొకటి చెప్పాలనిపిస్తుంది.. కేవలం ఒకటి రెండు సంఘటనల మూలంగా లేని పరిస్థితిని ఊహించుకోకు.. ఏమో, ఆ రోజు వాళ్ళిద్దరి మధ్యా ఏమన్నా చిన్న తగాదాలాంటిదేమన్నా అయిందేమో.. అందుకే ఆవిడ అలా కాస్త నిశ్శబ్దంగా ఉండి ఉంటారు.. అప్పుడప్పుడు భార్యాభర్తల మధ్య సంభవించే చిన్న చిన్న తగాదాలు తెచ్చే చికాకు నీకు చెప్పనవసరం లేదు.. అందుకే మాధురి గారి నోటి నుంచి వినకుండా తన జీవితాన్ని గురించి ఎక్కువ ఆలోచించి నీ మనసు పాడుచేసుకోకు.

అలానే నీకు ఇంకో సలహా.. ఇక నువ్వు మీ అమ్మమ్మ గారి గురించి ఎక్కువ ఆలోచించకు.. వాళ్ళు మిమ్మల్ని, మీ పెళ్ళినీ

యాక్సెప్ట్ చేయడానికి ఇంకా రెడీగా లేరు.. అలా అని దాని గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోవడం కన్నా నీకు లభించిన ఇతర అనుబంధాలను ఆస్వాదించు.. నిన్ను కన్నబిడ్డలా ఆదరిస్తూ మంచిచెడులన్నింటిలోనూ తోడుంటున్న భూషణం గారి దంపతులను చూస్తేనే అర్థమౌతుంది నువ్వెంత అదృష్టవంతురాలివో!

సరే మరి ఈసారి నీ రిప్లై లో నువ్వు డాక్టర్ దగ్గరికి వెళ్ళినట్లు గనక రాయకపోతే ఊరుకునేదిలేదు.. నువ్వు అబద్ధాలు రాయవని తెలుసు.. 'ఒట్టి కడుపునొప్పికి ఇంత హడావిడి ఎందుకంటావా?' ఆ మాటేదో తెల్లదూతల నోటితో వింటే అదో తృప్తి.. ఏమంటావు? అయినా మనందరికీ ఇదొక అలసత్వం.. నాన్న కూడా ఇంతే! ఫోన్ చేసినప్పుడు అమ్మ 'నాన్నకి వంట్లో బావుండడం లేదు వంశీ' అంటుంది.. డాక్టర్ ఏమన్నారు అంటే 'ఇంకా హాస్పిటల్ కి వెళ్ళలేదు.. రేపు, ఎల్లుండి చూసి అప్పుడు వెళ్తానంటున్నారు' అంటుంది!! వెంటనే డాక్టర్ దగ్గరికి వెళ్ళమని ఎన్నిసార్లు చెప్పినా ఇదే వరస.. కానీ నువ్వు తెలివైన మంచి అమ్మాయివి కదా.. అలా చేయవు.

వికాస్‌నీ, ఇంకా అందరినీ అడిగినట్లు చెప్పు. తొందరగా రిప్లై రాస్తావు కదా.
**వంశీ**

*****   ***   ***   *****

జనవరి 31, 1988
వెంకటాపురం

**ప్రియ మిత్రమా,**
ఇక్కడ తెల్లగా తెల్లవారింది.. ఆ లేత ఎండ ఇంటి ముంగిట్లోను, కొబ్బరి చెట్ల మీదా, కిటికీల మీదా పడుతోంది.. వికాస్ నిచ్చెన ఎక్కి ఇంటికప్పు పైకి పాకిన  ఆనపకాయలను కోసి జాగ్రత్తగా జారవిడుస్తుంటే కిందనించి నేను వాటిని నేను పట్టుకుంటున్నాను.. పక్కన వసారాలో హర్ష నాన్న మీద ఎక్కి గుర్రం ఆట ఆడుతున్నాడు..  అంతలో అమ్మ లోపలనించి కాఫీ గ్లాసుల ట్రేతో వచ్చి "ఇక ఆటలు చాలించండి.. వాడి స్నానానికి టైమయ్యింది" అంటోంది.

ఏంటీ? అయోమయంగా ఉందా? ఇందాకే ఈ అందమైన కల వచ్చింది.. కల అలానే కొనసాగిపోకూడదూ!? వెంట మెలకువనీ తెచ్చింది.. అదిగో అప్పటినించీ నిద్ర పట్టలేదు.. ఇదీ ఒకందుకు మంచిదే అనుకుని మీకు ఉత్తరం రాయడం మొదలుపెట్టాను.

బయట సన్నగా వర్షం పడుతోంది.. చినుకులు వాన మడుగులోకి పడుతున్న టప్ టప్ శబ్దం తప్ప ఇంకేమీ వినిపించడంలేదు.. ఈ ఇంట్లోకి వచ్చి కాస్త సర్దుకున్నాక వికాస్‌ని నేనడిగిన మొదటి కోరిక కిటికీ పక్కనే రాసుకునే టేబుల్ ఒకటి కావాలని! గుర్తుందా, ఇదివరకు అమ్మమ్మ వాళ్ళింట్లో నాగది కిటికీలోంచి చూస్తూ మంచం మీద కూర్చుని మీకు ఉత్తరాలు రాసేదాన్ని!

అలా మీ భృకుటి ముడిపడిపోతుందేమిటి చెప్మా! నేనేమీ మళ్ళీ అమ్మమ్మ వాళ్ళని తల్చుకుని బాధపడటం లేదు.. నిజంగా! మీరు చెప్పినట్లే మనల్ని అభిమానించేవాళ్ళు ఇంతమంది ఉండగా ఇంకా వాళ్ళ గురించే తలపోయడం, బాధపడటం అనవసరం!

నిజంగా పిన్నీ బాబాయిలు మాపట్ల చూపే ఆదరణని కొలవడం నావల్ల కాదు!

ఆమధ్య షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె జరిగింది.. వికాస్, ఆయన స్నేహబృందం ఆ వర్కర్స్ కి తగిన సలహాలు ఇస్తూ వాళ్ళతోనే ఎక్కువ సమయం గడిపారు.. అంతలో సమ్మె ఇంకా తీవ్రతరం చేయాలని నిరాహారదీక్షకి పూనుకున్నారు.. చిలికి చిలికి గాలివాన అయినట్లు యాజమాన్యం పోలీసులను రంగంలోకి దించారు.. ఫలితంగా అరెస్టులు, నిరాకరించినవారిపై లాఠీచార్జ్ లు.. ఉన్నట్టుండి పరిస్థితి గందరగోళమై కొంతమంది జైల్లోను, ఇంకొంతమంది బలమైన గాయాలతో హాస్పిటల్ లోనూ చేరారు! ఇవన్నీ మగవాళ్ళు వాళ్ళు చుసుకుంటారు కానీ ఇంటి దగ్గర ఆడవాళ్ళకీ, పిల్లలకీ ధైర్యం చెప్పడానికీ నేనూ, వికాస్ గ్రూప్ లోని వనజ వాళ్ళ ఇళ్ళ దగ్గర ఉండిపోవడానికి నిర్ణయించుకున్నాం.. జైలులో తమ భర్తల్ని ఎంత టార్చర్ చేస్తున్నారో అని కొందరు.. హాస్పిటల్ లో ఉన్నవాళ్ళ పరిస్థితి గురించి ఆందోళన చెందుతూ ఇంకొందరు.. ఎవరికీ రాత్రంతా కంటిమీద కునుకులేదు.. మీరు చదువుతున్నది నిజమే! ఆ రాత్రంతా అక్కడే ఉండిపోవాల్సివచ్చింది.. హర్ష ని పిన్నివాళ్ళే చూసుకున్నారు.. 'పర్లేదు, నాతోపాటు తీసుకెళ్తాను' అంటే బాబాయి ససేమిరా అన్నారు!

ఇంతటి అభిమానాన్ని కురిపించే ఈ దంపతుల అండ ఉండగా మనసు మారని అమ్మమ్మ వాళ్ళని గురించి బాధపడటం కూడదని నిర్ణయించుకున్నాను.. నా అసలు దిగులు వాళ్ళు మమ్మల్ని చూడటానికి రాలేదని, మాట్లాడడంలేదనీ కాదు! ఈ పెద్ద వయసులో వాళ్ళకి స్వంత అండ లేకుండా పోయిందే అని!

అన్నట్టు మాధురితో తర్వాత మాట్లాడాను.. రాజారావు ప్రవర్తన గురించి తనకే అయోమయంగా ఉందంటోంది.. అంతస్తుల తేడా తెచ్చిన మార్పు స్పష్టంగా తెలుస్తూనే ఉన్నా అతన్ని తప్పు పట్టే అవకాశం కనబడటం లేదంట! అందరితోనూ ఎంతో చక్కగా కలిసిపోయి మాట్లాడటం.. ముఖ్యంగా మాధురి వాళ్ళమ్మ, చెల్లితో చాలా కలివిడిగా ఉంటూ వాళ్ళకేమేం కావాలో అడిగడిగడిగి చూస్తుంటాడంట.. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే మాధురికి కట్నంగా ఇవ్వాలనుకున్నది రిజిస్టర్ చేసేస్తానని మాధురి వాళ్ళ నాన్నగారు అంటే 'దానికి తొందరేముంది' అంటూ చేయనివ్వలేదంట!! కానీ ఇంకా పిల్లలు కలగలేదన్న విషయం మాత్రం పదే పదే గుర్తుచేస్తూ ఉంటాడంట. ఇద్దరూ ఒకసారి డాక్టర్ దగ్గరికెళ్తే మంచిదన్న సలహా ఇవ్వడం తప్ప అప్పటికి నేనేం సలహా ఇవ్వలేకపోయాను.

ఇప్పుడు డాక్టర్ ప్రస్తావన వచ్చింది కాబట్టి 'నీ సంగతేంటి?' అని ప్రశ్నార్థకంగా చూస్తుంటారని తెల్సు! ప్రస్తుతానికి నాకూ ఏం తెలీదు.. అలా అని నొప్పి తగ్గిపోయిందని చెప్పను.. ఇంకా చాలా నొప్పిగా ఉంది.. కానీ 'ఇదిగో అమ్మాయ్, నీకు ఫలానా జబ్బు' అని ఇంకా ఏ డాక్టరూ చెప్పలేదండీ! మొదట ఈ ఊళ్ళో డాక్టర్ దగ్గరికే వెళ్తే అల్సర్ అని దానికి తగ్గ మందులు ఇచ్చారు.. వాటితో పెద్ద ఉపయోగమేమీ కనబడలేదు.. పైగా ఇదివరకులా అప్పుడప్పుడూ కాకుండా ఇప్పుడు దాదాపు రోజూ వస్తోంది.. బాబాయి కేకలేస్తే మొన్ననే బందరు వెళ్ళి స్కానింగ్, బ్లడ్ టెస్ట్ లు వగైరాలన్నీ చేయించుకున్నాను.. ఈ వారంలో రిజల్ట్ వస్తుంది మరి.. అసలు వికాస్‌కి కంగారు ఎక్కువైపోయింది.. తనతో అన్నాను "ఇంత ఖర్చు పెట్టారు, టెస్ట్ లన్నీ చూసి ఆ డాక్టర్ మిమ్మల్ని పక్కకి పిలిచి 'మీ ఆవిడని కాస్త తిండి తగ్గించమనవోయ్' అని రహస్యంగా చెప్తారు చూడండి" అని..

చిన్నగా నవ్వేసి నా తల అటూ ఇటూ ఊపేసి వెళ్ళిపోయారు! కాబట్టి మీక్కూడా నా సమాధానం అదే! నా రిజల్ట్ లో డాక్టర్ తేల్చేది అదే!!

అసలు నన్ను చూశారా ఒకదాని తర్వాత ఒకటి నా గాథలన్నీ చెప్తున్నాను కానీ అసలు విషయం మర్చిపోయాను.. హేపీ న్యూ ఇయర్ మిత్రమా.. మీకూ, రాధికగారికీ, పిల్లలకీ, అందరికీ.. రాధిక గారు పంపిన గ్రీటింగ్ కార్డ్ అందింది.. అందరికీ పేరు పేరునా విషెస్ చెప్పారు.. ఈసారికి నా బద్ధకాన్ని మీరిద్దరూ క్షమించేయాలి మరి! మీ పరిచయం అయ్యాక కాలం మాత్రం పరుగులు పెడుతోంది తెలుసా!

కొత్త సంవత్సరం అలా వస్తోంది ఇలా పాతబడిపోతోంది! ఈ సంవత్సరం చూపించబోయే విశేషాల్లో మీరు కూడా ఉంటే ఎంత బావుంటుందో! ఇంతకీ ఎప్పుడు దర్శనమీయబోతున్నారు నేస్తం!? మీ కవితల్లో కనబడే మార్దవం మీ గొంతులోనూ వినబడుతుందనే నా నమ్మకాన్ని నిరూపించడానికి నాతో ముఖాముఖీగా ఎప్పుడు మాట్లాడతారు? మీరు వస్తానన్న తర్వాత శ్రీరామనవమి రెండుసార్లు వచ్చెళ్ళింది కానీ తమరి జాడ మాత్రంలేదు! ఈ సంవత్సరమన్నా నీటిమీద మాటల్లా కాకుండా కాస్త పక్కా ప్లాన్ వేయండి కవిగారూ!

హర్ష పక్క మీద కదులుతున్నాడు.. లేచే టైమయింది.. ఇక ఇక్కడితో ఆపక తప్పదు.. ఈసారి మీ రిప్లై లో మనం ఎప్పుడు కలుసుకోబోతున్నదీ తప్పక రాయాలి మరి!
**కార్తీక**

***   ***   ***   ***

ఫిబ్రవరి 8, 1988
వెంకటాపురం

**నమస్తే వంశీ గారు,**
నేను వికాస్ ని. Hope you all are doing fine.
తలవని తలంపులా ఇతని ఉత్తరమేమిటా అనుకుంటున్నారా?

మా కార్తీకకి మీ అంతటి ఆప్తులైన స్నేహితులు లేరు.. మీ మధ్య ఏర్పడిన ఆత్మీయత కేవలం ఉత్తరాల వలనే అంటే నమ్మశక్యం కాదసలు! తనకి మీరంటే వల్లమాలిన గౌరవం, అభిమానం.. ఎప్పుడూ చెప్తుంది, 'నేను దిగులుగా ఉన్నప్పుడు, సమస్యల్లో ఉన్నప్పుడు కేవలం స్నేహితుడిగానే కాక ఒక గైడ్‌గా నాకు సహకరించిన మాస్టారు మా కవిగారు' అని! మరి మీ సహకారం ఇప్పుడు కొంచెం కావాలి మాస్టారూ.. ఈసారి మా ఇద్దరికీ!!

కార్తీక స్టొమక్ పెయిన్ గురించి మీకు చెప్పింది కదా. మొన్ననే టెస్ట్ రిజల్ట్స్ వచ్చాయి. అవి చూశాక, డాక్టర్ చెప్పింది విన్నాక నాకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నాను.. తెలిసినాయన ఒకరు ఇవాళ హైదరాబాదుకి వెళ్తుంటే ఆయనతో ఈ

లెటర్, టెస్ట్ రిపోర్ట్‌ల కాపీలు మీకందజేయమని పంపుతున్నాను. హైదరాబాదులో ఎవరైనా మంచి రేడియాలజీ డాక్టర్‌కి ఇవి చూపించి వారి అభిప్రాయం, సలహాలు కూడా కనుక్కోగలరా? అదీ వీలైనంత త్వరలో.. కనీసం ఇద్దరి డయాగ్నిసిస్ తీసుకుంటే మంచిదని అనుకుంటున్నాను. వాళ్ళు ఈ టెస్ట్ రిజల్ట్‌ని ధృవీకరించకపోవచ్చు కూడా కదా!

ఇంకో విషయం ఏమిటంటే అక్కడి డాక్టర్ల అభిప్రాయం తెలిసేవరకూ ఈ రిజల్ట్ విషయం కార్తీకకి చెప్పదలచుకోలేదు.. భూషణం మామయ్య కూడా అదే సజెస్ట్ చేశారు.. ఇప్పటికి ఆయనకి ఒక్కరికే చెప్పాను.

ప్రస్తుతానికి విజయవాడలో మంచి డాక్టర్ ఉన్నారని, వెంటనే అక్కడ జాయిన్ చేయమని సజెస్ట్ చేశారు. నేను మీకు నాలుగు రోజులలో ఫోన్ చేస్తాను. ఈలోపు తనని విజయవాడ హాస్పిటల్‌లో చూపించి ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేసేలా చూస్తాను.

I know I can depend on you.

I appreciate your help.

వికాస్

*** *** *** ***

ఫిబ్రవరి 14, 1988

హైదరాబాదు

డియర్ వికాస్,

Hope you are fine.

Sorry, ఇందాక మీరు కాల్ చేసినప్పుడు నేను ఇంట్లో లేను.. నేను పొద్దున్నే ఆఫీసుకి వెళ్ళిపోతాను.. మళ్ళీ మనం మాట్లాడడానికి ఎప్పుడు కుదురుతుందో అని ఎందుకైనా మంచిదని లెటర్ రాసేస్తున్నాను.. ఇప్పుడు నేను వచ్చింది డాక్టర్ దగ్గరనించే.. మీరు అడిగినట్లు ఒక్కరి దగ్గర కాకుండా ఇద్దరి దగ్గర రిపోర్ట్స్ చూపించాను. ఇద్దరూ ఒకటే విషయాన్ని కన్ఫర్మ్ చేశారు, ప్రైమరీ లివర్ కాన్సర్ అని! అంటే స్టొమక్‌లో వేరే పొరల నించి కాకుండా డైరెక్ట్‌గా లివర్‌లోనే మొదలైన కాన్సర్!!

వాళ్ళు సజెస్ట్ చేసింది ఏమిటంటే వెంటనే ట్రీట్‌మెంట్ అగ్రెసివ్ పేస్ లో మొదలవ్వాలని! ఎందుకంటే ఇది డిస్కవర్ చేసే సమయానికే `beyond the liver' స్ప్రెడ్ అయ్యే ఛాన్సెస్ ఎక్కువని చెప్పారు! అందుకే ఇక్కడి హాస్పిటల్ వివరాలు, ఫీజులు, మందుల సుమారు ఖర్చుల వివరాలన్నీ కూడా పంపుతున్నాను.. అంతేకాదు, ఈ డాక్టర్స్ కూడా అప్పుడే ఈ విషయాన్ని పేషెంట్ కి చెప్పకపోవడమే మంచిదన్న విషయాన్ని వ్యక్తపరిచారు..

వికాస్ మీ మనసులో ఏమూలో ఉన్న ఆశని తుడిచివేస్తున్నందుకు ఎంత బాధగా ఉందో చెప్పలేను.. మీరు లోనయ్యే ఆవేదనని ఊహించలేకపోతున్నాను.. నాకత్యంత ఆత్మీయురాలికి ఈవిధమైన కష్టం కలగడం ఎంత షాకింగ్‌గా ఉందో మీకు చెప్పలేను..

కానీ ఇప్పుడు చేయాల్సింది బాధని దిగమింగుకుని ఏం చేయాలి, ఎలా చేయాలన్న ప్లాన్ ని విశ్లేషించుకోవడం.. ఇప్పుడు నేనేం చెప్పినా ఏదో తాత్కాలిక ఓదార్పు మాటలుగా తోచి వైరాగ్యంగా అనిపించవచ్చు.. ఒక విషయం మాత్రం గుర్తుంచుకోండి, I'm there for you, for anything!

మరి మీ ప్లాన్ ఏమిటో, ఏవిధంగా ప్రొసీడ్ అవ్వాలనుకుంటున్నారో తెలియజేయండి. మీ రెస్పాన్స్ కోసం ఎదురుచూస్తుంటాను.
వంశీ

*** *** *** ***

ఫిబ్రవరి 24, 1988
హైదరాబాదు

ఓయ్ కార్తీకా,
అసలు మీ అమ్మాయిలు ఎంతటి అసాధ్యులో తెలుసా! ఇప్పుడే ఏదో పుస్తకంలో జోక్స్ చదువుతుంటే తెగ నవ్వొచ్చి వెంటనే నీతో పంచుకోవాలనిపించి ఉత్తరం మొదలుపెట్టాను.

ఒకసారి భార్యాభర్తలిద్దరు పోట్లాడుకుని ఒకరితో ఒకరు మాటలు మానేసారంట. ఆవిడ కాఫీ చేసి కప్పు అక్కడ పెడితే ఆయన తాగి సింక్ లో వదిలేయడం.. ఆయన ఏవేవో కూరగాయలు తెచ్చి వంటింట్లో పడేస్తే ఆవిడేమో తనకి తోచిన వంట చేసి టేబుల్ మీద పెట్టెళ్ళిపోవడం.. ఇలా గడిపేస్తున్నారు రోజులు.. అంతలో ఆయనకి అర్జెంట్ గా క్యాంప్ వెళ్ళాల్సి వచ్చింది.. సాయంత్రం ఇంటికొచ్చి బట్టలు సర్దుకుని, అన్నం తిని పడుకోబోతుండగా అలారం పాడైపోయిన సంగతి గుర్తొచ్చింది.. మరుసటిరోజు తెల్లవారుఝామునే ఐదు గంటలకి ట్రైన్.. పొద్దున్నే లేపమని భార్యకి చెబ్దామని అనుకుంటుండగానే తమిద్దరి మధ్యా మాటల్లేవన్న సంగతి గుర్తొచ్చింది! అందుకే ఓ పేపర్ మీద "దయచేసి పొద్దున్న మూడింటికి లేపు" అని రాసి వాళ్ళావిడ దిండు మీద పెట్టి, ఎందుకైనా మంచిదని వాచీ చేతికే పెట్టుకుని పడుకుండిపోయాడు.. పొద్దున్న సడెన్ గా మెలకువ వచ్చి వాచీ చూసుకుంటే 7:30 చూపిస్తోంది.. అంత రిక్వెస్టింగ్ గా రాసినా తనని ఎందుకు లేపలేదో భార్యని అడుగుదామని కోపంతో పక్క మిద నించి లేవబోతుండగా అతని దిండు పక్కనే ఓ పేపర్ కనిపించిది.. అందులో "ఏమండీ మూడైపోయింది.. ఇక లేవండి ప్లీజ్" అని రాసుంది!!
అదమ్మాయ్ మీ ఆడవాళ్ళ తెలివి!

ఎలా ఉన్నావు అని అడిగే సాహసం చేయను కానీ నాదో చిన్న రిక్వెస్ట్.. వేరేవారి కష్టాలు, సమస్యలు విన్నప్పుడు వాళ్లకి సహాయం చేయాలని ఎంతగా తపించిపోయేదానివో అంతే తపన నీకు నువ్వు సహాయం చేసుకోవడంలో కూడా చూపించు. నిన్న వికాస్ మాట్లాడినప్పుడు చెప్తున్నాడు ట్రీట్మెంట్ గురించి ఏం చెప్పినా నిరాసక్తత చూపిస్తున్నావని!

అయినా డాక్టర్లు చెప్పారుగా ఇదేమీ అంత ప్రమాదం కాదు, కేవలం సీరియస్ టైప్ అల్సర్ అని! చేయాల్సిందల్లా టైంకి మందులు వేసుకుంటూ, డాక్టర్లు చెప్పిన జాగ్రత్తలు తు.చ పాటించడం! నేను నీ మానసిక పరిస్థితిని అర్థం చేసుకున్నాను అని

చెప్పలేను కానీ ఒక్కసారి వికాస్ స్థానంలో ఉండి అతను పడుతున్న బాధని, నీకు నయం అయ్యేలా చూడాలన్న ఆత్రుతనీ గమనించు.. ఇకనించీ చికిత్స ఎంత ఫాస్ట్ పేస్ లో జరిగితే అంత మంచిది.

కార్తీకా, ఏమీలేని దానికి అదేపనిగా ఆలోచిస్తూ కృంగిపోయే అవకాశం మనసుకివ్వకు.. హర్ష ఆలనాపాలనా, పుస్తకాలు, కొత్త కొత్త వంటలు, దైవచింతన, ఇలా ఏదో ఒక వ్యాపకం కల్పించుకో. అసలు నేను నీకిచ్చిన బిరుదు గుర్తుందా, 'అతి మంచమ్మాయి'! మరి అలానే బిహేవ్ చేస్తూ చకచకా డాక్టర్ ఇచ్చిన మందులన్నీ వేసేసుకున్నావనుకో, ఎంచక్కా కడుపునొప్పి తగ్గిపోయి హర్షతో బోల్డంతసేపు ఆడుకోవచ్చు.. మళ్ళీ స్కూలు, శరణాలయం, సంఘసేవ అంటూ గిరగిరా తిరిగేయొచ్చు.. ఏమంటావ్? మాట వింటావు కదా!

అంతే కాదు, వికాస్‌కి ఇక్కడి మంచి మంచి డాక్టర్ల వివరాలన్నీ ఇచ్చాను.. మా ఇంట్లోనే ఉంటూ ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చు.. పనిలో పనిగా మనం గంటల తరబడి కబుర్లూ చెప్పుకోవచ్చు.. మరి ఎటువంటి జాప్యం చేయకుండా వెంటనే వచ్చేయండి.. మళ్ళీ హర్షని అక్కడా ఇక్కడా వదిలి రాకండి.

మీరు ఎప్పుడు వచ్చేదీ వెంటనే డిసైడ్ చేసి నాకు ఫోన్ చేయమని వికాస్ కి చెప్పాను.. నీకోసం బోల్డన్ని పుస్తకాలు ఎదురుచూస్తున్నాయి.. అలాగే ఇంతకుముందు నే చెప్పిన అసిస్టెంట్ పోస్ట్ లో కూడా జాయిన్ అవ్వొచ్చు.. ఏమంటావ్?

మీ ఫోన్ కోసం ఎదురుచూస్తుంటాము.
బి బ్రేవ్!!
**వంశీ**

***  ***  ***  ***

మార్చ్ 29, 1988
**వెంకటాపురం**

**నా నేస్తానికి,**
అక్కడ మీరందరూ క్షేమమే కదా!? ఇక్కడ అంతా క్షేమమే!
ఇవాళ వంటేం చేయాలో, హర్షని చూసుకోవడానికి ఇంకా మాణిక్యం రాలేదేంటి, స్కూల్‌కి టైమయిపోతోంది, మొన్న యాక్సిడెంట్ అయిన రేణుక ఎలా ఉందో? లాంటి చింతలేమీ లేకుండా ఇప్పుడే ఫ్రెష్‌గా బెడ్ షీట్స్ మార్చిన మంచం మీద జేరగిలబడి మీకుత్తరం రాస్తున్నాను.. చుట్టూ వారం తరబడి ఆపకుండా తిన్నా తరగని రకరకాల పళ్ళు.. కొత్త అట్టలతో మెరుస్తున్న మడత నలగని పుస్తకాలు.. ఇంతకన్నా క్షేమం ఏముంటుంది చెప్పండి!!

ఈవిడగారికి ఏమిటింత లగ్జరీ అనేసుకుంటున్నారు కదా! మరి ఈ అల్సర్ కడుపునొప్పికి వికాస్ చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు.. దానికి బాబాయి ఫుల్ సపోర్ట్! ఇద్దరూ కలిసి నాతో బలవంతంగా నెలరోజులు స్కూల్ కి సెలవు పెట్టించేసారు!

మీ "జీవితం" కవిత గుర్తుందా?

"శీతల పవనం, సంధ్యారాగం
వాన వెలసిన సమయం, ఆకాశంలో ఇంద్రచాపం
కలలు కనే జీవితం..

నీలాకాశం, పండువెన్నెల
అర్థరాత్రి, అందమైన కల
కోరుకునే జీవితం..

ఆలోచన, ఆందోళన
అలజడి, కలవరం
భయపెట్టే జీవితం..

సమస్యలు, సందేహాలు
సుడిగుండాలు, నడిసంద్రాలు
ఎదురయ్యే జీవితం!!"

మనం కలలుగని, కావాలని కోరుకునే జీవితానికీ, మనకి లభించే జీవితానికీ ఒక్కోసారి ఎంత తేడా ఉంటుందో కదా! వికాస్‌తో పెళ్ళైన కొత్తల్లో అచ్చు ఇలానే అనుకునేదాన్ని.. మళ్ళీ చాన్నాళ్ళ తర్వాత ఇప్పుడనుకుంటున్నా.. కాకపోతే అప్పుడు నమ్మలేని సంతోషం.. ఇప్పుడు తెలియని ఆందోళన!

నాగురించి కాదు.. వికాస్, హర్షల గురించి.. అంటే సినిమాల్లో చూపించే త్యాగశీలిలా ఆలోచిస్తున్నానని కాదు.. వంట్లో అంతా బావున్నప్పుడేమో వాళ్ళిద్దరితో గడిపే సమయం చాలా తక్కువుండేది.. ఇప్పుడు సెలవు పెట్టాక బోల్డంత ఫ్రీ టైం, వాళ్ళిద్దరి అన్ని పనులూ నేనే చూసుకుంటూ, హర్షతో ఆడుతూ పాడుతూ గడపాలని ఎంతనుకున్నానో.. కానీ ఈ మందుల వల్ల శరీరమే కాదు మనసు కూడా ఎంత నిస్సత్తువుగా అయిపోతుందో అసలు!

ఇప్పుడు హర్ష బుడిబుడి నడకలు మొదలుపెట్టాడు.. ఈ గదిలోంచి, ఆ గదిలోంచి వాడిని పిలుస్తుంటే, వాడు వచ్చీరాని పరుగుతో నన్ను కనుక్కుని, చీర కుచ్చిళ్ళలో మొహం దాచేసుకుని కిలకిలా నవ్వుతుంటే, నేనూ వాడిని ఎత్తేసుకుని ముద్దులు

కురిపిస్తూ, వాడి నవ్వులో జతకలిపినప్పుడు.. అప్పుడు.. సరిగ్గా ఆ ఆహ్లాద సమయంలో పిలవని పేరంటంలా వస్తుంది నొప్పి! వెంటనే మందు వేసుకుని కదలకుండా పడుకుంటే తప్ప ఉపశమించని నొప్పి!!

ఒక్కోసారి ఎందుకో చెప్పలేనంత భయం.. ఎంత అంటే, విశాల మైదానంలో విహరిస్తున్నదాన్ని ఉన్నట్టుండి నేలబారున ఉన్న లోతైన ఇరుకుబావిలో పడిపోయినంత భయం.. చుట్టూ ఏమీకనిపించని చీకటి, కదలడానికి వీలులేని ఇరుకుదనంలో ఉన్నప్పటి భయం!

అందరూ 'ఇప్పుడేమైందనీ? మేము లేమూ' అని ధైర్యం చెప్తున్నారు.. పగలంతా బానే ఉంటుంది
కానీ రాత్రి నిశ్శబ్దంలో ఆ చీకటి, ఇరుకుదనం ఆవహించి నిస్సహాయంగా అనిపించేది.. తల వెంట్రుకల నించీ కాలి గోళ్ళ వరకూ ఆవరించిన భయంతో వరుసగా ఒక వారంపాటు రోజూ రాత్రిపూట ఏడ్చేదాన్ని.. ఆ తర్వాత ఒకలాంటి వైరాగ్యం వచ్చేసింది.. ముఖ్యంగా హర్షతో సంతోషంగా గడపాలనే కోరిక హెచ్చింది.

కానీ వికాస్‌ని చూస్తుంటేనే దిగులు పెరిగిపోతుంది.. ఎవరైనా చూస్తే జబ్బు పడింది తననుకుంటారు! అంతలా పాడైపోయారు.. ఏదో చేసేసి నా ఈ నొప్పిని మాయం చేసేయాలని ఎంతో తాపత్రయపడుతున్నారు! 'ఎందుకిన్ని ఖరీదైన మందులు, డబ్బు ఖర్చు' అంటాను నేను.. 'లేదు, ఇలా అయితే చాలా తొందరగా, పూర్తిగా నయమైపోతుందని' తను!!

ప్రస్తుతం వారానికి రెండుసార్లు విజయవాడ వెళ్ళి చెకప్ చేయించుకు వస్తున్నాను.. మీతో చెప్పారుగా, ముందు ఇక్కడ మందులు వాడి ఆ ప్రోగ్రెస్‌ని బట్టి  హైదరాబాదులో చూపించవచ్చని ఇక్కడి డాక్టర్లు సలహా ఇచ్చారంట.. లేకపోతే అప్పుడే వచ్చేసి అక్కడ హాస్పిటల్లో చేర్పించేసేవాళ్ళు!! నెలజీతాల మా ఆర్ధిక పరిస్థితి గురించి మీకు ప్రత్యేకంగా వివరించక్కర్లేదు.. ఆయన స్నేహితులు అడిగిన వెంటనే సహాయం చెస్తున్నారు కాబట్టి అడగకుండానే అప్పు పుడుతోంది.. కానీ ఇలా ఎన్నోరోజులు జరగదు కదా! ఇదే ఆర్గ్యుమెంట్ తనతో చేస్తే ట్రీట్ మెంట్ పట్ల నిరాసక్తతని చూపిస్తున్నానని మీకు చెప్పారు..

అసలిప్పుడు ఏం చేశారో తెలుసా!! మొన్నెవరో జైపూర్ లో ఒక ఆయుర్వేద డాక్టర్ ఉన్నాడని, ఆయన మూలికలతో ఇలాంటి కడుపునొప్పి పేషెంట్స్‌ని ఎంతోమందిని నయం చేశాడని చెప్పారంట.. హుటాహుటిన నన్ను ఇక్కడి వాళ్ళకి అప్పగించేసి, వద్దని ఎంత చెప్పినా వినకుండా నాలుగు రోజుల్లో వస్తానని వెళ్ళారు! అయినా వంశీ గారూ, జైపూర్ కాళ్ళ గురించి విన్నాం కానీ ఈ జైపూర్ మూలికల గురించి విన్నామా ఎప్పుడైనా!? మళ్ళీ తిరిగి నామీద మీకు కంప్లైంట్స్ చేస్తారు చూడండి అసలు!!

ప్రస్తుతం తను వచ్చేవరకూ నా దగ్గర మాధురి ఉంటోంది.. కాలు కదల్చనీయడం లేదు తెలుసా! మళ్ళీ దానిలో ఒకరకమైన మార్పు చూస్తున్నాను.. హుందాతనం..  స్పష్టంగా కనబడుతున్న గాంభీర్యం!! ఇప్పుడు తన మాటల్లో పెరిగిన విజ్ఞత.. ఇదివరకు నేను మా తాతయ్యకు సాయం చేసినట్లు ఇప్పుడు వాళ్ళ అకౌంట్  వ్యవహారాలన్నీ తనే చూస్తోందంట! మొన్న వాళ్ళ గుమాస్తా వచ్చి రెండు పుస్తకాలు ఇచ్చి వెళ్తే ఆ రాత్రంతా కూర్చుని ఆ లెక్కలన్నీ సరి చూసింది.. మరి దీనికి మీ నాన్నా, రాజారావూ

ఒప్పుకున్నారా అంటే చిత్రంగా నవ్వేసి "ఇదేనే మన అమ్మాయిలతో తంటా! మన హక్కుల్ని మనం వాడుకోవడానికి కూడా తెగ భయపడతాం." అంది!! ఏది ఏమైనా ఈ మాధురి నాకు తెగ నచ్చేస్తోంది!!

ఇంకో విషయం, మందలిస్తూ ధైర్యం చెప్పిన మీ ఉత్తరం ఎంతో నచ్చింది! నిజం చెప్పాలంటే అది చదివిన ప్రతిసారీ నాలో నైరాశ్యం పాలు తగ్గిపోతోంది! మీరందించే మనోధైర్యం ధన్యవాదాలకందనిది.. ఇక ఆ జోక్ గుర్తొచ్చినప్పుడల్లా ఎంత నవ్వొస్తుందో! మాధురికి చదివి వినిపించినప్పుడైతే పడీపడీ నవ్వింది.. నాకూ అలానే నవ్వాలనుంది.. కానీ ఈ నొప్పొకటి అడ్డుపడుతోంది.. చాలా బాధగా ఉంటొంది.. ష్ ష్.. ఇంత తీవ్రంగా వస్తోందని
ఎవరికీ చెప్పకండి.

కాలేజ్‌లో ఉన్నప్పుడనుకుంటా ఒకసారి చేతివేళ్ళు తలుపుసందులో పడి విపరీతమైన నొప్పి కలిగింది.. ఈ బాధని ఆ తర్వాతెప్పుడో చీకట్లో గబగబా నడుస్తున్నప్పుడు, రాయి కొట్టుకుని కాలిగోరు పైకి లేచిపోయినప్పుడు కలిగిన నొప్పి అధిగమించింది.. హర్ష పుట్టేప్పుడు లేబర్ రూంలో పెయిన్స్ వస్తున్నప్పుడు దీనిముందు ఆ రెండింటి బాధ ఏమూలకి అనిపించింది.. కానీ ఇప్పుడు ఈ కడుపు నొప్పి వాటన్నిటినీ అధిగమించేసింది.. దీని తీవ్రతని చెప్పి ఇంకా అందరినీ బెంబేలు పెట్టడం నాకిష్టం లేదు.

రాధిక గారి చదువు ఎలా సాగుతోంది? ఇప్పుడు గౌతం కూడా స్కూల్ కి వెళ్తున్నాడు కదా ఇంకొంచెం ఫ్రీ టైమ్ దొరుకుతుందేమో.. స్టడీ మెటీరియల్ ఏమన్నా కావాలంటే అడగమని చెప్పండి.

సరే నేస్తం, ఈసారికి ముగించేముందు నాదో చిన్న రిక్వెస్ట్.. మీ దగ్గరున్న వాటిలోంచి కొన్ని మంచి పుస్తకాలు పంపగలరా? మీరు ప్రస్తుతం చదవనివే సుమా!! అసలప్పుడోసారి మీరన్నట్లు మీరు మాఇంటి పక్కనే ఉంటే అలా ఒక్క గెంతులో వచ్చి కావాల్సిన పుస్తకాలు పట్టుకుపోయేదాన్ని.. అయినా మీరెంత తెలివైనవారో చూడండి, అసిస్టెంట్ పోస్ట్, హాస్పిటల్స్ అంటూ అక్కడికి రమ్మని మమ్మల్ని ఆహ్వానిస్తున్నారే కానీ మీరు మాఊరొచ్చే మాటే రావడంలేదసలు! ఎలా మభ్య పెట్టేస్తున్నారో!

ఇప్పుడు నా టానిక్ లు మీ ఉత్తరాలే కాబట్టి వెంటవెంటనే జాబులు రాస్తుండాలి మరి! చూద్దాం లెటర్స్ అయినా బాకీ పెట్టకుండా, నెలల తరబడి వేచి ఉండేలా చేయకుండా రాస్తారేమో!
**కార్తీక**

*** *** *** ***

ఏప్రిల్ 15, 1988
హైదరాబాదు

ప్రియమైన కార్తీకకి,
'ఎలా ఉన్నావ్? అంతా క్షేమమేనా??' లాంటి యధావిధి ప్రశ్నలన్నీ దాటేసి అంతకుముందెప్పుడో అడుగుదామన్న ప్రశ్నని

అడిగేస్తున్నా.. అసలు నువ్వు మంచం మీద కూర్చుని ఉత్తరమెలా రాయగలవు!? 'అదేమన్నా బ్రహ్మావిద్యా!' అన్నట్టు ఫేస్ పెట్టకు.. పోయినసారి నీ ఉత్తరం చదివాక అసలు అందులో ఉన్న సౌలభ్యం ఏమిటా అని నేనూ ట్రై చేశా.. ఊహూ! నా వల్ల కాలేదు.. ఒక పేరా అయ్యేసరికి కాళ్ళు లాగడం.. నడుము పట్టేసినట్లు అయిపోవడం!! మరి నువ్వేమో పేజీలకి పేజీలు అలా కూర్చునే రాసేస్తున్నావ్.. అందుకే ఆ కూర్చోవడంలో ఏమన్నా సీక్రెట్ ఉందేమో తెలుసుకోవలనుకుంటున్నాను.. రాధికని అడిగితే అది కేవలం ఆడవాళ్ళకి మాత్రమే సాధ్యం అంటోంది.. అసలు నువ్వు ఇక్కడికి వచ్చేసి ఉంటే ఇలాంటి కిటుకులన్నీ దగ్గరుండి నేర్పేదానివి కదా.

వికాస్ ఫోన్ చేసి ప్రస్తుతానికి విజయవాడలోని డాక్టర్లని కన్సల్ట్ చేయడానికి డిసైడ్ చేసుకున్నట్టు చెప్పగానే ఎంతో నిరాశగా అనిపించింది.. అంతలోనే "అసలు మీ ఫ్రెండ్ ఏం చెప్పమందో తెలుసా 'మీరు అమెరికా వెళ్ళినప్పుడు రాధిక గారిని, పిల్లల్ని మాఊరికి పంపలేదుగా అందుకే మేమూ రాము" అని తను చెప్పగానే నీ స్పోర్టివ్‌నెస్ కి ముచ్చటేసి నవ్వేసుకున్నాను.

అసలు వికాస్ మూలికల కోసం జైపూర్ వెళ్ళాడని చదవగానే మనసంతా అతని పట్ల ఆర్ద్రతతో నిండిపోయింది.. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు సానుభూతి కోసం చూస్తూ కాలం గడపకుండా తోచినన్ని పరిష్కారమార్గాలు వెతకడం వికాస్ లాంటి తెలివైనవాళ్ళు చేసే పని! I have an increased respect for him!

ఇంతకీ వాటి ప్రభావం ఎలా ఉంది? మన టాబ్లెట్ల లాగా వాటికి ఒకటీ రెండూ అని లెక్క ఉండదు.. రోజుకి కాస్తో కూస్తో వాడాలి.. బావున్నాయని గబగబా తినేసి మళ్ళీ ఆ మనిషిని జైపూర్ ఎడారుల్లోకి పరిగెత్తించకు.

మేము మొన్న శిరిడీకి వెళ్ళి వచ్చాము.. చాలా షార్ట్ ట్రిప్.. నీకు తగ్గగానే మీ ఇద్దరితో మళ్ళీ వస్తామని రాధిక అప్పుడే మొక్కేసుకుంది.. నువ్వు అడిగినట్లే కొన్ని పుస్తకాలు, ఇంకా రాధిక నీకోసం తెచ్చిన కుంకుమ, విబూది లాంటివన్నీ పంపిస్తున్నాను. అలానే వీలైనంత త్వరలో మీ ఊరొస్తానన్న మాట కూడా పంపుతున్నాను.. ప్రామిస్!

నీ ప్రోగ్రెస్ ఎలా ఉందో వెంటనే తెలియజేస్తావు కదా!
వంశీ

*** *** *** ***

మే 20, 1988
వెంకటాపురం

హలో వంశీ గారు,
ఎలా ఉన్నారు?
ముందుగా మీరందిస్తున్న మోరల్ సపోర్ట్ కి ధన్యవాదాలు.

నాకు అది కావాలి, ఇది కావాలీ అని ప్రత్యేకంగా దేవుడికి మొక్కుకున్న సందర్భం లేదు. లేనిదాని గురించెప్పుడూ ఆలోచించకుండా అవసరంలో ఉన్నవాళ్ళకి నాకు వీలైనంత సాయం చేయడమే నాకు తెల్సిన పూజైనా, పునస్కారమైనా. కానీ ఈరోజు కార్తీక బాధని చూస్తూ నిస్సహాయంగా నిల్చోవడం తప్ప ఏం చేయలేని స్థితిలో ఉన్నాను.

ఇప్పుడు వాడుతున్న మందులకి ఏమాత్రం ప్రోగ్రెస్ కనిపించడంలేదు. కాన్సర్ సెల్స్ ఇంకా స్ప్రెడ్ అవకముందే ఎడ్వాన్స్డ్ ట్రీట్ మెంట్ ఇప్పిస్తే మంచిదని ఇక్కడి డాక్టర్లు తొందర పెడుతున్నారు. భూషణం మామయ్య వాళ్ళ తమ్ముడు చెప్పారు వైజాగ్‌లో మంచి డాక్టర్ ఉన్నారని, తనకి చాలా దగ్గర స్నేహితుడని, కార్తీకని వెంటనే తీసుకురమ్మని. ఎకామడేషన్ ఏర్పాట్ల గురించి ఏమాత్రం టెన్షన్ పడొద్దని కూడా చెప్పారు. మామయ్య కూడా ఏమాత్రం ఆలస్యం చేయకుండా బయల్దేరమని చెప్పడంతో రేపొద్దున్నే కార్తీకని వైజాగ్ తీసుకువెళ్తున్నాను. మా దూరపు చుట్టమయ్యే ఒకావిడ అక్కడ మాతో ఉండడానికి ఒప్పుకుంది. ఆవిడని, హర్షని తీసుకుని మామయ్య రెండురోజులలో వస్తానని చెప్పారు.

కానీ ఎన్ని చెప్పి మభ్యపెట్టినా ఇంక కార్తీక నమ్మడంలేదండీ. తనకి వస్తున్న కడుపునొప్పి మామూలుది కాదని నాతో వాదిస్తోంది. హాస్పిటల్‌లో ఎప్పుడూ నేను తన వెన్నంటే ఉండడం వలన, అక్కడ వాళ్ళకి ముందే చెప్పి ఉంచడం వలన ఎవరూ బయటపడలేదు. దయచేసి మీరు ఎప్పట్లాగే తనకి ఫ్రీక్వెంట్ గా ఉత్తరాలు రాస్తూ తన ధైర్యం సడలిపోకుండా చూస్తారు కదూ.

వైజాగ్ వెళ్ళి హాస్పిటల్‌లో చేర్చగానే అక్కడి కాంటాక్ట్ వివరాలతో మళ్ళీ మీకు లెటర్ రాస్తాను.
అంతవరకూ సెలవు.
**వికాస్**

*****   ***   ***   *****

జూన్ 2, 1988

వైజాగ్

**హాలో వంశీ గారు,**

మీరూ, మీ ఫ్యామిలీ అంతా బావున్నారని తలుస్తాను. కార్తీకని ఇక్కడ హాస్పిటల్ లో జాయిన్ చేసి అప్పుడే దగ్గర దగ్గరగా 10 రోజులైపోతోంది. ఈ హాస్పిటల్ ఛీఫ్ మామయ్య తమ్ముడు, రఘురాం గారికి మంచి స్నేహితుడవ్వడం వలన బెడ్ అదీ వెంటనే అరేంజ్ చేశారు. రఘురాం గారే మేముండడానికి కూడా ఒక చిన్న రూం హాస్పిటల్‌కి చాలా దగ్గరలోనే చూసిపెట్టారు. మామయ్య హర్షని, మా అత్తయ్యనీ దింపి రెండు రోజులుండి వెళ్ళిపోయారు. ఈ కష్టకాలంలో సహాయాన్నందిస్తున్న ఈ స్నేహహస్తాల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది!

ఇప్పటివరకూ వాడిన మందులతో ఏమీ పాజిటివ్ రెస్పాన్స్ కనబడలేదని కార్తీకకి వెంటనే రేడియేషన్ ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు. డాక్టర్లు ధైర్యం చెప్తున్నంతసేపూ కాస్త ఊరటగా అనిపించినా కార్తీక మొహం చూస్తుంటే చెప్పలేనంత

అలజడి. కడుపునొప్పికి తోడు ఈ రేడియాషన్ వేడి కూడా తోడయ్యేసరికి తను తట్టుకోలేకపోతోంది.. నరకయాతన పడుతోంది. తన బాధని తగ్గించలేని అశక్తుడినైనా మనసుని మాత్రం ఆహ్లాదపరచడానికి నా శతవిధాలా ప్రయత్నిస్తున్నాను. మెలకువగా ఉన్నంతసేపూ హర్షతో సమయం గడపడానికే ప్రయత్నిస్తోంది. వాడితో ఆడుతూనే సడెన్‌గా వాళ్ళ అమ్మమ్మ తాతయ్యల్నీ, మిమ్మల్నీ గుర్తుకు తెచ్చుకుంటుంది. తనకేదో అయిపోతుందని, పెద్దవాళ్ళని వాళ్ళ పట్టుదలలు సడలింపచేసే శక్తి తనకి లేదు గానీ మిమ్మల్ని మాత్రం వీలైనంత త్వరలో చూడాలని ఆత్రుతపడుతోంది.

మేమిద్దరం దగ్గరవ్వడానికి కార్తీక మీద మీ ప్రభావమే ముఖ్యకారణమని నాకు తెలుసు. మీకో విషయం తెలుసా, నేను కూడా పెళ్ళి చేసుకోకూడదనే నిర్ణయంతో ఉన్నవాడినే! అంటే కార్తీకలా పెళ్ళి పట్ల విముఖతతో కాదు... నా ఆలోచనలను, ఆశయాలనూ అర్థంచేసుకునే అమ్మాయి దొరుకుతుందనే నమ్మకం లేక! కానీ కార్తీకని చూశాక ఆ నిర్ణయం సడలిపోయింది. అవసరంలో ఉన్నవాళ్ళకి ఊరికే మాట సాయం కాక నిజంగానే సహాయం చేయాలనే తాపత్రయం ఉన్న అమ్మాయి, పని చేసుకుపోవడమే కానీ ఎలాంటి మెప్పుదలలనూ ఆశించని అమ్మాయి! తనని నా జీవితభాగస్వామిగా ఆహ్వానించాలన్న ఆలోచన క్షణక్షణానికీ బలపడి, అమరావతి పిక్నిక్ తర్వాత దృఢనిశ్చయంగా మారింది. ఇక ఆలశ్యం చేయకుండా భూషణం మామయ్య వాళ్లకి నా మనసులోని మాటని చెప్పగానే వాళ్ళు నిరుత్సాహం కలిగించే మాట చెప్పారు. అదే, తనకి పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదని, త్వరలో హైదరాబాద్ లో ఎమ్.ఫిల్ చేయడానికి వెళ్ళిపోబోతున్నదనీ! అయినా సరే అడిగిచూడమన్నాను. నమ్మశక్యం కాని విధంగా కార్తీక వెంటనే ఒప్పుకుంది. ఆ తర్వాత తెలిసింది మీ గురించి, మీ ఇద్దరి కలం స్నేహం గురించి, తన మీద మీ లేఖల ప్రభావం గురించి! ఆ క్షణంలోనే మీరు నాక్కూడా ఆప్తమిత్రుడైపోయారు.

అందుకే కేవలం కార్తీకని సంతోషపరచడానికే కాదు మేమిద్దరమూ కలిసి మీకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికైనా మీరు వీలైనంత త్వరలో ఇక్కడకి రావాలని కోరుకుంటున్నాను. కవర్ మీద అడ్రెస్ అదీ రాస్తున్నాను. మీరు రాగలిగేదీ డిసైడ్ చేసుకుని తెలియపరుస్తారు కదూ.

మీ ఉత్తరం కోసం ఎదురుచూస్తుంటాము.

వికాస్

*** *** *** ***

జూన్ 8, 1988

హైదరాబాద్

**డియర్ వికాస్,**

ఇంత తొందరగా మీ క్షేమసమాచారం అందించినందుకు చాలా థాంక్స్.. మీ ఉత్తరం చదువుతుంటే మనసంతా ఖచ్చితంగా ఇదీ అని తెలియని బరువుతో నిండిపోయింది.. అయినా మీరు 'కృతజ్ఞతలు' అదీ ఇదీ అంటూ పెద్ద పెద్ద మాటలు వాడేశారు.. నాకంత అర్హత ఉందనుకోను.. నేను చేసిందల్లా కేవలం నా భావాల్ని కార్తీకతో పంచుకోవడమే! నిజంగా ఇంతకన్నా ఎక్కువ నేనేమీ చేయలేదు.. ఈమాత్రం దానికి మీరిద్దరూ నాకు ఆపాదిస్తున్న గౌరవాన్ని చూస్తుంటే కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

అందమైన భావాలతో, సునిశితమైన హాస్యంతో ఉత్తరాలు రాసే కార్తీక మా ఫ్యామిలో ఒకరిగా ఎప్పుడో కలిసిపోయింది.. 'ఈ విషయం కార్తీకకి చెప్తే ఏమంటుందో', 'ఈసారి కార్తికని దీని గురించడగాలి', 'దీనికి కరెక్ట్ సమాధానం కార్తీకే చెప్పగలదు' అంటూ తరచూ మా సంభాషణల్లో దొర్లే తన పేరు వింటున్న వాళ్ళకి, మేము తనని

ప్రత్యక్షంగా చూడలేదనే విషయం చెప్తే నమ్మరనేది అతిశయోక్తి కాదు! మా మాటల్లో, పనుల్లో నిరంతరం తన నామస్మరణ వినిపిస్తూనే ఉంటుంది.. అంతే కాదు మా ఇద్దరి అమ్మా,నాన్నలకి కూడా తన పేరు చిరపరిచయం!

కార్తీక అప్పుడప్పుడూ మీగురించి చెప్పిన సంగతుల వల్ల అప్పటికే మీరు కూడా మంచి స్నేహితుడిగా మా మనసుల్లో స్థానాన్ని సంపాదించేసారు! కుటుంబవ్యవస్థ పట్ల తనకున్న అసహనాన్ని తొలగించుకుని మీకు భాగస్వామి కావడం మాకెంతో సంతోషం కలిగించిన విషయం.. మీ జీవన సౌరభాన్ని వింటూ, ఆస్వాదిస్తున్నంతలోనే కార్తీక ఇలాంటి ప్రాణాంతకమైన జబ్బు బారిన పడటం ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాము.. అదీ దానిగురించి నిర్ధారణ నేనే చెప్పాల్సి రావడం ఇంకా బాధాకరంగా ఉంది.. పొద్దున్న లేచిన దగ్గరనుండీ ఎన్నో దురదృష్టకరమైన సంఘటనల గురించి వింటుంటాం, చదువుతుంటాం.. 'ప్చ్ అలానా!' అని పెదవి విరచి వదిలేస్తాం.. అలాంటిదేదో మనదాకా వస్తేగానీ అందులో ఉన్న అసలు విషాదం మనకి తెలీదు!

ఎన్నేళ్ళ నించీ వింటున్నాం 'కాన్సర్ నివారణకి సాగుతున్న పరిశోధనలు' అని!! ఇంకెప్పుడు కనిపెడతారు మందు!? తల్చుకుంటుంటే ఒక్కోసారి పట్టరాని కోపం... ఈ డాక్టర్లు, సైంటిస్టుల మీద! ఆలోపు మన కార్తీక లాంటివాళ్ళెంతమంది ఈ వ్యాధిబారిన పడి బాధలనుభవించాలి!! సారీ వికాస్, నా ప్రియ నేస్తం కష్టాన్ని తగ్గించలేని నా నిస్సహాయతకి ఫలితం ఈ అనుచిత ఆవేశం.

ఈసమయంలో తనకి సంతోషం కలిగించేదేదైనా చేయడానికి మేము సిద్ధం.. మీ దగ్గరనించి అన్ని వివరాలతో ఉత్తరం రాగానే బయలుదేరదామని ఎదురుచూస్తున్నాను.. వచ్చే వారం మొదటి మూడురోజులూ ఫారిన్ డెలిగేట్స్ తో ఇంపార్టెంట్ మీటింగ్స్ ఉన్నాయి.. అవి అవ్వగానే గురువారం, పదహారో తేదీ ఉదయాన్నే గోదావరికి బయలుదేరుతాను.. టికెట్ రిజర్వేషన్ అయిపోయింది.

ఏ మాత్రం అధైర్యపడకుండా పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్న మిమ్మల్ని అభినందిస్తున్నాను వికాస్.. ఏ క్షణమైనా ఒక బలహీన పవనాన్ని పంపి మీ నిబ్బరాన్ని పరీక్షిస్తుంటే మీతో పాటు మేమందరం అండగా ఉన్నామన్న సంగతి జ్ఞప్తికి తెచ్చుకోండి.. Lets keep our spirits up!

మిమ్మల్ని కలుసుకునే రోజుకై ఎదురుచూస్తూ..

వంశీ

*** *** *** ***

జూన్ 8, 1988

వైజాగ్

ఎలా ఉన్నారు మిత్రమా?

మధుమాసపు నందనవనంలా గోచరిస్తున్న జీవితం నిజంగా నాదేనన్న నమ్మకం బలపడిన మరుక్షణమే అపహాస్యం చేస్తూ కలలా కరిగిపోవడానికి సిద్ధమైపోతోంది.. అలా కలలా మాయమవకూడదని అందని ఏ నక్షత్రం అంచుల్నో పట్టుకోవాలని ఆరాటపడుతున్నాను.. ఎక్కడ నా పట్టు సడలుతుందోనని కొన్ని ఆత్మీయ హస్తాలు అహర్నిశం నా చుట్టూ కాపలా కాస్తున్నాయి!

`ఇంకా మంచి డాక్టర్లు ఉన్నారంట`అని రాత్రికి రాత్రి ప్రయాణం కట్టించి ఇక్కడికి తీసుకొచ్చేసారు వికాస్.. చేరిన మూడోరోజే నర్సుని మంచి చేసుకుని `అసలు నా జబ్బేంటని?` వాకబు చేశాను.. ఆవిడేమో తేలిగ్గా నవ్వేసి "జబ్బూ గిబ్బూ అని పెద్ద పెద్ద మాటలొద్దమ్మా.. కడుపులో సిస్ట్ పెరిగింది.. ఆపరేషన్ చేయడం ప్రమాదమని మందులతోనే తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.. అంతే!" అని చెప్పింది.. నాకు బోధపడిపోయింది, ఈమె కూడా మావాళ్ళ నాటకంలో పాత్ర సంపాదించేసింది అని!

అయినా ఇప్పుడసలు నాకసలేమయ్యింది అన్న చింత కాకుండా ఇంకెన్ని మందులు మింగాలా అన్న భయం ఎక్కువైంది.. కడుపులో నొప్పికి తోడు ఆ మందుల వల్ల కలిగే తలతిరుగుడు లాంటివి మొదలయ్యేసరికి నా శక్తి సన్నగిల్లిపోతోంది.. దానికి తోడు బయటనించే సిస్ట్‌ని కరిగించడానికి ఎలెక్ట్రానిక్ బీమ్స్‌ని పంపించే ట్రీట్‌మెంట్ ఒకటి మొదలుపెట్టారు.. అసలేమీ నొప్పి లేకుండా ఇదేదో బానే ఉందే అనుకున్నా.. కానీ మూడోరోజు నించి ఒళ్ళంతా ఒకటే మంటలు, మంచినీళ్ళు తాగినా బయటకి వచ్చేస్తున్న నాసియా ఫీలింగ్.. శారీరక బాధ అటుంచితే అసలు ఈ హాస్పిటల్‌ని చూస్తుంటే నాకు ఏదో స్టార్ హోటల్ లో ఉన్నట్లుంది! ఎటుచూసినా పరిశుభ్రంగా, చల్లని గాలి వచ్చేలా వెంటిలేషన్, అక్కడక్కడా తాజాపూల వేజ్‌లు.. అవన్నీ చూసి నాకు హాయిగా అనిపించడానికి బదులు దిగులేసింది! ఇంత సౌకర్యం లభ్యమయ్యే వెల ఎంతోనని.. మీరే చెప్పండి వంశీ గారు, ఇలాంటి హాస్పిటల్స్‌లో ఫీజులు ఆకాశాన్నంటుతాయి కదా!? దానికి తోడు ఇప్పుడు నాకిస్తున్న స్పెషల్ ట్రీట్‌మెంట్‌కి అయ్యే ఖర్చు!! వీటన్నిటికీ డబ్బు వికాస్ ఎలా సమకూర్చగలుగుతున్నారో తెలీదు.. రెండు మూడు సార్లు అడిగితే "ఇలాంటి విషయాల గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండు.. ఒకప్పుడు నువ్వు నలుగురికీ చేసిన మంచే ఇప్పుడిలా సహాయపడుతుందనుకో!" అంటున్నారు.

అదివరకు వికాస్‌ని `అమ్మ కుచ్చిళ్ళు వదలని పసిపిల్లాడిలా ప్రవర్తిస్తారంటూ' ఆటపట్టించేదాన్ని.. కానీ గత నెల రోజులుగా అలుపెరుగని సైనికుడిలా ఆయన పడుతున్న శ్రమని చూస్తుంటే మనసంతా వేదనతో నిండిపోతోంది! ఎప్పుడూ సమస్యల్లో ఉన్నవాళ్ళకి ఏదో చేయాలని తాపత్రయపడే మనిషిని స్వార్ధంతో నా కొంగునే ముడేసుకుని ఊరూరా తిరుగుతున్నట్లనిపిస్తుంది.. అదే మాట తనతో అంటే నవ్వుతూ "మరి ఆ కొంగుముడి ఎప్పటికీ విప్పనని ప్రమాణం చెయ్యి" అంటారు.. నిజంగానే ఎప్పుడు మిగతా పనులు చేస్తారో కానీ నేను మందుల మత్తులో లేనంతసేపూ నాతోనే ఉంటారు.. హర్షని నా పక్కనే కూర్చోబెట్టి మాటలు నేర్పిస్తున్నారు.. ఇప్పుడర్జంట్‌గా వాడిచేత `అమ్మా` అని పిలిపించాలంట.. `అంత తొందరెందుకు, మాటలు రావడానికి ఇంకా సమయముంది కదా` అంటే "మనవాడు అందరిలా తీరికగా నేర్చుకుంటాడనుకున్నావా, వీడు అన్నిట్లో ఫాస్టు ఉంటాడు చూడు" అంటూ వాడిని కిలకిలా నవ్వేలా చక్కిలిగింతలు పెడతారు..

అలా వాళ్ళిద్దర్నీ చూస్తుంటే అర్జెంట్‌గా లేచి అన్నీ సర్దేసి మా ఊరెళ్ళిపోవాలనిపిస్తుంది.. అంతేకాదు, కళ్ళ ముందు అనేక దృశ్యాలు వరుసగా కదులుతుంటాయి.. వాడికి స్నానం చేయిస్తూ, గోరుముద్దలు పెడుతూ, నిద్రపుచ్చుతూ నేను పద్యాలు పాడటం.. వాడు నా పక్కనే కూర్చుని పాఠాలు చదువుకోవడం.. వికాస్‌తో కలిసి పొలం గట్లెంట తిరిగి కూరగాయలు కోసుకురావడం.. వాడు మొట్టమొదట గెలిచిన ట్రోఫీని నాకు బహుమతిగా ఇవ్వడం.. వాడిని ఏ కాలేజీలో చేర్పించాలా అని నేనూ, వికాస్ తర్జన బర్జన పడడం.. అన్నీ ఇలాంటి దృశ్యాలే!! మీకు తెలుసా, హర్ష వంటి మీద ఒక్క దెబ్బ

కూడా పడకుండా వాడికి క్రమశిక్షణ అలవాటు చేయాలని మా కోరిక! ఉజ్వలంగా ఎదగబోయే వాడి భవిష్యత్తులో మా పాత్రలు తలచుకుంటుంటేనే ఎంత ఉద్వేగంగా ఉందో నేస్తం!

ఈ ఆనందం మనసుని చేరి పారవశ్యంగా మారేలోపే మళ్ళీ సన్నగా నొప్పి మొదలవుతుంది.. హర్షని పట్టుకున్న చేతివేళ్ల బిగువు సడలిపోతుంది.. కళ్ళు బాధతో అరమూతలవుతుంటాయి.. అంతలో "నొప్పిగా ఉందా?" అంటూ తల మీద అతి మృదువుగా వికాస్ నిమురుతుంటారు.. నా కంటినీళ్ళని తుడుస్తూ తన కళ్ళు చెమరుస్తున్న సంగతే తలంపుకి రాదు.. ఇంతకన్నా నరకం కూడదనిపిస్తుంది.

ఒక అందమైన బంధాన్ని పరిచయం చేస్తూ జీవితంలో మలిపొద్దు మొన్ననేగా మొదలైంది.. ఎన్నెన్ని కొత్త ఆశయాలు.. ఆలోచనలు.. చేతనైనంతగా అసహాయులకి కొత్తదారి చూపించాలనే తాపత్రయం.. బోల్డన్ని కొత్త ప్రణాళికలు తయారు చేసుకుంటుండగానే ఇలా మంచానికి అతుక్కుపోవడంతో అప్పుడే ఆఖరిపొద్దు వచ్చేసిందా అనే ఆందోళనొకటి మనసుని పట్టి ఊపేస్తోంది.. కొత్త పనుల గురించి అటుంచితే అసలు శరణాలయంలో పిల్లల పరిస్థితి ఎలా ఉందోనని దిగులుగా ఉంది.

ఇంత తొందరగా అడ్రెస్ ఎలా సంపాదించిందో కానీ మాధురి ఉత్తరం మొన్ననే వచ్చింది.. అక్కడ పిల్లలంతా మమ్మల్ని ఒకటే కలవరిస్తున్నారంట.. ఆరీఫ్ అయితే కార్తీకక్క దగ్గరికి తీసుకెళ్ళండని రోజూ గొడవంట.. అందుకే మందులవీ జాగ్రత్తగా వాడి తొందరగా ఇంటికి వచ్చేయమని రాసింది.. అసలు చూడండి, ఇలా బ్లాక్‌మెయిల్ చేస్తేగానీ నేను మాట విననట్టు!! ఏదో ఒకటి రెండు సార్లు పొట్టలో ఆ మందులు చేసే గొడవ తట్టుకోలేక వేసుకోనని మొరాయించాననుకోండి.. దానికే పిల్లల బెంగ గురించి చెప్పి భయపెట్టాలా, మరీను!! కానీ ఇంకో మంచి విషయం కూడా రాసిందండి.. మా అమ్మమ్మ తాతయ్యలు నా ఆరోగ్యం సంగతి విని చాలా ఆందోళన పడుతున్నారంట.. అంటే వాళ్ళ ఆందోళన నాకు సంతోషం అని కాదు.. ఇప్పటికి వాళ్ళ మనసులో నా పట్ల ఉన్న వ్యతిరేకత తొలగిపోయిందన్న ఆనందం.. అంతే! పోనీలేండి ఈ జబ్బు ఈరకంగా ఒక మంచిపని చేసింది!

ఇందాకే మాధురికి నాలుగు లైన్ల ఉత్తరం రాసేసాను, పిల్లల్ని అప్పుడప్పుడూ వెళ్ళి చూస్తుండమని.. అలానే అమ్మమ్మ వాళ్ళని ఎంతగానో తలచుకున్నట్లు చెప్పమని.. తన ఉత్తరం చదివాక మనసులో ఎప్పటినించో ఉన్న వెలితి తగ్గినట్లు అనిపించినా ఇంకా ఒక అసంతృప్తి మిగిలే ఉంది.. మరింకేమీ కాదు, మిమ్మల్ని కలుసుకోవడం.. అందుకే ఓపిక లేకున్నా మీకు ఉత్తరం రాయడానికి కూర్చున్నాను.

రెండు లైన్లు రాసానో లేదో వికాస్ వచ్చి "ఇంకా మాధురికి ఉత్తరం అవ్వలేదా? ఇంతసేపు కూర్చోకూడదు నువ్వు" అంటుంటే చెప్పాను రాస్తున్నది మీకని.. వెంటనే చెప్పారు, మీకు తను ఇక్కడికి వచ్చీ రాగానే రాసినట్లు, అందులో మిమ్మల్ని తప్పకుండా రమ్మని చెప్పినట్లు.. రేపో ఎల్లుండో రిప్లై కూడా వస్తుంది చూడు అంటున్న తన మాటలు వినగానే భలే సంతోషం వేసింది.. అదిచ్చిన ఉత్సాహంతో ఇంతసేపు రాయగలుగుతున్నాను.. అయినా, నా వెనక మీ ఇద్దరు తెగ ఉత్తరాలు రాసేసుకుంటున్నారుగా అసలు!! ఈ లెక్కన నేను ఇక్కడినించి ఇంటికి వెళ్ళేసరికి మీ ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్ అయిపోయి, నన్ను వదిలేసి మీకు మీరే రాసేసుకునేటట్లున్నారు!!

ఈ సరదా మాటలు పక్కన పెడితే మీరూ, వికాస్ మంచి స్నేహితులవ్వటం నాకు చాలా సంతోషాన్నిస్తుంది.. అప్పటివరకూ చురుగ్గానే అటూ ఇటూ తిరిగిన తను మొన్న భూషణం బాబాయి తిరిగి వెళ్ళిపోగానే డల్‌గా కనిపిస్తున్నారు.. నా

దగ్గర మామూలుగానే ఉంటున్నా తన కళ్ళల్లో అదోలాంటి నిస్సత్తువ!! ఇలాంటప్పుడు వికాస్‌కి మీలాంటి మానసిక స్థైర్యం కలిగించే స్నేహితుల అవసరం చాలా ఉంది.. పోనీ నన్ను కలవడానికి కాకపోయినా మీ కొత్త స్నేహితుడి కోసమైనా వస్తారేమో చూద్దాం!

ఏమిటో మిత్రమా మీ గురించీ, రాధిక గారు, పిల్లల గురించీ మాట మాత్రమైనా అడగకుండా మిమ్మల్ని కూడా నా భవసాగరంలో మునకలు వేయిస్తున్నాను.. క్షమించండి.. అయినా ప్రత్యేకించి అడగకపోయినా మీ అందరూ నిరంతరం మా ఆలోచనల్లో ఉంటారన్న సంగతి మీకు చెప్పక్కర్లేదు.

మరి నాది బాధో, భయమో, ఆందోళనో, లేక అన్నీ కలిపో.. మనసు విప్పి చెప్పడానికి మీకన్న ఆత్మీయులు లేరు.. అందుకే లోపల కదలాడే ప్రతి భావాన్నీ మీతో చెప్పందే మనసూరుకోదు.. మీ 'నేస్తం కోసం' కవితలో కనిపించే ఆ స్నేహం నాకు మీరే!!

*"చీకటిపొరల్లో చిక్కుపడినప్పుడు*
*నెమరేసుకునేందుకు ఒక జ్ఞాపకం కావాలి..*
*మౌన సరస్సులో సుడులు తిరిగేప్పుడు*
*ఆహ్లాదం పంచేందుకు ఓ ఆత్మీయ స్వరం కావాలి..*
*సమస్యల కత్తుల వంతెనపై దిక్కు తోచనప్పుడు*
*నేనున్నానని వెన్నుతట్టే ఓ నేస్తం కావాలి..*
*...."*

మీ అడుగుల సవ్వడి వినిపించే ఉదయం కోసం ఎదురుచూస్తూ...

కార్తీక

***   ***   ***   ***

జూన్ 16, 1988

హైదరాబాదు

హలో వికాస్,

కార్తీకకి ఎలా ఉందిప్పుడు? ముందుగా హృదయపూర్వక క్షమాపణలు, చెప్పినట్లుగా ఇవాళ వైజాగ్ రాలేకపోయినందుకు!

నాకు తెలుసు మీరిద్దరూ ఎంతగానో ఎదురుచూస్తుంటారని.. కానీ తప్పనిసరి పరిస్థితిలో ప్రయాణం వాయిదా వేసుకోక తప్పలేదు.. నిన్న ఈపాటికి ఇక్కడ నేనూ, రాధిక భయాందళనలతో హాస్పిటల్‌లో కూర్చున్నాము.. నిన్న సాయంత్రం ఆఫీసుకి ఫోన్ వచ్చింది, స్కూల్లో ఆడుకుంటూ ఆదిత్య జారుడుబల్ల మీదనించి కింద పడ్డాడని! హడావిడిగా హాస్పిటల్‌కి పరిగెత్తేసరికి పరిస్థితి భయానకంగా ఉంది.. వాడి తలకి లోతైన గాయం తగిలి రక్తం విపరీతంగా పోవటంతో దాదాపు

కోమాలోకి వెళ్ళిపోయేంత సీరియస్ కండిషన్.. బ్లడ్ ఎక్కించాలంటే ఒక్క రాధికది సరిపోకపోతే మళ్ళీ బ్లడ్‌బాంక్‌ల చుట్టూ పరుగులు.. ఇప్పుడు ప్రమాదమేమీ లేదు గానీ ఇంకా ఒక 3 డేస్ వరకూ హాస్పిటల్ లోనే ఉంచాలంటున్నారు.

నేను రాలేకపోతున్న సంగతి మీకు చెప్పాలని కార్తీక ఉంటున్న హాస్పిటల్ ఫోన్ నంబర్ కోసం చాలా ప్రయత్నించి, అది దొరికినా ఆ రెసెప్షన్ లో ఉన్నవాళ్ళు విషయం మీకు అందజేస్తారో లేదో అని మా ఫ్రెండ్ చేత టెలిగ్రాం ఇప్పించాను.. విషయం తెలిక మీరు కంగారు పడతారేమో అని ఈ రెండు ముక్కలు పోస్టాఫీస్ లోనే రాస్తున్నా!

కార్తీక రాసిన ఉత్తరం అందింది.. తను ప్రస్తుతం ఎంత నిరుత్సాహానికి గురయ్యేదీ నేను అర్థం చేసుకోగలను.. కానీ తనకి ఆదిత్యకి ఇలా జరిగిన విషయం చెప్పకుండా వేరేదో సాకు చెప్పండి, ప్లీజ్.. ఆదిత్యని ఇంటికి తీసుకువచ్చి కాస్త కోలుకోగానే వెంటనే బయలుదేరి వస్తాను.. మీరు, కార్తీక ఏమాత్రం అధైర్యపడకండి.. You are there in our prayers.

మళ్ళీ త్వరలో మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాను.. ఉంటాను.

వంశీ

*** *** *** ***

జూన్ 26, 1988

వైజాగ్

ఆత్మీయ నేస్తానికి,

తను ఎన్ని సమస్యల్లో ఉన్నా మన కష్టానికి స్పందించి, నేనున్నానంటూ ఆలంబన ఇచ్చేవాడే కదా అసలైన స్నేహితుడంటే! అలాంటి మీ స్నేహం నాకు లభించినందుకు నేనెంతటి అదృష్టవంతురాలిని నేస్తం! అదిగో, అలా ఏమీ తెలీనట్టు అయోమయంగా చూడకండి.. ఆదిత్యకి ఇప్పుడెలా ఉంది? 'అంతా క్షేమమే' అని మళ్ళీ మీ దగ్గర్నుంచి కబురు వచ్చేవరకూ అదోలాంటి ఆందోళన ఇక్కడ మా మనసుల్లో! నడుస్తున్న బాబుకి ఏ రాయో రప్పో తగిలితేనే మన ప్రాణం విలవిలాడిపోతుంది.. అలాంటిది అంత పెద్ద దెబ్బ తగిలిన ఆదిత్యని చూస్తే రాధిక గారు ఎంత భయాందోళనకు గురై ఉంటారో కదా!! విషయం చెప్పవద్దని మీరు వికాస్‌కి రాసినా అంతకుముందే మీ స్నేహితుడు పంపిన టెలిగ్రామ్ లో 'ఆదిత్య సీరియస్..' అని అప్పటికే మెన్షన్ చేసేసారు!

అది వికాస్ నా దగ్గర ఉన్నప్పుడే నర్స్ తీసుకొచ్చి ఇచ్చేసరికి తను బయటికే చదివేసారు.. మాకైతే చాలా కంగారేసింది కానీ అప్పటికి నా నొప్పి తీవ్ర స్థాయిలో మొదలవ్వడంతో సెడేటివ్స్ ఇచ్చి పడుకోబెట్టేసారు.. ఆ తర్వాత మూడు నాలుగు రోజులకి మళ్ళీ నేను సరిగ్గా ఈ ప్రపంచంలోకి రాగలిగాను.. అప్పుడు వికాస్ మీరు రాసిన ఉత్తరం గురించి చెప్పారు! ఏంటీ, "అసలే జబ్బుగా ఉన్న అమ్మాయి.. తనకి ఇలాంటి బాధ కలిగించే విషయాలు వివరంగా చెప్పడం ఎందుకూ!?' అని వికాస్‌ని చివాట్లేయడానికి రెడీ అయిపోతున్నారా? పాపం, తను మాత్రం ఏం చేస్తారు చెప్పండి.. పది నిమిషాలకోసారి 'ఆదిత్యకి ఏమైందో!? ఇప్పుడెలా ఉన్నాడో!?' అని తల్చుకుంటుంటే చూడలేక 'విషయం ఇదీ' అని చెప్పేసారు.

నాకు తెలుసు, మా ఆయన్ని బాగా వెనకేసుకు వస్తున్నానని అనుకుంటున్నారు కదూ.. "భార్యాభర్తలిద్దరిలోనూ ఒకే రకమైన వ్యక్తిత్వ వికాసం ఉండకపోవచ్చు.. కానీ ఒక తుఫాను సాయంత్రం భర్త ఇంకా ఇల్లు చేరకపోతే భార్య ఆందోళన చెందుతుంది.. అదే భార్యకి వంట్లో బాగోకపోతే భర్త కాళ్ళూ చేతులూ ఆడవు.." గుర్తుందా, ఇవి మీరు చెప్పిన మాటలే!! మీరు నాతో చెప్పిన ఇలాంటి ఎన్నో సునిశితమైన విషయాలే నా ఆలోచనలని ఊహించలేనంతగా ప్రభావితం చేశాయి..

జీవితకాలపు అనురాగ బంధానికి తలవంచేలా చేశాయి.

మీ కవితలు చదివీ చదివీ నాక్కూడా ఏదో రాసేయాలన్న దురాశో లేక మీ పరిచయ పరిణామం వివరించాలన్న ఆత్రుతతో... చాలా రోజులుగా మీకు చెప్పాలనుకున్న నా హృదయ స్పందన ఇది...

"గువ్వల కువకువల సుప్రభాతంతో నిద్ర లేస్తున్న బాలభానుడు.. అసుర సంధ్య అల్లరి తట్టులోలేక ఎర్రబడ్డ మొహంతో అస్తమిస్తున్న సూర్యుడు.. గోరువెచ్చగా నిన్ను గుర్తు చేస్తే అది నా తప్పు కాదు..
కను రెప్పల కింద భాష్పాలకే కాదు కలలకీ చోటు ఉందనీ.. ఉండాలనీ.. వాడిన పువ్వు మూగ వేదనే కాదు స్వచ్ఛమైన పచ్చదనం సాక్షిగా రేపు విచ్చుకోబోతున్న మొగ్గ తెచ్చే ఆశల వర్ణాలనీ గుండె నిండా నింపుకోవాలనీ..
మిత్రమా, నా నిశ్శబ్దపు ప్రపంచంలో, నా వెతల కలతను దూరం చేస్తూ నువ్వు ఆలపించిన ఆత్మీయతా రాగం గాయత్రీమంత్రమై..
నా దోసిలిని నమ్మకాల పూలతో నింపుతూ.. హిమసమీరమై మనసుని కమ్మి.. పదాలే లేని నా బ్రతుకుని శ్లోకంలా మలచుకునేందుకు స్ఫూర్తివైన నువ్వున్న తీరాన్ని నేను చేరగలనా!?
ఒక్కసారి.. ఒకే ఒక్కసారి.. నిన్ను చూడాలని.. నువ్వు నేర్పిన నా బ్రతుకు పాట నీకు వినిపించాలనీ..
అది విని నీ పెదవులపై విరిసిన ఆనందపు నెలవంకలను దొంగలించి దిగంతాల అంచులకి పరిగెట్టి పారిపోవాలనీ..
నేస్తం! ఈ ఒక్క కోరిక తీర్చవూ......."

మనందరం కలిసాక వికాస్‌ని చూసి 'మంచి సెలెక్షన్!' అని మీ కళ్ళల్లో కనిపించే మెచ్చికోలుకి చిన్నగా గర్వపడడానికీ.. హర్ష, ఆదిత్య గౌతమ్‌లతో కలిసి ఇల్లంతా పరుగులు పెడుతూ ఆడుకుంటుంటే 'నెమ్మది నెమ్మది' అని హెచ్చరిస్తునే మురిసిపోవడానికీ... ఈ ఆనందాన్ని అనుభవించడానికైనా తలుపులు తోసుకురావడానికి తొందరపడుతున్న మృత్యుదేవతని ధైర్యంగా ఎదిరించాలనిపిస్తుంది!

అయినా ఇలా హాస్పిటల్స్‌లో కాకుండా చక్కగా మా ఊర్లో, మా ఇంట్లోనే కలుసుకుందాం వంశీ గారు.. నాకేమీ పర్వాలేదు.. మీరు కూడా ఆదిత్యకి కంప్లీట్ గా నయమయ్యేవరకూ ఈ ప్రయాణాల గురించి ఆలోచించకండి.. రాధిక గారిని అడిగినట్లు చెప్పండి.

ఇప్పుడే హర్షని తీసుకుని వికాస్ వచ్చారు.. మరి నాదైన జీవితంలోకి కాసేపు విహరించడానికి వెళ్ళొస్తాను.

కార్తీక

***   ***   ***   ***

సెప్టెంబర్ 15, 1988

వెంకటాపురం

ప్రియ మిత్రమా,

చీకటి దుప్పటి నిండుగా కప్పుకుని నిదురిస్తున్న వేపచెట్టు ఆకులు గువ్వల కువకువల సుప్రభాతంతో బద్దకంగా కదులుతున్నాయి.. గేటు పక్కనే ఉన్న చిట్టి గులాబీల పొద నిండుగా విరబూసినట్టు ఈ మసక చీకట్లో కూడా కిటికీలోంచి చిక్కగా కనబడుతోంది.. ఉండిండి వీస్తున్న గాలికి టేబుల్‌క్లాత్ అంచులు కదులుతుంటే దానిమీద పెయింట్ చేసిన లతలు ఊగుతున్నట్లనిపిస్తున్నాయి.. ఏమిటీ, నీకు చిరపరిచితమైనవన్నీ ఇలా నా వర్ణనలో కనిపిస్తున్నాయేమిటా అని కదూ నీ

ఆశ్చర్యం!? అల్లెప్పుడో నేనిచ్చిన మాట నిలబెట్టుకోవడానికీ, నువ్వు కోరుకున్నట్లే అక్కడా ఇక్కడా కాకుండా మీ ఇంట్లోనే కలుసుకోవడానికీ మీ ఊరొచ్చాను... కాస్త ఆలశ్యంగా!!!

ఆదిత్యకి స్టిచెస్ పడిన చోట ఇన్ఫెక్షన్ రావడంతో హైఫీవర్.. మళ్ళీ హాస్పిటల్ లో అడ్మిట్ చేయాల్సిన పరిస్థితి.. ఆ హడావిడిలోనే నీకు ఎలా ఉందో, వస్తానని ఎంతగా ఎదురుచూసుంటావో కదా అన్న మధనం.. ఇంతలోనే స్వాంతన వచనాలు పల్కుతూ, అందరం ఇంట్లోనే కలుసుకుందాం అన్న ఆశాభావంతో కూడిన నీ ఉత్తరం చదివాకా నాలో ఒకలాంటి ధైర్యం.. నువ్వు తప్పకుండా కోలుకుని ఇంటికి తిరిగొస్తావని! ఆదిత్యని చూడడానికి వచ్చిన నా క్లోజ్ ఫ్రెండ్స్ అందరూ నీ గురించి అడిగేవారు.. ఆదిత్యకి జ్వరం తగ్గుముఖం పడుతుండగానే ఇంటినించి ఫోన్, నాన్న గారికి స్ట్రోక్ వచ్చిందని!! ఆఘమేఘాల మీద అక్కడికి వెళ్ళి లోకల్ డాక్టర్ల సలహాతో వెంటనే హైదరాబాదు కి తెచ్చేసి జాయిన్ చేశాను.. ఈ గందరగోళంలోనే వికాస్ ఓ సారి కాల్ చేస్తే పరిస్థితి వివరించి నీ గురించి అడిగాను.. 'ఏదో పర్వాలేదు' అని చెప్పినా తన గొంతులో అంతులేని నిర్వేదం ధ్వనించింది.. అప్పుడనిపించింది, ఎలాగైనా ఓ సారి, కనీసం ఒక్కరోజుకైనా వచ్చి మీ ఇద్దర్నీ చూడాలని.

నాన్నా, ఆదిత్య ఇద్దరూ ఇంట్లోనే ఉండి రెస్ట్ తీసుకోవడం మొదలుపెట్టిన రెండో రోజే రాధికతో చెప్పాను, ఒకరోజుకి వైజాగ్ వెళ్ళొస్తానని.. తన సంగతి నీకు తెలిసిందేగా, 'తప్పకుండా వెళ్ళిరండి' అనే అంది! అప్పటికప్పుడు టికెట్ రిజర్వ్ చేయించుకుని అర్జెంట్‌గా ఈ విషయం వికాస్ చెవిన వేయడం ఎలానా అని ఆలోచిస్తుండగానే ఫోన్ మోగింది.. తీయగానే వికాస్ గొంతు! ఇక నేను ఉత్సా హంగా నా ప్రయాణం గురించి చెప్పబోతుంటే అడ్డుపడి తను చెప్పిన విషయం విన్నాక నాకు ప్రపంచం గిర్రున తిరిగినట్టైంది!

*" 'ఇక ఈ నొప్పి భరించే శక్తి నాకు లేదు.. మీరు, హర్ష జాగ్రత్త' అని నోట్ రాసిపెట్టి కార్తీక ఫాన్ కి హ్యాంగ్ చేసుకుందండీ" గద్గదిగంగా అంటున్న వికాస్ మాటలు చెవిలో గింగురుమంటుంటే మనసూ, మెదడూ ఐస్ బ్లాక్స్ మధ్య ఇరుక్కుని ఘనీభవించిన పరిస్థితి.. అవతల వికాస్ హలో హలో అంటున్నా నోరు కదపలేని అసహాయస్థితి! ఏం జరిగిందో అర్థం కాక రాధికే నా చేతిలోంచి రిసీవర్ తీసుకుని మాట్లాడింది.*

అసలిదెలా సాధ్యం కార్తీకా!! యముడిని సైతం తలుపవతలే నిలువరిస్తానని ఎంత గుండెనిబ్బరంతో చెప్పావు! మరి ఎన్ని బలహీన క్షణాలు నీమీద మూకుమ్మడిగా దాడి చేస్తేనో నువ్వీపని చేసి ఉంటావు!

'కార్తీక స్కూల్ వాళ్ళు సంస్మరణ సభ ఏర్పాటు చేశారు.. తను ఎంతో అభిమానించే మీరు లేని ఆ సభని ఊహించుకోలేము' అని వికాస్ చెప్పగానే 'తప్పకుండా వస్తాను' అన్నానే గానీ నేను మొదటిసారి మీ ఊరికొచ్చేది ఇలాంటి సందర్భానికా అనుకోగానే మనసులో బాధ సుడులు తిరిగింది. మీ స్కూల్లోకి అడుగుపెడుతుంటే అప్పటివరకూ చూడని ఎందరో చిరకాల పరిచయస్తులు.. వికాస్ తో సహా! భూషణం గారి దంపతులు, మీ అమ్మమ్మ తాతయ్యలు, మాధురి గారి దంపతులు, మీ సుబ్బులు.. మాకు ఎలాంటి పరిచయ కార్యక్రమాలు అవసరం లేకపోయింది! నీతో కలిసి ఎన్నో

కార్యక్రమాల్లో పాల్గొన్న మీ స్నేహబృందం, మీ సహాయాన్ని అందుకున్న ఇంకెంతోమంది తో హాలు నిండిపోయింది.. ఇంతమంది మనసుల్లో స్థానం సంపాదించుకున్న నువ్వు నేనేదో నిన్ను ప్రభావితం చేశానని నాకు పెద్దపీట వేస్తూ వచ్చావు!! నీ ఆఖరి ఉత్తరంలో నువ్వు ఆర్తిగా రాసిన కవితలాంటి హృదయనివేదన చదివాక 'ఇంతటి భావుకత్వం ఉన్న అమ్మాయా ఇంతకాలం నన్ను గొప్ప కవిగా పొగుడుతోంది!?' అన్న సంభ్రమాశ్చర్యాలు!! ఎందుకు నేస్తం నాకు చెందని ఎత్తులో నన్ను నుంచోబెట్టావు!? తలచుకుంటేనే కృతజ్ఞత కనుకొలుకుల నుండి ధారగా ప్రవహిస్తోంది!

"దయచేసి ఇవాళ రాత్రికి ఉండండి" అని వికాస్ అడగ్గానే సరేనని తలూపేశాను.. నీకు సంబంధించిన మనుషులు, పరిసరాలు, వస్తువుల మధ్య సంచరిస్తుంటే ఒకలాంటి స్వాంతన కలుగుతోంది.. ఇకనించీ వీటి గురించి చెప్పే నీ ఉత్తరమనే జాబిలి మాఇంటికి రాదుగా.. అందుకే మనసు పట్టేన్ని జ్ఞాపకాలతో తిరిగి వెళ్ళాలనుకుంటున్నాను.

అల్లంత దూరంలో, నువ్వు చెక్కడం మొదలుపెట్టి హడావిడిగా వదిలేసి వెళ్ళిపోయిన శిల్పం, హర్ష... నిద్రలో అటూ ఇటూ కదులుతున్నాడు.. ఈ గాలితరంగాలలో మిళితమైపోయి వాడిని నిద్రపుచ్చుతున్నావు కదూ! భౌతికంగా నీ రూపం నీరవమైనా ఈ పసివాడిని వదిలి నువ్వప్పుడే కనబడని లోకాలకు పోలేవని బలంగా అనిపిస్తోంది.. ఈ చీకటిరాత్రి నిశ్శబ్దంగా నన్ను ఓదార్చడానికి ప్రయత్నిస్తుంటే, ఈ స్వగతం రాసుకుంటున్నాను.. కాదు కాదు..... నీకు రాస్తున్నాను! ఇది ఇక్కడే నీ టేబుల్ మీదే వదిలెళ్ళబోతున్నాను!! మెదడు సాధ్యం కాదంటున్నా మనసు నమ్మడంలేదు.. ఏ సమీరమో దిగంతాల వైపుకి పయనిస్తూ ఈ స్నేహితుడి కళ్ళలోని తడినీ, మనసులోని వేదననూ నీ వరకూ అందజేస్తుందనే పిచ్చి నమ్మకంతో రాస్తున్నాను.. అసలు రహస్యం చెప్పాలంటే 'ఇక నువ్వే నాకు ఉత్తరం బాకీ' అని నీ ఫోటోని చూసినప్పుడల్లా ఆటపట్టించడానికి రాస్తున్నాను..

స్నేహమంటే కలిసి కాఫీ, టీలు తాగడాలు.. ఊసుపోని కబుర్లు చెప్పుకుని ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోవడాలు మాత్రమే కాదన్న విషయం అర్ధమయ్యేలా చేశావు.. మనుషులు ఎందుకు, ఎలా బ్రతకాలోనని నువ్వు కలగజేసిన స్ఫూర్తికీ.. మా మనసుల్లో వెన్నెలలు కురిపించిన నీ ఊసుల జాబిలికీ నా అక్షరసుమాంజలి...

*"కదిలిపోయే క్షణాలన్నీ*
*కాలవాహినిలో లీనమౌతాయి*
*నీ చెలిమిలో గడచిన కాలం మాత్రం*
*వీడని నీడలా నన్నంటి ఉంటుంది*
*వెనుతిరిగి నాకు దరహాసాలనందిస్తుంది!*
*వేసారిన మనసుకి వసంతం చూపిస్తుంది!!"*

సదా నీ జ్ఞాపకాలలో..
వంశీ

~~~ అయిపోయింది ~~~

*మీతో కొన్ని ఊసులు:*

నా చివరి మాట చెప్పేముందో చిన్న కథ...

రెండు నెలల క్రితం అనుకుంటాను డెబ్భైల్లో వచ్చిన ఒక ప్రముఖ నవల చదవడం మొదలుపెట్టాను.. మొదట్లో కొంచెం బోర్ కొట్టినట్లు అనిపించినా తర్వాత్తర్వాత ప్రధాన పాత్రని మలచిన తీరు నచ్చి రాత్రీ పగలూ ఏ కాస్త సమయం దొరికినా ఆ పుస్తకం పట్టుకు కూర్చునేదాన్ని.. ఇలా చదువుతూనే మధ్య మధ్య నా సాహిత్యగురువు గారితో పాత్రల గురించి చర్చలు చేసేదాన్ని.. అలా ఒకనాటికి ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది, కథ అయిపోయింది! కానీ అది ముగిసిన తీరు నన్ను తీవ్ర నిరాశకి గురిచేసింది! నాకు ఎంతో నచ్చిన ప్రధాన పాత్ర మరణిస్తుంది! అదీ చిట్టచివరి రెండు పేజీల వరకూ మనకి తెలీదు!! ‘అనవసరంగా ఆ పుస్తకం చదివి బోల్డంత టైమ్ వేస్ట్ చేసుకున్నాననీ.. ఇలా మెయిన్ కారెక్టర్ ని చంపేసి పేలవంగా ముగిస్తారని అనుకోలేదని‘ మళ్ళీ మా గురువుగారితో మాట్లాడినప్పుడు వాపోయాను.

"ఒక్క విషయం చెప్పు, నీకసలు పుస్తకమే నచ్చలేదా లేక ముగింపొక్కటే నచ్చలేదా" అని ఆయనడిగారు.. "ముగింపే అస్సలు బాలేదు" ఠక్కున చెప్పాను.. "మరి పుస్తకంలో నీకు నచ్చిన విషయాలూ.. ఆ మెయిన్ కారెక్టర్ నిన్ను ప్రభావితం చేసిన అంశాలూ.. ఇవన్నీ ముగింపు మూలంగా అర్ధరహితంగా అనిపిస్తున్నాయా?" మళ్ళీ ప్రశ్నించారు.. ఈసారి ఒక నిమిషం ఆలోచించి "లేదు" అన్నాను.. "అయితే ముగింపు ఎలా ఉంటే నీకేం.. వందల పేజీల పాటు సాగిన కథనంలో ఆ పాత్రని మలచిన తీరు, ఆ పాత్ర అనుభవాల ద్వారా రచయిత చెప్పిన ఎన్నో విషయాలు, మానవ జీవితాన్ని గురించిన అద్భుతమైన అబ్జర్వేషన్స్ ఉండగా, కేవలం రెండు పేజీల్లోని నచ్చని సంఘటన పట్టుకుని మొత్తం పుస్తకమే నిరుత్సాహపరిచిందనడం ఎంతవరకూ సమంజసం!?" అని నాలో ఉన్న నిరాశా మేఘాన్ని పటాపంచలు చేశారు! ముగింపుని బట్టి రచనని అంచనా వేయకుండా అసలు అంశాలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం నేర్పిన వారికి నా ధన్యవాదాలు!

ఈ సంభాషణని మీతో పంచుకోవడానికి కారణం స్ఫురించే ఉంటుంది.. సీరియల్‌లో కార్తీకకి వంట్లో బాలేదన్న భాగం చదివిన తరువాత చాలా మంది ముగింపుని ఊహించి ఇలానే నిరాశ చెందారు.. ఏదైనా మిరకిల్ జరిగి కార్తీకకి నయమైపోతే బావుండుననుకున్నారు.. స్వతహాగా నాకూ బాధాకరమైన ముగింపులున్న కథలూ, సినిమాలు నచ్చకపోయినా ఈ
~~~

కథ ముగింపు ముందే తెలిసినందువల్లో లేక నేనే రాస్తున్నందువల్లో పాఠకులు వ్యక్తపరుస్తున్న ఈ స్పందనకి అంతగా రియాక్ట్ కాలేకపోయాను! అప్పుడే పైన చెప్పిన సంభాషణలో పాల్గొనడం జరిగింది.. అప్పుడర్థమయింది! *నేనూ..మీరూ..మనందరం ముగింపు మరణమయితే అదొక అపజయంలా భావిస్తాం!! కానీ ఇక్కడ మాత్రం కార్తీక మరణం అపజయం కాదు.. అత్యంత దురదృష్టకరమైన సంఘటన!*

ఈ కథలో ఏ వ్యూహాలు లేవు.. ట్విస్ట్‌లు అంతకంటే లేవు.. తెలుగు సినిమాల్లో కనిపించే త్యాగశీలి పాత్రలు లేవు.. ఉన్నదల్లా స్వచ్ఛమైన స్నేహం! ఇద్దరు మనుష్యుల మధ్య మొదలైన స్నేహం, వారి మనసుల దాకా పాకి.. కుటుంబాల్లోనూ విస్తరించి.. ఇతర స్నేహితులనూ కలుపుకున్న వైనం ఇది!! ఎప్పుడో యండమూరిగారన్నారు, *"చెట్టు నించి జారే ప్రతి శిథిల పత్రమూ వ్యథ కాదు.. జరిగిపోయిన కథ కాదు.. కొత్త చిగురుకి చోటిచ్చే ప్రయత్నం!"* అందుకే ముగింపు ఏమైందీ అని కాకుండా అసలు కథంతా అలుముకున్న వంశీ, కార్తీకల స్నేహసౌరభాలను ఆఘ్రాణిద్దాం.. వీలైతే మనమూ వీరిలాంటి నేస్తాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నిద్దాం.. ఒకవేళ ఇప్పటికే ఇలాంటి నేస్తం మన జీవితంలో ఉండి ఉంటే ఆ బంధాన్ని ఇంకాస్త పటిష్ఠం చేసుకుందాం!!

కథలే ఇంకా సరిగ్గా రాయడం రాని నేను ఒక సీరియల్ పూర్తి చేశాను.. అది పాఠకుల హృదయాలకు కొంచెమైనా దగ్గర కాగలిగింది అంటే ఆ గొప్పదనమంతా కిరణ్‌ప్రభ గారిది.... ఆయన నాపైన పెట్టుకున్న నమ్మకానిదీను! ఆయనే ఈ సీరియల్‌లోని కథానాయకుడు 'వంశీ'!! ఇందులో ప్రస్తావించిన కవితలన్నీ వీరి '**కవితాప్రపంచం**' లోనివే. దాదాపు ఇరవై సంవత్సరాలుగా జ్ఞాపకాలలో కార్తీకని సజీవంగా ఉంచుకోవడమే కాకుండా వాటిని అందరితో పంచుకోవాలనుకున్నారంటేనే తెలుస్తుంది ఆయన వారి స్నేహానికి ఎంతటి విలువనిచ్చారో!!

అమ్మో, సీరియలా! నావల్లకాదు బాబోయ్ అన్న నన్ను "ఒక్క పదినిమిషాలు నే చెప్పేది విని ఆ తర్వాత నిర్ణయం తీసుకో" అని కూర్చోబెట్టి వినిపించారు.. కథ విన్నాకైతే నేనసలే రాయలేనన్నాను! ఇంతటి హృద్యమైన కథని సరిగ్గా చెప్పలేక పాడుచేసేస్తానేమో అంటే "లేదు దీన్ని అక్షరాల్లోకి మలిచే శక్తి నీకు ఉందంటూ" నాతో ఔననిపించారు! కథ తనదే అయినా కేవలం అక్కడక్కడా గైడ్ చేయడం మినహా టైటిల్ పెట్టడం నించీ మొత్తం స్వేచ్ఛని నాకే వదిలేశారు.

కౌముది కోఎడిటర్, కాంతి గారైతే నా పేరుని కార్తీకగా మార్చేశారు.. ప్రతీనెలా ఇరవయ్యో తారీఖు రావడం ఆలశ్యం 'కార్తీకా, నీ ఉత్తరం ఎప్పుడొస్తుందోయ్?' అని అడుగుతూనే నేను వంశీ, రాధికల గురించి రాసినవాటిని ప్రస్తావించి "ఈ విషయాలు నువ్వెలా ఊహించగలిగావు!" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు.. ఒకటీ, రెండు గంటల్లో విన్నదంతా పన్నెండు నెలల సీరియల్‌గా మలచగలిగానంటే దాని వెనుక వీరి ప్రోత్సాహం ఎంతో ఉంది!!

**ఊసులాడే ఒక జాబిలట!** ని చదివి కౌముదిలోనూ, నా బ్లాగ్ లోనూ ఎప్పటికప్పుడు తమ స్పందనని తెలియజేసిన పాఠక స్నేహితులందరికీ...

"ఇది నువ్వే రాయగలవు" అంటూ వెన్నుతట్టి ప్రోత్సహించిన కిరణ్‌ప్రభ, కాంతికిరణ్ దంపతులకూ...

ఎప్పటికప్పుడు 'నేను సీరియల్ రాసుకోవాలండీ' అన్న మరుక్షణమే చీమ కూడా చిటుక్కుమనకుండా చుట్టూ ప్రైవసీని కలిగించిన శ్రీవారికి..

హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ

-మీ

నిషిగంధ

## కలలా కరిగి ఊహల్లో మిగిలిపోయిన కార్తీక కథ వెనుక కథ

కలం స్నేహ ప్రపంచం నుంచీ అలా 'కార్తీక' అజ్ఞాతంగానే అదృశ్యమైన తరువాత, 'వికాస్' ఒకసారి హైదరాబాదు వొచ్చాడు. నాకు ఫోన్ చేసాడు. వాళ్ళ నాన్నని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి తీసుకొచ్చాననీ, ఇంకో రెండు రోజులుంటాననీ చెప్పాడు. ముందుగా వాళ్ళ అబ్బాయి, పసివాడు 'హర్ష', ఎలా వున్నాడని అడిగాను. బాబుకు ఆరోగ్యం బావోలేదనీ, డయారియా అనీ, వాళ్ళ అమ్మవాళ్ళింటివద్ద వదిలి వచ్చాననీ చెప్పాడు. తనకి అది కూడా వర్రీగా ఉందనీ అన్నాడు. ఇంటికి రమ్మని ఆహ్వానించాను. ఉన్న రెండు రోజుల్లోనూ సి.ఎమ్ ని కలవాలనీ, ఏవో గిరిజన సమస్యలమీద మెమొరాండమ్ ఇవ్వాల్సిన పని ఉందనీ చెప్పాడు. తన ఫోన్ నంబరు అడిగితే , పబ్లిక్ బూత్ నుంచీ మాట్లాడుతున్నాననీ, మళ్ళీ తనే చేస్తాననీ అన్నాడు...అంతే.. ఈ రోజువరకూ 20 ఏళ్ళలో అతని వద్దనుంచీ ఏ సమాచారం లేదు. వాళ్ళబ్బాయి 'హర్ష' ఈ సరికి పెరిగి పెద్దవాడై ఉండాలి. ఆరోజుల్లోనే ఒకసారి ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేసే మిత్రుడొకతను కలిస్తే 'వికాస్' గురించి చెప్పాను. తనకి బాగా తెలుసనీ రాడికల్ ఉద్యమాల్లో పనిచేస్తూ అజ్ఞాతంలోనే ఉంటాడనీ, ఎప్పుడైనా ఉద్యమాల చందాలకోసం వస్తాడనీ చెప్పాడు. ఈసారి కలిస్తే వివరాలు కనుక్కోమని చెప్పాను.. అటునుంచీ సమాచారమేమీ లేదు ఇన్నేళ్ళలోనూ. ఆ విధంగా ఒక ప్రియనేస్తం కనిపించకుండానే , ఈ ప్రపంచంనుంచీ, మా పరిచయ పథంనుంచీ సవినయంగా తప్పుకుంది.

***

1984 మే నెలలో హైదరాబాదు నుంచీ 'పల్లకి' అనే వారపత్రిక మొదలైంది.. అప్పటికే 'ఆంధ్రభూమి' సృష్టించిన ప్రభంజనాన్ని తట్టుకుని, అతి త్వరలోనే అగ్రస్థాయిని చేరుకుంది. (1984 ఆగస్టులో అనుకుంటాను విజయవాడ నుంచీ 'స్వాతి' వారపత్రిక మొదలైంది) 'పల్లకి' మొదలైన మూడో వారం నుంచో, నాలుగో వారం నుంచో నేను వ్రాసిన ఫోటో కవితలు, లోపలి కవర్ పేజీలుగా వచ్చేవి. అచిరకాలంలోనే పాఠకుల ఆదరణ చూరగొన్న ఆ ఫోటో కవితలు, కొన్ని నెలల తరువాత మల్లాది గారి 'లిటిల్ రాస్కెల్' సీరియల్ మొదలయ్యాక, ఇన్నర్ కవర్ పేజీలనుంచీ లోపలి పేజీలకి మారాయి. వారం వారం వచ్చే కవితలకి పాఠకులనుంచీ స్పందన బావుండేది. ప్రతి వారం చాలా ఉత్తరాలు వచ్చేవి. రోజూ సాయంకాలం 'పల్లకి' ఆఫీసుకి వెళ్ళగానే శివప్రసాద్ గారు నాకొచ్చిన ఉత్తరాలన్నింటినీ ఇచ్చేవారు. అలా వొచ్చిన వుత్తరాల్లో ఒక ఉత్తరమే 'కార్తీక' (నవలలో పేరే కొనసాగిస్తున్నా) నుంచీ.


తరువాత జరిగిన సంఘటనలన్నీ నిషిగంధ యధాతథంగా వ్రాసారు. నవలీకరణకోసం ఒక 20 శాతం కాల్పనికత జోడించారేమో కానీ, మిగతా కథ అంతా జరిగిన దానినే చిత్రించారు (పాత్రలూ, స్థలాలూ మార్చి). పాతికేళ్ళ క్రిందటి సంఘటనల్ని, ఒకటి రెండు గంటల్లో నేను చెప్పగా విని, ఆకర్షణీయమైన నవలగా తీర్చి దిద్దిన నిషిగంధని మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.


చాలా పాత్రల స్వభావాలూ, కొన్ని సంఘటనలూ నేను చెప్పకపోయినా రచయిత్రి ఊహించి వ్రాసిన విధానం అమోఘం. ప్రతినెలా తన నుంచీ వచ్చిన స్క్రిప్టు చదవగానే.. మళ్ళీ పాతికేళ్ళు వెనక్కి వెళ్ళిపోయేవాళ్ళం. చాలా మంది అడిగిన ప్రశ్న 'కార్తీకని ఎందుకు కలుసుకోలేదు..?' , 'ఫోన్ లో ఐనా మాట్లాడవచ్చుగదా..?' అని. ఇతమిత్థమైన సమాధానం లేదు. ఆ రోజుల్లో ఫోన్‌లు ఇంత విరివిగా లేవు. (నిజానికి 1979లో ఫోన్‌కోసం అప్లికేషన్ పెడితే మాకు 1995 లో కనెక్షన్ వచ్చింది!!) ..వ్యక్తిగతంగా కలవడానికి..ఎందుకో పరిస్థితులు అనుకూలించలేదు. అజ్ఞాత కార్తీక స్నేహం ఇప్పటికీ మాకు మనసులో ఒక తీయని బాధ. మళ్ళీ ఎప్పుడో ఎక్కడో 'వికాస్' ఐనా , లేదా వాళ్ళ అబ్బాయి 'హర్ష' ఐనా కనిపిస్తాడని ఎదురు చూస్తూనే ఉన్నాం..

చాలాసార్లు వాస్తవ సంఘటనలే కల్పిత కథలకంటే ఎక్కువగా మనసుల్ని కదిలిస్తాయనడానికి, నిషిగంధ కలం చిత్రించిన 'ఊసులాడే జాబిలి' ప్రత్యక్ష నిదర్శనం. ప్రతి నెలా ఆసక్తిగా చదివి, తమ స్పందన తెలియచేసి., పాత్రలతో పాటు ప్రయాణించిన పాఠకాభిమానులకి కృతజ్ఞతాభివందనాలు.!!

మీ

– కిరణ్‌ప్రభ





Dear Kanthi Garu,

నమస్తే